సూర్యనారాయణరావు, వల్లూరి

రాజ్యాంగతంత్రము

చెన్నపురి, 1913

Record no. 418

Sūryanārāyaṇarāvu, Vallūri

Rājyāṅgatantramu

Cennapuri, 1913

Record no. 418

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

సూర్యనారాయణరావు, వల్లూరి.
రాజ్యాంగతంత్రము / వల్లూరి సూర్యనారాయణరావు గారిచే రచియింపఁబడినది.- చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1913.
4, 245, 21 p. ;17 cm.
Record no. 418

Sūryanārāyaṇarāvu, Vallūri.
Rājyāṅgatantramu / Vallūri Sūryanārāyaṇarāvu gāricē raciyimpam̐baḍinadi.- Cennapuri : Vāviḷla Rāmasvāmiśāstrulu aṃḍ Sans, 1913.
4, 245, 21 p. ;17 cm.
Record no. 418

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB Date filming began:

ఆంధ్రభాషాభివర్ధనీ ప్రచురములు. 16.

రాజ్యాంగతంత్రము.

మ-రా-రా-శ్రీ, వల్లూరి సూర్యనారాయణరావు
బి. ఏ. బి. ఎల్. & ఎల్. టి. గారిచే
రచియింపఁబడి

మచిలీపట్టణము నందలి
ఆంధ్రభాషాభివర్ధనీసంఘము (లిమిటెడ్) వారిచేఁ
ప్రచురింపఁబడినది.

చెన్నపురి:
వావిళ్ల. రామస్వామిశాస్త్రిులు అండ్ సన్సు వారిచే
ముద్రింపఁబడినది.

1913

వెల రు. 1 0 0

ఉపోద్ఘాతము.

ఇంగ్లాండులో నుండు ప్రజాప్రభుత్వమువలననేగాని మనకు రాజకీయస్వాతంత్ర్యములు కలుగవనియు, ఈబ్రిటీషు ప్రభుత్వముక్రిందనే యుండి నిబంధనానుకూల రాజకీయాందోళనమును మనవిద్యాధికులు ఎడతెగకుండ దేశమందంతయు వ్యాపింపఁజేసినయెడల, మొదట జర్మనీసామ్రాజ్యము వంటిదియు, తరువాత అమెరికా సంయుక్తరాష్ట్రరాజ్యాంగతంత్రమువంటిదియు నగు రాజ్యాంగ నిర్మాణమే మనకును లభించుననియు నేను గట్టిగ నమ్ముచుండుటచే, కొన్ని యాంగ్లేయ, అమెరికాగ్రంథముల ననుసరించి, గతించిన రెండుసంవత్సరములలో మచిలీపట్టణమందు ప్రచురింపఁబడు 'ఆంధ్రభారతి'లో నాకు తీరిక సమయములయందు, సామాన్యప్రజలకు బోధపడునటుల నేను వ్రాసిన వ్యాసములనే ఎట్టిమార్పులను చేయకుండ ఇందుఁ బొందుపఱచితిని. వీనిని వ్రాయుకాలములో, ఇంగ్లాండునందును మనదేశమందును, రాజ్యాంగవిషయములలో గొప్పమార్పులు జరుగుచుండఁగా, వానినికూడ సందర్భానుసారముగ నుదహరించుచుంటిని. ఆంగ్లేయరాజ్యతంత్రములో నింక ననేకమార్పులు శీఘ్రకాలములో కలుగుననుటకు సందేహము లేదు. ఇంగ్లాండు, స్కాట్లెండు, అయిర్లండు వేల్సులు

కూడ సంయుక్తరాష్ట్రములుగ మాఱునని తోఁచెడిని. కావున, ఇంగ్లాండు, అమెరికాసంయుక్త రాష్ట్రరాజ్యాంగతంత్రములను బాగుగ తెలిసికొని అచ్చటి ప్రజలకు న్యాయవిధియందును, తమదేశమందును గల భక్తివిశ్వాసములను మనవారు కొంత వఱకైనను నలవడ చేసికొనెద రని నమ్ముచున్నాను.

మచిలీపట్టణము.
15-6-1913

వల్లూరి. సూర్యనారాయణరావు,
సెక్రటరి,
ఆంధ్రభాషాభివర్ధనీసంఘము.

ఆంగ్లేయరాజ్యతంత్రము.

ప్రథమభాగము.

CHAPTER I.

రాజుయొక్క అధికారములు.

ఇంగ్లాండు దేశములో పార్లమెంటువారే సర్వాధికార్య మును చెలాయించెద రనుమాట వాస్తవమేకాని, రాజునకుఁ గూడ దేశపరిపాలనలోఁ గొంత స్వాతంత్ర్యము కలదు. రాజు తనకిష్టులైన మంత్రుల సహాయమున రాజ్యమును పరిపాలించు కొనవచ్చును. కాని పార్లమెంటులో ఒకభాగమైన ప్రజాప్రతి నిధి సంఘము (House of Commons) అట్టిమంత్రులయందు యిష్టము చూపినయెడల రాజ్యపరిపాలన మొక్కనిముసమైనను న్యాయశాస్త్రములప్రకారము జరుగుటకు వీలులేదు. పార్ల మెంటువారు అట్టిమంత్రులు చేయుప్రతికార్యమునకు ఆటంకము కలుగఁజేసి, చట్టములకు వ్యతిరేకమైన పనులను వారిచేత చే యించి, ఆపనులన్ను చేసినందుకు వారిని శిక్షించగలరు. అట్టి మంత్రులు కోరుచట్టములు నిర్మాణము కాకుండఁజేయఁగలరు.

ప్రతిసంవత్సరారంభమందును పార్లమెంటు కూడి ప్రజలమీఁద విధించుపన్నులను ఖర్చుచేయు విషయములో చట్టమును నిర్మాణముచేసినగాని (Passing Appropriation bills) రాజ్యములో ఒక నౌకరునకైనను జీతము ముట్టనేరదు. ఒక్కదమ్మిడియైనను వసూలుచేయ వలనుపడదు. ఎప్పుడైనను రాజు తనపార్లమెంటును తృణీకరించి, అట్టిపనులను తన నిరంకుశాధికారముతో తన మంత్రులవలన చేయించఁదలఁచుకొన్న యెడల రాజు ఎప్పుడు తప్పు చేయఁడని మామూలు యేర్పాటున్నను పార్లమెంటుకు, ఆమంత్రులు జవాబుదార్లుగా నుండుటకై, ముఖ్యమైన రాజ్యాంగ విషయములను గుఱించి రాజుచేత దస్కతుచేయించబడు ప్రతి కాకితము మీఁదను యిద్దరుముగ్గురు మంత్రులు తిరిగి దస్కతుచేసినగాని, ఆకాకితములు చెల్లనేరవని యేర్పఱచి యున్నారు. ఈమంత్రులయొక్క సంఘమే కాబినెట్ (Cabinet) అని పిలిచెదరు. వీరందఱు, పార్లమెంటుయొక్క రెండుశాఖలలో, ప్రభుసంఘములోఁగాని (House of Lords) లేక ప్రజాప్రతినిధి సంఘములోఁగాని (House of Commons) మెంబర్లుగా నుండవలెను.

పార్లమెంటులో, అందులో ముఖ్యముగా ప్రజాప్రతినిధి సంఘములో నెక్కువమంది తమ పార్టీవారుగా నుండినఁగాని, యీమంత్రులు రాజ్యపరిపాలన చేయలేరు. వీరందఱుకలసి ముఖ్యమైన రాజ్యాంగ విషయములను చర్చించి యేకాభిప్రాయులై

ననేగాని యే వ్యవహారము సరిగా నడవదు. తమరు ఎక్కువ పట్టుదలతో పనిచేయుచున్న యేముఖ్యాంశములోనైనను తమ పార్టీ పార్లమెంటు సభలో వీగిపోయినయెడల యీమంత్రులందఱు ఒక్కసారిగా తమపదవులకు రాజీనామాలిచ్చివేయుదురు. అప్పుడు రాజు, ఎక్కువబలముగల రెండవపార్టీవారిలోనుండి తగు మంత్రుల నేఱికొని వారికి తనముద్రాధికార మిచ్చి, వారిగుండా రాజ్యపరిపాలన జరిగించుకొనవచ్చును. లేదా, ఓడిపోయిన పార్టీవారి యభిప్రాయమే, పార్లమెంటునకు బయటనున్న ప్రజల యభిప్రాయ మని తలఁచిన యెడల, పార్లమెంటులో, ప్రజాప్రతినిధి సంఘమును నిలిపివేసి తిరిగి ప్రతినిధుల నేర్పఱచుకొనవలసినదని, రాజు, తనమంత్రులగుండా ప్రజల కాజ్ఞాపించవచ్చును. అప్పుడు, ప్రజలు, తమ కేర్పడియున్న నిబంధనల ప్రకారము ప్రతినిధులనెన్నుకొనఁగా, నేపార్టీవారిసంఖ్య యెక్కువగ నుండునో ఆపార్టీలోనుండియే మంత్రుల నేర్పఱచుకొని, వారికి రాజు తనముద్రాధికారము నీయవలెను.

పైవిధముగ ప్రజాప్రతినిధిసంఘము నేర్పఱచకయె రాజు రాజ్యము చేయవలెనన్న అతని నిరంకుశాధికారము నణఁగఁద్రొక్కుటకు, ప్రజలే పార్లమెంటు సభికులను ఏర్పఱచుకొనుటకుఁదగు నిబంధన లున్నవిగాన ఆవిధముగా వారు పార్లమెంటు యేర్పాటుచేసి, రాజునకు పిచ్చిసలహాల నిచ్చినమంత్రులను శిక్షించుటయు యుద్ధమూలమునఁగాని, చట్టములమూలమునఁ

గాని రాజును తొలగించుటయు, లేక దేశభ్రష్టునిఁ జేయుటయు లేక ఉరిదీయుటయు లేక కారాగారబద్ధునిఁ జేయుటయుఁ దలపెట్టించకమానదు. పార్లమెంటువారి కిట్టి సంపూర్ణస్వాతంత్ర్యము కలుగక పూర్వము ఇట్టి పనులు జరిగించియే ఆదేశపు ప్రజలు తమ హక్కులను సంపాదించుకొనియున్నారు. ఇటీవల, తగు నిబంధనలన్నియు నేర్పడి అట్టి ఘోరకృత్యములు జరుగ నవకాశము లేశమాత్రము లేదు. ఇప్పుడు పార్లమెంటుయొక్క రెండుశాఖలవారు నేకగ్రీవముగా రాజు నురిదీయవలెనని చట్టమును నిర్మించినచో, దానికి రాజు తన యంగీకారమునిచ్చి దస్కతు చేయవలసినదే గాని, మాఱుమాట పలుకఁగూడదు. దాని నిషేధించుటకు, వాదమునకు తనకు అధికారమున్నను అనుభవములో మాత్రము లేశము తనకు అవకాశములేదు.

తెలివిగలరాజు రాజ్యాంగ విషయములో, ప్రజలకు తెలియకుండఁగనే, మిక్కిలి జోక్యము కలుగచేసుకొనవచ్చును. అనుభవశాలియగు రాజు, తనమంత్రులకు మంచిసలహాయును, సహాయమును ఉత్సాహమును కలిగించఁగలఁడు. తనమంత్రులును వారి పార్టీవారును ప్రజలసౌఖ్యమునకు భంగకరమైన పనులు జరిగించుచున్నారని తనకుఁదోఁచిన యెడల, నాపార్టీవారు, పార్లమెంటుసభలో నెక్కువగనుండి తమమాట చెల్లించుకొనుచుండినను ఆసభను నిలిపివేసి క్రొత్తపార్లమెంటు సభకు ప్రతినిధుల నెంచుకొనవలసినదని ప్రజల కాజ్ఞాపించవచ్చును.

ఆంగ్లేయరాజ్యపద్ధతి ఒక్కసారిగా చట్టములవలన సృష్టింపఁబడక అనేక శత సంవత్సరములనుండి క్రమక్రమముగ పెరుగునట్టుల ఇంగ్లాండు దేశచరిత్రసాకల్యముగ చదివినవారికి స్పష్టముగా కనుపించును. పూర్వము ఆదేశపురాజులు తమమంత్రులయొక్కయు, ప్రభువులయొక్కయు, సలహాలను వినక నిరంకుశాధికారముతో రాజ్యముచేయుచుండిరి. 1265 సంవత్సరములో, ప్రజాప్రతినిధి సంఘము వారొకశాఖగాను, గొప్పభూమిఖామందులు, మతాధిపతులు, న్యాయాధిపతులు మొదలగువారు రెండవశాఖగాను పార్లమెంటుమహాసభ యేర్పఱచఁబడినది. అప్పుడు రాజ్యముచేయుచుండిన రాజు మిగుల బలహీనుఁడు. కనుక నేప్రభువులును ప్రజలును కలసి యీసభ నేర్పాటుచేయించఁగలిగిరి. ఈ పార్లమెంటువారు సుమారు 540 సంవత్సరములు ఒకప్పుడు రాజుతో విన్నవించుకొనియు మఱియొకప్పుడు ఆయన యుద్ధప్రయములకు పన్నులను విధించుకొని సొమ్ముసమకూర్చి హక్కులను బేరమాడియు, ఒకప్పుడు భయపెట్టియు క్రమక్రమముగ తమరాజుల వలన అనేక స్వాతంత్ర్యములుగల హక్కులను సంపాదించుకొనఁగలవారైరి. వీనిలో చట్టనిర్మాణ స్వాతంత్ర్యము పన్నులను విధించి ఖర్చుపెట్టుస్వాతంత్ర్యము ముఖ్యమైనవి. తుదకుఁ బ్రజాశక్తి రాజశక్తికంటె మించి పార్లమెంటుయొక్క కట్టుబాటులనుమీఱి నిరంకుశాధికారముతో ప్రవర్తించిన ఒకరాజును శిరచ్ఛేదము చేసి, మఱియొకరాజును దేశమునుండి వెడలగొట్టి తాను తన

పార్లమెంటుద్వారా చేసినశాసనముల కనుకూలముగా ప్రవర్తించెదమని వాగ్దానముచేసిన పరదేశ ప్రభువులను తనకు రాజుగ, జేసికొని ఇంగ్లాండు దేశమున కేగాక, దానిబిడ్డలైన, ఆస్ట్రేలియా న్యూజీలండు దక్షిణ ఆఫ్రికా మొదలగు దేశములకు సయితము స్వాతంత్ర్యము నొసంగినది.

ఇంగ్లాండు దేశపురాజు నామమాత్రావశిష్టుఁడుగ బరిగణింపఁబడినను ఆయనను తీసివేయుటకుమాత్రము ప్రజలొల్లరు. రాజులేనిరాజ్యము ఎంతబాగుగ ప్రజలు, తమ ప్రతినిధుల మూలమున పరిపాలింపఁబడినను, సామాన్యప్రజల కది యంత సుబోధకముగ నుండదు. ఆదేశపురాజు రాజ్యాంగ విషయములలో సాధారణముగ జోక్యము కలుగఁజేసికొనఁడు. గనుకనే ఆయన మంత్రులయందు వలెఁగాక, రాజునందును ఆయనకుటుంబముయందును మిక్కిలి యనురాగము కలిగి ప్రజలు ప్రవర్తించెదరు. ఈమధ్య ఆయన బంధువుఁడైన రష్యాచక్రవర్తిని తన దేశమున కాహ్వానముచేయగా రష్యా దేశ జనుల బాధలకు కారకుఁడని ఆచక్రవర్తి యెంచఁబడుటచేత, కీరుహార్డీ మొదలగు పార్లమెంటుసభ్యులును మఱికొందఱును తమ రాజు ఇట్టివిషయములో ప్రజలకు ఆగ్రహము కలిగియున్నపుడు జోక్యమును కలుగజేసుకొన్నయెడల ఆయన కిరీటము తక్కిన అనుపయోగమైన వస్తువులవలెనే కరిగింపఁబడిపోవునని కఠినముగాఁ జెప్పిరి కాని చాలమంది ప్రజలు పార్లమెంటులో జరుగు చర్చలకంటె

తమరాజుగారి కుటుంబములో జరుగు పెండ్లిపేరంటములను గుఱించియే, యెక్కువ శ్రద్ధ తీసుకొనెదరు. తమవలెనే నిత్యము సుఖదుఃఖములకు లోనైన తమరాజుగారి కుటుంబమందు అధికవిశ్వాసము కలిగియుందురు. కేవలము ప్రజాప్రభుత్వము గలదేశములో వలెగాక ప్రజలయొక్క లక్ష్యము, అంత విస్తారముగా పార్లమెంటులో అనుదినము జరుగుచర్చలయం దుండనేరదు. రాజకీయతంత్రములుకూడ అంత సులభముగ మాఱిపోవుచుండవు. ఆంగ్లేయ రాజ్యాధిపత్యము, మతము సామాన్యప్రజల నెంతగా నాకర్షించునో, అంతబలముతో వారి నాకర్షించుచు, రాజ్యపరిపాలనను కూడ మిక్కిలి బలపఱచును. చట్టములకు లోఁబడవలెనను మాటకంటె రాజుకు లోఁబడవలెననుట ప్రజలకెక్కువ స్పష్టపడును. ఇదిగాక యోగ్యుఁడైనరాజు సంఘములో నీతికి మార్గదర్శకుఁడును, తనమంత్రులకు సహాయుఁడుగనుకూడ నుండవచ్చును. మన ఎడ్వర్డు రాజుగారు పరరాజులతో యుద్ధము పొసఁగకుండ ఆయా దేశములకు పోయి యెంతయో పని చేయుచుండెను. అనుభవశాలురగు, విక్టోరియా మహారాణి మొదలగువారు పార్లమెంటులో నుండు సభ్యుల యొక్కయు, బయటి ప్రజలయొక్కయు అభిప్రాయములను గుర్తెఱిఁగినవారై తమ మంత్రిత్వమునకు మిక్కిలి యుపయోగకారులైన మంత్రులను, వారి పార్టీలోనుండి యేఱికొనఁగలుగుదురు.

ఇంగ్లాండుదేశములో చట్టనిర్మాణవిషయములో రాజు తన యంగీకారము నిచ్చితీరవలయు నని యిదివరకే వ్రాసియుంటిని. కాని, పార్లమెంటువారి అనుమతిలేకయే, అట్టిచట్టముల నమలులోఁ బెట్టినపుడు, రాజు అనేక అధికారములను చెలాయించఁగలఁడు. తనసేనల నన్నిఁటిని ఎత్తివేయవచ్చును. పటాలములలోనున్న సేనాధిపతుల నందఱిని వారి యుద్యోగముల నుండి తప్పించ వచ్చును. యుద్ధ నావికులను, వారి సేనాధిపతుల నటులనే చేయవచ్చును. యుద్ధనావలను, వానిసామానులను అమ్మివేయవచ్చును. ఇట్లు తన దేశమునకు కావలసిన రక్షణసేనను తీసివేసి, దానిని పరదేశీయులపాలు చేయవచ్చును. తన రాజ్యములో కొంతభాగమును పరరాజులకిచ్చి వారితో సంధి కావించుకొనవచ్చును. తనదేశములోనుండు ప్రతిపురుషుని ప్రతి స్త్రీని తనపార్లమెంటులో ఒక శాఖమైన ప్రభు సంఘములో జేర్చవచ్చును. ప్రతిపల్లిలోను ఒక సర్వకలాశాల నేర్పఱచవచ్చును. సివిలు ఉద్యోగీయులలో చాలాభాగ మందఱిని బరతరఫు చేయవచ్చును. తన దేశములో న్యాయాధిపతులచే శిక్షింపఁబడిన నేరస్థులందఱిని క్షమించవచ్చును. ఇంతింతపనులు రాజు అనుదినము చేయఁగలిగి యున్నపుడు, ఆయన యేల చేయుచుండలేదని కొందఱడుగవచ్చును. దానికి రెండుమూఁడు ముఖ్యకారణములు కలవు.

1 రాజుచేయు ప్రతియాజ్ఞయు కాగితములమీఁద లిఖింపఁబడి ఒకరిద్దరు, ముగ్గురు మంత్రులచేతఁ గూడ దస్కతుచేయఁబడినను, దానిని లాప్రకారము ప్రజ లుల్లంఘించవచ్చును. కనుక, అట్టియాజ్ఞలను చేయుమని బోధించు మంత్రులను విచారణచేసి శిక్షించుటకు పార్లమెంటువారికి అధికారము కలదు. దీనినే(Right of impeachment)అనియెదరు. 2. అట్టి మంత్రులను తమ పదవులకు రాజీనామా లిచ్చునట్లు చేయుటకు తగిన మార్గములు పార్లమెంటువారిచేతులలోనే యున్నవి. ఇదివరకు వ్రాసినట్లు వారిసమ్మతిలేకుండ ఒక పైసా నయినను, తమ మంత్రులఁగుండా రాజు వసూలుపఱచుకొనలేఁడు. దీనినే (Right of taxation) అని చెప్పుదురు. పార్లమెంటువారు రివిన్యూ సంబంధమైన బిల్లులు (Money bills) ప్యాసుచేసి రివిన్యూ ఖర్చు చేయువిధమును కనఁబఱచు ఆక్టులను (Appropriation Acts) ప్రతిసంవత్సరము నిర్మాణముచేసినఁగాని, రాజు బొక్కసములోకి ఒకదమ్మిడియైనను రానేరదు. రాజ్యములో స్థిరమయిన సేన యుండవలెనన్న, ప్రతిసంవత్సరము పార్లమెంటువారు (Mutiny Act)అనేచట్టముల నేర్పఱచుచుండినఁగాని, ఒక మనిషియైనను సేనలో కొలువ నవసరములేదు కాఁబట్టి న్యాయనిబంధనలకు బద్ధుఁడై యుండవలెనన్న రాజుగాని, అతని మంత్రులుగాని, పార్లమెంటువారియొక్క, వారిలో ముఖ్యముగ రెండవ శాఖమైన ప్రతినిధి సంఘము సహాయములేకయే, యేపనియు చేయఁజాలరు.

CHAPTER II

కార్యనిర్వాహకశాఖ.

ఆంగ్లేయరాజ్యపరిపాలనలో రాజు మిక్కిలి కొద్దిసంబంధమును గలుగజేసి కొనుచుండు ననియుఁ గార్యనిర్వహణాధికారము (Executive power) నామమాత్రముగా రాజునందుండుటయేగాని నిజమున కాయన మంత్రులయందే యున్నదనియు, యీమంత్రులను పార్లమెంటులో నేపార్టీవా రెక్కువగ నుందురో ఆపార్టీలోనుండియే రాజేర్పఱచు కొనుచుండవలయుననియు, యీపార్లమెంటులో నొకశాఖయైన ప్రజాప్రతినిధి సంఘము యెక్కువగనుండు పార్టీ కిష్టులైన ప్రముఖులనేమంత్రులుగ రాజు గైకొనవలసినదనియు, లేనియెడల రాజ్యపరిపాలనము సరిగా జరగుట యసాధ్యమనియు వ్రాసియున్నాము. ఈమంత్రులసంఘమే రాజుపేరట రాజ్యభారమంతయు వహించి కార్యనిర్వాహకత్వమును జక్కఁగా జరిపించుదురు. దేశక్షేమమునకుఁ గావలసిన ముఖ్యవిషయము లన్నిఁటిలోను వీరందఱు యేకాభిప్రాయులై ఒకపార్టీగా చేరియుండి ఆ విషయములను ప్రజాప్రతినిధిసంఘములోఁ జర్చించునపుడు వీరిమాటసాఁగక యెక్కువ మందిసభ్యులు వీరికి వ్యతిరేకముగ నభిప్రాయపడిన యెడల వీరందఱు నొక్కమాఱుగ తమపదవులకు రాజీనామాల నిచ్చెదరు. వీరిలో వీరికి పట్టుదల విషయములలోఁ గూడ కొంచెము

భదాభిప్రాయము లున్నను నంద ఱేకగ్రీవముగ రాజీనామా లిచ్చుట శిష్టాచారమై యున్నది. అప్పుడు రాజు ప్రజాప్రతినిధి సంఘములో రెండవ కక్షిదారులలో ప్రముఖులకు ముద్రాధికార మిచ్చుటగాని లేక ఆ సంఘమును చెడఁగొట్టి (Right of Dissolution) తిరిగి నూతన ప్రతినిధుల నెన్నుకొనవలసినదని ప్రజలకుఁ దెలియఁజేయుటఁగాని జరగును. నూతన ప్రతినిధుల యభిప్రాయముబట్టి వెనుకటి మంత్రు లుండుటయో క్రొత్త మంత్రులు వచ్చుటయో తటస్థించుచుండును.

ఈ మంత్రులసంఘము (Cabinet) ఆంగ్లేయరాజ్యతంత్రములో గార్యనిర్వాహణాధికారమునకును (Executive power) శాసన నిర్మాణాధికారమునకు (Legislative power) నన్యోన్యసంబంధములు గలుగఁజేయుచున్నది. ఫ్రాన్సుదేశములోను అమెరికాసంయుక్త రాష్ట్రములోను ఇంగ్లాండుదేశపు రాజ్యతంత్రము ననుసరించియే కొన్నినిబంధన లేర్పడినవిగాని ఆదేశములో నీరెండుశాఖలు స్వతంత్ర స్వామ్యములు కలవై విడి విడిగానుండుటంబట్టి శాసన నిర్మాణశాఖ సాధారణముగఁ గార్యనిర్వహణశాఖ కాటంకము కలుగఁజేయుచు కొన్ని చిక్కు సమయములలో తన స్వతంత్రాధికారమును నిర్వహించుట వలన ననేకములగు నిబ్బందులు కలుగుచు వచ్చెను. అమెరికా సంయుక్త రాష్ట్రములో నొక్క గొప్పవిప్లవము 1834 సంవత్సరమందు సంప్రాప్తమైనపుడు కార్యనిర్వహణము తిన్నగా జరగకపోవుటచే

తనే ప్రజలు తమప్రెసిడెంటుగారైన అబ్రహాములింకనుగారు నిరంకుశాధికారము నుపయోగించుట కొప్పుకొనిరి. ఫ్రాన్సు దేశములో 1789, 1871 సంవత్సరములలో జరిగిన విప్లవము లీ రెండు శాఖలను సమ్మేళనము చేయుట కాదేశపు రాజ్యతంత్రములలో తగిన వసతులను గలుగఁజేయకపోవుటనుబట్టియే సంభవించెను. ఈవిప్లవములకు మఱికొన్ని యితరకారణము లున్నను వారి ప్రజాప్రతినిధి సంఘమని (National Assembly) వివిధములైన యధికారములు తనయందే యుంచుకొనుటవలన కార్యనిర్వాహణాధికారము క్రమముగ నిర్వహింపలేక రెండు మూడుసారులు ప్రతినిధిసంఘమే నిర్మూలింపఁబడి ఆ యధికారము నిరంకుశ ప్రభుత్వము చేతులలోఁ బడవలసి వచ్చెను.

ఆంగ్లేయశాసననిర్మాణ సభలో (Legislature) కార్యనిర్వాహణసభ (Executive) ఒక కమిటీగా నెంచవచ్చును. ఆశాసన నిర్మాణ సభయొక్క కమిటీలలో నీకార్యనిర్వాహణ సభ యొక పెద్దకమిటీగా నెంచఁబడవలయును. దీనినే కాబినెట్ (Cabinet) అని పిలిచెదరు. ఇదియే ముఖ్యమంత్రుల సంఘము. శాసననిర్మాణసభలో ముఖ్యశాఖయైన ప్రజాప్రతినిధి సంఘములో నెక్కువపార్టీవారికి యేగొప్పవారిపై నమ్మకము గలిగియుండునో వారే రాజమంత్రులై కాబినెట్టులో మెంబర్లయ్యెదరు. వీరిని నియమించునధికారము నామమాత్రముగా రాజునందున్నను నిశ్చయమునకు నూఱుసంవత్సరములనుండి ప్రజాప్రతినిధి సంఘము (House of Commons) నందే యున్నది.

ఈకాబినెట్టులోని ప్రధానమంత్రి, అమెరికాసంయుక్త రాష్ట్రము యొక్క ప్రెసిడెంటు హోదాతో సమానమైన హోదానుగలిగియున్నాఁడు. అమెరికాలో ప్రెసిడెంటు ప్రజలచేత నెన్నుకొనఁబడినను ఆంగ్లేయదేశప్రధానమంత్రులను ప్రజలు తమప్రతినిధి సంఘముఖమున నెన్నుకొనెదరు. కాఁబట్టి ఆంగ్లేయశాసన నిర్మాణసంఘము తన ముఖ్యవిధియైన శాసన నిర్మాణము కంటె మంచికార్య నిర్వహణ సభను స్థాపించుట, దానిని నిలువఁబెట్టుటకు ప్రయత్నించుట, అది చేయు లోపములను సవరించుట, దానికితగిన సలహాల నొసంగి తిన్ననైన మార్గము నందుంచుట, ఇవియే తన కెక్కువ ముఖ్యమైన కార్యములుగా నెంచుకొను చుండును. ఇట్లెడతెగక కార్యనిర్వాహణ సభ యొక్క చర్యలను మిగుల జాగ్రత్తతోఁ బరిశీలించుచు శాసన నిర్మాణసభ దానిని తనకుబాధ్యతఁ గలిగించుకొను చుండును. ఈ కాబినెట్టులో యే మెంబర్లే యేమంత్రిస్థానమున కర్హులో ప్రధానమంత్రి (Prime Minister or Premier) యోచించి రాజుచేత నా యా పదవులను వారి కొసంగించుచుండును. ప్రధానమంత్రి తక్కిన మంత్రిస్థానములలోఁ దన కిష్టము వచ్చిన మఱియొక స్థానమును గూడ స్వీకరించుట తరచుగ తటస్థించును.

ఈ మంత్రి సంఘము (Cabinet) యెప్పుడు కూడునో యెట్టి మంత్రాలోచనలు జరిగించుచుండునో యితరుల కెవ్వరికిని దెలియవు. వారిచర్యలన్నియు రహస్యములే. వారియుద్దేశములు

వారప్పుడప్పుడు పార్లమెంటుసభలో అనఁగా శాసన నిర్మాణ సభలోను బయట ప్రజల మీటింగులలోను నిచ్చునుపన్యాసమూలముననే ప్రజలకుఁ దెలియుచుండును. వీరికొక విచిత్రమైన శక్తికలదు. తమ్ము నేర్పరచుకొన్న శాసన నిర్మాణసభలో ముఖ్యశాఖయైన ప్రజా ప్రతినిధిసంఘమునే తమ సలహాను విననందుకు విచ్ఛేదము చేసి వెడలఁగొట్టఁగలదు (Right of Dissolution). తమ మాత్రమైన శాసన నిర్మాణ సభయొక్క తీర్మానములను గొంతకాలమువఱకైనను దాము తృణీకరించవచ్చును. తమకు వ్యతిరేకముగ నొక ప్రజా ప్రతినిధి సంఘము (House of Commons) తీర్మానించినయడల దానిని వెడలఁగొట్టి ప్రజలచేత మఱియొక ప్రతినిధి సంఘమును నిర్మాణము చేయించి దాని కప్పీలు చేసికొనుట కీకాబినెట్టువారి కధికారముకలదు. ఈపనిని తమరాజుచేత చేయించెదరు. రాజు వీరిమాట ప్రకారము సాధారణముగ జరిగించి తీరును.

శాసన నిర్మాణసభకును (Legislature) కార్యనిర్వాహణసభకును (Executive) నిట్టి అన్యోన్యసంబంధముండుట దేశమునకు మిక్కిలి క్షేమకరము. దీనికి కొన్ని యుదాహరణల నీ క్రిందఁ బొందుపరచెదను.

ప్రతి నాగరిక దేశములో విద్యాభివృద్ధికిని, సివిల్ మిలిటరీ మొదలగు వ్యవహారములకును, కావలసిన వ్యయములు మాఱుచు నేఁటేఁట హెచ్చుగుచుండును. కార్యనిర్వాహకులును,

శాసననిర్మాణకులును, నొక్కరే కానపుడు, వీరుభయులకు తగవులు తరుచుగ సంభవించును. పన్నువిధించువారికిని వానినిఖర్చు చేయువారికిని తప్పక జగడములు తటస్థపడుచునే యుండును. తమకుఁగావలసిన చట్టముల నేర్పాటు చేయనియెడలఁ గార్యనిర్వాహణశాఖ బలహీనమైపోవును. అట్టికార్య నిర్వాహణభారము తమయందు లేకపోవుటచేత, శాసన నిర్మాణసభ యెందునకుఁ గొఱగాకపోవును. తాను చేయఁదలచుకొన్నది చేయుటకుశక్తి చాలమిఁ గార్యనిర్వాహణ సభ తనపేరు సార్థకమునకుఁ దెచ్చుకొన లేకపోవును. తానుచేయు తీర్పులవలన బాధపడువారితరులు గనుకను దేశక్షేమమునకు బాధ్యులు కార్యనిర్వాహకసభవారు గనుకను, శాసననిర్మాణసభ తనస్వాతంత్ర్యము వలననే తాను చెడిపోవుచున్నది. కాఁబట్టి కార్య నిర్వాహణసంఘమువారు, దేశపరిపాలనకుఁ దమకు గావలసిన పన్నులను గుఱించి శాసననిర్మాణసభవారికిఁ దెలుపుచు, వారియంగీకారమును బడసి పన్నులను విధించుచుందురు. ఒకవేళ వారియంగీకారము నియ్యనియెడలఁ దాము తమపదవులకు రాజీనామాల నిచ్చుటగాని లేక ప్రజా ప్రతినిధిసంఘమును ఛిద్రముచేసి తిరిగి క్రొత్త ప్రతినిధుల నెన్నుకొన వలసిన దనిప్రజలకుఁ దెలియఁజేయుటగాని తటస్థించు చుండును.

ఈ రెండుశాఖలకు భేదములు ప్రబలకమునుపు మంత్రుల పార్టీవారును, రెండవపార్టీవారును, పార్లమెంటులోనేగాక ప్రజ

లకుఁగూడ వారివారివాదములు బోధపడుటకనేకోపన్యాసముల నిచ్చుచుందురు. ఈచర్చలలోఁ దమవాగ్ధాటియు, బుద్ధికౌశల్యతను, జూపఁగలవారే మున్ముందు మంత్రులగుట నిశ్చయము. ఒకానొకప్పుడు ప్రజాప్రతినిధి సంఘము విచ్ఛిత్తయిన తరువాత తిరిగి ప్రస్తుతచర్చాంశములలో నెట్టియభిప్రాయములను వెల్లడిచేయ వలసిన ప్రతినిధుల నెన్నుకొనవలయునో జనులు తెలిసికొనుటకు వార్తాపత్రికలును ఉపన్యాసములును, ముఖ్యాధారములు. కార్యనిర్వహణదీక్షాపరులగు మంత్రిపుంగవులకు గాని వీరిలో నెవరికి దగినబలమియ్యవలయునో ప్రజలాలోచించుకొని తమ ప్రతినిధులనెన్నుకొని శాసననిర్మాణసభకు పంపెదరు. శాసననిర్మాణశాఖకును, కార్యనిర్వహణశాఖకును గల అన్యోన్యసంబంధము వలననే రెండును బలపడును. వీనికి వేఱువేఱుగ స్వతంత్రశక్తులుండి విరోధముగనున్నయెడల, రెండును బలహీనమగును. ఇదిగాక శాసననిర్మాణసభ కార్యనిర్వహణసభ నేర్పరచినతరువాత దానూరకకూర్చుండునా? లేదు. ఎల్లపుడు రెండవదానిచర్యలు బహుజాగరూకతతో కనిపెట్టుచునేయుండును. కార్యనిర్వాహకులగు కాబినెట్టులోని మంత్రులను దానుతీసివేయుచుండుటయు, నేర్పఱచుచుండుటయుఁ దఱచుగఁ దటస్థించుచుండును. తానేర్పఱచిన మంత్రులనే వారు జరిగించిన పనులకు వారియెడల దనకు నమ్మకములేదని తీర్మానముచేసి, వారినొకప్పుడు మంత్రి పదవులనుండి వెడలఁగొట్టును. తానే యొకానొకప్పుడు,

మంత్రులసలహాతీసికొన్న రాజుచేత వెడలఁగొట్టఁబడవచ్చును. కాని తిరిగి ప్రజాప్రతినిధి సంఘ మేర్పడి, తాను క్రొత్తమంత్రులనేర్పఱచుకొని రాజును తనకు రాఁబఱుచుకొనఁగలదు. శాసననిర్మాణశాఖను, కార్యనిర్వహణశాఖకును, అనఁగా పార్లమెంటు వారికిని, కాబినెట్టువారికిని, అన్యోన్యసహాయము, పరరాజులతో యుద్ధము సంభవించుట మొదలగుచిక్కుసమయములలో నెక్కువయవసరము. ఇట్టిసమయములలో నుపకరించుమంత్రులను జనులు, తాము స్వయముగఁగాని లేక అప్పటిపార్లమెంటు ప్రతినిధులముఖమునఁ గాని, యెన్నుకొనవచ్చును. అలలులేక నెమ్మదిగనుండు సముద్రములో నోడనడుపు చుక్కానివాఁడు గొప్పతుపానులో నెట్లు పనికిరాక క్రొత్తవాని నెట్లేర్పాటుచేయుదురో అట్లే ఆయా సమయములకుఁ దగినమంత్రు లేర్పడుచుందురు. క్రిమియాయుద్ధము సంప్రాప్తమయినపుడు, మిక్కిలి తెలివితేటలతో నెమ్మదిగ రాజ్యముచేయు మంత్రులనుసహా తీసివేసి, యెక్కువధైర్యస్థైర్యములతో వెనుకంజవేయక యుద్ధమును జయప్రదముగ నెరవేర్పగలిగిన మంత్రుల నేర్పఱచుకొనిరి.

CHAPTER III.
న్యాయశాస్త్రవిధి.

ఇతర దేశములలో సాధారణముగా గనుపడని యొకనిబంధన యింగ్లాండు దేశములోఁ గలదు. దీనిని న్యాయశాస్త్రవిధి యని చెప్పనొప్పను. (Rule of Law) ఈశబ్దార్థములో రెండుమూఁడు ధ్వను లున్నవి. అవియేవియనఁగా, 1. క్రమముగాఁ జట్టములవలన నేర్పడిన న్యాయనిబంధనల నుల్లంఘించువారు సామాన్యన్యాయసభలమూలముననే తప్ప మఱియొక విధముగ విచారణచేయఁబడి వారియాస్తికిని, స్వాతంత్ర్యమునకును భంగము కలుగఁగూడదు. అనఁగా, నిరంకుశాధికారమున కొంతయైనను చోటియ్యఁ బడదు. 2. ఎంతగొప్పవాఁడైనను, నెంతకొద్దివాఁడైనను సివిలు క్రిమినల్ కోర్టులలో మామూలుగా నమలులో నున్న చట్టములకు బద్ధుఁడు కావలసియుండును. ప్రతిప్రభూద్యోగియు, మంత్రి మొదలు కాన్స్టేబిలువఱకు చట్టములకు వ్యతిరేకముగ నడచిన యెడల, కోర్టులలో జవాబుదారీ చేయవలసియుండును. పైఅధికారి యాజ్ఞనుబట్టి చేసితినని యేతాబేదారును తప్పించుకొనలేఁడు. 3. జనుల హక్కులు శాసనములమూలమున నేర్పడక, అప్పుడప్పుడు కోర్టులలో కక్షిదారులు తెచ్చినవ్యాజ్యములలో స్థాపింపఁబడిన వగుటచేత నాంగ్లేయరాజ్యతంత్రము న్యాయశాస్త్రవిధిచేత నిబిడీకృత మైనది. జనులకు స్వాతంత్రము నొసఁగిన కొన్ని యితర రాష్ట్రములలో వారిహక్కులను జట్టము

లగుండ స్పష్టపఱిచిరిగాని, వానిని గాపాడుటకుఁదగిన మార్గములను జూపరైరి. ఇందులో రెండవదే బహుముఖ్యము. ఇంగ్లాండు దేశములో జనుల హక్కులకును వానిని సాధించు నుపాయములకును నెడతెగని అన్యోన్యసంబంధము న్యాయస్థానముల గుండ నేర్పడుటచేత, నీహక్కులను కొద్దికాలమునకైనను భంగముకలిగింపఁజేయుటకు పరిపాలకులకు సాధ్యము కాదు.

దేహ స్వాతంత్ర్యపు హక్కు.

రాజునకును పార్లమెంటువారికిని మధ్య పుట్టిన రెండుదస్తావేజులలో (Magna Charta and Petition of Right) యీహక్కువిషయమై వ్రాయఁబడియున్నదిగాని యీదస్తావేజు లదివఱకు ప్రజలకున్న హక్కులను దెలియఁజేసినవేగాని క్రొత్తగా నాహక్కులను స్థాపనచేయ లేదు. దేహస్వాతంత్ర్యపుహక్కు అనఁగా న్యాయశాస్త్రమునకు వ్యతిరేకముగా నడచినపుడు తప్ప నేవిధముగాను నెవర్నైనను చెఱసాలలో వేయకుండుట, అరెస్టు చేయకుండుట, ఇంక మఱి యే విధముగను నిర్బంధించకుండుట; అట్లెవరైనను జరిగించినయెడల, వారిని శిక్షించుటయు, వారివలన నష్టపరిహారమును బొందుటయు, ప్రతివానిహక్కైయున్నది. అట్టి యకృత్యమును జేసినవాఁ డెంతగొప్పయుద్యోగమందున్నను నతనిమీఁద సివిలు క్రిమినల్ చర్యలు జరిగించవచ్చును. అట్టిపని రాజాజ్ఞచేఁ జేయఁబడినదని చెప్పుకొన్నను కోర్టువా రంగీకరింపరు.

ఏమనిషియైనను విచారణలేకుండ చెఱసాలలోఁ గాని మఱి యేచోటనైనఁగాని బంధింపఁబడినపు డాయన బంధువులుగాని స్నేహితులుగాని, యెవరి హవాలాలో నాయనయుంచఁబడెనో వారికి నోటీసును బంపి (Writ of Habeas Corpus)ఆయనను కోర్టుకు తెప్పించఁగలరు. ఈహక్కు అనేక సంవత్సరములనుండి వాడుకలో నుండి యిటీవలి చట్టముల వలనఁ గూడ బలపఱచఁబడినది. గొప్ప నేరము జరిగించెనని యనుమానముమీఁద నరెస్టుచేయఁ బడిన వాడుకూడ తనశీఘ్రకాలములో విచారింపవలసిన దని యీచట్టములక్రింద కోర్టువారికి పిటీషను పెట్టుకొనవచ్చును.

కార్యనిర్వహణ శాఖకును (Executive body) న్యాయాధికారులకును(Judicial body)గల సంబంధమీ చట్టముల నములులో పెట్టునపుడు స్పష్టముగా విశదమగుచుండును. రాజుగాని, ఆయన యుద్యోగస్థులుగాని, అశాస్త్రీయముగా నెవరినైనను నిర్బంధించినపుడు,కోర్టులలో నెల్లప్పుడు దానికి పరిహారమును బొందుట కడుసులభము. కాఁబట్టి కార్యనిర్వహణశాఖ వారిపరిపాలనను, న్యాయాధికారు లెల్లపుడు కనిపెట్టిచూచుచు బహుజాగరూకతతో దానిని గుఱించి పరామర్శ జరుపుచుందురు. దీనికిఁ గొన్ని యుదాహరణల నిచ్చెదను.1. 1839 సంవత్సరములో, నాంగ్లేయ రాజ్యాధికారము క్రిందనున్న కెనడా యను దేశములో గొందఱికి రాజద్రోహ నేరమునకు

ద్వీపాంతరశిక్ష విధింపఁబడి అక్కడి యధికారులచేత నొక యోడమీఁద దక్షిణమహాసముద్రములో నున్న ఒకదీవికి పంపఁబడిరి. ఆయోడ, మార్గమధ్యమున నింగ్లాండు దేశములో నొక రేవుపట్టణము సమీపించగా ఆఖైదీల స్నేహితులు కనడాలో విచారణ సరిగా జరుగలే దని యింగ్లీషుకోర్టులో పిటీషను పెట్టి వారిని లండనుపటణమునకు రప్పించి తిరిగి విచారించిరి. తుదకు కెనడా దేశాధికార్ల తీర్పు ఖాయపడినప్పటికి నీదేహస్వాతంత్ర్యపు హక్కు యెంత జాగ్రత్తతో గాపాడఁబడుచున్నదో స్పష్టముగాఁ గనుపించెను.2. 185[illegible] సంవత్సరములో మన యిండియా దేశములో నొకతెల్లమిలిటరీ యుద్యోగస్తునిమీఁద కూనీ నేరము మోపఁబడి, ఆయన నాల్గు సంవత్సరములు చెఱసాలలో నుండునట్లు తీర్పుకాఁగా నట్టి తీర్పునుబట్టి యాయుద్యోగి యింగ్లాండునకు పంపఁబడెను. ఆయన యింగ్లాండు దేశములో నడుగుపెట్టఁగనే, అట్లు పంపఁబడుట న్యాయనిబంధనలకు వ్యతిరేకముగా నున్నదను కారణముచేతనే దోషియని ఒప్పుకొనఁబడిన యీహంతకుఁడు విడుదలచేయఁబడెను. 3. ఇతరదేశములలో నేరములు చేసి, యింగ్లాండునకు పాఱిపోయి వచ్చినమనుష్యులను, ఏయే నేరములకు నేయేచర్యలు జరిగిన మీఁదట నట్టినేరస్థులను వారిపరిపాలకులకు స్వాధీనపఱచవలెనో ఈసంగతులను దెలుపు చట్టములఁ బట్టియే. (Extradition Acts) వారి నొప్పఁ జెప్పవలెనుగాని యింగ్లాండులో కార్యనిర్వహణ శాఖవారు తమ నిరంకుశాధికారముతో నట్లు జరిగించుటకు వలనుపడదు.

ఒకప్పుడు దేశములో గొప్పవిప్లవములు, లేక దొమ్మిలు సంభవించినపుడును, అరాజకులు ప్రబలినప్పుడును కార్యనిర్వాహక సంఘమువారు కొన్నికొన్ని నేరములకు పైచట్టములను (Habeas Corpus Acts) నొక సంవత్సరమునకు మించకుండ నమలులోఁబెట్టకుండ నుండుపద్ధతిమీఁద శాసననిర్మాణశాఖవారివలనఁ (Legislature) గొన్నిచట్టముల నేర్పాటు చేయించుకొనుచుండెదరు. వీనికే (Habeas Corpus Suspension Acts) అనిపేరు. ఆసంవత్సరము గడువులోపల రాజ మంత్రులును, తక్కినయుద్యోగస్థులును నిరపరాధులైనవారిని కేవలము అనుమానముమీఁదనే నిర్బంధించినపుడు వారు ఆ సంవత్సరాంతమందు సివిల్ క్రిమినల్ చర్యలకు లోఁబడ వలసి యుందురు. కనుక గడువులోపలనే ఆమంత్రులుమొదలగువారిని మన్నించుటకు గాను, పార్లమెంటు వారు (Acts of Indemnity) అనుచట్టముల నేర్పఱచెదరు. సర్కారుద్యోగస్థు లాసంవత్సరము కాలములో జరిగించిన చర్యలు నిర్హేతుకము లయినవా, లేక సదుద్దేశముతో చేయఁబడినవా, శీఘ్రకాలములో నేల యపరాధులును కోర్టువారి యెదుట విచారణకు పెట్టలేదు. అనుచితములయిన కార్యము లేమయినను జరిగించిరా, అనవసరమయినట్టియు, నతి కఠినమయినట్టియు శిక్షలను విధించిరా—ఈ మొదలగు సంశయములన్నింటిని ఆలోచించి గాని శాసన నిర్మాణశాఖవారీ (Indemnity Acts)నుప్యాసు చేయరు. కాఁబట్టి శాసననిర్మాణశాఖ కొన్నికొన్ని చిక్కు సమయములలోఁ గార్యానిర్వాహ

కశాఖ కెక్కువబలమును, నిరంకుశాధికారమును నొసంగియును ఆ బలమును ఆయధికారమును నెట్లుపయోగింపఁ బడుచుండెనో ఆసంగతి కనిపెట్టుచు కేవలము నిరపరాధు లయిన వారిని నిర్హేతుకముగ గారాబద్ధులనుగాఁ జేసినమంత్రి మొదలగువారిని కోర్టులలో మామూలుగా నమలులోనున్న న్యాయనిబంధనలకు లోఁబఱచెదరు. కాఁబట్టి యేవిధముగఁ జూచినను గొప్ప విప్లవసమయములయందు నిరంకుశాధికార మవశ్యమగునపుడు గూడ న్యాయశాస్త్రవిధిని బట్టియే ఆయధికారము కలుగుటయు, పోవుటయు దటస్థించుచుండును.

చర్చాస్వాతంత్ర్యపు హక్కు.

ప్రతివ్యక్తియు, సాంఘిక రాజకీయ మతసంబంధమైన విషయములలోఁ దనయిచ్చకువచ్చినట్లు నిర్భయముగ మాటలాడవచ్చునని యు కోర్టులలో తీర్పులు పుట్టుచుండుటయేగాని, యీహక్కువిషయమై వేఱయొకదస్తావేజు పుట్టలేదు. ఈహక్కును దుర్వినియోగపఱచినపుడు మాత్రమే కోర్టువారు శిక్షించెదరు. సరియైన హేతువులులేక యితరుల పరువునకు భంగము కలుగఁజేసిన వారు శిక్షాపాత్రులగుదురు. ఈవిషయములో సామాన్యమానవులకుంటెవార్తాపత్రికల కెక్కువహక్కు లేదు. నిజమైనసంగతుల నైనను గొన్నిసమయములందు వ్రాయఁగూడదు. చెప్పఁగూడదు. అట్లువ్రాయుట చెప్పుటలోఁ గూడమితముగా నాక్షేపించవలయును. రాజ్యపరిపాలనా విమర్శనలకు గూడ, జనులనడతలను విమ

ర్శించు లిఖిత వాగ్రూపకమైన చర్చలకువలెనే, సామాన్యనిబంధనలే వర్తించును. ఈవిమర్శనలు నేరములా యనువిషయమును గుఱించి, విమర్శకునివంటివారే యగుపండ్రెండుగురు సామాన్యప్రజల తీర్పననుసరించియే (Trial byjury) పని జరుగుచుండును. పండ్రెండుగురు పెద్దమనుష్యులు వ్రాయవచ్చుననిగాని అభిప్రాయపడు విషయమును వ్రాయుటకు చెప్పుటకు హక్కు కలిగియుండుటే చర్చాస్వాతంత్ర్యపుహక్కని చెప్పవచ్చును. ముద్రణాస్వాతంత్ర్యముకూడ దీనిలో చేరినదే. వార్తాపత్రికలు మొదలగువానిని ప్రచురించుటకు లైసన్సు అక్కరలేదు. వానిని ముద్రించువాఁడు గాని, ప్రచురించువాఁడుగాని సొమ్ము యేమాత్రము ముందుగా సర్కారుకు దాఖలు చేయనక్కరలేదు ముందెప్పుడైనను పత్రికాధిపతి నేరము చేయునేమో యని వానిబద్ద మొదటనే జామీను అడుగఁగూడదు. నేరముచేసినందుకు శిక్షించెదరుగాని ఒకపత్రికలో రాజద్రోహకరమైన లేక మఱియొక హానికరమైనవ్యాసము ప్రచురింపఁబడినంత మాత్రముచేతనే, ముద్రణాయంత్రము దానివస్తుసామగ్రి మొదలగునవి జప్తుచేయవలనుపడదు. ప్రచురపఱచకమునుపే వ్యాసమును సర్కారు ఉద్యోగస్థులకు జూప నక్కరలేదు. నిరంకుశాధికారముతో నేపత్రికను నిలుపుచేయుటకు సర్కారు వారి కధికారము లేదు. తక్కిన నేరములకు మామూలు కోర్టులలో మామూలు న్యాయనిబంధన లెట్లు వర్తింపఁ జేయుదురో ఆవిధము

గనే ముద్రణాయంత్ర సంబంధమైన నేరములకుఁగూడ నట్లే వర్తింపఁ జేయుదురు.

బహిరంగముగ జనులు కూడగలహక్కు.

ఎంతమందియైనను, నెక్కడనైనను జేరి యేవిషయమైనను చర్చించవచ్చును. అట్టిసభలలోఁ జేరినవారిచర్యలనుబట్టి అవి అశాస్త్రీయమైన సభలు కావచ్చును. అప్పుడు వానిని పరిపాలకులు వెడలఁగొట్టవచ్చును కాని న్యాయముగఁ గూడిన సభలోఁ జర్చించబడుచున్న విషయములు మఱికొందరికిష్టములేనంత మాత్రము చేత దొమ్మి జరుగునేమోయని ఆసభను వెడలఁగొట్టఁగూడదు. పార్లమెంటువారేర్పఱుచు శాసనములవలననే తప్ప ఒకమంత్రిగాని, ఒకమేజస్ట్రేటుగాని సభలను జరుగకుండ నిషేధించుట న్యాయశాస్త్రమునకు విరుద్ధము. సదుద్దేశముతోఁగూడినసభలో జరుగు చర్చలవలన కొందఱుజనుల కసూయ సంభవించి దొమ్మి జరిగి రక్తము వరదలుగట్టి ప్రవహించవచ్చునేమోయను సంశయము కలిగినప్పటికి సర్కారుఉద్యోగస్థులాసభ నాఁపివేయుటకు వలనుపడదు. ఇట్టిహక్కు యూరపుఖండవాసులలోఁగూడ కనుపించదు.

ఇండియాదేశములో బ్రిటిషు ప్రభుత్వ మారంభమయినది మొదలు, మనసర్కారువారు పైనజెప్పిన మూఁడు హక్కులను నిరాటంకముగ ప్రజలుపయోగించునట్లు చేసిరి. కాని, యీదేశములో ననేకజాతులును, అనేకమతవైషమ్యములు మొద

లగునవి యుండుటచేతను మనదేశశిక్షాస్మృతులు మొదలగు వానిలోఁ గొద్దిమార్పులును జేర్చి, యీహక్కులను మనకు నిలిపిరి. ఇటీవల, మూఁడునాలుగు సంవత్సరములనుండి, అక్కడక్కడ కొందఱు అరాజకులు బయలువెడలి దౌర్జన్యములు జరిపించుచుండుటచేతను వారి నణఁచివేయుటకో, లేక మఱియే యితరకారణముల వలననో కొన్ని కఠిన శాసనముల నిర్మాణము చేసిరి. దేహస్వాతంత్ర్యపుహక్కుకు భంగమగు 1827 సంవత్సరపు ఆక్టును పునరుద్ధారణముచేసి, విచారణలేకనే ద్వీపాంతరశిక్ష విధించుట, చర్చాస్వాతంత్ర్యపుహక్కుకు భంగమగు (Press Act) స్థాపించుట, బహిరంగముగ జనులు కూడుకొనఁగలహక్కుకు కొంతభంగకరమగు (Seditious Meetings Act)అనుచట్టమును నిర్మాణముచేయుట—ఈమొదలగు చట్టములవలన మనలిఖితవాగ్రూపస్వాతంత్ర్యమునకు కొంత కొఱంత గలిగినదని చెప్పుటకు సందేహము లేదు.

ఇంగ్లాండు దేశములో న్యాయశాస్త్రవిధి(Rule of Law) యెంతబలీయముగ నున్నదో చూపుట కిదివఱకిచ్చిన యుదాహరణములుగాక, మఱికొన్నిటి నీక్రింద వివరించుచున్నాను.

1. స్థిరమైనసేన (Standing Army) దాని న్యాయశాస్త్రము (Martial Law)

మామూలుగ నమలులో నుండు చట్టముల నాఁపుదల చేసి, మిలిటరీకోర్టులచేత దేశమును బరిపాలించుట ఆంగ్లేయ

న్యాయశాస్త్రములలో నెక్కడను కనుపించదు. కాని దేశము పరులచే దండెత్తఁబడినప్పుడు గాని తిరుగుబాటు దొమ్మి మొదలగునవి తటస్థించునప్పుడు గాని పరిపాలకులకు వానిని తక్షణమే యణఁచివేయుటకుఁ దగినంత యధికార ముండవలెను గదా లేనియెడల దేశ మరాజకమై ప్రజలందఱు సంక్షోభిల్లెదరు. జనులదేహములను ఆస్తిని కాపాడవలసిన విధి పరిపాలకులదై యున్నది. ఇట్టిసమయములలో ప్రతిసివిలు మిలిటరీ యుద్యోగస్థుఁడు మేజస్ట్రీటు, పోలీసు బంట్రౌతు, ఇంకను సామాన్య మానవుఁడుకూడ దొమ్మిల నాఁపుటకు పరిపాలకులకుఁ దగిన సహాయముఁ జేయవలయును. తమ శక్తిసామర్థ్యముల నన్నిటి నుపయోగించవలెను. ఒకప్పుడు దొమ్మిచేయువారిని హత్యకూడ చేయవచ్చునుగాని యనవసరమైన దౌర్జన్యమును చూపకూడదు. అట్లు చూపినవారు తాము మేజస్ట్రీటులైనను పోలీసు వారైనను కోర్టులలో విచారణ చేయఁబడి ప్రండ్రెండుగురు సామాన్య మానవులగుపంచాయితీవారి తీర్పును బట్టి శిక్షింపఁబడుదురు.

ఫ్రాన్సు మొదలగు కొన్ని దేశములలోఁ గొన్ని కొన్ని ప్రాంతము లప్పుడప్పుడు మిలిటరీ కోర్టులచేఁ బరిపాలింపఁ బడుచు మామూలుశాసనముల నమలులోఁబెట్టక మిలిటరీ ఆఫీసర్ల యిష్టప్రకారము జనుల నరెస్టుచేయుటయు కారాగృహములందుఁ బడవేయుటయు ఉఱిదీయుటయుఁ దటస్థపడుచుం

డును. ఇట్టిచర్య యింగ్లాండులో నెప్పుడును జరుగ నేరదు. ఆంగ్లేయరాజ్యములో నొక భాగమగు అయిర్లాండు దీనిని ఫ్రెంచివారు 1798 వ సంవత్సరములో దండెత్తి నపుడు అయిర్లాండు దేశస్థు డొకఁడు ఫ్రెంచివారిసేనలో సేనానాయకుఁడై తుదకు ఆంగ్లేయులవలనఁబట్టువడి వారి సేనానాయకుల వలన నుఱిదీయఁబడఁబోవుచుండగా సివిలుకోర్టువారు ఆయన ఫ్రెంచిసేనలో చేరిన వాఁడుగాని యింగ్లీషు ఆఫీసరు కాఁడు గనుక మిలిటరీ యుద్యోగస్థులు విచారించుట కేమియు నధికారము లేదని ఆయనను వదలి పెట్టించిరి.

ఇంగ్లాండులో కొంతస్థిరమైనసేన యున్నది. ఇదియొకపుడు రాజునకు సహాయముచేసి జనుల స్వాతంత్ర్యమునకు భంగము గలుగఁజేయునేమోయనియు, అట్టిసేన కొంచెమైనను లేనియెడల యితరదేశీయులు దండెత్తి వచ్చినప్పుడు దేశస్వాతంత్ర్యమే నశించునేమోయనియు యీసమస్య కొంతకాలము క్రిందటివఱకు ఆంగ్లేయ రాజనీతి నిపుణుల మనస్సులను కలవర పఱచుచుండెను. కాని వారీ సమస్యను మిక్కిలి తెలివి తేటలతో సాధించిరి. ఈస్థిరమైన సేనలో నుండు ప్రతిసైనికుఁడు తనపై ఆఫీసర్ల యుత్తరవులను బట్టి మాఱు మాటాడక నడచుకొనవలసియున్నను తక్కిన సామాన్యజనులవలెనే సివిలు అధికారులకు లోఁబడి యుండవలెను. ఈ సేనలోనుండువారి విధ్యుక్తధర్మములను దెలియఁజేయుచు ప్రతి సంవత్సరము (Mutiny Acts) అనుచట్టములను పార్లమెంటువారు నిర్మాణము చేయుచుందురు.

ఒక సైనికుఁడు సామాన్యమానవుని విషయమై ఏనేరమైనను జరిగించిన యెడల అతను మామూలు క్రిమినలుకోర్టులకు లాగఁబడి శిక్షింపఁబడును. అతడు నితరులకు బాకీపడిన యెడల సివిలుకోర్టులో నతని మీఁద వ్యాజ్యము తీసుకొనివచ్చి డిక్రీని పొందవచ్చును. కాని యతను కోర్టుకు రానక్కఱలేదు. ముప్పది పౌనులకు మించని ఋణమునకు ఆతనిని యరస్టుచేయుటకు వలను పడదు. ఏ విషయము లైనను మిలిటరీ సివిలుకోర్టుల యధికారములకు పొసగమి సంభవించునపుడు సివిలు అధికారమే ప్రబలవలయును. కూనీ నేరమొకసైనికుని మీఁద మోపఁబడి అతఁడు సివిలుకోర్టులో విచారింపఁబడి విడుదలైన యెడల ఆతనిని తిరుగ మిలిటరీ కోర్టువారు విచారించఁగూడదు. ఒకప్పుడు అతఁడు మిలిటరీ కోర్టులలో శిక్షింపఁబడినను విడుదల చేయఁబడినను ఆనేరమునకే సివిలుకోర్టులలో తిరిగి విచారింపఁబడవచ్చును.

ఒక నేరమునకు ఒకసైనికుఁడు విచారింపఁబడుచున్నప్పుడు అతఁడు తన పైయధికారియాజ్ఞనుబట్టి చేసితినని వాదించినను సార్థకములేదు. ఒకప్పుడు తనపైయధికారి యాజ్ఞను నిరాకరించిన యెడల మిలిటరీ కోర్టులలో నతనికి శిక్ష తప్పక పోవచ్చును. అయినను ఈ విషయములలో తాను కూడ బాగుగా నాలోచించుకొని కార్యమునకుఁ గడంగవలయును. ఒక దొమ్మి జరుగుచున్నప్పుడు తన పై ఆఫీసరు గుంపుమీఁద తుపాకిని కాల్చుమని యాజ్ఞనియ్యవచ్చును. అట్లుచేయ నవసర మున్న

ప్పుడు తానుగాని లేక సామాన్యపౌరుఁడు గాని అట్లు ఆజ్ఞ నుల్లంఘించఁగూడదు. కాని రాజులే యాందోళన సమయములలో జనప్రియుఁడైన ఒక ప్రముఖుఁడు రాజద్రోహి యనుకొని అతని మీఁద కాల్చుమని యాజ్ఞాపించి చంపించినయెడల ఆజ్ఞాపించినవారును సామాన్యక్రిమినలు కోర్టులలో నుఱిదీయఁబడుటకు సందేహము లేదు. కాఁబట్టి యీసమయములలో సైనికులు తమ పైయధికారుల యాజ్ఞల నుల్లంఘించుట తమ పేధియై యున్నది. ప్రతిసైనికుఁడు సేనలో నున్నంత కాలము మిలిటరీ యధికారమునకు లోఁబడి యుండవలయును. తనపై ఆఫీసరు నొక చిన్నదెబ్బ కొట్టిన యెడల నది గొప్ప నేరముగ నెంచబఁడి అతను కఠిన శిక్షకు లోఁబడును. ఒకనికి మిలిటరీ నిబంధనలు వర్తించునా లేదా యను విషయము మామూలు సివిలుకోర్టులు విచారించవలయును. ఒకఁడు ముందుగా సేనలోఁ జేరఁబోవునప్పుడు ఒక కంట్రాక్టు చీటీమీఁద సంతకము చేయవలయును. అట్టి కంట్రాక్టు సరిగాఁ జరుగఁబడినదా దాని నుండి విముక్తుఁడు కావచ్చునా యను విషయములు సివిలు కోర్టులే విచారించవలయును. మిలిటరీయధికారులు తమకున్న యధికారము నతిక్రమించి యేసైనికునైనను అక్రమముగా నిర్బంధించినపుడు సివిలుకోర్టువారు (Habeas Corpus) అను యనుజ్ఞపత్రికను వారికిఁ బంపి ఆసైనికునిరప్పించి విడుదల చేయుదురు. ఈ స్థిరమైన సేనలో సైనికులందఱు తమ పైయధికారముల

యాజ్ఞలకు బద్ధులు కావలె నన్న యెడల ప్రతిసంవత్సరము పార్లమెంటువారు (Mutiny Acts) అనుచట్టములను నిర్మాణము చేయవలెను. అట్లు వారు చేయని యెడల మిలిటరీ లాప్రకారము ఏసైనికుఁడును నడచుకొనవలసిన యవసరములేదు.

పైనఁ జెప్పఁబడిన స్థిరమైన సేనకాక పార్లమెంటువారు చేయు కొన్ని చట్టములను బట్టి (Militia Acts) ప్రతిజిల్లాలో నుండుకొందఱు పెద్దమనుష్యుల యాజమాన్యము క్రింద చిన్నచిన్న సైన్యము లేర్పడుచుండును. ఈసైన్యము కూడవలసినదని, రాజాజ్ఞ నొసంగిన తరువాత, పదిదినములలోగా పార్లమెంటు కూడునట్లు చేసి వారిఅంగీకారమును తీసికొని (Mutiny Acts) అను చట్టములను ప్యాసుచేయించు కొనవలయును.

(2) ఆదాయవ్యయములు.

ధనములేక యేవ్యవహారము జరుగ నేరదు. రాజ్యపరిపాలనకు విస్తారము సొమ్ము కావలెను. ఈ సొమ్ము ప్రజలమీఁద పన్నులువేసి వసూలు చేయవలెను. ఆంగ్లేయదేశములో నన్ని విధములైన పన్నులు చట్టములమూలముననే విధింపఁబడవలెను. రాజుగారికి, పూర్వము తమ స్వంతభూములవలనఁ గొంత యాదాయము వచ్చుచుండెను. ఇప్పుడదికూడ మొత్తపు రివిన్యూలో చేరిపోయి, ఆయన ఖర్చులకుగాను ప్రతిసంవత్సరము కొంతసొమ్ము పార్లమెంటువారిచ్చెదరు. పార్లమెంటు కూడక పోయినను, అనేకకోట్లధనము శాశ్వతముగా నమలులో నుండు

చట్టములను బట్టియే (Permanent Acts) వసూలగుచుండును. సుమారు ఆఱువంతులసొమ్ము ఈ శాశ్వతచట్టములవలనను, ఒకవంతు సొమ్ము ప్రతిసంవత్సరము పార్లమెంటువారు విధించుచట్టములవల్లను (Annual Acts) వసూలగుచుండును. ఆదాయపుపన్ను రెండవమాదిరి చట్టములవలననే విధింపఁబడుచుండును.

ఈ రెండువిధములైన చట్టముల మూలమున వసూలగు సొమ్ము యావత్తు రివిన్యూ ఆఫీసులోనికి చేర్చఁబడి రాజుగారి బొక్కసము,(Kings'Exchequer)అను ఇంగ్లాండు బ్యాంకిలో జమకట్టఁబడును. ప్రతిదినము గొప్పగొప్ప మొత్తములు మొదట రివిన్యూ ఆఫీసులోనికి వచ్చుచుండును. ప్రతిసాయంత్రము ఇద్దఱు దొరలు ఒకబండినెక్కి యింగ్లాండు బ్యాంకివద్దనుండి యిక్కడకువచ్చి; ఆ రోజులెక్కలను తనిఖీచేసికొని వసూలైన సొమ్ము యావత్తు బ్యాంకికి తీసికొనిపోయి అక్కడ జమకట్టింతురు. ఈవిధముగవచ్చిన సొమ్ములోనుండి ఒక దమ్మిడియైనను పార్లమెంటువారి చట్టములకు వ్యతిరేకముగ ఖర్చుచేయుటకు వలనుపడదు. ఈ ఖర్చులుకూడ కొన్ని శాశ్వతపు చట్టములవల్లను(Permanent Acts)కొన్ని ప్రతిసంవత్సరము నిర్మాణముచేయు చట్టములవల్లను (Annual Appropriation Acts) వినియోగింప వలయును. e.g. కొల్బలము తుర్కబలము నావికాసైన్యము మొదలగు వానికి జీతములు వగైరాఖర్చులు శాశ్వత చట్ట

ములనుబట్టి కాక ప్రతిసంవత్సర మేర్పడుచట్టముల మూలముననే వ్యయమగుచుండవలయును.

పైచట్టముల ననుసరించి రాజమంత్రులు ఖర్చుచేయుచున్నారా లేదా యని కనుగొనుటకు ఒకమంచి యేర్పాటు చేయఁబడి యున్నది. రాజ్యాంగ విషయములలో నొంతమాత్రము జోక్యము కలుగఁజేసికొనకుండునట్టియు, పార్లమెంటువారి రెండు శాఖలయొక్క తీర్మానము లేనిదే, తీసివేయఁబడుటకు వీలులేనట్టియు, యిద్దఱు అధికారులు కలరు. వారు (Comptroller and Auditor General)అనియు,(Assistant Comptroller and Auditor General)అనియు పిలువఁబడుదురు. మంత్రులసంఘమునకు వీరిమీఁద నెట్టి యధికారము లేదు. మంత్రులకు ఎందు నిమిత్తమైనను సొమ్ము కావలసినయెడల, నీయిద్దఱు ఉద్యోగస్థులుదగ్గరకుఁ బోయి వీరివలన ఉత్తరవు తీసికొని(Grant of Credit) దానిని ఇంగ్లాండు బ్యాంకివారికి చూపించి సొమ్ము తెచ్చుకొను చుండవల యును. ఈ యుత్తర వియ్యకమునుపు, పైనఁజెప్పిన యిద్దఱు ఆఫీసర్లు పార్లమెంటువారి చట్టములలో యేవిషయమున కెంతఖర్చు చేయవలసినదని వ్రాయఁబడియున్నదో దాని నిమిత్తమే, అంతమొత్తమునే యీమంత్రులు కోరుచున్నారా యనుసంగతి విచారించవలయును. ఇటుల నుత్తరు వీయనియెడల బ్యాంకిలోనుండి ఒకపైసా అయినను రాజ్యపరిపాలనకు కావలసిన ఖర్చులక్రింద నీయఁబడదు

పైనచెప్పఁబడిన యాఫీసర్లు దేశముయొక్క ఆదాయవ్యయములను తెలియఁజేయు యావత్తు లెక్కలను తనిఖీచేసీ, ఆడిట్టుచేసి ఒకపట్టీని తయారు చేయుదురు. ప్రతి సంవత్సరాంతమందును వీరు ప్రజాప్రతినిధి సంఘమున కొక పెద్దరిపోర్టును పంపుదురు. ఆలెఖ్ఖలను ఆరిపోర్టును తిరిగి తనిఖీ చేయుటకు ప్రజాప్రతినిధి సంఘమువారు ఒక కమిటీ నిచ్చెదరు. ఆకమిటీవారు ప్రతిపైసా యేలాగున ఖర్చు అయినదో బాగుగ పరిశోధించి తాముకూడ నొకరిపోర్టును తయారు చేసి పార్లమెంటువారికి పంపెదరు పైనచెప్పఁబడిన యిద్దఱుద్యోగీయులు, మూర్ఖపుపట్టుదలతో నెప్పుడైనను మంత్రులకు లాప్రకారము సొమ్ము తీసికొనుట కుత్తర వీయనియెడల వీరిని పార్లమెంటువారు తీసివేయవచ్చును. ఇదిగాక, హైకోర్టువారివల్లన వీరిచేత, విధ్యుక్తకార్యములను నెఱవేర్పింపఁజేయవచ్చును. కాఁబట్టి పైనచెప్పిన రీతిని ధనమూల మిదంజగత్తను లోకోక్తి ననుసరించి ధనశక్తిని తమ చేతులలోనే యుంచుకొన్న ప్రజాప్రతినిధి సంఘమువారే యింగ్లాండుదేశమును లాప్రకారము నిజముగఁ బరిపాలించుచున్నారు. ఆసంఘములో నుండు ప్రతినిధులను దీసివేయుటకును క్రొత్తవారి నేర్పఱుచుటకును శక్తిగల ప్రజలే నిజమైన రాజులుగ నున్నారు.

ఈధనశక్తి పార్లమెంటులో నొకశాఖయైన ప్రభు సంఘములో నుండక ప్రజాప్రతినిధి సంఘములో మాత్రి మేల యుం

డవలెను; ఆదేశములో ఆదాయవ్యయములకుఁ గావలసిన చట్టములు రెండవశాఖయైన ప్రజాప్రతినిధి సంఘము నుండియే బయలు వెడలుటయు, వాటిని ఏవిధముగను మార్చుటకుఁగాని రద్దుపఱచుటకుఁగాని, ప్రభు సంఘమువారికి ఎట్టి అధికారము లేకుండుటయు పూర్వమునుండి ఆచారముగ వచ్చుచున్నది. కాని కొన్ని మాసములనుండి తక్కిన చట్టములవలెనేయీ చట్టమునుకూడ అట్లు మార్చుటకును రద్దుచేయుటకును, తమకు అధికారమున్నదని వాటిని ప్రభు సంఘమువారు రద్దుచేయుటయు, ప్రజాప్రతినిధి సంఘములో జనుల కనుకూలమైన చట్టములను ప్రభు సంఘమువారు అంగీకరించక పోఁబట్టియు నిప్పుడాదేశములో గొప్పవిప్లవము జరుగుచున్నది.

CHAPTER IV.

ప్రభుసంఘము.

ఇంగ్లీషు పార్లమెంటు, ప్రభుసంఘమనియు (House of Lords) ప్రజాప్రతినిధి సంఘమనియు (House of Commons) రెండుశాఖలు నేర్పడియున్నది. వీనిలో మొదటిశాఖ సుమారు ఎనుబది సంవత్సరములనుండి, రెండవ శాఖకంటె బలహీనముగా నున్నది. 1832 వసంవత్సరము వఱకు ప్రజాప్రతినిధి సంఘమునకు మెంబర్ల నేఱికొనుటలోఁ బ్రభువుల కెక్కువ స్వాతంత్ర్యముండెను. కాని ఆసంవత్సరములో నేర్పడిన చట్టమునుబట్టి ప్రతినిధుల నేఱికొను నధికారము సామాన్యజనులలో బహుమందికి (Middle Classes) కలుగుటచేత అప్పటినుండి ప్రభువులయొక్క యధికారము హెచ్చినది, 1867 వసంవత్సరపు చట్టమునుబట్టి ప్రజాప్రతినిధి సంఘమునకు ప్రతినిధుల నేఱికొను హక్కు పూర్వముకంటె నెక్కువ సామాన్యజనమున కీయఁబడుటచేత ప్రభుసంఘము కంటెఁ బ్రజాప్రతినిధి సంఘమే యెక్కువ బలీయముగానున్నది. అయినను ఆంగ్లేయ రాజ్యతంత్రములోఁ బ్రభుసంఘమువలన నుపయోగములేక పోలేదు. దీనిలోనుండు ప్రభువులు జనులవలన మిగుల గౌరవమును పొందుచుండు వారు విద్యాధికులుగాని ప్రభువులు కూడ వారిగొప్ప వంశమునుబట్టి గాని వారిసంపదనుబట్టి గాని వారి యస్టేటులనుబట్టి గాని సామాన్యప్రజల వలన గౌరవింపఁబడుచుందురు. మనదేశములో జమీందా

రులు రాజులు మొదలగు గొప్ప భూమిఖామందులవలెనే యీ ప్రభువులు మిక్కిలి పలుకుబడి కలవారుగ నున్నారు. వీరిలో బుద్ధిమంతులగు విద్యాధికులే మనదేశమునకును కాలనీలకును విదేశములకును గవర్నరులుగాను గవర్నరుజనరులుగాను రాయభారులుగాను ఆంగ్లేయదొరతనము వారు పంపుచుందురు.

ధనమున కెక్కువ గౌరవముగల యీకాలములో గొప్ప వంశముగల ప్రభువు లుండుట ఆధనమును పూజించుటను కొంత తగ్గించును. ప్రతిదేశములో నిట్టి ప్రభుసంఘము దొరకుట కడుదుర్లభము. మంచివ్యాపారములలో స్వశక్తివలన న్యాయముగ ధనమార్జించినవాఁడు గౌరవపాత్రుఁడే కాని యాధనమును కేవలము వారసత్వమూలమున పొందిన యొక శుంఠను గౌరవించుట కడునీచము. ఈ విధముననే గొప్పవంశములో పుట్టినంత మాత్రముచేతనే ఒక ప్రభువు గౌరవనీయుఁడు కాఁజాలఁడు. ఆయనను వీరిద్దఱిలో సాధారణముగ రెండవవాఁడే మెఱుఁగు, వీనియందు నీచపునడత యుండదు. ఎదటివాని నెట్లు మర్యాద చేయవలయునో తా నెట్లు మర్యాద తెచ్చుకొనవలయునో యతనికి తెలియును బ్రతికిచెడినవాఁడు సామాన్యముగా చెడి బ్రతికినవానికంటె గౌరవనీయుఁ డనులోకోక్తి దీనికి నిదర్శనము. ఇదిగాక రాజకీయోద్యోగియులయందు పామరులకు ఒకవిధమైన పిచ్చిగౌరవము కలదు. దీనిని కొంతవఱకాఁపి వేయుటకు పారంపర్యముగ వచ్చు కులగౌరవముండుట కూడ ము

ఖ్యము. కాఁబట్టి యీప్రభుసంఘము దేశపురాజువలెనే సామాన్యప్రజలకు గౌరవ పాత్రమై రాజ్యతంత్రములో విప్లవములు లేక రాజ్య పరిపాలన నెమ్మదిగా జరుగునట్లు చేయును.

ఈప్రభుసంఘములో నుండు ప్రతిప్రభువునకు బయట ప్రజలలో నున్నంత యధికారము గౌరవము ఆసంఘములో నుండదు. తెలివితేటలతో రాజకీయ విషయములను ఆలోచనలోనికి తెచ్చుకొని వాటిని గుఱించి సరియైనయభిప్రాయముల నీయఁగలశక్తి వంశపరంపరగా వచ్చుశక్తికాదు. ఈ ప్రభుసంఘములోనికి రాజులు తమ మంత్రుల సలహాల ననుసరించి అప్పుడప్పుడు గొప్పలాయర్లు మొదలగువారిని ఆ మరణాంతము(Life Peers.) ప్రభువులునుగా చేర్చుచుండుట చేత యిట్టిప్రభువులయెదుట వంశపారంపర్యముగా మన మిరాశీదార్లవలెనుండు గొప్పప్రభువులు (Hereditary Peers) సాధారణముగా దివిటీలముందు దీపముల వలె వెలుఁగుచుందురు. వీరిలో కొందఱు కేవలము మూఢులుగా నుండి ఆటలు, పాటలు, వేఁటలు మొదలగు వ్యసనములయందు తగులుకొనిన వారై యెన్నఁడో కాని ప్రభు సంఘములో తమముఖమును కనుపఱచరు- వీరి యస్టేటులలో అనేకమంది వీరిసహాయముచేత జీవించువారగుటచే వీరి కక్కడ పలుకుబడి మెండు. కాని యేవిధమైన యెస్టేటులేక తన జీతమునే యాధారముగ జేసికొన్న యొకలాయరుప్రభువు యెక్కువ తెలివితేటలతో ప్రతివిషయమును చర్చించఁగలుగును.

కనుక యీయనకే ప్రభు సంఘములో నెక్కువ పలుక బడి యుండును. ఈకారణమును బట్టియే నిన్న మొన్న స్వశక్తివలన యీ ప్రభువు పదవిని సంపాదించుకొనఁ గలిగిన యొక ప్రభువుయెదుట పురాతన వంశములో బుట్టి తాతముత్తాతలనుండి జనులవలన మిగుల గౌరవము పొందుచున్న పారంపర్య హక్కుగల ప్రభువులు తాము తృణీకరింపఁబడిపోవుదు మనుభయము చేత ప్రభుసంఘమునకు తఱుచుగా రాక అక్కడ చర్చింపఁబడు కొన్ని గొప్పవిషయములలో తమపార్టీ వారికి వోటు నీయవలసి వచ్చినప్పుడు మాత్రము తల సూపుచుందురు. ఈవంశపారంపర్య హక్కులు గలప్రభువులలో కూడ మిక్కిలి ధీమంతులును, రాజ్యతంత్రములో నెక్కువ జోక్యము కలుగ చేసికొని మంత్రిపద వులను సంపాదించుకొన్నవారు లేకపోలేదు. కాని అట్టి ప్రముఖులు కొద్దిగా నుందురు.

మొత్తముమీఁద పార్లమెంటులో యీ ప్రభుసంఘముప్రజాప్రతినిధి సంఘమును రెండు శాఖలుండుట వలనఁ గొన్ని ప్రయోజనములు కలవు. ఈరెండు శాఖలు సమానహక్కులు కలవియని వాడుకమాత్రమే కాని నిజముగ ప్రజాప్రతినిధిసంఘమే యెక్కువబలమైనది. దీనిమాటయే తుదకు చెల్లుబడిలోనికి రాక తప్పదు వీటిరెంటికి నిజముగా సమానాధికారమున్న యెడల ఒకటి నిర్మించిన చట్టములన్నీ రెండవది రద్దుచేయుచు నెడతెగని కలఁతలు సంభవించి, రాజ్యపరిపాలన జరుగుట యసాధ్యమగును

రాజ్యములో నెవరియందో యొకరియందు సంపూర్ణాధికారముంచితీరవలయు. వారి యాఖరు ఉత్తరవున కందఱు లోఁబడవలయును. లేనియెడల దేశ మరాజకస్థితికి రాక తప్పదు. జనులకు నిజమైన స్వాతంత్ర్యము గలదేశములో నీ యధికారము జనులయందే యుండును. జనబాహుళ్యములో నీ యధికారము ప్రతివానియం దుండుట తటస్థించదు. కనుక వారు తా మేర్పఱచుకొన్న కొన్ని నిబంధనల ప్రకారము తాము కోరుకొన్న ప్రతినిధులయందట్టియధికార ముంచవలయును. ఇంగ్లాండులో నిట్టి ప్రతినిధి సంఘ మేర్పడి దానికి అవాంతరము లేవియు గానియెడల ఆఱేఁడు సంవత్సరముల కొకసారి విడిపోయి క్రొత్తప్రతినిధి సంఘము జనులచే నేర్పాటు గాఁబడుచుండును. ఇట్లు నూతనముగా నేర్పడు సంఘముయొక్క నిరంకుశాధికారమునకు మేర లేదు. అయితే ప్రభుసంఘము గౌరవార్థముగానే యున్నదా లేక దానివలన రాజ్యతంత్రమునకు ప్రయోజనము కలదా యని చదువరులకు సందేహము కలుగకమానదు. దీనికి సమాధాన మీక్రింద వివరించెదను.

ప్రజాప్రతినిధిసంఘములో ప్యాసుఅయిన బిల్లులు ప్రభుసంఘమువారు మార్చవచ్చును, లేక ఒకానొకప్పుడు త్రోసివేయవచ్చును. త్రోసివేయఁబడిన బిల్లులను తిరిగి రెండుమూఁడుసారులు ప్రజాప్రతినిధి సంఘమువారు ప్యాసుచేసి ప్రభు సంఘమువారి యంగీకారమునకు బంపవచ్చును, అప్పుడు ఆబిల్లు ప్యా

సగుటకు జనులు నిశ్చయించుకొన్నారని ప్రభుసంఘమువారికి తోఁచినయెడల వారును దాని కొప్పుకొనెదరు. తరువాత రాజు ఆబిల్లు ప్యాసగుటకు తన యంగీకారము నిచ్చితీరవలయును, అప్పుడా బిల్లు చట్టముగా నేర్పడును, కాఁబట్టి ప్రజాప్రతినిధి సంఘములో నొకపార్టీవారు బలవంతులుగా నుండి యొకప్పుడు దీర్ఘాలోచనచేయకయే తొందరగా ప్యాసుచేసిన బిల్లులు తిరిగి ఆలోచించుటకును. ఆబిల్లులలో కొన్ని విషయములను మార్చుటకును, ప్రభుసంఘమువారి కధికార ముండుటచేత యీసంఘము దేశమునకు మిగుల లాభకరము. ఒకప్పుడు నిరంకుశాధికారముతో బయట ప్రజల కయిష్టమయిన బిల్లులు ప్రజాప్రతినిధి సంఘమువారు ప్యాసుచేయవచ్చును. అట్టిసమయములో నీప్రభుసంఘమువారు, వాటిని కొంతకాలమువఱకైనను ఆఁపివేయుట మిగుల శ్రేయస్కరము. ప్రతిప్రజా ప్రతినిధిసంఘము దానిగడువుకాలమగు నేడు సంవత్సరములంతమయినప్పుడుగాని, లేకరాజు, తన మంత్రుల యనుమతితోనైనను, వారియనుమతి లేకుండనైనను, ఉత్తరువు చేసినప్పుడుగాని ఛిద్రమైపోయినప్పుడుగాని క్రొత్తప్రజాప్రతినిధి సంఘమేర్పడును, ఈక్రొత్తసంఘముకూడ తనపూర్వ ప్రజాప్రతినిధి సంఘమువారి బిల్లునే పట్టుదలలో ప్యాసు చేసినయెడల దానిని ప్రభుసంఘమువారు శిరసావహించి ప్యాసు చేయవలసిన వారే యగుచున్నారు, ప్రజలయొక్క యభిప్రాయ మిప్పుడైనను స్ప

ష్టముగా తెలియవచ్చినది గనుక తమ సంఘమున కేమి విప్లవము రానైయున్నదో యని భయపడి ప్రభువులు బిల్లును ప్యాసుచేయుట కంగీకరింతురు. అట్టి సమయములలో కూడ ప్రభుసంఘమువారు మూర్ఖత వహించి, బిల్లును త్రోసివచ్చిన యెడల యేమి జరుగవలసినది? ఈ సమస్య ఆంగ్లేయులచరిత్రలో ఒకటిరెండుసార్లు తటస్థించఁగా రాజు తనమంత్రుల సలహా పుచ్చుకొని కొందఱుక్రొత్తప్రభువులు నేర్పఱచు తనయధికారము నుపయోగించెద నని భయపెట్టగా, ప్రభుసంఘమువారు ప్రజాప్రతినిధి సంఘమువారు పంపిన బిల్లుల నంగీకరించిరి. కాఁబట్టి ప్రభుసంఘము గొప్పవిప్లవములను రానీయకుండఁగఁ జేయలేక పోయినను, విప్లవము రావచ్చునని సూచనచేయుటకు పనికి వచ్చును.

ఆంగ్లేయరాజ్యతంత్రములో నేఁటేఁట. అనేక ముఖ్యవిషయములు ప్రజాప్రతినిధి సంఘములో చర్చకు వచ్చుచుండును. ప్రతినిధులకనేకపని తొందరవలన యూపిరిసలుపక తగినంత యోఁచన చేయకయే అనేకమంది జనులకు నష్టము సంభవించు బిల్లులు కొద్ది మెజారిటీవలననే ప్యాసుచేయుట తటస్థించుచుండును. అట్టి సమయములం దెక్కువ యవకాశముగల ప్రభుసంఘమువారు దీర్ఘాలోచనచేసి వాటిని రద్దుపఱచుట, లేక మార్చుట బహుముఖ్యము. ఒకానొకప్పుడు తాత్కాలికోత్సాహముల వలనను, కక్షుల మత్సరములవల్లనను ప్రజాప్రతినిధిసంఘమువారు తమనిరంకుశాధికారమును చెలాయించి, బయట

జనులలో బహుమంది కయిష్టమైన బిల్లులు తమలో నెక్కువ మందిగల పార్టీచేత ప్యాసు చేయించవచ్చును. ఒకనిని నిరంకుశాధికారముకంటె ఒకసంఘముయొక్క నిరంకుశాధికారము ఒకప్పు డెక్కువ హానికరముగ నుండును. అట్టి సంఘములతీర్పులకు కొద్దికాలమువఱకైనను ఆఁపుదల చేయుట మంచిది. ఈ పనిని ప్రభుసంఘమువా రెల్లప్పుడు సరిగా నిర్వర్తించుచున్నారని చెప్పుటకు వలనుపడదు. ఈసంఘమువారికి, తగినగౌరవపదవి, స్వాతంత్ర్యత, సావకాశము కలవుగాని అశ్రద్ధ, అసమర్థత, కొన్నిపట్టింపులు, పిఱికితనము, మొదలగు కొన్నిదుర్గుణములు, వారిలో చాలామంది కుండుటచేత నీప్రభుసంఘము తనవిధ్యుక్త కార్యములను సరిగా నెఱవేర్పలేకయున్నది. అదృష్టవశమున కొందఱు పూర్వప్రభువులకు జ్యేష్ఠపుత్రులుగా నున్నంతమాత్రముచేతనే ప్రభుసంఘములో చేరుట తటస్థించిన యీపెద్దమనుష్యులు కష్టపడి జ్ఞానమును సంపాదించి తమబుద్ధివిశేషమునకును శక్తిసామర్థ్యములకును ప్రజలచేత ప్రతినిధులుగా నెన్నుకొనఁబడినవారితో నెట్లుపోల్పఁబడఁగలరు? ఇట్టివారు చట్టనిర్మాణకౌశలు లెట్లగుదురు? హేతువులనుబట్టియే యీప్రభుసంఘములో బహుమంది మెంబర్లు తమలో తెలివిగలవారి యుపదేశము ననుసరించి నడవక తప్పదు వీరిలో ప్రముఖులు మిగుల దూరదృష్టికలవారై యెంతవఱకు ప్రజాప్రతినిధిసంఘమువారికి వ్యతిరేకముగ నడువవచ్చునో యెప్పుడు జనుల

యభిప్రాయములను బట్టి, తాము వెనుకకు తగ్గవలయునో తెలిసికొని సంచరించు చుందురు.

ప్రస్తుతము ఇంగ్లాండులో పార్లమెంటుయొక్క రెండుశాఖలకు గొప్పజగడము తటస్థమైనది. ప్రజా ప్రతినిధిసంఘమువారు ప్యాసుచేసిన రివిన్యూచట్టములు(Money bills)సాధారణముగా ప్రభుసంఘమువారేవిషయములోను మార్చునాచారము లేదు. అట్టి యధికారము శాస్త్రప్రకారము వారికి కలదని కొందఱు వాదించుచున్నారు, బహుకాలమునుండి అట్టి యాచారము లేదని అందఱొప్పుకొనినవిషయమే. ఇట్లుండఁగా యీసంవత్సరపు బడ్జెట్టులో అదివఱకులేని భూమిపన్నులను క్రొత్తగ నేర్పాటుచేసి, ప్రజల కనుకూలమైనట్టియు, ప్రభువుల కయిష్టమైనట్టియు కొన్ని క్రొత్తమార్పులతో నిప్పటి మంత్రులు బిల్లును తయారుచేసి ప్రజాప్రతినిధి సంఘమువారిచేత ప్యాసుచేయించిరి. దీనికి ప్రభుసంఘమువారు సమ్మతించక, ఆబిల్లును త్రోసివేసిరి, ఇంతకు పూర్వ మీమంత్రుల పార్టీవారు ప్రజాప్రతినిధిసంఘముచేత ప్యాసుచేయించిన రెండుమూఁడు గొప్పబిల్లులను ప్రభుసంఘమువారు త్రిప్పివేయుటచేత, తిరిగి ప్రజల సమ్మతిని బడయవలయునని రాజుచేత, ఆప్రజాప్రతినిధిసంఘమును ఛిద్రముచేయించి, తమబడ్జెట్టు అంగీకరింపఁబడవలసినదా లేదా యనునంశము మీఁద మంత్రులు తిరిగి ప్రజలకు అప్పీలు చేయగా, వారు నూతన ప్రతినిధులను కోరుకొనిరి. వీరిలో నెక్కువ

మంది మంత్రులపార్టీలో చేరినవారై బడ్జెట్టు ఉన్నది యున్నట్లుగా ప్రభుసంఘమువా రంగీకరింపవలెననియు, వారికిముందు ప్రజాప్రతినిధి సంఘమువారు పంపు ఎబిల్లులకు నాటంకము కలుగఁజేయకుండ తగునుపాయముల నాలోచింపవలెననియు, ప్రభుసంఘములో వంశ పారంపర్యమైన హక్కులను కొంతవఱకు తగ్గించి ప్రభువులచేఁగాని, రాజు చేఁగాని యేలుకొనఁబడు లేక సృజించఁబడు ప్రభువు లెక్కువమంది యాసంఘములో నుండవలయుననియు అభిప్రాయము గలవారైరి. తమహక్కులను తగ్గించుకొనుటకు ప్రభుసంఘమువారు సులభముగ నొప్పుకొందురా? అట్లెన్నఁడు జరుగ నేరదు. కాఁబట్టి ప్రభుసంఘములోని కొందఱు పెద్దలు, ప్రజాప్రతినిధిసంఘమువారు పంపిన బడ్జెట్టు కొద్దిమార్పులు లేకుండఁగగాని. ప్రభుసంఘమువారు వారితో రాజీగా పరిష్కరించుకొనవలసి యుండుననియు, తమ సంఘములో కొన్నిమార్పులు చేసికొనుట యత్యావశ్యకమనియు, అట్టిమార్పులను తామే చేసికొనవలసి యుండుననియు, కఠినముగా తమ సోదరుల కుపదేశించుచున్నారుగాని వారిమాటలను వంశపారంపర్యహక్కులుగల ప్రభువులు పెడచెవినిబెట్టుచున్నారు. మనరాజుగా రుభయశాఖలకు నేదియో ఒకవిధముగ రాజీ చేయఁబ్రయత్నించుచున్నారు. ఎట్లైనను, ప్రజాశక్తి నానాఁటికి వృద్ధిపొందుచుండుటవలన యీ యాంగ్లేయ రాజ్యతంత్రములో గొప్పమార్పులు రక్తపాతకములేకనే రాఁగ

లవు పార్లమెంటులో రెండుశాఖ లుండవలెనని అన్ని కక్షుల వారిలో నేకాభిప్రాయమే కలదు. ప్రజాస్వాతంత్ర్యముగల ప్రపంచమందుండు ప్రతినాగరిక రాజ్యములో రెండు చట్టనిర్మాణ శాఖలు కలవు. కాని యిప్పటి సమస్యయేమనఁగా చట్టనిర్మాణ విషయములో ప్రభుసంఘముయొక్క అధికారము మెంతవఱ కుండవలయును? ఎట్టివారు ప్రభుసంఘములో నుండఁదగినవారు? ఈవిషయమై అనేక భేదాభిప్రాయము లుండుటచేత ఆంగ్లదేశ మల్లకల్లోలముగా నున్నది.

CHAPTER V.

చట్టనిర్మాణసంఘము.

పార్లమెంటువారి విధ్యుక్తధర్మము లన్నిటిలో శాసననిర్మాణము ముఖ్యమైనది. పన్నులను విధించుటకును ఖర్చుపెట్టుటకును అధికారమునిచ్చు బిల్లులు ప్రప్రథమమునఁ బ్రజాప్రతినిధిసంఘమునుండియే బయలుదేరవలెను, వీటిని ప్రభుసంఘమువారు మార్చుటకుగాని, త్రోసివేయుటకుగాని, అధికారము గలదా లేదాయనునది వివాదాంశము. అట్టి యాచారము మాత్రము లేదు. తక్కిన బిల్లులు పార్లమెంటుశాఖలైన ప్రభుసంఘమునం దుండిగాని, బయలుదేరవచ్చును. వానిని ఒక శాఖవారు ప్యాసుచేసి రెండవ శాఖవారి యంగీకారమునకు పంపబడును. వారు వాటిని పూర్ణముగ నంగీకరించవచ్చును, లేక మార్చవచ్చును. అట్లు మార్చినపుడు, వానిని తమరు చేసిన మార్పులతో మొదటి శాఖవారికిఁ బంపెదరు. అట్టి మార్పులను వీరంగీకరించ వచ్చును, లేదా తాము మఱికొన్ని క్రొత్త సవరణలు చేసి పంపించవచ్చును. ఒకప్పుడు, ఒకరి మార్పులు రెండవశాఖవా రంగీకరించక, కొన్నిబిల్లులు చట్టముగ నేర్పడుట తటస్థించక పోవచ్చును. అట్టి సమయములలో నీరెండు శాఖలవారికి నెడతెగని పోరాటము సంభవించును. అప్పుడుభయ శాఖలు రాజీపడుటకు రెండుమార్గములు కలవు. (1) రెండు శాఖలవారు తమలోఁ గొందఱుప్రముఖులను ప్రతినిధులుగ నే

ర్పఱచుకొనెదరు. వీరు మేనేజర్లని వాఁడబడుదురు, ఒక శాఖలో ప్యాసుఅయిన బిల్లును ఒప్పుకొనని రెండవశాఖవారి మేనేజర్లు తమకు దాని నంగీకరించక పోవుటకు కారణము లన్నియు వ్రాసి మొదటిశాఖవారి మేనేజర్లకు పంపెదరు. వారి సవరణలను వీరికి, వీరి సవరణలను వారికి పంపుకొనుచు తుదకునేదియో ఒకవిధమగుకొన్ని సవరణలతో నంగీకరించి, బిల్లును రెండవశాఖవారు ప్యాసుచేయుదురు. ఒకప్పుడు రెండు శాఖలవారి మేనేజర్లు కలుసుకొని ముఖాముఖిని ఆబిల్లును చర్చించి కొన్నిసవరణలతో రెండు శాఖలవారిచేత నొప్పించి చట్టముగా నేర్పాటుచేయుదురు. ఇట్టి కూటమి 1851 సంవత్సరము దరిమిలా నెన్నఁడు జరుగలేదు. (2) బిల్లునుగాని దానిలో మార్పులను గాని ఒప్పుకొనని శాఖవారు రెండవవారికి తమకుఁగల కారణములను తెలుపుచు తమరు మార్పుచేసిన బిల్లును పంపెదరు. దానిని రెండవ శాఖవా రంగీకరించనియెడల చేయునదేమియు లేదు.

ఈ పైవిధముల నుభయశాఖలకును రాజీనామా కుదరక బిల్లు ప్యాసు కావలెనని మంత్రులు పట్టుదల పట్టినయెడల యేశాఖవారివలన దానికి నాటంకము సంభవించినప్పటికి తమరు తమ మంత్రిత్వమును వదలుకొనుటయైనను సంభవించును. లేక తమయొక్కయభిప్రాయమే ప్రజాభిప్రాయ మని గట్టినమ్మకమున్నయెడల అప్పటి ప్రజాప్రతినిధిసంఘము భిన్నము చేయవలసినదని రాజుగారికి సలహా నిచ్చి, తిరిగి నూతనప్రజాప్రతినిధిసంఘము నేర్పాటు చేసికొనుట యైనను సంభవించును. ప్రభుసంఘము భిన్నమెప్పుడు క్షావీలులేదుగనుక, దానిమూర్ఖపుపట్టువలననే ఒకానొకపుడు నూతన ప్రజాప్రతినిధి సంఘ మేర్పడును. అప్పుడు దేశములో బహుజనాభిప్రాయ మా బిల్లువిషయమై యెటులున్నదో తప్పక కనుగొనవచ్చును. ఆబిల్లు ప్యాసుకావలెననియే యీనూతన ప్రజాప్రతినిధిసంఘముకూడ నభిప్రాయమిచ్చినయెడల పార్లమెంటులో రెండుశాఖలవారును దానిని ప్యాసు చేయుట సాధారణముగ తటస్థించును. అప్పుడుకూడ ప్రభుసంఘమువారు ప్రజాభిప్రాయమును దృణీకరించినయెడల దేశములో విప్లవము రాకుండ, రాజు ప్రభుసంఘమును భిన్నముచేయలేక పోయినను, దానిని మార్చుటకు తాను మఱికొందఱు ప్రభువుల నేర్పాటుచేయు నధికారము నుపయోగించి ఆబిల్లును ప్యాసుచేయుటకు కావలసిన ప్రభువుల నేర్పాటుచేసి ప్రభుసంఘమును నూతన ప్రభువులతో ముంచివేయవచ్చును. కాని యింతపని యెన్నఁడును జరుగలేదు. ఎక్కువ మెజారిటీతో ప్రజాప్రతినిధిసంఘము వా రంగీకరించిన బిల్లును ఒకటిరెండుసార్లు త్రోసివేసినను తుదకు ప్రభుసంఘమువారు దానిని ప్యాసుచేయుచునే వచ్చిరి. దేశములో బహుజనాభిప్రాయమును గనిపట్టి ప్రభుసంఘమువారు నడచుకొనుచున్నారు. అట్లు నడచుకొనినయెడల గొప్ప విప్లవమిప్పుడు రానైయున్నది. దీనికి కారణములు బాగుగబోధపడుటకుఁ రాజ్యతంత్రములో మఱికొన్ని విషయములను గమనింప వలయును.

ప్రజా ప్రతినిధిసంఘములో మామూలుగ నిదివఱకు రెండు పెద్ద కక్షు లుండినవి, వీరు పూర్వ సాంప్రదాయ పాక్షికులు. (Conservatives) ప్రజా స్వేచ్ఛా పాక్షికులు (Liberals) అని పిలువఁబడుదురు. కాలానుసరణముగ వీరియభిప్రాయములు ముందుముందుకు నడుగువేయుచున్నను, వీరిమధ్య కొంత భేద మెల్లప్పుడు నుండును, వీరిలో మొదటి కక్షువారు రాజ్యతంత్రము, చట్టనిర్మాణము మొదలగు విషయములలో మార్పుల నొల్లరు, ప్రభుసంఘములోకూడ నీరెండు కక్షు లున్నను వారిలో ముప్పాతికపాలు పారంపర్య హక్కుగల భూస్వాములగుటచే నీప్రభుసంఘ మెల్లప్పుడు పూర్వ సాంప్రదాయకుల పక్షముననే యుండును. ఈరెండు కక్షులలో నెవరి ప్రతినిధులు ఎక్కువగా ప్రజాప్రతినిధి సంఘమునకు ప్రజల యెన్నికలవలన పంపఁబడుదురో ఆపార్టీలోనుండు ప్రముఖులకే మంత్రిపదవుల నొసంగుట రాజవిధియై యున్నది, ఈ యిరుకక్షులవారి ప్రముఖులుప్రజాప్రతినిధి సంఘములో ప్రతివిషయమును, గుఱించి తమ భేదాభిప్రాయములను వెల్లడించుచు, బయటనుండు జనుల కుపన్యాసముఖమునను, వార్తాపత్రికలలో వ్యాసముల ముఖమునను, తెలియఁజేయుచు తమపార్టీవారిని వృద్ధిపఱచుటకు ప్రయత్నించెదరు, ఉభయకక్షుల ప్రముఖులు తమరు మంత్రిత్వములోనికి వచ్చిన యెడల కొండంత పనులు చేయఁగలుగుదు మని వృథా ప్రగల్భములు కొట్టక, సామాన్యపువాగ్దానములే చేయుచు,

ప్రతివిషయములోను తమపార్టీవారిని అతి త్వరితముగ పఱుగెత్తకుండ చేయుదురు. ఎలయన తమరే మంత్రులగుట తటస్థపడినపుడు తమరు ఎన్నికల సమయమందు ప్రజకుఁ జేసిన వాగ్దానములను నెరవేర్చవలసి యుందురు. లేనియెడల, తమరు, దేశములో నియామకు లందఱిచేతను పరిహాసింపఁబడుదురు.

ఐర్లాండు దీవినుండి వచ్చు ప్రతినిధులందఱు ప్రజాస్వేచ్ఛాపాక్షికులలోఁ జేరియుందురు. ప్రజాప్రతినిధిసంఘములో నుండు 670 మంది మెంబర్లలో వీరు సుమారు 100 మంది యుందురు.వీరిని ఐర్లాండు జాతీయవాదు లని పిలిచెదరు.(Irish Nationalists) వీరిమూలముననే ప్రజాస్వేచ్ఛాపాక్షికులు తిరిగి రెండుశాఖలుగ విడిపోయి, వీరిదేశమునకు వేఱు పార్లమెంటు నీయవలసిన దనువారు(Radicals) అనియు, అట్లీయఁగూడదనువారు (Liberal Unionists)అనియు వాడఁబడుదురు. ఇప్పుడు క్రొత్తగ మఱియొక పార్టీవారు బయలుదేరిరి.వీరు తమచేతులతో కష్టించి పనిచేయువారల చేతనే ముఖ్యముగ నెన్నుకొనఁబడువారగుటచే, వీరు కృష్యవలంబకులని(Labourites)పిలువఁబడుచున్నారు. వీరిని ప్రజాప్రభుత్వవాదులలో నతివాదులని చెప్పవచ్చును. వీ రిపుడు సుమారు నలుబదిమందికంటె నెక్కువగ లేరుగాని క్రమక్రమముగఁ వృద్ధిఁ బొందుటకు సందేహము లేదు.

పూర్వసాంప్రదాయక పార్టీవారు 1906 సంవత్సరమునకు పూర్వము పదియేండ్లు తమమంత్రులచేత రాజ్యము చేయించఁగలవారైరి. ఆ సంవత్సరములో ప్రజాస్వేచ్ఛా పాక్షికులు రాజ్యముచేయఁ బ్రారంభించి, మొదటిపార్టీవారు తమతో నెల్లప్పుడు నేకీభవించు ప్రభుసంఘమువారి సహాయముతో నిర్మించఁగలిగిన కొన్ని శాసనములను రద్దుచేయుటకును కొన్నిఁటినిమార్చుటకును బిల్లులను తయారు చేసి ప్రజాసంఘములో ప్యాసుచేయఁగలిగిరి. కాని ప్రభుసంఘమువారివలన నవి యనుపయోగముగ మార్చఁబడి తుదకు త్రోసివేయఁబడినవి,(e. g. Education Act of 1902, Licencing Act 1904, Plural voting Bill, Scotch land Blll, Scotch Valuation Bill etc)ఇట్లు తమరు ప్రజానుకూలము లగుబిల్లులను ప్రజాప్రతినిధిసంఘమువలన ప్యాసు చేయించుకొనఁగలిగినప్పటికి ప్రభుసంఘమువారు వానిని రద్దుపఱచుచుచు వచ్చిరి. కాఁబట్టి ప్రభుసంఘములో నెక్కువమంది పూర్వసాంప్రదాయకపక్షావలంబురు లగుటచే నూతనచట్టనిర్మాణవిషయములలో ప్రజాస్వేచ్ఛాపాక్షికుల నొక యడుగైనను సాఁగనియ్యలేదు. తుదకు ప్రజాప్రతినిధి సంఘములో ప్యాసుకాఁబడినట్టియు, తాము మార్చఁగూడనట్టియు, ఆదాయవ్యయముల బిల్లుల నన్నిటిని చేర్చిన పట్టీని(Budget)వారిచేతఁ దృణీకరింపఁబడుటచే ప్రజాస్వేచ్ఛాపాక్షికుల మంత్రుల కాగ్రహాము కలిగి ప్రజాప్రతినిధి సంఘమును రాజుచేత భిన్నముచేయించి క్రిందటి డిసెంబరులో తిరిగి ప్రజలను నూతనప్రతిని

ఘుల నెన్నుకొనుటకు, ఆయనవలన యాజ్ఞపొంది, తాము నిర్మాణముచేసిన బడ్జెట్టు ప్రభుసంఘమువారు ప్యాసుచేయవలసినదా, కాదా, ప్రజాప్రతినిధి సంఘములో ప్యాసు అయిన అన్నివిధములైన బిల్లులను నిరాకరించు నధికారము, (Right of veto) ప్రభుసంఘమువారికి ఎంతవఱకుండవలెను. అను నీరెండు విషయములను గమనించి, యెన్నికలు చేయవలసిన దని ప్రజల కప్పీలు చేయఁగా (i) పూర్వసాంప్రదాయపాక్షికులు (ii) ప్రజాస్వేచ్ఛాపాక్షికులు 276 (iii)ఐర్లాండుజాతీయవాదులు 82 (iv)పనివాండ్ర మెంబర్లు 40. మొత్తము 673 రు ఏర్పడిరి. వీరిలో మొదటివారిలో కొంద ఱైర్లాండు జాతీయవాదులు చేరియున్నారు. దీనికి కారణము ము0 దుదహరించెదను.

ఈనూతన ప్రజాప్రతినిధి సంఘములోఁ బ్రజాస్వేచ్ఛాపాక్షికులును కొంచె మెచ్చు తక్కువగ సమానసంఖ్య గలవారైనప్పటికి, ఐర్లాండుజాతీయవాదులును, పనివాండ్ర మెంబర్లును మొదటివారితోఁ గలియుటచేత వీరిమంత్రులైన ఆస్క్విత్తు, చర్చిలు, లాయడ్ జార్జి, హాల్డేను, బరన్సు, గ్రే ప్రభువు మొదలగువారు రాజ్యము చేయఁగలుగుచుండిరి. కాని వీరిలో వీరికి కలఁతలు లేకపోలేదు. ప్రభుసంఘమును ఛీదాగా తీసివేయవలయు నని పనివాండ్ర మెంబర్లును, ప్రస్తుతము మంత్రులు తయారుచేసిన బడ్జెట్టు తమ కెంతయు లాభకారి కాదు గనుక దానిలో కొన్నిమార్పు లుండవలె నని కొంద ఱైర్లాండుజాతీయవా

దులను వయోవృద్ధులైనపనివాండ్రకు పెన్షన్ల నేర్పాటుచేసి ప్రభువుల స్థితులకు న్యాయమైనపన్నులను విధించిన యీబడ్జెట్టును ప్యాసుచేయవలసినదని ప్రజాస్వేచ్ఛాపాక్షికులును, పనివాండ్ర మెంబర్లును, మునుగా బడ్జెట్టు విషయమయి జగడమాడి తరువాత ప్రభుసంఘము వారిశాసన నిరాకరణ విషయమై ముందుగా నాలోచించినంగాని, తమపని సానుకూలపడనేరదని అయిర్లాండుజాతీయవాదులలోం గొందఱును, ఇట్టివ్యతిరేక సలహాల నిచ్చువారినందఱిని సమ్మేళనము చేసి, వీరిలో వీరికి నేదియో ఒక విధముగ రాజీ కుదుర్చుటకు ప్రస్తుత మంత్రులందఱు భగీరథ ప్రయత్నములు చేయుచున్నారు, ప్రధాన మంత్రిగారగు అస్క్విత్తుగారు, తమ తమబడ్జెట్టు కొద్దిమార్పులలో తిరిగి పార్లమెంటువారియెదుట పెట్టెద ననియు, ప్రజాప్రతినిధిసంఘములో ప్యాసుకాంబడు తక్కినబిల్లులవిషయమై ప్రభుసంఘమువారి శాశ్వతనిరాకరణ స్వాతంత్ర్యము (Right of Absolute veto)పోయి వారికి స్వల్పకాలనిరాకరణస్వాతంత్ర్యమే(Right of Suspensory veto)యుండవలయుననియు, యేప్రియలుమాసములో పార్లమెంటులో సెలవిచ్చినారు, ప్రభుసంఘమువారిని బొత్తిగా తీసివేయుటకు సమ్మతించక వారివిషయమై కొన్నితీర్మానములను ప్రజా ప్రతినిధి సంఘము వారి యెదుట నుంచినారు, అవియేవియన:—(1) ఆదాయవ్యయములపట్టీని ప్రజాప్రతినిధి సంఘములోనే తయారుచేయంబడి

వారు ప్యాసుచేసినబిల్లును ప్రభుసంఘమువారేవిధముగ మార్చకుండ నంగీకరించవలసినది. ఇది శిష్టాచారమైనను ముందు ముందు తగవులు లేకుండ ఈవిషయమై ఒకచట్టము నిర్మాణము చేయవలసియున్నది, ఇట్టి ఆదాయవ్యయ చట్టములలో మఱియే యితరవిషయమైనను చేర్చి(Right of tacking)ప్రభుసంఘమునకు పంపినయెడల ఆవిషయమునుబట్టి బిల్లుసంబంధించినదా, లేదాయను సంగతిని లాకోర్టులకు వదలక ప్రజాప్రతినిధి సంఘములో నందరిపార్టీలచేత సమానముగ గౌరవింపంబడు అగ్రాసనాధిపతి(Speaker of the House of Commons) గారితీర్పు ననుసరించియుండవలెను.(2)ప్రజాప్రతినిధిసంఘములో ఒక బిల్లును చర్చనిమిత్తము ప్రవేశపెట్టిన తరువాత రెండుసంవత్సరములు దానిని చర్చచేసి పిమ్మట ప్యాసుచేయవలెను. ఈలోపుగ ప్రజాప్రతినిధి సంఘము మాఱినను ఆబిల్లు విచారణలో నున్నట్లుగనే యెంచంబడవలయును, (3) ఎట్టిఅవాంతరములు రాని యెడల ప్రజాప్రతినిధి సంఘము ఏడుసంవత్సరములకొకసారి తనకుం దా ఛిద్రమై నూతన ప్రజాప్రతినిధిసంఘమేర్పడుచున్నది. ఇక ముందు దాని గడువుకాలము అయిదు సంవత్సరములు మాత్రమే యుండవలెను.

ఈపైవిషయము లన్నిటిని చేర్చి ఒక బిల్లును పార్లమెంటులోం బెట్టుట కేర్పఱచుకొని, అట్టి బిల్లు ఒకవేళ ప్రజాప్రతినిధిసంములో ప్యాసు అయినను ప్రభుసంఘమువారు రద్దు

పఱచ వచ్చుననుభీతితో అస్క్విత్తు మొదలగుమంత్రులు ఈతీర్మానములను మాత్రమే ప్యాసుచేయించి ప్రస్తుత ప్రజాప్రతినిధి సంఘమును ఛిద్రము చేయించి, తిరిగి ప్రజల కప్పీలు చేసి, నూతన ప్రజాప్రతినిధిసంఘము నేర్పాటు చేయవలెనని అభిప్రాయపడి, ముందుగా నీ తీర్మానములనే ప్యాసుచేయించినారు. బడ్జెట్టుకూడ పార్లమెంటులో రెండుశాఖలవారివలన ప్యాసు చేయఁబడినది.

ఈమధ్య ప్రభుసంఘము వారిలో ప్రముఖుఁడగురోజుబరీ ప్రభువుగారు తమ సంఘములోఁ గొన్ని మార్పులఁ జేయఁజూచెను గాని, యీయన తీసుకొనివచ్చిన తీర్మానములను ప్రభుసంఘమువా రంగీకరింపలేదు. తిరిగి కొద్దికాలములో జరుగఁబోవునెన్నికలలో ప్రజాస్వేచ్ఛాపాక్షికుల కక్షవారే యెక్కువగ ప్రజాప్రతినిధి సంఘమునకు సభ్యులుగా వచ్చినయెడల ప్రభుసంఘములో గొప్పమార్పులు చేయుట కొకబిల్లును ప్యాసుజేయుటకు సందేహము లేదు.

PART II

ద్వితీయ భాగము.

అమెరికాసంయుక్తరాష్ట్రతంత్రము.

CHAPTER I.

రాజ్యాంగనిర్మాణము.

అమెరికాఖండములో సంయుక్తరాష్ట్ర మనునొకదేశము కలదు, ఇదిమన ఇండియాదేశము కంటె సుమారు రెండు మడుంగులు పెద్దది. దీనివైశాల్యము ౩౫ లక్షల చదరపుమైళ్లు. పదిసంవత్సరముల క్రిందట జనాభాలెక్కను బట్టి యేడు కోట్ల అఱువదిలక్షల జనసంఖ్యగలదైయున్నది. ఏఁబది చిన్న స్వతంత్ర రాష్ట్రములు కలసి యీరాజ్య మేర్పడినది గాన దీనికి సంయుక్తరాష్ట్ర మని పేరు. దీనిరాజ్యాంగనిర్మాణము మిక్కిలి చిత్రముగ నుండును. దీనిలో ప్రతిస్వల్పరాష్ట్రమునకు లోపలి పరిపాలనలో పూర్ణస్వాతంత్ర్య మున్నను దానికిని మఱియొక రాష్ట్రములో నుండు పౌరులకుఁగాని లేక తమ సంయుక్తరాష్ట్రమునకును అన్యదేశమునకును గాని కలఁతలు సంభవించినపుడు వానిని నివారించుటకు వేఱుగ నొకరాజ్యతంత్రమును స్థాపించి స్థానిక విషయములలో సంపూర్ణాధికారము నిచ్చునటుల యీ

చిన్నరాష్ట్రము లొక చట్టము లిఖితరూపముగా నున్నది. దానికి (Articles of Constitution) అని పేరు. మొదట 13 చిన్నరాష్ట్రములుగా నేర్పడిన తరువాత క్రమక్రమముగ పూర్వ మా దేశమును కడునాగరికులను పాఱద్రోలి అడవులను ఛేదించి ఆంగ్లేయులును మఱికొందఱు యూరపుఖండ వాసులును చిన్నచిన్న రాష్ట్రములను నూతనముగా స్థాపించుచు, వీనినిగూడ పైనచెప్పిన చట్టమునకు లోఁబఱచి సంయుక్తరాజ్యతంత్రములో చేర్చుచు వచ్చిరి. ఇట్లు 1896 వ సంవత్సరము వఱకు జరుగుచునే యుండెను.

ఈ సంయుక్తరాష్ట్రరాజ్యతంత్రము మన కేల? ఈ అమెరికాదేశస్థులు ఆంగ్లేయులవలె మనకు పరిపాలకులా? కావున నీవిషయము మన కంతగా లాభకరము కాదని కొంద ఱనుకొనవచ్చును. ఈసంయుక్తరాష్ట్రమును సంస్థాపించినవారు మనలను పరిపాలించు ఆంగ్లేయులలో నొకశాఖవారు. ఈదేశము మొదట ఇంగ్లాండునకు వలసరాజ్యము(colony)గానుండి తరువాత ఇంగ్లాండుతో యుద్ధము చేసి సంపూర్ణస్వాతంత్ర్యమును సంపాదించుకొని, తన తల్లినుండి విడిపోయి ఆమెకుకూడ ననేకవిషయములలో మార్గదర్శియగు చున్నది. ఇదిగాక యింత గొప్పదేశము రాజువలనఁగాని ప్రభువులవలనఁగాని పరిపాలింపఁబడక కేవలము ప్రజలచేతనే పరిపాలింపఁబడుచున్నది. ఈరాజ్యతంత్రములో నుండు మంచిచెడుగులను దెలిసికొనుట మనకు మిగుల

ముఖ్య మని చెప్పుటకు మఱియొక కారణముకూడ కలదు, ఇండియా దేశములో వలెనే, అక్కడ కూడ భిన్నజాతు లుండి, వేఱువేఱుభాషలను మాటలాడుచున్నారు, వేఱువేఱు మతములును ఆచారములును కలవు. రాజకీయవ్యవహారములలో మాత్రము ఆంగ్లేయభాష నుపయోగించెదరు. మన ప్రభువులగు ఆంగ్లేయుల సహాయమువలన ముం దెప్పుడైనను మనకు ప్రజాస్వామికము (Democracy) రానున్న యెడల వివిధజాతులు, మతములు, భాషలు, ఆచారములు గలమనయిండియా దేశము అమెరికాఖండములో వలెనే, అనేక స్వల్ప రాష్ట్రములుగా మాఱి యేకచ్ఛత్ర పరిపాల నావశ్యకతను కనిపెట్టి ఒకసంయుక్తరాష్ట్ర రాజ్యతంత్రమును ప్రజలు స్థాపించవలసివచ్చును. ప్రజాస్వామికప్రభుత్వము కావలెనన్న జను లెట్టి లక్షణము లలవఱచుకొనవలెనో, న్యాయశాస్త్ర విధి కెంత దాసానుదాసులై ప్రవర్తించవలెనో, ప్రజాస్వామికమువలన నెట్టి యపాయములు తఱచుగ తటస్థించుచుండునో, వాని నెట్లు నివారణ చేసికొనుటకు ప్రయత్నించుచుండవలెనో, యీమొదలగు విషయములు అమెరికా సంయుక్తరాష్ట్ర పూర్వచరిత్రవలనను ఆదేశపు ప్రస్తుత రాజ్యతంత్రము వలనను కొంతవఱకు తెలిసికొనవచ్చును.

ఇంగ్లాండు దేశమును జేమ్సు అనురాజు పాలించుచున్నప్పుడు మతసంబంధమగు కలఁత లుండుటవలన, భగవంతుని తమయిష్టానుసారముగ ప్రార్థించు కొనుటకు అనేకమంది

యాంగ్లేయులు తమ దేశమును విడచి అట్లాంటికు మహాసముద్రమును దాటి అమెరికాకు వలస పోయిరి. ఆసముద్రతీరమున కొన్నిచిన్న చిన్న రాష్ట్రములను స్థాపించుకొనిరి. ఇంగ్లాండు దేశపు రాజులు ఆరాష్ట్రములకు గవర్నరులను నియమించుచుండిరి. పరిపాలనాధికారమంతయు ప్రజలయందే యుండి ఆంగ్లేయ రాజులపేరిటనే వారి న్యాయశాస్త్రముల ననుసరించి రాజకార్యములు వ్యవహరింపఁబడుచుండెను. ఇట్లు మూఁడవ జార్జి గారు ఇంగ్లాండుదేశము నేలుచున్నపుడు అప్పటికి నేర్పడియున్న పదుమూఁడు చిన్నరాష్ట్రములకును, ఇంగ్లాండుదేశమునకును తేయాకు మొదలగు దిగుమతి వస్తువులమీఁద పన్నులను విధించు విషయమై తగవు లేర్పడి,తుదకు గొప్పయుద్ధము పొసఁగినది.అప్పుడు పదుమూఁడు రాష్ట్రములనుండి వచ్చిన ప్రతినిధు లందఱు 1774, 1775 వ సంవతత్సరములలో తమ రాష్ట్రము లన్నియు కలసి యుద్ధమొనరించుటకు తగినమార్గము లాలోచించుటకు కూడిరి. 1777 వ సంవత్సరములో తమ స్వాతంత్ర్యమును ప్రకటించి ముందు తామెల్లప్పుడు తమయైకమత్యమును కాపాడుకొనుటకు కొన్నినిబంధనలు చేసికొనిరి. ఈ నిబంధనల ననుసరించి యీ రాష్ట్రములనుండి పంపబడిన ప్రతినిధు లందఱు చేరిన కాంగ్రెసు మహాసభలో సంయుక్తరాష్ట్రాంగమున కిచ్చునధికారములు గాక, తక్కిన రాజ్యాంగహక్కులన్నియు ప్రతిరాష్ట్రమునకుఁ గలవని భావించవలసినదే యని తీర్మానము చేసిరి. కాని పదిసం

వత్సరములలోనే తమలోఁ దమకుఁ దగవులు పుట్టి యింగ్లాండుతో యుద్ధము జరుగు సమయమందును, 1783వ సంవత్సరములో సంధిజరిగిన తరువాతను కూడ రాజ్యతంత్రము సరిగా నెఱవేఱక కాంగ్రెసు మీటింగులకు కావలసిన ప్రతినిధుల సమావేశము లేక పరదేశీయులు చులకనగా చూచుట తటస్థించినది, కావున 1787వ సంవత్సరములో జార్జివాష్టింగను అనుమహానుభావుని యాధిపత్యముక్రింద, ఫిలడెల్ఫియాపట్టణములో నీపదుమూఁడు రాష్ట్రములనుండి, మేధావంతులును, రాజ్యతంత్రజ్ఞులు నగు55 ప్రతినిధులేర్పడి నైదుమాసములు రాత్రింబవళ్లు రహస్యముగ చర్చలుచేసి, గొప్పచిక్కులలో నిండియుండు విషయములలో తమలో తాము రాజీపడుచు, తమతమరాష్ట్రముల సంపూర్ణ అంతస్స్వాతంత్ర్యములకు భంగము రాకుండ సమాధానములు చేసికొను ఒకనూతన చట్టమును తయారుచేసి, తమకార్యమును జయప్రదముగ నెఱవేర్చిరి. ఈ చట్టమును ఆయారాష్ట్రశాసన నిర్మాణ సంఘముల యంగీకారమునకు తేఁబడగా, అదృష్టవశమున యీపదమూఁడు రాష్ట్రములవారును దాని నొప్పుకొనిరి. కాని, దేశములో నప్పటినుండియు రెండుపార్టీ లేర్పడినవి. సంయుక్తరాష్ట్రాధికారము(Central National Government) నెక్కువగ బలపఱచవలెనని కొందఱును, రాష్ట్రాధికార (State Government) బలమభివృద్ధి నొందుచుండిన గాని తా మింగ్లాండుతో పోరి సంపాదించుకొన్నస్వాతంత్ర్యము

నిలువదని భయపడువారు మఱికొందఱునై యుండిరి. ఈ విషయమును గుఱించి 1787, 1788 సంవత్సరములలో సామాన్యజనులందఱివోట్లు తీసికొనియుండినయెడల గొప్ప విప్లవము వచ్చి యీరాష్ట్రైకమత్యమునకు భంగము కలిగియుండును. అదివఱకు సుమారు నూటయేఁబది సంవత్సరములనుండి రాష్ట్రశాసననిర్మాణసంఘములలో(State Legislatures) చర్చలవలన తాతముత్తాతలనుండి వంశపారంపర్యముగా వచ్చుచున్న జ్ఞానమును అనుభవమును ఉపయోగించు రాష్ట్రీయప్రతినిధు లందఱు నాచట్టము నంగీకరించిరి. అయినను, ఇట్టి యెడతెగని ఐకమత్యమునకు, పరదేశీయులవలన ఉపద్రవములు సంభవించు ననుభయమే ముఖ్యకారణము. కొన్నిరాష్ట్రములవారు ఆచట్టములో కొన్ని సవరణలవిషయమై ప్రస్తావించిరి. వానిలో కొన్నిసవరణలుమాత్రము దరిమిలాను ఆచట్టములోనుండు నిబంధనల ననుసరించి యంగీకరింపబడెను, మూఁడువంతులరాష్ట్రములును సంయుక్తరాష్ట్రీయకాంగ్రెసు మహాసభలో రెండువంతుల ప్రతినిధులును, ఒప్పుకొను సవరణలు ఆచట్టములో చేర్పఁబడు చుండవలయును, ఈ చట్టమునకే (Articles of Constitution) అని పేరు పెట్టఁబడెను, ఇది 15 సెక్షనులుగా భాగింపఁబడి యున్నది, ఈసంయుక్తరాజ్య తంత్రమునుండి యేరాష్ట్రమైనను తనకిష్టములేనియెడల విడిపోవచ్చునా లేదా యనునది అప్పటికి ముభావముగానుంచిరిగాని, తరువాత దేశములో నీగ్రోజాతీయులకు నల్లవారు

తెల్లదొరలకు బానిసలుగా నుండవచ్చునా లేదా యను వివాదాంశమును తీర్మానించుటకు 1868 సంవత్సరములో ఆచట్టముక్రింద చేరిన రాష్ట్రములు తమలో తాము ఘోరయుద్ధములు జరుపుకొని, శాశ్వతముగ పరిష్కరించుకొనిరి. అప్పటినుండియు సంఘములోనుండి యేరాష్ట్రము విడిపోవుటకు వీలులేదు.

పైన చెప్పినచట్టము 1789వ సంవత్సరమునుండి యమలులోనికివచ్చి, అమెరికాదేశస్థులను ఒక జాతివారినిగా చేసినది. అంతకు పూర్వము స్వల్పరాష్ట్రములు తమ సంరక్షణకొఱకు తమలో తాము చేసికొన్న కట్టుబాటు జాతీయప్రభుత్వముగ మాఱి అన్ని రాష్ట్రములపౌరులమీఁదను స్వయముగా నధికారమును వహింపఁగల ఒకసంయుక్త రాష్ట్ర మేర్పడెను, కాని వివిధరాష్ట్రముల స్వపరిపాలన కాటంకము లేవియు కల్పింపఁబడలేదు. సంయుక్తరాష్ట్రమునకంతయు పరిపాలనాధికారుల నెట్లు ఏర్పఱచవలెనో సంయుక్తరాష్ట్ర పరిపాలకులకును (Central Government) రాష్ట్రపరిపాలకులకును(State Government) వీరిపౌరులకును (Individual citizens) ఎట్టిసంబంధముండవలెనో యీసమస్యయే, ఆచట్టనిర్మాణకులమనస్సులను కలవరపఱచఁజొచ్చెను. వారలాసమస్య నెట్లు పరిష్కరించిరో మనమిప్పుడు తెలిసికొనవలసి యున్నది.

రాష్ట్రపరిపాలకులకు తమ రాష్ట్రమునకు సంబంధించిన వ్యవహారములలో సంపూర్ణస్వతంత్రత కలదు గాని అన్ని రాష్ట్ర

ములవారికి సంబంధించిన కొన్నివిషయములు సంయుక్తరాష్ట్రి పరిపాలకులకు నొసంగఁబడినవి. అవి యేవియనఁగా (1) పరదేశీయులతో యుద్ధము, సంధి, ఇంక నితరరాజకార్యములు (1) పటాలములు, నావికాసైన్యము (3) సంయుక్తరాష్ట్రి న్యాయాధిపతులు (4) రాష్ట్రీము లొండొంటితోను విదేశీయులతోను సంబంధించిన వాణిజ్యము, దానిపై సుంకములు, (5)నాణెముల యేర్పాటు(6)గ్రంథస్వామ్యములు నూతనకల్పనాధికారపత్త్రికలు(Copy-rights, patents)(7)తపాలకచ్చేరీలు, తపాలుపోవు మార్గములు (8) పైవిషయములకు కావలసిన ఖర్చులనిమిత్తము పన్నులు (9)పౌరుల సంరక్షణకు భంగము కలుగఁజేయు రాష్ట్రీయచట్టములను రద్దుపఱుచుట—వీనిలో కొన్ని విషయములను గుఱించి చట్టములు జేయుటకును, రాష్ట్రీయకార్యనిర్వాహకశాఖలును, న్యాయాధికారులును సంయుక్త రాష్ట్రపరిపాలకుల శాసనముల నమలులోఁ బెట్టుటకుఁ దగిన యేర్పాటులు చేయుటకును, రాష్ట్రీయ పరిపాలకులుగూడహక్కులు గలిగియున్నారు.

పైనచెప్పినచట్టమును(Articles of Constitution)నిర్మాణము చేసినవారు నాలుగువిషయములను తమమనస్సులయందుంచుకొనిరి:—(1) సంయుక్తరాష్ట్రపరిభుత్వమునకు బలము, ఫలోత్పాదకశక్తి (2)దానిలోని వేఱువేఱుపార్లమెంటులకు స్వాతంత్ర్యము, (3) అది ప్రజల కుత్తరవాదియగుట (4) వ్యక్తిస్వాతంత్ర్యము, వీనిలో మొదటిది కార్యనిర్వాహకాధికారమును బల

పరచుట వలనను, రెండవది చట్టనిర్మాణ చట్ట నిర్వాహక న్యాయాధికారశాఖలకు అన్యోన్య నిరోధములు సరితూగు సాధనముల నేర్పరచుటవలనను, మూడవది, పాలనాధికారులందరు ప్రజలచేత నెన్నుకొనవలసిన విధుల నేర్పరచుటవలను, నాలవది, పైన యుదహరించిన నిరోధములు సరితూగు సాధనములవలనను, పౌరుని హక్కులను చట్టముచేతనే సంరక్షింపబడుట వలనను, జాగ్రతపరచబడి, చట్ట నిర్మాణకులు తమయుద్దేశములను మిక్కిలి తెలివితో నెరవేర్చగలిగిరి.

ఆంగ్లేయరాజ్య తంత్రమునకును, యీసంయుక్తరాజ్య తంత్రిమునకును గల భేదములు ముందు వ్రాసెదను. ప్రస్తుతము ఒక సంగతిమాత్రిము చదువరులు గ్రహించవలయును. ఇంగ్లాండులో పార్లమెంటుకు సంపూర్ణాధికారముకలదు. అదియేచట్టమునైనను చేయగలదు. మార్చగలదు. రద్దుచేయగలదు. రాజునుంచగలదు. తీసివేయగలదు. ఆయనవంశపారంపర్యపు హక్కును రద్దు చేయగలదు. న్యాయాధికారుల కడ్డు కలిగించగలదు. ప్రతి పౌరునియొక్క పవిత్రమైనహక్కుల నన్నిటిని తీసివేయగలదు. దీనికిని ప్రజలకును మధ్యచట్టములేవియు భేదమును కలిగించలేవు. ఆంగ్లేయజాతియావత్తు ఆపార్లమెంటుసభలో నున్నదనియే మనమెంచవలెను. కాబట్టి సర్వశక్తియు నిరంకుశాధికారమును బ్రిటిషు పార్లమెంటువారికి కలదని గట్టిగ నమ్మవలయును.

అమెరికా సంయుక్త రాష్ట్ర పరిపాలనలో యేశాఖకు నట్టి యధికారములేదు. కాంగ్రెసుమహాసభయేగాక, ఆసభయు, ప్రెసిడెంటుగారునుకూడ చట్టమునకు(Constitution)లోబడవలసినదే. దానిని దాటి వారు వెళ్లుటకు వీలులేదు. దాని నతిక్రమించి ఏచట్టమునైనను చేసినయెడల ప్రతిపౌరుడును దానినుల్లంఘించవచ్చును. బ్రిటిషుపార్లమెంటువలె నధికారముగలవారు అమెరికాలో రాష్ట్రీయప్రజలే. చట్టముప్రకారము నియమింపబడి చట్టముయొక్క నిబంధనల ననుసరించి ఆచట్టములో మార్పులను చేయగలవారు ప్రజలేకాని, పరిపాలకులలో నేశాఖవారికిని, అట్టి యధికారము లేదు. ఇంక నీ శాఖలయొక్క అధికారములను గురించి వేరువేరుగ విచారింతము.

CHAPTER II.

ప్రెసిడెంటు.

ప్రజాప్రతినిధులు రాజ్యము చేయునపుడు వారి సంఘమున కొక యగ్రాసనాధిపతి నేర్పరుచుకొనవలసియుండును. అల్లకల్లోలము లేకుండ ప్రతినిధులు రాజకీయ విషయములను చర్చించుటకును, వారి సంఘముయొక్క కట్టుబాటుల ననుసరించి చర్యలు సరిగా జరిగించుటకును ఒక యగ్రాసనాధిపతి యుండవలయును. ప్రతిసంఘము అట్టి వానిని తన మెంబర్లలో నుండియే యేర్పరుచుకొనుచుండును. కాని, రాజకీయ సంఘమువారి యగ్రాసనాధిపతికి కొన్నియధికారములు ముఖ్యముగ నుండవలెను. అవి లేని యెడల, ఆసంఘముయొక్క తీర్మానములను నెరవేర్చుటకు యెవనియందధికారముంచెదరు? కాబట్టి చట్టనిర్మాణ సంఘమొకటి యున్నను దాని చట్టముల నమలులో పెట్టుటకు నొక కార్య నిర్వాహణ శాఖ యేర్పడవలెను. ఈ కార్యనిర్వాహణము ఒకనియందుండవలెనా? అను నీ విషయమును గురించి సంయుక్తరాష్ట్ర రాజ్యతంత్రజ్ఞులు మొట్టమొదట తమ రాజ్య నిబంధనను (Constitution) నిర్మాణము చేయునపుడు యెక్కువ దీర్ఘాలోచన చేసిరి. తమ మాతృదేశమైన యింగ్లాండులో అప్పటి రాజుగారు తమ యధికారము

నంతయు చలాయించుచు, పార్లమెంటులో కూడ తనకు పలుకుబడి మెండై అమెరికా వారితో తన ప్రజల సమ్మతిని బడయకనే యుద్ధము జరిగించఁ గలిగెనని తాము యోచించి, తమ ప్రెసిడెంటుకు పూర్ణ కార్య నిర్వహణాధికారము నివ్వలేదు. తమ ప్రసిడెంటు నాల్గు సంవత్సరముల కొకసారి ప్రజలచే నెన్నుకొన బడవలెననియు, చట్ట నిర్మాణ సంఘములో నొక శాఖయగు శిష్టసభ (Senate) యను సంఘముయొక్క యనుమతిలేనిదే పరరాష్ట్రములతో సంధిచేయుటకును, కొందరు ముఖ్యులైన యుద్యోగస్థుల నేర్పాటుచేయుటకును ఆయన కధికార ముండకూడదని యేర్పాటు చేసిరి. ఆయన మిగుల డాంబముతో నుండకుండుటకును, చట్టనిర్మాణసంఘములో మెంబర్లకు లంచము లివ్వలేకుండుటకును, ఆయనకు కొద్దిజీతము నేర్పరచిరి. ఆదేశములో ప్రభువులు సర్లు, దివాను బహద్దర్లు సి. ఐ. ఇ లు యీ మొదలగు బిరుదావళులను కొట్టివేసిరి గనుక, తమ ప్రెసిడెంటుగారు యిట్టి బిరుదు గాలములతో మానవమత్స్యములను వశపరచుకొనలేకుండ చేసిరి. తక్కిన విషయములలో తన ప్రజల పక్షమున ఆయన రాచకార్యముల నన్నిటిని వ్యవహరించ గలుగును.

ప్రెసిడెంటు గారిని నియమించు నధికారము సామాన్య ప్రజలందరకు నిచ్చినయెడల దేశమం దంతటను యీ గొప్ప బహుమానము నొసంగుటకు మితిలేని అపాయకరమైన ప్రేరే

పణ పుట్టును. అప్పుడు కేవలము మాటకారి యైనంతమాత్రముననే, ఒకనికి ప్రెసిడెంటు పదవి లభింపవచ్చును. చట్టనిర్మాణ సంఘమునకే, యీయనను నియమించు నధికారమిచ్చినయెడల, కార్య నిర్వహణాధికారము చట్టనిర్మాణసంఘములకు లోబడి పోవును. ఈ రెండు శాఖలు వేరువేరుగ నుండ వలెననియే యీ దేశరాజ్య నిబంధనాధికారుల యభిప్రాయము. ఇదిగాక చట్టనిర్మాణసంఘముచే ప్రెసిడెంటు యెన్నుకొనబడిన యెడల, ఒక పార్టీవారి సహాయముచే నెన్నుకొనబడినట్లగుగాని, ప్రజలచే నెన్నుకొన బడినట్లు యెంచబడదు. కాబట్టి యీ సమస్యను ద్విగుణమైన యెన్నికల నేయుక్తిచేత సాధించిరి. ప్రతిస్వల్పరాష్ట్రము, తాను సంయుక్త రాష్ట్రచట్ట నిర్మాణశాఖకు ప్రతినిధుల సంఖ్యతో సమానమైన నియామకుల నేర్పరచవలయును. ఈనియామకు లందరుకూడి ప్రెసిడెంటుగారిని ఆయన క్రింది యుద్యోగస్థుడైన వైసు ప్రెసిడెంటు గారిని యెన్నుకొనవలెను. వీరి వోట్లు ఒక కవరులో నుంచి, శీలుచేసి సంయుక్తరాష్ట్ర శిష్టసభకు(Senate) పంపబడును. ఆసభయొక్క అగ్రాసనాధిపతి రెండవసభయైన కాంగ్రేసు మెంబర్లనుకూడ దగ్గర నుంచుకొని ఆకవరును విప్పి వోట్లు లెక్కపెట్టును. ఈనియామకులు రాజ్యతంత్రములో నేపార్టీలోను చేరకుండుటకై వారు కాంగ్రేసుసభలో మెంబర్లుగాగాని గవర్నమెంటు నౌకర్లుగాగాని యుండకూడదని చట్టము నేర్పరిచిరి.

పైపద్ధతిమూలమున, ప్రెసిడెంటుగారును వైసు ప్రెసిడెంటుగారును సామాన్య జనుల వలనగాక, మేధావంతులైన వారిచేత, మిక్కిలి తెలివితేటలతో నెన్నుకొనబడుదురని యీ రాజ్యతంత్రనిర్మాణకు లెంచిరిగాని మొదట రెండు మూడుమారులు తప్ప తరువాత నట్లు తటస్థించలేదు. రాష్ట్ర చట్టనిర్మాణ సభల వలన నెన్నుకొనబడిన యీ నియామకులు, తమకు తోచిన న్యాయము ననుసరించి ప్రెసిడెంటు నెన్నుకొనుటకు వీలులేదు. ఏమనిషికి వోటు వేయవలెనని వీరి నేర్పరచెదరో ఆయనకే వీరు తమ వోట్లువేయుదురు. కాబట్టి నిజముగా జనులే తమ ప్రెసిడెంటును, వైసుప్రెసిడెంటును యేర్పరుచు కొనుచున్నారు. ఇటీవల యీ నియామకులు రాష్ట్రచట్టనిర్మాణ సంఘములవలనగాక, జనుల వలననే సరాసరిగా యేర్పరచ బడుచున్నారు.

ప్రజాప్రభుత్వముగల దేశములలో నెల్ల ప్రజలలో కనీసము రెండు గొప్పకక్షులుండును. ఈ దేశములోగూడ నాలాగునే ప్రజాప్రభుత్వవాదులలో (Republicans, Democrats) అని రెండుపార్టీలుకలవు. ఉభయకక్షులవారునుచేరి, ఒక గొప్ప సభ (National Convention) చేసి దానిలో నొకప్రముఖుని నేర్పాటు చేసికొనెదరు. ఈ సభ చిత్రవిచిత్రములు ముస్ముందు వర్ణించెదను. ఈసభలో ప్రెసిడెంటు వైసుప్రెసిడెంట్ల స్థానమునకు తమ పార్టీవారిలో నెవరు తగియుందురో యీవిషయము నాలోచించుటకు ప్రతిరాష్ట్రము నుండియు ఆపార్టీవారి

ప్రతినిధులు చేరుదురు. ఉద్యోగములో నున్న ప్రెసిడెంటుగారి నియమితకాలము యింక నాలుగుమాసములలో పరిసమాప్తి నొందుననగా దేశమంతటను రాబోవు ప్రెసిడెంటు విషయమై ఉపన్యాసములు వ్యాసములు ఊరేగింపులు రాత్రులలో కాగడాలతో జనశ్రేణులు ప్రతివీధిలోను గుంపులు. యీ విధముగా నల్లకల్లోలముగా నుండును. తరువాత నవంబరు మాసములో ఒక్క దినముననే దేశమంతటను ప్రతిరాష్ట్ర ముఖ్యపట్టణము లందును ప్రెసిడెంటు వైసుప్రెసిడెంట్ల నెన్నుకొను నధికారముగల నియామకులను జనులందరు నేర్పాటుచేసికొనెదరు. ఏ పార్టీవారివలన తమ రేర్పరచబడిరో ఆ పార్టీవారు నిశ్చయించుకొన్నవానికే తాము వోట్లుయిచ్చుట, యీ నియామకులు, తమ విధ్యుక్తధర్మముగా నెంచుదురుగాన వీరిని ప్రజలేర్పాటుచేయుటతోడనే ప్రెసిడెంట్ల పదవులను గురించి యల్లకల్లోలమంతయు తగ్గిపోవును.

ఈ నియామకుల యెన్నికలు నిజముగా జనులవలనగాక రాష్ట్రములవలననే జరుపబడుచున్నవి. ఒక రాష్ట్రములో నెక్కువమందిగల పార్టీ వారిచేత నియామకు లందరు నేర్పడుదురని నిశ్చయమైనపుడు, ఆరాష్ట్రములో తక్కువమంది గల పార్టీవారిని పెద్దపార్టీవారిలోనికి తెచ్చుకొనుటకు ప్రయత్నించుట యెంతమాత్రము లాభములేదు. కాబట్టి అట్టిరాష్ట్రములలో గడబిడలు తక్కువగా నుండును. అక్కడ చిన్న పార్టీవారి

వోట్లు కేవలము వృథమై పోవుచుండును. కాని యిరు కక్షుల వారును కొంచె మెచ్చుతక్కువగ సమానముగనున్న రాష్ట్రములలో ఉభయులును తమ నియామకుల నేర్పర్చుకొనుటలో మిక్కిలి కృషి చేయుదురు. ఈరాష్ట్రములను సందిగ్ధ రాష్ట్రములని (doubtful states) పిలచెదరు. కాబట్టి ఒకానొకప్పుడు జనాభిప్రాయమునకు భిన్నముగ ప్రతిరాష్ట్రమునుండి వచ్చునియామకులు తక్కువమంది జనులచేత నెన్నుకొనబడుట తటస్థించుచుండును. మొదటి ప్రెసిడెంటు గారయిన జార్జివాషింగ్టన్ గారు తప్ప తక్కిన ప్రెసిడెంట్లందరు యేదోనొక పార్టీలో చేరినవారయ్యి ఆపార్టీవారి యిష్టముచొప్పున ప్రవర్తించవలసి వచ్చుచున్నది. కాబట్టి యింగ్లాండు దేశములో వలెనే యీదేశములో కూడ కక్షులచేతనే రాజ్యము పరిపాలింపబడుచున్నది. ఇంగ్లాండు దేశపురాజు యేపార్టీవారితోను నేకీభవింపక తనగౌరవస్థానమందు విడిగానుండును. సంయుక్తరాష్ట్రపు ప్రెసిడెంటుగారు ఒకపార్టీవారిచేత నేర్పరుపబడి, వారితో నేకీభవించుచుండినను, కొందరు గొప్పయుద్యోగీయుల నేర్పాటు చేయుటలో తప్ప తక్కిన వ్యవహారములలో తన గౌరవపదవివలన గలుగు జవాబుదారీని గమనించుచు ప్రజలందరి తరఫున తాను ప్రతినిధిస్థాన మనుష్ఠించితి నని తెలిసికొనుచు మిగుల జాగరూకతతో ప్రవర్తించుచుండును. రెండవ కక్షివారి మనస్సులు నొవ్వకుండ తన యధికారములను చెలాయించుచుండును.

ఈసంయుక్తరాష్ట్ర నిబంధనలో ఒకరు ప్రెసిడెంటుగా నెన్నిసారులైనను యెన్నుకొనబడవచ్చును. కాని యెంతగొప్పవాడయినను రెండుసారులకంటె ప్రెసిడెంటు పదవికి ప్రయత్నించచకూడదని ఒకయాచారమేర్పడియున్నది. నాల్గుసంవత్సరముల కొకసారి ప్రెసిడెంటును యెన్నుకొనవలెను. 1891 సం. లో నేర్పడిన Apportionment act ను బట్టి ప్రెసిడెంటును వైసు ప్రెసిడెంటును యెన్నుకొనగల నియామకుల సంఖ్య 444. వీరిలో మెజారిటీ వారి వోట్లను బట్టి వారు నియమింపబడుదురు. ఆపదవులను గోరువారిలో నెవరికిని ఆవోటులలో కనీసము సగమైనను రానియెడల యెక్కువవోట్లు వచ్చిన మొదటిముగ్గురులో కాంగ్రెసుసభవారు తమ కిష్టము వచ్చినవారి నేర్పరుచుకొనవచ్చును. ఆసభలో రాష్ట్రముల వరుసను వోట్లు యివ్వబడును. ప్రస్తుతమందున్న 44 రాష్ట్రములలో 23 రాష్ట్రములైనను ఆమువ్వురిలో నొకరికి వోట్లువేసిన గాని ఆయన కా ప్రెసిడెంటు ఉద్యోగము రానేరదు. ఒక రాష్ట్రప్రతినిధు లెందరున్నను వారందరు కలసి ఒకవోటే వేయవలెను. వీరిలో మెజారిటీ యేర్పడక, సమాన సంఖ్యగలవారయినయెడల యీరాష్ట్రము వారికి వోటు లేనటులనే యెంచబడును. ఇట్టిచిక్కు సగము రాష్ట్రములవారికి సంభవించినపుడు గాని, రాష్ట్రములన్నియు యెవనికిని మొత్తములో సగమువోట్లు యివ్వలేనపుడుగాని అదివరకు యేర్పడియున్న వైసుప్రెసిడెంటుగారే ప్రెసిడెంటు

పదవిని గైకొందురు. సంయుక్తరాష్ట్రనిబంధన యేర్పడినతరువాత యింతవరకు రెండుసారులు మాత్రమే కాంగ్రెసుసభవారు ప్రెసిడెంటు నేర్పాటు చేయవలసి వచ్చినది.

ప్రెసిడెంటుగారిని తీసివేయవలెనన ఆయనమీాద కాంగ్రెసుసభవారు దోషారోపణచేసి శిష్టసభచే విచారణ చేయించవలెను. అప్పుడు సంయుక్తరాష్ట్రహైకోర్టుఛీఫుజడ్జీగారగ్రాసనాధిపత్యము వహించవలయును. ఆసభలో రెండువంతుల మెంబర్ల వోట్లనుబట్టి అతడు నేరస్థుడుగా నెంచబడును. తనగడవు కాలములో ప్రెసిడెంటుగారు చనిపోయినను, తీసివేయబడినను రాజీనామా యిచ్చినను వైసుప్రెసిడెంటుగారు వారిస్థానమునకు వచ్చెదరు. ఈయనకూడ లేకపోవుట తటస్థించినయెడల అధికార తారతమ్యమును బట్టి స్టేటుసెక్రటరీ మొదలగువారు ఆయుద్యోగమునకు వచ్చెదరు.

CHAPTER III.

ప్రెసిడెంటుగారి యధికారములు విధులు.

సంయుక్తరాష్ట్ర కార్యనిర్వాహణ శాఖలో ప్రెసిడెంటు ముఖ్యుడు. ఆయన ముఖ్యాధికారములు విధు లెవ్వియన:—

1. సంయుక్త రాష్ట్రాధికారుల కవసరము వచ్చినపుడు ప్రతిరాష్ట్రము నుండియు సమర్థులైన జనులను రావించి పటాలములను నావికాసైన్యమును సేకరించి వానికి తాను సేనాధిపతిగా నుండుట.

2. శిష్ట సభలో నప్పటికి హాజరుగా నున్న మెంబర్లలో రెండువంతులు ప్రతినిధుల యొప్పుదలతో పరరాజులతో సంధి గావించుట.

3. రాయబారులను హైకోర్టు జడ్జీలను, విదేశములో నుండవలసిన తన ప్రతినిధులను, శిష్టసభవారి సలహాతో నేర్పరుచుట.

4. కొన్ని నేరములను తప్ప, తక్కిన నేరములను చేసిన వారిని క్షమించుట.

5. శిష్టసభ కాంగ్రెసుసభలను కష్టతరుణములయందు కూడుటకు తగిన యేర్పాటులను చేయుట.

6. కాంగ్రెసు సభవారు నిర్మాణము చేయు చట్టములకు తాను సమ్మతించక వానిని పునర్విచారణకు వారియొద్దకే తిరిగి పంపుట.

7. అప్పుడు కాంగ్రెసులోను శిష్టసభలోను కూడియున్న మెంబర్లలో రెండువంతులవారు ఆచట్టముల నొప్పుకొనిన యడల తాను వానికి సమ్మతించ వలసియుండుట.

8. సంయుక్త రాష్ట్ర స్థితి గతులను కాంగ్రెసు వారికి తెలిపి అప్పటప్పటికి చేయదగిన పనులను వారికి తెలియ జేయుట.

9. చట్టములు సరిగా నమలులో పెట్టబడుచున్నవో లేవో యనుసంగతి విచారించుట.

10. విదేశీయ రాయబారుల కాతిథ్య మిచ్చుట.

11. సంయుక్త రాష్ట్రోద్యోగస్థుల కధికార పత్రిక లొసంగుట.

ఈ పనులన్నియు నాల్గు తరగతులుగా భాగింప వచ్చును. 1 పరదేశీయ వ్యవహారములు, 2 స్వదేశీయ వ్యవహారములు 3 చట్టనిర్మాణ సంబంధమైన కార్యములు, 4 ఉద్యోగీయుల నియమించు నధికారము.

I. యూరపు ఖండమునకు దూరముగా నుండుటచేతను, అమెరికా ఖండములో యీసంయుక్తరాష్ట్రమే మిగుల గొప్ప రాజ్యముగా నుండుటచేతను పరదేశీయ వ్యవహారములలో ప్రెసిడెంటుగారి కంతగా జోక్యము కలుగజేసి కొనుట కవకాశము లేదు. తమ దేశమును వ్యాపింపజేసికొనవలెనన్నే యభిలాష అక్కడి ప్రజలకు లేశమాత్రమును లేదు. ప్రెసిడెంటు కాంగ్రెసు

సభవారి సమ్మతి లేనిదే పరరాష్ట్రములతో యుద్ధముచేయుటకు వీలులేదు. కాని కాంగ్రెసుసభను యుద్ధము చేయుటకు ఒప్పించతగిన యుపాయము లాయనకు లేకపోలేదు. శిష్టసభలో రెండువంతుల ప్రతినిధుల సమ్మతి లేనిదే ఆయన సంధి చేయలేడు. ఆ సభవారి పరరాష్ట్ర వ్యవహార శాఖతో (Foreign affairs Committee) కార్యనిర్వాహక సంఘమువారెల్లప్పుడు సంబంధ ముంచుకొన వలయును. కాంగ్రెసుసభవారు న్యాయనిబంధనల ప్రకారము యీవిషయములలో జోక్యము కలుగజేసికొనలేకపోయినను, కార్యనిర్వాహక శాఖవా రవలంబించు నొకానొకా రాజ్యతంత్రము సరికాదనిగాని మరియొక విధముగ జరిపించ వలసినదనిగాని తీర్మానములను చేయవచ్చును. ఒకానొక సమయములో శిష్టసభవారిని తమతో నేకీభవించవలయునని కోరవచ్చును. ఈ రెండుశాఖల వారి తీర్మానములను కూడ ప్రెసిడెంటు పెడచెవిని పెట్టవచ్చును. కాని పరరాష్ట్రములతో వర్తకసంబంధమైన సంధులు మొదలగునవి చట్టములమూలమునగాని ఏర్పడనేరవు గనుకను, ద్రవ్యసహాయము లేకనే యుద్ధములు గొనసాగవు గనుకను, కాంగ్రెసు సభవారు తమ యధికారమును వేరు సాధనముల చెలాయించుకొన గలుగుదురు. పరరాష్ట్రములతో సంబంధించిన వ్యవహారములలో కార్యనిర్వాహక శాఖయొక్కయు చట్టనిర్మాణ శాఖయొక్కయు అధికారములను విడదీయుట స్వతంత్రరాజ్యము

లలో నెల్ల బహుదుర్లభము. ప్రజారక్షణకు బహిరంగచర్య యెంత యవసరమో పరరాజ్య విషయిక మంత్రాంగమునకు రహస్యము అవిలంబనము నంత ముఖ్యములు. సామాన్యవ్యవహారములలో ననుభవమందు ప్రెసిడెంటు కాంగ్రెసునకు లోబడియుండడు. ఏ వ్యవహారమైనను ప్రెసిడెంటు పరిష్కరించకుండ శిష్టసభ చేయగలుగునుగాని, ఆయన పరిష్కరించ కూడదని నిశ్చయించుకొన్న వ్యవహారమును శిష్టసభ పరిష్కరించలేదు. ప్రెసిడెంటు తలచుకొన్నయెడల తన దేశమును యుద్ధములో దింపగలడు. తనప్రజలలో క్రోధాది గుణముల నుద్రేకింపగలడు.

II. నెమ్మది దేశములో నున్నపుడు ప్రెసిడెంటుగారి యధికారమంతగా కనుపించదు. మామూలు వ్యాపారములన్నియు యేరాష్ట్ర మారాష్ట్రమేజరుపుకొనును. సంయుక్తరాష్ట్రాధికారము చట్టములకు లోబడియేయుండును. కార్యనిర్వాహక శాఖకు స్వతంత్రత ముండుట తటస్థించదు. కాని యుద్ధసమయములలో ముఖ్యముగా నంతఃకలహములలో ప్రెసిడెంటుగారియధికారము మిక్కిలివృద్ధియగును. సేనలకన్నిటికిని నాయకుడుగా నుండుటయే గాక కాంగ్రెసు సభవారిచేత నిరంకుశాధికారము బడయును. 1862- 1863 సంవత్సరములో సంయుక్తరాష్ట్రములో నంతఃకలహము సంభవించినపుడు తనతో యుద్ధము చేయుచున్న కొన్ని రాష్ట్రములలో బానిసలనందరిని విడుదలచేసి స్వాతంత్ర్య మిచ్చితినని ప్రెసిడెంటు "లింకన్" గారు చాటించిరి. ప్రతిరాష్ట్రము ప్రజలచేతనే పరిపాలింప బడవలెననియు అట్టిప్రజాప్రభుత్వము తొలగకుండ జేయవలెననియు సంయుక్తరాష్ట్రనిబంధనలో యేర్పాటు చేయబడియే యున్నది. ప్రతిరాష్ట్రము తనలో నంతఃకలహము సంభవించినపుడు తన చట్టనిర్మాణశాఖమూలమునగాని, అది కూడుటకు వీలులేనపుడు, కార్యనిర్వాహక శాఖమూలమున గాని సంయుక్త రాష్ట్రాధికారుల సహాయమును కోరవచ్చును. అట్టిసమయములో ప్రెసిడెంటు తనకిష్టులగు పార్టీవారికి సహాయము నొసంగవచ్చును. తరుచుగా ప్రెసిడెంటు తనప్రజలకు తాను చేయబోవు పనుల విషయమై తెలుపుచుండును. సామాన్యమానవుల వలెనే తానుకూడ స్వరాష్ట్ర సంయుక్తరాష్ట్రములలో జరుగు నెన్నికలలో వోట్లు వేయవచ్చును.

III. చట్టనిర్మాణ విషయములలో యింగ్లాండు రాజునకును అమెరికా ప్రెసిడెంటునకును కొంచెము భేదముకలదు. ఆంగ్లేయరాజు చట్టనిర్మాణశాఖలో ఒకడుగా నెన్నబడుచు పార్లమెంటునకు నధ్యక్షుడుగా నుండి పార్లమెంటులో ప్యాసయిన బిల్లులకు తనయంగీకారమునిచ్చి వానిని చట్టములుగా స్థిరపరచును. పార్లమెంటు కూడినప్పుడును విడిపోయినప్పుడును తప్ప సాధారణముగా రాజు తన పార్లమెంటుకు అధ్యక్షుడుగా నుండుట లేదు. పార్లమెంటువారు ప్యాసుచేసిన చట్టములకు తానంగీకార

మివ్వకుండుటయు లేదు. రాష్ట్రనిబంధనలనుబట్టి ప్రెసిడెంటు శిష్టకాంగ్రెసు సభలలో చేరి యుండడు.

ఆయన వానికి వేరుగనుండి బిల్లులను ప్యాసుచేయుటలో కొంత స్వతంత్రాధికారము కలిగియుండును. ఇదిగాక ఆంగ్లేయ రాజులు తామొక బిల్లును తయారు చేసి తమ మంత్రుల గుండ దానిని పార్లమెంటు వారి యంగీకారమునకు వారియెదుట పెట్టవచ్చును. ప్రెసిడెంటు తానుగాని తమమంత్రులుగాని బిల్లును కాంగ్రెసు శిష్టసభల యెదుట పెట్టుటకు వలనుపడదు. ఏలయన వీరందరు నాసభలో మెంబర్లు కారు. దేశస్థితి, జాతీయవిషయములు, మొదలగు వానిని గురించి బిల్లులను తయారు చేయవలసినదని ప్రెసిడెంటు ఆ సభలకు తెలియజేయవచ్చును. అట్టి చట్టములుండుట యవసరమని వారికి తనసలహా నొసంగవచ్చును. ఆసభలో ప్రతిదానిలోను రెండువంతుల మెంబర్లకంటె తక్కువ మందిచేత ప్యాసు అయిన చట్టములను ప్రెసిడెంటు నిరాకరించవచ్చును. ఇట్టియధికారము యింగ్లాండు రాజునకున్నను ప్రస్తుత మాచరణలో లేకపోవుటచేత నది నశించినదనియే చెప్పవచ్చును. శిష్టసభ కాంగ్రెసుసభలలో ప్రతిదానిలోను రెండువందల ప్రతినిధులు ప్యాసుచేసిన బిల్లులు ప్రెసిడెంటు ఒప్పుకొనకున్నను చట్టములుగా నేర్పడును.

IV. సంయుక్తరాష్ట్రవ్యవహారము లన్నిటికి తానే జవాబుదారీ చేయవలయును గనుక ప్రెసిడెంటు తనక్రిందియుద్యోగ

స్థుల నందరిని తానే ఏర్పాటు చేసికొనవచ్చును. ఈ విషయములో యీయనకు పూర్ణాధికార మిచ్చినయెడల అపాయము కలుగునేమో యనుభయముచేత శిష్టసభవారి యనుమతికూడ బడయవలయునని సంయుక్తరాష్ట్రనిబంధనలో చెప్పబడియున్నది. ప్రెసిడెంటుపదవికి ప్రయత్నించు ప్రతివారును తనస్వరాష్ట్రములోను యితర రాష్ట్రములోను తన పార్టీవారికి, యీయుద్యోగస్థుల నియమించుటలో, తాను వాగ్దానములు చేసినగాని తాను రాబోవు యెన్నికలలో కృతార్థుడు గానేరడు. కాబట్టి శిష్టసభలో చేరిన ప్రతిమెంబరు తనపార్టీవారిలో నుండి ప్రెసిడెంటు నేర్పాటుచేయబడ నున్నపుడు ఆయనచేత తనస్నేహితుల కుద్యోగము లిప్పించుటకు తగు ప్రయత్నములు చేయక మానడు. రెండవపార్టీతో సంబంధించిన మెంబర్లు యీవిషయములో యేవిధమైన జోక్యమును కలుగజేసికొనరు. అట్లు చేయదలచుకొన్నను యెంతమాత్రము లాభములేదు. ప్రెసిడెంటు నేర్పరచగల పార్టీవారి శిష్టసభ మెంబర్లు రహస్యముగ కూడి తమపార్టీవారిలో నుండి ఉద్యోగస్థుల నేర్పాటు చేసికొనెదరు. తామే అట్లుయేర్పడుటకు నిబంధన సమ్మతించదు. ఈ కారణమును బట్టి యీశిష్టసభ మెంబర్లకెంత పలుకుబడి యుండునో చదువరులూహించుకొనవచ్చును. క్రొత్తప్రెసిడెంటు యేర్పడినపుడెల్ల యీయుద్యోగస్థులు మారుచుందురు. కాబట్టి కార్యనిర్వాహకశాఖ కింత యధికారమును కలుగజేసి దేశములో

నొక కక్షివారికింత యధిక బలము నొసంగుట ఒకప్పుడు మిక్కిలి అపాయకరము. 1883 సంవత్సరములో యేర్పడిన సివిలుసర్వీసు చట్టమును బట్టి క్రిందియుద్యోగములలో చాలభాగము ప్రెసిడెంటు స్వాధీనమునుంచి తప్పించి పరిక్షలలో తేరినవారికే యీ యుద్యోగములు నొసంగ బడుచున్నవి. ఇప్పటికైనను పోస్టుమాస్టర్ల యుద్యోగములు మొదలగునవి సుమారు 3500 వరకు ప్రెసిడెంటు స్వాధీనములోనున్నవి. ఇట్లున్నను ప్రెసిడెంటు శిష్టసభలో తనస్నేహితుల శిఫారసులను వినక తప్పదు. ఎన్నికలలో తనకు సహాయము చేసినవారలందరికి యీయుద్యోగములను పంచియిచ్చును. ప్రతిరాష్ట్రములో చిన్నచిన్న యుద్యోగము లన్నియు శిష్టసభలో నున్న యీరాష్ట్రప్రతినిధులకే వదలివేయుచున్నను, పెద్దయుద్యోగస్థుల నేర్పరుచుటలో యీ ప్రతినిధుల నందరను కలిపి యొప్పించుట మిగుల దుర్లభము.

దేశము నెమ్మదిగా నున్న సమయములో ప్రెసిడెంటు యధికార మంతయెక్కువగా కనుపించదు. చట్టనిర్మాణవిషయములో గాని కార్యనిర్వహణ విషయములో గాని కాంగ్రెసు సభికుల యనుకూల్యమునుబట్టియే పనులు సాగుచుండును, కాని నెమ్మదికి భంగము సంభవించు సమయములలో సివిలు మిలిటరీ డిపార్టుమెంటులు రెంటికిని యాజమాన్యము వహించుట వలన ప్రసిడెంటు యధికారమునకు మేరలేదు. అట్టి సమయములలో వీరు నిరంకుశాధికారము నుపయోగించు

టుకు జనులు ఒప్పుకొనెదరు. అప్పుడుకూడ యీయన బహుజనాభిప్రాయము వలననే యిట్టి నిరంకుశాధికారము నుపయోగించ గలుగును. కాంగ్రెసు సభవారుకూడ జనులచేత నెన్నుకొనబడువారగుటచేత వీరికిని ప్రెసిడెంటుకును పరస్పర వైరములు చాలకాలముండవు. రాజులు జనులనుండిగాక తమకు పారంపర్యముగ వచ్చు హక్కులను బట్టియే తమరు నిరంకుశాధికారము నుపయోగించ గలమని గర్వించినయెడల అమెరికా ప్రెసిడెంటు ప్రజలచేత నెన్నుకొనబడినవాడగుటచేతనే తాను నట్టి నిరంకుశాధికారము చలాయించగలనని గర్వించవచ్చును. ఆయన చట్టనిర్మాణ శాఖవారికిని ప్రజలకును కూడ ప్రతినిధిగా నెంచబడును. ప్రజలే వీరి నందరిని యెన్నుకొనువారగుటచే వారిసహాయము వలననే తప్ప వారి ప్రెసిడెంటులు నిరంకుశప్రభువు లెప్పటికిని కాలేరు.

CHAPTER IV.

శి ష్ట స భ.

ఈదేశములో చట్టనిర్మాణసభకు 1 శిష్టసభ (Senate) 2 ప్రజాప్రతినిధిసంఘము (House of Representatives) అనురెండుశాఖలు కలవు. వీనిలో మొదటిదానికి ప్రతిరాష్ట్రమునుండియు యిద్దరిద్దరు ప్రతినిధులు పంపబడుదురు. వారు ఆ రాష్ట్రములో కాపరస్తులై ముప్పది సంవత్సరములవయస్సునకు తక్కువలేకుండ నుండవలెను. వారు ఆరుసంవత్సరముల కొకసారి తమరాష్ట్రీయ చట్టనిర్మాణసభవలన యెన్నుకొనబడవచ్చును. ఈశిష్టసభలో, రెండుసంవత్సరముల కొకసారి మూడవవంతు ప్రతినిధులు తమ స్థానములను కాళీ చేయుచుండవలెను. ఈవిధముగా ఆరుసంవత్సరముల కొకసారి యావత్తు సభ క్రొత్తదిగా నేర్పడుచుండును. ఎప్పుడుచూచినను, యీశిష్టసభలో రెండువంతులు ప్రాతమెంబర్లు ఒకవంతు క్రొత్తమెంబర్లు కనబడుచుందురు. ఈదేశములో నలుబదినాలుగు రాష్ట్రములున్నవి గనుక, యీశిష్టసభలో యెనుబది యెనుమండ్రు మెంబర్లున్నారు. ఇంగ్లాండులో యీసభను పోలియున్నది పార్లమెంటులో నొకశాఖయగు ప్రభుసంఘము. దీనిలో సుమారు 550 మంది మెంబర్లుగలరు. వీరిలో నొకరిద్దరు మంత్రుల సంఘ

ములో(Cabinet)చేరియుందురు. శిష్టసభలో నుండు మెంబరు (Senator) సంయుక్తరాష్ట్రములో యేయుద్యోగములోను ప్రవేశించ కూడదు. ఈశిష్టసభలో ప్రెసిడెంటు స్థానమును సంయుక్తరాష్ట్ర వైసుప్రెసిడెంటుగా రధిష్ఠించెదరు. ఏవిషయములోనైనను, శిష్టసభలో నిరుకక్షులవారును సరిసమానముగా నున్నపుడుతప్ప, తక్కినసమయములయందు, వీరిప్రెసిడెంటుకు వోటులేదు.

ఈశిష్టసభ చట్టనిర్మాణ కార్యనిర్వాహక, న్యాయవిచారణ సంబంధమైన వ్యవహారములు కొన్ని నెరవేర్చుచుండును. 1. కాంగ్రెసులో రెండవశాఖయైన ప్రజాప్రతినిధి సంఘముతో కలసి చట్టముల నేర్పాటుచేయును. ప్రెసిడెంటుగారు ఆచట్టముల నామోదించినయడల యవిస్థిరపడును. ఆయనాచట్టముల నంగీకరింపక తిరుగ గొట్టినయడల, కాంగ్రెసుయొక్క రెండుశాఖలలోను, రెండువంతుల ప్రతినిధులు ప్యాసుచేసినయడల, ప్రెసిడెంటుగారి యంగీకారము లేకపోయినను అట్టిచట్టము లమలులోనికి రావచ్చును. 2. ప్రెసిడెంటుగా రేర్పరచదలచుకొను న్యాయాధిపతులు, మంత్రులు, రాయబారులు మొదలగు నుద్యోగస్థుల విషయమై తమయభిప్రాయమును తెలియజేయవచ్చును. ప్రెసిడెంటుగారు పరరాజులతో చేయుసంధులకు, దమలో రెండువంతులుప్రతినిధులయిష్టముమీద తమయంగీకారము నొసంగవచ్చును. అటుల వీరు జరిగించనియడల అట్టిసంధు

లెందుకు పనికిరావు. 3. ప్రజాప్రతినిధి సంఘమువారు (House of Representatives) ప్రెసిడెంటుగారిమీదగాని, వారిమంత్రులమీదగాని దోషారోపణచేసి తమయెదుట ఫిర్యాదుచేసిన యడల (Impeachment) శిష్టసభవారు న్యాయవిచారణ చేయుదురు.

రాష్ట్రము చిన్నదైనను, పెద్దదైనను, సంయుక్తరాష్ట్ర శిష్టసభకు యిద్దరు మెంబర్లనే పంపవలయును. కాంగ్రెసుయొక్క రెండుశాఖలప్రతినిధులు మొత్తముమీద ప్రజలవలననే యెన్నుకొనబడుచున్నట్లు చెప్పినప్పటికి, శిష్టసభమెంబర్లు డైరెక్టుగా ప్రజలచేత నెన్నుకొనబడుటలేదు. వారు ప్రజలచేత నియమింపబడిన రాష్ట్రీయచట్టనిర్మాణసభల మెంబర్లచేత యెన్నుకొనబడుదురు. ఈ శిష్టసభయను రెండవశాఖయుండుట మిక్కిలి యుపయోగకరము. ప్రజాప్రతినిధి సంఘము వారు, తొందరవలనగాని, అహంకార మాత్సర్యముల వలనగాని స్వల్పాలోచనలతో చేయుపనులను శిష్టసభవారు కొంత జాగరూకతతో నెమ్మదిగా నాలోచించి వాటికి తమయంగీకారము నిచ్చుట తటస్థ పడుచుండును.

ఈ శిష్టసభమెంబర్లు ప్రజాప్రతినిధి సంఘ మెంబర్లవలె ప్రజలచేతగాక రాష్ట్రప్రజాప్రతినిధి సంఘములవలన నెన్నుకొనబడువారగుటచేత గొప్పమేధావంతులుగా నుందురు. ఇంగ్లాండులో ప్రభుసంఘమువారు చాలాభాగము తమ తండ్రులకు పుట్టి

నంతమాత్రము చేతనే యీగౌరవపదవిని పొందుచూ ఆటవేటపాటలయందు తమకాలము నంతయు తమయస్టేటులలో గడపుచు పార్లమెంటులో సంవత్సరమున కొకసారియైనను తమముఖము జూపించరు. సాధారణముగా వీరందరు వంశపారంపర్యపు హక్కులను జీవితకాలపు హక్కులను కలిగియుండి ప్రజలచేత నెన్నుకొనబడక పూర్వపక్షావలంబకులుగానే యుండుటచేత యీశాఖకును ప్రజాప్రతినిధి సంఘమునకును యెడతెగని పోరాటమేర్పడి ఇప్పుడాంగ్లేయదేశములో గొప్పవిప్లవము రానైయున్నది. ఇదియెట్లు సర్దుబాటగునో యెవరు నూహించి చెప్పజాలకున్నారు.

ఈ శిష్టసభ రాష్ట్రీయపాలనాధికారమునకును (State Government) సంయుక్త రాష్ట్రీయ పాలనాధికారమునకును (Federal Government) ఒకగొలుసువలె యున్నది. ఇది పైనజెప్పిన రెండవదానిలో నొకభాగమైనను మొదటివారివలన నెన్నుకొనబడు మెంబర్లసంఘమై యున్నది. అయినను యీశిష్టసభకు మెంబర్ల నెన్నుకొనక పూర్వము రాష్ట్రీయచట్టనిర్మాణ సంఘములలో మెంబర్ల నెన్నుకొనవలెను. కనుక ముందుగనే శిష్టసభకు పంపవలసిన మెంబరుపేరు నిశ్చయించుకొని ఆయననేపంపించుటకిష్టమున్నవారినే రాష్ట్రీయచట్ట నిర్మాణసభకు మెంబర్లనుగా ప్రజలేర్పరచుకొనెదరు. కాబట్టి డైరెక్టుగా కాకపోయినను యీశిష్టసభ మెంబర్లు వేరుమార్గమున

ప్రజలచేతనే యెన్నుకొనబడుచున్న ట్లెంచవలెను. ఒకరాష్ట్రమునుండి వచ్చినమెంబర్లు యేచర్చాంశములోనైనను ఒకరి కొకరు వ్యతిరేకముగా శిష్టసభలో తమ భిన్నాభిప్రాయమును బట్టి వోట్లువేయవచ్చును. తమ్మునేర్పరచిన రాష్ట్రీయచట్టనిర్మాణసంఘము రెండుసంవత్సరముల కొకసారి ఛిద్రమై నూతన సంఘ మేర్పడుచుండును. తాముమాత్రము ఆరుసంవత్సరముల వరకు శిష్టసభలో మెంబర్లుగా నుండవచ్చును. ఏకకాలమందే ఒకరాష్ట్రమువలన పంపబడిన యిద్దరు మెంబర్లు శిష్టసభలో నుండి పోకుండ నిబంధన లేర్పడియున్నవి.

రివిన్యూ బిల్లులు యింగ్లాండు దేశములో వలెనే ప్రజాప్రతినిధి సంఘములో మొట్టమొదట తేబడవలెను. తరువాత శిష్టసభవారు తమ యంగీకార మివ్వవలెను. కాని యింగ్లాండులో ప్రభుసంఘమువారు ఆబిల్లుల నేవిధముగను మార్చకూడదు. శిష్టసభవారు ఆబిల్లును త్రోసివేయవచ్చును. మార్చవచ్చును. అనేకదినములు రెండుశాఖలవారును పోరాడుకొనుచు, పన్నులు విధించుటలోను, వానిని ఖర్చుపెట్టు విషయములోను, అనేకవిధముల బేరములు చేయుచుండవచ్చును. తుదకు తమ తగవులను రాజీనామాగా పరిష్కరించుకొన బడుచుండును.

కార్యనిర్వాహకాధికారము, చట్టనిర్మాణాధికారము గల యిట్టి శిష్టసభ యింగ్లాండులోగాని మరి యేయితర యూరపు ఖండ దేశములోగాని లేదు. ప్రజాప్రతినిధి సంఘములో మెంబర్ల దూరాలోచనా అభావమునకును ప్రెసిడెంటుయొక్క నిరంకుశాధికారమునకును యీసభ కొంత ఆటంకము కలిగించుననుటకు సందేహములేదు. దీని సహాయములేకుండ ప్రజాప్రతినిధి సంఘమేమియు చేయలేదు. ప్రసిడెంటుగారు తనయిష్టము వచ్చినటుల రాచకార్యముల జరిగించలేడు. శిష్టసభలో నుండు మెంబరు సాధారణముగా ప్రజాప్రతినిధి సంఘములో నుండు మెంబరుకంటె యెక్కువగౌరవము, అధికారము, స్వాతంత్ర్యము, అనుభవము కలిగియుండును కాబట్టి ప్రతిరాజ్య తంత్రజ్ఞుడు శిష్టసభలో మెంబరుగా నుండవలయునని కోరుచుండును. ఈసభలో చాలభాగము న్యాయవాదులే మెంబర్లుగా నుందురు.

CHAPTER V.

మంత్రులసంఘము.

ఆంగ్లేయ రాజ్యతంత్రములోవలె, సంయుక్తరాష్ట్ర రాజ్యతంత్రములో మంత్రులసంఘమును 'కాబినట్' అని వాడుటలేదు, గాని స్టేటుసెక్రిటరీ, ట్రెజరీసెక్రిటరీ, యుద్ధసెక్రిటరీ, నావికాసెక్రిటరీ, హోముసెక్రిటరీ, అటర్నీజనరల్, పోష్టుమాష్టరు జనరల్, అనునీ యష్టమంత్రులుచేరిన సంఘము 'కాబినట్' అని పిలువవచ్చును. వీరిలో నొక్కొకరికి నెలకు 2250 రూపాయల జీతముండును. వీరినందరిని ప్రెసిడెంటుగారు శిష్టసభయొక్క అనుమతితో నేర్పరచుకొనెదరు. ఈసభ తన యనుమతి నివ్వకపోవుట యెన్నడు తటస్థించలేదు. ఇంగ్లాండులో ప్రభుసంఘము (House of Lords) ప్రజాప్రతినిధిసంఘము (House of Commons) కలసి పార్లమెంటని యెట్లు వాడబడునో ఆవిధముగనే శిష్టసభ(Senate)ప్రజాప్రతినిధి సంఘము (House of Representatives)కలసి కాంగ్రెసు అని వాడబడును. ఈమంత్రులను తీసివేయు నధికారము ప్రెసిడెంటుగారియందే యున్నది.

ఈమంత్రులకు కాంగ్రెసులో వోట్లువేయు నధికారములేదు. వీరు కాంగ్రెసుమహాసభలో యేశాఖకును మెంబర్లుగా నుండకూడదు. ప్రెసిడెంటుగారు ఉద్యోగముల నిచ్చెదనని కాంగ్రెసులో ప్రముఖులను తాను వశపరచుకొనకుండుటకును, తన మంత్రులు ప్రజాప్రతినిధులకు లంచములు మొదలగునవి రుచిజూపి వారిని తమకు లోబరచుకొనకుండుటకును, యిట్టి నిబంధన యేర్పరుపబడినది. ప్రెసిడెంటుగారు తనయుద్యోగములో ప్రవేశించు నపుడు తాను వెనుకటి ప్రెసిడెంటుగారి పార్టీలో చేరినవాడైనను పూర్వమంత్రులనుగాక క్రొత్తవారినే తనకు మంత్రులనుగా జేసికొనవచ్చును అదివరకెన్నడును కాంగ్రెసులోగాని రాష్ట్రీయసభలలోగాని మెంబరుగా నుండనివారికిఁగూడ మంత్రిపదవి నీయవచ్చును. సాధారణముగ కొంతప్రాముఖ్యతగల వానికే ఆయన యిచ్చుచుండును తాను ప్రసిడెంటగుటకు మిక్కిలి పాటుపడినవారిని తరచుగ నీ మంత్రిపదవులకు నియమించుచుండును. ఒకానొకప్పుడు తనపార్టీవారివలన తనతోకూడ ప్రెసిడెంటు పదవికి యెన్నుకొనబడిన వారిని మంత్రిస్థానములయందుంచుచుండును. ఈమంత్రులలో స్టేటు సెక్రిటరీ మిక్కిలి గొప్పవాడు. ఈయన పరదేశీయ రాచకార్యములను మిక్కిలి జాగరూకతతో చక్కబెట్టుచుండును. ఈమంత్రిస్థానమునందున్నవారు ప్రెసిడెంటుపదవికి యర్హులగుచుందురు. జఫర్సన్ మాడిసన్ మన్రో, ఆడమ్సు—వీరు ప్రెసిడెంట్లుకాక పూర్వము యీ మంత్రి స్థానమును కొంతకాల మధిష్టించిరి. ట్రెజరీసెక్రిటరీగారు కోశాధిపతి యని వాడబడుచుండును.

యుద్ధసమయములయందు యీయన యధికారము మిక్కిలి ప్రకాశించును. పన్నులను విధించు నధికార మేమియు నీయన యందుండదు. అటర్నీ జనరల్ గారు సంయుక్తరాష్ట్రమునకు పబ్లికుప్రాసిక్యూటరుగా నుండుటయేగాక కొంతన్యాయాధికారముకూడ కలిగియుండును. సంయుక్తరాష్ట్ర నిబంధన ననుసరించి కార్యనిర్వాహణాధికారమున కున్న మేరలు సంయుక్తరాష్ట్రాధికారమునకును రాష్ట్రాధికారులకు నుండవలసిన అన్యోన్య సంబంధములు న్యాయచట్టములకు సంబంధించిన విషయములు—యీ మొదలగు వానిలో ప్రెసిడెంటుగారికి యీమంత్రి సలహాకారుడుగా నుండును.

ఇంగ్లాండులో నిబంధనలకు లోబడిన రాజాధిపత్యమునకును (Constitutional Monarchy) అమెరికా ప్రెసిడెంటు యొక్కయు యీయన మంత్రులయొక్కయు అధికారమునకును మిక్కిలి తారతమ్యముకలదు. మొదటిదానిలో రాజు ప్రజలకు స్వయముగ నుత్తరవాది కాడు. ఆయన పేరుమీదజరుగు ప్రతికార్యమునకును ఆయనమంత్రులే జవాబుదారీ వహించెదరు. సంయుక్తరాష్ట్రములో ప్రెసిడెంటుగారే తమప్రజలకుత్తరవాదియగును. ఆయన మంత్రులు ఆయనచేతనే నియమింపబడినవారై ఆయనకు నౌకర్లుగానున్నారు. వీరికి కాంగ్రెసులో నేమియు సంబంధములేదు. వీరు చేయుకార్యములు ప్రెసిడెంటుగారు స్వయముగ జరిగించినట్లే యెంచబడును. సంయుక్తరా

ష్ట్ర పరిపాలన యీమంత్రిసంఘము వారందరు కూడి యాలోచించి చేయరు. వీరిలో నొక్కొక్కరు వారివారికి నియమితాధికారములు ప్రెసిడెంటుగారి యుత్తరువులకులోబడి చెలాయించుచూ ఆయనకుమాత్రమే జవాబు చెప్పవలసిన వారేగాని యీ మంత్రులందరికి సమిష్టియాలోచనగాని అయిక్యధురంధరత్వముగాని లేదు. ఇంగ్లాండులో కాబినట్ లో చేరిన మంత్రులందరు కూడి రాజ్యాంగవిషయముల నాలోచించుకొని తమప్రధాన మంత్రిగుండా రాజునకు సలహానిచ్చెదరు. ఆయనవారిసలహా నామోదించకున్న వీరంద రొక్కసారిగ తమపదవులకు రాజీనామాల నిచ్చెదరు.

జార్జి వాషింగ్టన్ గారు, తాను ప్రథమమున ప్రెసిడెంటు పదవి నధిష్టించి నపుడు, యీయధికారి యేపార్టీవారితో నైనను సంబంధించని వాడుగా నుండవలయుననియే ఆదేశ రాజ్యతంత్రజ్ఞుల యభిప్రాయము. దీని ననుసరించియే ప్రెసిడెంటుగారు డైరెక్టుగా ప్రజలచేత నెన్నుకొను విధులేర్పరుపబడెను. ప్రథమ ప్రెసిడెంటుగారైన వాషింగ్టనుగారు మహానుభావుడు గనుకనే, తనకిష్టులైన మంత్రులను, వారేపార్టీలోవారైనను లక్ష్యము చేయక, యేర్పరుచుకొని యావన్మంది ప్రజలకు మిగుల సంతృప్తికరముగ రాజ్యము చేయగలిగెను. ఈయన కాంగ్రెసులో నెక్కువ పార్టీవారికి గాక, ప్రజలకే యుత్తర వాదియగుటచే, యేపార్టీలో చేరియున్నను, తెలివి తేటలుగలవా

రిని తనకు మంత్రులుగఁ జేసికొనెను. ఈయన తరువాతవచ్చిన ప్రెసిడెంట్లు, యేపార్టీ వారి ప్రముఖుల సహాయమువలన తామాపదవిని సంపాదించుకొనగలిగిరో ఆపార్టీ వారిలో నుండియే తమమంత్రుల నేరికొనఁ జొచ్చిరి.

పైన చెప్పిన విషయములో సంయుక్తరాష్ట్ర మంత్రిసంఘము, యింగ్లాండు దేశపు "కాబినెటు"నుపోలి యున్నది. రెండును యెప్పటికప్పుడు ఒక్కపార్టీలో నుండియే, యేర్పడుచున్నవి కాని ఆంగ్లేయ పార్లమెంటు పద్ధతి నాల్గు ముఖ్యసూత్రములమీద నిలచియున్నది. (1) కార్యనిర్వాహణశాఖాధిపతి (King is the head of the executive) ప్రజల కుత్తరవాదిగా నుండడు. ఆయనకు సలహా నిచ్చుమంత్రిసంఘము (Cabinet) యావత్తు జవాబు దారీని వహించెదరు. ఏతప్పు చేసినను వీరు బాధ్యులగుదురు. రాజుగారు తప్పించుకొనెదరు. రాజాజ్ఞ ననుసరించి చేసితిమని మంత్రులు తప్పించుకొనుటకు వలనుపడదు. తమ కిష్టము లేని పనిని రాజు చేయనున్నయడల, తాము తమ పదవులకు రాజీనామాల నివ్వవలసినదే. (2) ఆంగ్లేయ మంత్రులు చట్టనిర్మాణసంఘములో (Legislature) చేరినవారై, వారి సంఘము పార్లమెంటు వారి కమిటీలలో నొక పెద్దకమిటీగా నేర్పడి యుండును. (3) ఈమంత్రిసంఘము పార్లమెంటువారికి జవాబుదారులై వారికి తమయందు నమ్మకములేదని తెలియగనే, తమమంత్రిత్వమును వదులుకొనవలయును.

(4) ఈమంత్రులు, ఉమ్మడిగాగాని, విడివిడిగాగాని తాము చేయు నన్నిపనులకు పార్లమెంటుకు ఉత్తరవాదులగుచున్నారు. వీరిలో నొకరుచేసినలోపము, వీరందరు చేసిన లోపముగానే యెంచబడును. కావుననే వీరందరు నొక్కసారిగ రాజీనామాల నిచ్చెదరు. ఒకానొకపుడు, వీరిలో నొకరు, తానుచేసిన పనికి తానే జవాబుదారీ వహించుకొని, తనపదవికి రాజీనామా యిచ్చుట తటస్థించవచ్చును.

పైనచెప్పిన నాలుగు సూత్రములలో నేదియు సంయుక్తరాష్ట్రరాజ్యతంత్రములో వర్తించదు. ప్రెసిడెంటుగారు తమ్ము నెన్నుకొన ప్రజల కేగాని కాంగ్రెసున కుత్తరవాదికాడు. ఈయన నాలుగుసంవత్సరముల కొకసారి యెన్నుకొనబడవలెను గనుక, యీమధ్యకాలములో యీయనమీద దోషారోపణచేసి కాంగ్రెసువారివలన విచారించబడుట యెన్నడోగాని తటస్థించదు. తన మంత్రుల సలహావలన ఒకపని చేసితినని తనజవాబుదారీని తొలగించుకొనలేడు. ఏలనన, వారిమాటవినవలసిన బాధ్యత తనకు లేశమాత్రములేదు తనకు వారు విధేయులుగా నుండవలెను. లేదా వారు తమ పదవులకు రాజీనామాలనిచ్చి తొలగిపోవలెను. ఈ మంత్రులు కాంగ్రెసులో మెంబర్లుగా నుండకూడదు గనుక, వీరు దానికి జవాబుచెప్పనవసరములేదు. కాంగ్రెసు సభవారు యీ మంత్రుల చర్యల విషయమై యెట్లు తీర్మానములు చేసికొన్నను, వీరు తమప్రెసిడెంటుగారికి యనుకూలురైన యడల, అట్టి తీర్మా

నములను పెడచెవిని బెట్టవచ్చును. ధనము నపేక్షించు యేపనియైనను వారు తలపెట్టి నపుడు, కాంగ్రెసుసభవారాపొమ్మనివ్వనియెడల, యీమంత్రు లూరుకొన వలసినదే కాని, వీరిని కాంగ్రెసుసభ వారెన్ని చీవాట్లు పెట్టినను వాటినన్నిటిని వీరు తిరస్కరించవచ్చును. ఒకానొకపుడు ప్రెసిడెంటుగారికిని బహుజనాభిప్రాయమును సూచించు కాంగ్రెసునకును పోరాటము సంభవించిన యెడల యేరాజకీయ వ్యవహారము సరిగా జరుగక గొప్ప యాటంకము కలుగవచ్చును. ప్రజాస్వాతంత్ర్యమునకై నిబంధనాపూర్వకమగు నిరోధములు (Constitutional checks) యేర్పాటు చేయబడినపుడు యిట్టిచిక్కు లప్పుడప్పుడు రాకమానవు. అట్టి సమయములయందే ప్రజలయొక్కయు వారి నాయకులయొక్కయు సామ్యత తెలివితేటలు ఓర్పు వివేకము ఉపాయము మొదలగు సద్గుణము బయలు పడును. ఇంగ్లాండులో మంత్రిసంఘము తమయందు పార్లమెంటు వారికిష్టము లేనియెడల ఒకపూటనైనను రాచకార్యములు వ్యవహరించలేరు. సంయుక్తరాష్ట్రములో ప్రెసిడెంటుగారును వీరిమంత్రులును కాంగ్రెసుసభవారితో జగడమాడుచు నాలుగు సంవత్సరముల వరకు రాజ్యము చేయుచుండవచ్చును.

CHAPTER VI.

ప్రజాప్రతినిధి సంఘము

శిష్టసభా ప్రతినిధులు రాష్ట్రముల కెట్లు ప్రతినిధులుగ నుందురో యీ సభాసభ్యులును జనులకందఱకు నట్లే ప్రతినిధులుగ నుందురు. ప్రతిరాష్ట్రములో నుండు జనసంఖ్యను బట్టి, ఆయారాష్ట్రముల వారు కొంతమంది నియామకమైన సభ్యుల నెన్నుకొనవచ్చునను నిబంధనము కలదు. ఆయారాష్ట్రములవారు తమప్రతినిధుల నెన్నుకొనుటకు వారివారి కుచితమైన జిల్లాల నేర్పరచుకొనెదరు. ఈ సంఘములో నిప్పుడు 356మంది సభ్యులకంటె నెక్కువమంది యుండగూడదు. ప్రతినిధుల కుండవలసిన యోగ్యతలు వారిరాష్ట్రపరిపాలకులకే వదలి వేయబడినవి. రెండుసంవత్సరముల కొకసారి క్రొత్తప్రతినిధు లెన్నుకొనబడుచుందురు. ఈయెన్నికలు బేసి సంవత్సరములలో గాక 1910, 1912, 1914 మొదలగు సరి సంవత్సరములలో జరుగవలయును. కాబట్టి ప్రతి రెండవసారి వచ్చుకాంగ్రెసు ప్రతినిధుల యెన్నికలు ప్రెసిడెంటుగారి యెన్నిక సమయములోనే జరుగుచుండును. సాధారణముగా ఎన్నికలైన ఒక సంవత్సరమునకు గాని యీప్రతినిధులు కూడుట తటస్థించదు. 1910 వ సంవత్సరము నవంబరుమాసములో ఎన్నుకొనబడిన ప్రతినిధులు

1911 వ సంవత్సరము డిసెంబరు మాసములోగాని కూడరు. ఒకప్పుడు ప్రెసిడెంటుగారు 1911 వ సంవత్సరము మార్చి చివర నుండి యీక్రొత్తసంఘమును కూడునట్లు చేయవచ్చును. అప్పటివఱకు ప్రాతసంఘ ముండక తప్పదు.

ఇంగ్లాండులోకంటె నిక్కడి యెన్నికలకు ఖర్చు తక్కువ పట్టును, అక్కడవలెనే యిక్కడకూడ ఎన్నికలలో లంచములిచ్చుట కలదు గాని కాంగ్రెసు ప్రతినిధులు యెన్నికలైన ఒక సంవత్సరమునకు గాని కలియకపోవుటవలన నీయెన్నికల న్యాయాన్యాయములను గుఱించి అంతగా తగవులు పెట్టుకొనరు. ఈ సంఘములో మెంబర్లు సాధారణముగా నలువది అరువది సంవత్సరముల మధ్యవయస్సు గలవారుగా నుందురు. లాయర్లసంఖ్య యెక్కువగా నుండును. కాని ప్రతిభావంతులైన లాయర్లుగాని రైల్వే ప్రొప్రయిటర్లుగాని దీనిలో నుండరు. గవర్నమెంటు ఉద్యోగీయులు సభ్యులుగా నుండగూడదు. ఈసంఘములో చాలమంది సభ్యులు సాధారణపువిద్య మాత్రమే నభ్యసించినవారుగానుందురు. ఆనరబిల్ అనుబిరుదు ప్రతిసభ్యునకు గలదు కాని ప్రతిరాష్ట్రపు శిష్టసభాసభ్యుడును, ప్రతిన్యాయాధిపతియు, ప్రతియున్నతోద్యోగీయుడును, నీబిరుదు గలిగి యుండుటచే దీనియం దంతగా గౌరవములేదు.

ఈసంఘమునకు శిష్టసభవారి కార్యనిర్వహణ వ్యాపారమందు గాని, ఉద్యోగీయుల నేర్పాటు చేయుటలోగాని, విదేశీయులతో సంధులనుచేయుటలోగాని యేవిధమైన యధికారములేదు. కాని రివిన్యూ బిల్లులను ముందుగాతీసికొనివచ్చుటకును గొప్ప ఉద్యోగీయులమీాద దోషారోపణచేయుటకును ఎన్నికలలో సగముకంటె నెక్కువగ వోట్లులేక ప్రెసిడెంటుగా రెన్నుకొనబడలేనపుడు తానే వారిని ఎన్నుకొనుటకును, నీసంఘమునకు నధికారము కలదు. ఎన్నిబిల్లులు విచారణలో నున్నప్పటికి నీసంఘము కూడినది మొదలు రెండు సంవత్సరములకు మార్చి నాల్గవ తారీఖుతో నవన్నియు పడిపోవలసినదె.

ఇంగ్లాండులో నుండు ప్రజాపతినిధి సంఘములో వలెనే కాంగ్రెసుసభకూడ తనకొక యధ్యక్షుని నేర్పరచుకొనును. ఈయనను 'స్పీకర్' అనిపిలుతురు. కాని యింగ్లాండులో నీయుద్యోగి యొక పార్టీవారిచేతనే యేర్పరచబడినప్పటికి నీయన నిష్పక్షపాత బుద్ధిగలిగి యేపార్టీవారితోను చేరక నిబంధనల ప్రకారము సభ్యుల నందఱును క్రమక్రమముగ నడుచునట్లుచేయుచు తాను మాత్రము యేవిషయములోనైనను నేవిధమైన జోక్యమును కలుగ జేసికొనడు. అమెరికాలో నీయన ఒకపార్టీవారివలన నేర్పరుపబడుటయేగాక కాంగ్రెసులో చర్చింపబడు ప్రతిబిల్లు విషయమై వేఱువేఱు కమిటీల నేర్పరుచుటయు, తనపార్టీలోనున్న ప్రముఖుల నాకమిటీలలో నెక్కువగ జేర్చుటయు, నీయన సదాచేయుచుండును. తానాసంఘములో నుపన్యాసములేవియు నియ్యకపోయినను రహస్యముగ దనవారికి

సలహానిచ్చుచుండును. ప్రతికమిటీకిని చైరుమానును తానేర్పరుచు చుండును. ఈవిధముగ తనస్నేహితులను తన్ననుసరించువారిని గౌరవస్థానములకు రప్పించగలడు. తనకిష్టము లేనియెడల నే సభ్యుని ప్రాబల్యమైనను అథోగతి పాలు చేయగలడు. ఈయన మొదట తనపార్టీవారివలన నెన్నుకొనబడునపుడే తనవారిలో కొందఱుప్రముఖులకు వాగ్దానములు చేసియుండునుగాన వారియభిప్రాయముల ననుసరించియే పోవుచుండును. ఈయనయధికారము పయికంతగా కనుపడక పోయినను కొద్దికాలమే నిలచియున్నను ప్రెసిడెంటుగారి యధికారముతో సమానమనియే చెప్పవచ్చును. ఇంగ్లాండు మొదలగు నైరోపాఖండప్రదేశములలో ప్రధానమంత్రి తననూతనామాత్య సంఘము నేర్పరుచుకొనుటకై యెంత కష్టపడునో యీయనకూడ కాంగ్రెసు కమిటీల సభ్యులను చైరుమానులను ఏర్పరుచుటలో నంతకష్టపడుచుండును. ఈయన నెలకు రెండువేల రూపాయల జీతముకలిగి హైకోర్టుజడ్జీలతోను సంయుక్తరాష్ట్రపు వైసుప్రెసిడెంటుగారితోను సమానపదవి యందుండును.

రెండుసంవత్సరముల కొకసారి జరుగు ప్రతియెన్నికలోను ఈకాంగ్రెసు సభ్యులలో సగముకంటె నెక్కువమంది తమస్థానములను సాధారణముగా పోగొట్టుకొనుచుందురు. ఈసంఘములో ఇంగ్లాండులో వలెనే పార్టీలున్నవిగాని వీనికి పెద్దలు లేరు గవర్నమెంటు పక్షమువారనియు వీరిప్రతికక్షులనియు పార్టీలీ కాంగ్రెసు సభలోలేవు. ప్రెసిడెంటుగారుగాని ఆయన

మంత్రులుగాని మఱియేయితర గవర్నమెంటు ఉద్యోగస్థులుగాని యీసభలో నుండనేకూడదు. ఈసంఘములో చాలమంది సభ్యులు ప్రెసిడెంటుగారికిని ఆయనమంత్రివర్గమునకును వ్యతిరేకులమని భావించుకొనుట అక్కడిజనులకు ఆశ్చర్యజనకముగా నెంతమాత్రము ఉండదు; ఏలయన శాసన నిర్మాణాధికారము కార్యనిర్వాహణాధికారము విడివిడిగా నుండవలెననియే వారి యుద్దేశము.

ఈసభలో సాధారణముగా రిపబ్లికనులనియు డెమొక్రాటులనియు రెండుపార్టీలు మాత్రమేయుండును ఈసంఘము కార్యనిర్వాహకశాఖ నేర్పరచదు. దానిని తీసివేయదు. దానిమీద నేయధికారమును చెలాయించలేదు. కార్యనిర్వాహక సంఘమువారికి గావలసిన సొమ్ముకంటె నొకప్పుడు తక్కువగను నొకప్పు డెక్కువగను నిచ్చుచుండును. ఇచ్చినతరువాత నాసంఘమెట్లు ఖర్చుచేయునో తాను తెలిసికొనదు తన సంఘములోవారి కెవరికిని రాజకార్య నిర్వహణమును గుఱించి జవాబుదారీ యెంతమాత్రము లేదు. ఈసంఘములోని సభ్యులు విద్యాధికులై సామాన్య జనులకు మార్గదర్శకులుగా నుండుటకు బదులు జనబాహుళ్యముయొక్క అభిప్రాయముల ననుసరించియే పోవుచుందురు మూడువందల యేబదిమంది తమకొక యధిపతిలేకుండ నిష్టమువచ్చినట్లుకూడి చట్టములను గుఱించి చర్చించుచున్నయెడల నీసంఘమొక పెద్దయల్లరిమూకగ నుండకపోవునాయని కొందఱు సందేహించవచ్చును. కాని ప్రతిముఖ్యవిషయమును నొక

కమిటీవారికి వదలివేయుటచేత నావిషయ మీసంఘములోనికి
చిట్టచివర చర్చనిమిత్తము వచ్చినపుడు ఆకమిటీచైరుమానుగారే
యీసంఘమున కంతయు పెద్దగాపనిచేయుచు దీనిని నడుపుచుం
డును. తక్కిన వీరిపార్టీవారు వీరివలన సంగతులను గ్రహించి
వీరి సలహాప్రకారము నడచుకొనుచుందురు.

కాంగ్రేసుకమిటీలు.

జనులకు నిజమైన స్వతంత్రముగల దేశములయందు, శాస
ననిర్మాణ కార్యనిర్వాహక విషయములలో పెద్దపెద్ద సభలచేత;
రాచకార్యములను శీఘ్రముగను సులభముగను చేయించుట
మిగుల కష్టతరముగనుండును. ఈకష్టములను దొలగించు నుపా
యముల రెంటిని పాశ్చాత్యులు కనిపెట్టిరి. (1) ఈసభలలో
రెండుకక్షులుగా సభ్యులేర్పడి ఆకక్షులకు గొందఱు ప్రముఖుల
నేర్పరుచుకొని, వారి యాజమాన్యముక్రింద నడచుట. ఈయా
చార మింగ్లాండు పార్లమెంటులో సుమారు రెండువందల సంవ
త్సరములనుండి వచ్చుచున్నది. (2) పెద్దసభలను చిన్నచిన్న స
భలుగా విడదీసి, అప్పటప్పటికి జర్చించవలసిన విషయములను
వీనికి విభాగించి వీనితీర్పులే ఆఖరుతీర్పులుగా చేయుట, లేక
యీతీర్పులు పెద్దసభయొక్క యంగీకారమునకు బంపుట. ఈ
యాచారము కొంతవఱకు నింగ్లాండు దేశములోకూడ నున్న
ది. సంయుక్తరాష్ట్రములలో దీనినే యవలంబించుచున్నారు.
శిష్టసభలోను కాంగ్రెసు సభలోను రెండుసంవత్సరములకొకసారి

యిట్టి చిన్నచిన్న కమిటీ లనేక మేర్పడుచుండును. అనగా ఎన్ని
కలు, కోశీవ్యాపారము, నాణెములు, న్యాయసభలలోను శాసన
ములలోను మార్పులు, రైల్వేలు, కాలువలు, పరదేశీయులతో
వ్యవహారములు, నావికాబలము, సేన, వ్యవసాయము, పోస్టు
ఆఫీసులు, పోస్టురోడ్లు, చేతిపనులు, గనులు, విద్య, కూలివాం
డ్రు, పెన్షనులు, మొదలగు విషయములను విచారించుటకేకాక,
వేఱువేఱు బిల్లులకుగూడ, వేఱువేఱు కమిటీ లేర్పఱచబడు
చుండును.

ఈకమిటీలమెంబర్లు తమ కవసరము గలిగినపుడు ఆయా
సంగతులతో విశేషానుభవముగలవారికి సమ్మనులు జేసి సాక్ష్య
మును పుచ్చుకొందురు. ఈమీటింగుల చర్యలు సాధారణముగా
బహిరంగము చేయగూడదు. ప్రిటిడిపార్లమెంటులో నాదాయ
వ్యయమునుగుఱించి మంత్రులు మొదలగు గొప్పయుద్యోగస్థు
లీకమీటీలవద్ద సాక్ష్యమియ్యవలసి యుండును. అట్టియుద్యోగ
స్థులు తాము జరిగించుపనులకు తమ ప్రెసిడెంటుగారికి మాత్రమే
యుత్తరవాదులైయున్నను వీరిని మిక్కిలి లోతైన పరీక్షకు లో
బఱుచుటవలన తమ విధ్యుక్తకార్యములందు మిగుల జాగరూ
కతతో ప్రవర్తించెదరు. ఈవిధముగ నీదేశములో కార్యనిర్వహ
ణాధికారమును శాసననిర్మాణాధికారమును కమిటీలగుండ కలి
యుచుండును.

ఈకమిటీలలో సిద్ధమగు బిల్లులు కాంగ్రెసుసభలో విస్తార
ము చర్చలేకుండగనే చట్టములుగ నేర్పడుచుండును. ఈపద్ధతివ

లన కొన్ని నష్టములు గలవు. ప్రతినిధులందఱుకలసి యొకబిల్లును, ఆలోచనలోనికి దీసికొనివచ్చుట సంభవించదు. కమిటీల మీటింగులలోనే చర్చయంతయు జరుగును. కాంగ్రెసులో మేధావంతులు ఒకటిరెండు ముఖ్యమైన కమిటీలలో చేరగలరుగాని ఒక్కసారియే కూడుచున్న సుమారేబది కమిటీలలో వారుచేరుటకువీలులేదు. తక్కిన కమిటీలలో సాధారణప్రజ్ఞగలవారును క్రొత్తమెంబర్లును కలసి పనిచేయుచుందురు. కాంగ్రెసుసభలో నందఱు చేరి యేబిల్లువిషయమైనను, వాదానువాదము చేయుటకు తగినసావకాశములేదు. వేఱువేఱు కమిటీలలో వేఱు విషయములను గుఱించి వేఱువేఱుబిల్లులు తయారగుచుండుటచేత కాంగ్రెసుయొక్క శాసననిర్మాణ విషయమున నొకరీతిగా నుండు పద్ధతి కనుపించదు. ప్రతికమిటీవారును తమ కొప్పగించినవిషయములో తమకుదోచిన రీతిని బిల్లుతయారుచేసి కాంగ్రెసులో ప్యాసుచేయించుకొనుటకు యత్నించెదరేకాని యితరకమిటీలవారుచేరి తయారుచేయుబిల్లులు తమబిల్లుల నెంతవఱకు బాధించునో ఆలోచించరు. ప్రశ్నలను విధించుకమిటీయొకటి. వ్యయముచేయు కమిటీ మఱియొకటి. బిల్లులను గుఱించి జరుగవలసిన చర్యయంతయు కమిటీలలోనే జరుగును. కనుక ధనవంతులును ప్రముఖులును నైనవారు కమిటీల సభ్యుల నెల్లపుడు దర్శించుచు వారిలో గొందఱకు లంచములిచ్చుచు నయమునగాని భయమునగాని వారిచేత దమ కనుకూలమైన బిల్లులను ప్యాసుచేయించుకొనెదరు. ఈ కమిటీపద్ధతివలన కాంగ్రెసులోనుండు సభ్యునియొక్క జవాబు

దారీ తగ్గిపోవుచుండును. ఇంగ్లాండులో నొకమంచిచట్టము రద్దయినపుడుగాని ఒకచెడుచట్టము ఆమోదింపబడినగాని మంత్రుల సంఘమును వారిపార్టీ వారందఱును జవాబుదారీ వహించి తీరవలయును. సంయుక్త రాష్ట్రములో మంత్రులసంఘమువారు కాంగ్రెసులో సభ్యులుగ నుండగూడదు గనుక వారెంతమాత్రము నీచట్టములకు జవాబుదారీని వహించరు. కమిటీవారి రిపోర్టుప్రకారము జరిగించితిమని కాంగ్రెసుమెంబర్లు తప్పించుకొనెదరు. కమిటీమెంబర్లలో చాలమంది కేవలము అనామకులుగా నుందురు గనుక వారినేమనినను లాభములేదు. ఆకమిటీచైరుమానుగారు ప్రముఖుడుగా నుండుట తటస్థించును. కాని ఆయనవంటి సుమారేబది చైరుమానులయొక్క నడతలను కనిపెట్టుటకు ప్రజలకుగాని వార్తాపత్రికాధిపతులకుగాని సావకాశములేదు. కాబట్టి కాంగ్రెసులో జరుగు చర్యలనుగుఱించి ప్రజలంతగా నక్కఱ కలుగజేసికొనరు. కమిటీల చైరుమానులకే సర్వాధికారముండుటచేత వారు ముఖ్యముగా ద్రవ్య సంబంధమైన వ్యవహారములలో నెక్కువ జోక్యము కలుగజేసికొనెదరు. వీ రేయుద్యోగినైనను తీసివేయజాలకపోయినను వానిని గజగజవణకించి వానిడిపార్టుమెంటుకార్యనిర్వాహకమును గుఱించి బిల్లులను తయారుచేయించి ప్యాసుచేయించగలరు. కాని తరువాత నవి శిష్టసభలో రద్దుచేయబడవచ్చును ఈసభవారుకూడ వానిని ప్యాసుచేసినను ప్రెసిడెంటుగారు నిషేధించవచ్చును. ఉభయసభలలో రెండువంతుల మంది యంగీకరించిన యెడల ప్రెసిడెంటుగా

రిష్టపడకపోయినను ఆబిల్లులు చట్టములుగామారును. అప్పుడు వానినందఱు నంగీకరించవలసినదే.

ఒకటి అనాలోచనవలనను తొందరగను నేకార్యమునైన జేసినయెడల దానిని రెండవది దిద్దుటకు సావకాశము కలిగియుండుటకై యీరెండు సభల నేర్పాటుచేసినవారిముఖ్యోద్దేశ్యము. ఇదిగాక, చిన్నరాష్ట్రములు, పెద్దరాష్ట్రములు, అను వివక్షతలేకుండ, వీనికన్నిటికి సమానసంఖ్యగల ప్రతినిధులను జేర్చి వీనికి సమాన స్వాతంత్ర్యమును గలుగజేయుటకు శిష్టసభ యేర్పడినది. ఆయారాష్ట్రములలో నుండు జనసంఖ్యను బట్టి యేర్పడు ప్రతినిధులతో కాంగ్రెసుసభ యేర్పడినది. ఇంగ్లాండులో ప్రభుసంఘమనియు, ప్రజాప్రతినిధిసంఘమనియు రెండుసభలున్నవి. సంయుక్తరాష్ట్రములో శిష్టసభ, కాంగ్రెసు సభలు రెండును ప్రజాప్రతినిధులనే కలిగియున్నవి.

ఇంగ్లాండులోవలెనే, యీదేశములోకూడ నీరెండుసభలకు భేదాభిప్రాయములు కలుగవచ్చును. వీనివైరమువలన బిల్లులు ప్యాసుకాకపోవచ్చును. కార్యనిర్వహణము ప్రెసిడెంటు యందుండుటచేత, దానికి ఆటంకములు సాధారణముగా కలుగవు. ఇదిగాక యీరెండుసభల మెంబర్లను ప్రజలచేతనే యెన్నుకొనబడినవారగుటచేత, వీరంతగా పట్టుదలతో పోరాడరు. ఇంగ్లాండు, ప్రాన్సు, ఇటలీదేశములలో కార్యనిర్వాహకశాఖ ప్రజాప్రతినిధిసంఘము వారిచే నియమింపబడును గనుక, అక్కడి రెండుసభలకు అన్యోన్యవైషమ్యము సంభవించిన రాచకార్యములు

నడపు మంత్రులుకూడ వానిలోజేరిన వారగుటచే అక్కడిజగడము మిక్కిలి తీవ్రముగ నుండును. సంయుక్తరాష్ట్రములో తప్ప మఱియే స్వతంత్రరాజ్యములోను ఈరెండుసభలును సమానబలముగలవిగా నుండుట తటస్థపడలేదు. ఇట్లున్నను రాజ్యపరిపాలన సరిగా జరుగుటకు నీరెండుసభల మెంబర్లు ప్రజలచేతనే యెన్నుకొనబడుట, రెండుసభలతో నేసంబంధములేక కార్యనిర్వాహకశాఖ విడిగా నుండుట, ముఖ్యకారణములు. ఈరెండుసభలకు తగవులు తటస్థించినపుడు, శిష్టసభలో నుండు ముగ్గురును కాంగ్రెసులో నుండు ముగ్గురును కలసి యీసభలకు గలభేదాభిప్రాయములను చర్చించుకొని యేదియో ఒకవిధముగ రాజీపడుదురు.

కాంగ్రెసుకును ప్రెసిడెంటుకునుగల సంబంధము.

శిష్టసభయు ప్రజాప్రతినిధిసంఘమును కలిపి కాంగ్రెసు అని సాధారణముగా వాడుచుందురు. ఈరెంటికి సమానాధికారములు కలిగి కార్యనిర్వాహక శాఖకు సమానసంబంధమే కలిగియుండునుగాన, నిచ్చట వ్రాయునది యీరెండు సభలకు వర్తించును. సంయుక్తరాష్ట్రకీయోద్యోగియు నీసభలలో మెంబర్లుగా నుండ గూడదని నిబంధన యున్నను, వీరు వానిలో మాటలాడకూడదను నిషేధములేదు. కాని యట్లు జరుగుట మిక్కిలి యరుదు. వీరు కాంగ్రెసు కమిటీల యెదుట సాక్షులుగా వచ్చెదరు. వీరిపక్షమున వాదించు మెంబర్లుకూడ నీసభలలో నుండరు. ప్రె

సిడెంటు, కొందఱు కాంగ్రెసు ప్రముఖులతో రహస్యాలోచనలు చేయుచు తన కుచితమని తోచిన బిల్లులను కాంగ్రెసులో చర్యనిమిత్తము ప్రవేశపెట్టించ వచ్చును. ఈప్రముఖుల స్నేహితులకు గొప్పయుద్యోగముల నిచ్చెదమని యాసకలిగింతురు. ఈవిధముగ తప్పతనప్రతిపక్షుల వాదములను బహిరంగముగ నిట్టి సభలలో ఖండించగల ఆంగ్లేయ మంత్రివర్గమువలె, నీదేశపు ప్రెసిడెంటునకు గాని యీయన మంత్రులకుగాని అవకాశము లేదు. కాబట్టి యీసంయుక్తరాష్ట్రములో శాసననిర్మాణశాఖకు దారిచూపించి నడిపించు నధికారము కార్యనిర్వాహకశాఖ కెంత మాత్రములేదు.

కార్యనిర్వాహక శాఖవారు అనగా ప్రెసిడెంటును ఈయన మంత్రులను చేయవలసిన కార్యములును గుఱించియు నదివఱకు చేసినకార్యములను గుఱించియు, కాంగ్రెసువారు తీర్మానములను చేయుచుందురు. ప్రెసిడెంటుగా రట్టి తీర్మానములను పెడచెవిని బెట్టవచ్చును. అంతమాత్రముచేత నాయనకు స్థానభ్రష్టత కలుగదు. ఆయనకు తోచినప్రకారము చేయగల సమర్థుడు ఆయనమంత్రులు, ఆయనచేతనే నియమింపబడు వారుగాన, వారివిషయమై కాంగ్రెసువారేమి తీర్మానములుచేసినను వారికి లక్ష్యములేదు. కమిటీలలో వీరు సాక్ష్యమిచ్చునపుడు సరియైన జవాబులీయక తప్పించుకొన వచ్చును. కొందఱు తెలివిగల మంత్రులు, తమనేర్పువలన కమిటీవారిని సరియైనదారి తప్పించి తప్పత్రోవలను బెట్టించగలుగుదురు. ఒకప్పుడు ప్రెసి

డెంటుగారి కార్యనిర్వహణమునకై కావలసిన బిల్లులను వ్రాసు చేయక కాంగ్రెసుసభవారు తమయభీష్టములకు ఆయనను లోబఱచు కొనుటకు ప్రయత్నము చేయుచుందురు. ప్రెసిడెంటు పిరికివాడైన యెడల, నేదియో యొకవిధముగ వారితో సమాధానమునకు వచ్చుచుండును. ప్రెసిడెంటు యథేచ్ఛగా జరిగించు విషయములలో స్వల్పాంశములను గుఱించికూడ కాంగ్రెసు చట్టముల నిర్మాణము చేయవచ్చును. ఆయన వానిని క్రమమైన రాజ్యవ్యవహారతంత్రమునకు వ్యతిరేకముగ నున్నవని త్రోసివేయవచ్చును. ఒకవేళ వానిని తానొప్పుకొని దస్కతు పెట్టినను, లేక రెండుసభలలోను రెండువంతుల మెంబర్లు వానినంగీకరించినను, అసలు నిబంధన ప్రకారము యిట్టిచట్టముల నేర్పాటు చేయుటకు కాంగ్రెసువారి కధికారము కలదాయను విషయము నాలోచించవలసి యుండును. ఆచట్టములను కార్యనిర్వాహక శాఖవా రతిక్రమించినయెడల హైకోర్టువా రీవిషయముల నాలోచించి తీర్పుచెప్పవలెను. అట్టితీర్పుకు అందరు బద్ధులుకావలసినదే. అప్పుడుకూడ ప్రెసిడెంటు వానిని లక్ష్యపెట్టనియెడల, ఆయనమీద దోషారోపణచేసి కాంగ్రెసువారాయనను తొలగించుటతప్ప వేఱుమార్గ మేమియులేదు. ఈయౌషధము సింహప్రతిపాలనము వంటిది. దీని నవసానకాలమందు వాడుట తటస్థించును. చిన్నచిన్న విషయములలో దీనినుపయోగించుట హాస్యాస్పదముగా నుండును. మీఁదు మిక్కిలి దేశమునకు అరిష్టము కూడ కలిగించును. తిన్నగనడుచుకొనని మంత్రుల నడతను

గుఱించి గర్హించుచు కాంగ్రెసు వారు తీర్మానములనుచేసి వారి పదవులకు రాజీనామా లిచ్చునటుల చేయవచ్చును. అట్లు వారు జరిగించనియెడల సాధారణముగ నీసభవారు చేయునదేమియులేదు. అసమర్థత మొదలగు విషయములను గుఱించి దోషారోపణముచేసి వారిని తొలగించుట యెన్నడు తటస్థించదు. ఒక కంపెనీలో భాగస్వాములచేత నియమింపబడి తమకు నమ్మకము లేని మేనేజరువలన, డైరెక్టర్లు తమకిష్టమున్నను లేకపోయినను, నేదియో ఒకవిధముగ పనుల నెట్లు జరిగించుకొనవలసివచ్చునో, ఆవిధముగనే ప్రెసిడెంటు యేర్పఱచిన మంత్రివర్గముచేత రాచకార్యములు నిర్వహించుకొన వలసియుండును.

జనులకు నిజమైన స్వాతంత్ర్యముగల రాజ్యములలో కోశాధికారమనే యాయువుపట్టు వారి చేతులలోనే యుండకతప్పదు. సొమ్ము వసూలుచేసి ఖర్చుచేయు నధికారము ప్రజాప్రతినిధులయందున్న యెడల, కార్యనిర్వాహకశాఖవారి నిరంకుశాధికారమున కవకాశముండదు. ఈవిషయములో సంయుక్తరాష్ట్ర నిబంధన ప్రెసిడెంటు నెంతమాత్రము జోక్యము కలగచేయనియ్యదు. ఆయనతోగాని ఆయనమంత్రులతోగాని కాంగ్రెసు వారు సంప్రదింపరు. ఇంగ్లాండులో బడ్జెటువిషయమై కార్యనిర్వాహకశాఖయు శాసననిర్మాణశాఖయు ముఖాముఖిని అనేకదినములు చర్చించి సాధక బాధకముల నాలోచించి బిల్లులనుప్యాసు చేయుదురు. సంయుక్తరాష్ట్రములో రాజ్యపరిపాలనకు గావలసిన సొమ్మును గుఱించి తీర్మానముల నుపపాదించుట వానిప్యాసు

చేయుటకు ప్రయత్నించుట ప్రతిడిపార్టుమెంటుకు కావలసిన సొమ్ము రాబట్టుట, అక్కఱలేని చోట సొమ్ము పోకుండజేయుట, జనులకు కష్టము కనుపడనిమార్గముల నాలోచించి రివిన్యూవృద్ధిచేయుట, సంవత్సరమునకు కావలసినమట్టుకే సొమ్ము నాయత్తపఱుచుకొనుట, సాధ్యమైనంతవఱకు ప్రతిసంవత్సరము నిలుకడగ కావలసిన ఖర్చు మొత్తము స్థిరపఱచుట—యీ మొదలగు విషయములనుగుఱించి కార్యనిర్వాహక శాఖవారితో కాంగ్రెసువారు సంప్రదించుటలేదు. ఆకారణమునుబట్టియే వారికి జవాబుదారియులేదు. ఇవియన్నియు కాంగ్రెసుకమిటీలలో చర్చింపబడి యేర్పాటులు చేయబడుచుండును. వివిధవిషయములకు వివిధములగు కమిటీలు యేర్పాటగుచుండుటవలన నొకదానితో నొకటి సంబంధములేక, వీనికిష్టమువచ్చినటులు పనిజరగిపోవుచుండును.

కాంగ్రెసుసభ వారి యీకోశాధికారము ప్రెసిడెంటు నెంతవఱకు లోబఱచుకొన గలుగును? ఐరోపాఖండములోకంటె చాల తక్కువగ నుండునని చెప్పవలయును. ప్రెసిడెంటు యేవిషయమైనను బాగుగ నాలోచించి, దాని ననుష్ఠానములో పెట్టవలెనన్న, ఆయనకు తగినద్రవ్యసహాయము కాంగ్రెసువారు చేయకపోవచ్చును. యుద్ధ సమయములందు తగినద్రవ్యము నీయక ఆయన నశక్తుని చేయవచ్చును. సంయుక్తరాష్ట్ర నిబంధనకు లోబడు కాంగ్రెసువారు శిఫారసుచేసిన మార్గముల నవలంబించక ప్రెసిడెంటు వానిని విరుద్ధముగానే జరిగించుచున్న యెడల

కాంగ్రెసువారేమియు చేయజాలరు. రాజ్యవ్యవహారములకు కావలసిన సొమ్మునుకూడ కాంగ్రెసువారియ్యని యెడల, ప్రెసిడెంటుకుకంటె దేశమునకును తమకును ఎక్కువహాని సంభవించునుగాన అట్టిపని యెన్నటికిని జరుగనేరదు. ఆయనకు జీతమియ్యకూడదని వీరు తీర్పుచేయుటకు వలనుపడదు ఆయన జీతము సంయుక్తరాష్ట్ర నిబంధనవలన నేర్పడి యున్నది. ఆయన మీాద దోషారోపణచేసి, నిందితుడని తీర్మానించి, యేయుద్యోగియు నాయన యాజ్ఞకు బద్ధుడుకాకుండ చేసిననేగాని, ఆయన తొలగిపోవుట తటస్థించదు. ప్రెసిడెంటును తమతీర్పులకు లోబడునటుల చేయవలె నన్న వానిని ద్రవ్యమునిచ్చు బిల్లులలో చేర్చి ఆయన యంగీకారమునకు పంపెదరు. ఆబిల్లులలో నేవిధమైన సవరణలు చేయకూడదు. ఆయన వానిని సంపూర్ణముగ నంగీకరింపవలెను లేదా సంపూర్ణముగ త్రోసివేయవలెను. ఇటీవల నీపద్ధతి నమలులో పెట్టు నాచారము లేదు.

శాసన నిర్మాణ కార్య నిర్వాహక శాఖల సంబంధము.

ప్రజల యభిప్రాయమే చెల్లుబడి యగుచుండు దేశములలో శాసననిర్మాణసంఘము, వారిప్రతి నిధులనే కలిగియుండుటచేత, వారు దానిని కొంతకట్టుబాటులో పెట్టినగాని అధికారమును తగ్గించుటకు ప్రయత్నము చేయుచుండుట ప్రతిశాసననిర్మాణశాఖయొక్కయు స్వభావమై యున్నది. దీని నియమితకాలానంతరము వచ్చు క్రొత్తశాసన నిర్మాణశాఖకూడ వెనుకటిదానియేర్పాటులను సాధారణముగ రద్దుచేయదు. కాబట్టి

క్రమక్రమముగ కార్యనిర్వాహకశాఖ నీరసమై తుదకంతరించిపోవచ్చును; లేదా శాసననిర్మాణశాఖలో కలసిపోవచ్చును. అనగా కార్యనిర్వాహకసంఘమువారు శాసననిర్మాణ సంఘము క్రింద తాబేదారులుగ మాత్రమే పనిచేయుట తటస్థపడును. ఇట్లు జరుగకుండ కొన్ని దేశములలో తగునుపాయములు కనిపెట్టబడినవి. ఇంగ్లాండు దేశములో శాసననిర్మాణశాఖ వారిచ్చుతీర్మానములమీాద, కార్యనిర్వాహక శాఖవారు ప్రజలకు డైరెక్టుగా అప్పీలు చేసికొనుటకు చట్టముల వలననే అధికార మేర్పడియున్నది. ప్రష్యా దేశములో ప్రజలకు రాజభక్తి మిక్కుటముగ నుండుటచేత నక్కడి కార్యనిర్వాహక శాఖవారు, శాసననిర్మాణశాఖ వారితీర్పుల నప్పుడప్పుడు లక్ష్యపెట్టకుండుట తటస్థపడుచుండును.

సంయుక్తరాష్ట్రములో నీవిషయమై యెట్టి కట్టుబాటుల నేర్పఱచిరో విచారింతము. నిబంధనాస్థాపకులు కార్యనిర్వాహక సంఘమున కెక్కువ బలము నిచ్చుటకు భయపడి తమప్రతినిధి సంఘమగు కాంగ్రెసు అనే శాసన నిర్మాణశాఖకు, ఆఖరున నిష్కర్షాభిప్రాయమిచ్చు నధికారమును గలుగఁజేసిరి. ప్రెసిడెంటుగారిని ఆయన మంత్రులను శాసననిర్మాణశాఖకు వేరుగనుంచి ఆయనకు కొన్ని స్వతంత్రాధికారములను కల్పించుటవలన కార్యనిర్వాహకశాఖకు కొంతబలమును కలుగఁజేసితిమని నిబంధ నాస్థాపకులు తలచిరి. కాని అందువలన కార్యని

ర్వాహకశాఖను కొంతవఱకు బలహీనముగ కూడ జేసిరి. క్రొత్త చట్టములను ముందుగా శాసననిర్మాణశాఖ యంగీకారమునకై ప్రవేశపెట్టుటకు ఇంగ్లాండుమంత్రులవలె ప్రెసిడెంటుగారి కధికారములేదు. ఇంగ్లాండు రాజునకువలె శాసన నిర్మాణశాఖను ఛిద్రముచేసి జనుల కప్పీలుచేసికొనుటకు ప్రెసిడెంటుగారి కధికారములేదు. ఈయనను కదల మెదలకుండ వివిధశాసనములచేత శాసననిర్మాణశాఖ కట్టివేయవచ్చును. నాల్గుసంవత్సరముల వఱకు తాను ఉద్యోగమునుండి తొలగింపబడలేకపోయినను శాసననిర్మాణ శాఖవారిమీద నేయధికారమును చెలాయించలేకపోగా తాను జనులకు అప్పీలు చేసుకొనుటకు కూడ ప్రెసిడెంటునకు సదుపాయము లేర్పడియుండలేదు.

ప్రెసిడెంటునకు శాసననిర్మాణములో నభిప్రాయమిచ్చు నధికారము లేనప్పటికి చట్టములను ప్యాసుకాకుండ నిషేధించు నధికారము కొంతవఱకు గలదు. తనలో రెండువంతులు మెంబర్లు నేకాభిప్రాయముగ నుండనియెడల శాసననిర్మాణశాఖ ప్రెసిడెంటుగారికంటె బలహీనముగనుండును. శాసననిర్మాణశాఖలో సమానాధికారముగల రెండు సభలుండుటవలన నిది మఱి కొంత బలహీనమై ఈ రెండుసభలలోను రెండువంతుల మెంబర్లు యేవిషయములోనైనను నేకాభిప్రాయము గలవారుగ నుండుట దుస్తరము. అట్లెప్పుడైనను తటస్థించినయెడల ప్రెసిడెంటును, ఆయనమంత్రులును కేవలము దుర్బలులగుదురు. అపుడు

కార్యనిర్వాహకశాఖను శాసననిర్మాణశాఖ మ్రింగవేసినదని యెంచవలయును.

పరదేశప్రభువులతో మంత్రాలోచన శాసనములచేత జరుగుపని కాదు. ఈవ్యవహారము కార్యనిర్వాహక శాఖకైనను లేక శాసననిర్మాణశాఖలో నొక చిన్న కమిటీకైనను వదలవలయును. ఇంగ్లాండులో రాచకార్యము మంత్రులకు వదలివేయబడి వారు ప్రజలకు ఉత్తరవాదులుగ చేయబడిరి. సంయుక్తరాష్ట్రములో విదేశీయులతో మంత్రాలోచన ప్రెసిడెంటుగారికే వదలివేయుచు యుద్ధమును చాటించు నధికారము శాసననిర్మాణశాఖలో రెండవ సభయైన ప్రజాప్రతినిధిసంఘమునకును సంధిచేయు నధికారము మొదటిదైన శిష్టసభకును నిబంధనాస్థాపకు లేర్పరచిరి. ఈయధికారమిట్లు విభాగించుటవలన గలుగు ననర్థకములు గడచిన నూఱుసంవత్సరములనుండి సంయుక్తరాష్ట్రమునకు పరదేశీయులతో యుద్ధమేమియు ప్రసంగనందున కనుపించలేదు.

CHAPTER VII.

న్యాయస్థానములు.

ప్రతిచిన్న రాష్ట్రములో దానిచట్టముల నమలులో పెట్టుటకు కోర్టులేర్పడి యున్నవిగాని, యీచిన్న రాష్ట్రములలో దమలో తమకును, ఒకరాష్ట్ర పౌరునకును; మఱియొక రాష్ట్రమునకుగాని, మఱియొకరాష్ట్ర పౌరునకుగాని; ఒకరాష్ట్రపౌరునకు సంభవించినప్పుడును, సంయుక్తరాష్ట్రమునకు సంబంధించిన వాణిజ్య, నావికావిషయములు విదేశీయులతో జరిగిన సంధుల ననుసరించి యేర్పడిన విషయములు యిట్టి సందర్భములలో తగవులు కలిగినపుడును, పక్షపాతము లేకుండ న్యాయముగ తీర్పుచేయుటకు సంయుక్తరాష్ట్రన్యాయస్థానములు వేఱుగ నేర్పఱచబడినవి. ఇదిగాక, సంయుక్తరాష్ట్రనిబంధనలు (Articles of constitution) వ్రాతమూలముగ నుండుటచేత దానికి వాక్యార్థము చేయుటకును, కాంగ్రెసు సభవారు ప్యాసుచేయు చట్టములు ఆనిబంధనవలన వీరికియ్యబడిన యధికారము ననుసరించి యున్నవా లేవాయని విచారించుటకును, నీసంయుక్తరాష్ట్ర న్యాయస్థానములుకూడ, ఆనిబంధనలవలనే యేర్పడియున్నవి. తక్కిన విషయములలో నొకరాష్ట్రములో నున్నపౌరులకు గలుగు వివాదములు ఆరాష్ట్రపు కోర్టులే తీర్చవలసియున్నది.

ఈసంయుక్తరాష్ట్ర న్యాయస్థానములను మూడుతరగతులుగ విభాగింపవచ్చును.

(1)సుప్రీమ్‌కోర్టు(2)సర్క్యూటుకోర్టులు (3)డిస్ట్రిక్టుకోర్టులు. సుప్రీముకోర్టు మనయింగ్లాండులో నుండు ప్రివికౌన్సిలువంటిది. దీనితీర్పుమీద నప్పీలులేదు. సంయుక్తరాష్ట్రనిబంధనలో, సుప్రీంకోర్టున కింతమంది జడ్జీలుండవలయునని చెప్పియుండలేదు. ప్రస్తుతము యెనమండ్రుగురున్నారు. వీరిలో చీఫుజడ్జీగారికి నెలకు రు 2600లును తక్కినజడ్జీలకు రు 2000 లును జీతమిచ్చెదరు. వీరిమీద దోషారోపణచేయబడి కాంగ్రెసువారిచే, క్రమమైన విచారణమీద, వీరుతీసివేయబడువఱకు వీరెంతకాలమైనను జడ్జీపదవియందుండ వచ్చును. వీరిని మఱియొక విధముగ నెవరును దీసివేయుటకు వలనుపడదు. ఇంగ్లాండులో నేజడ్జీనిగాని, పార్లమెంటులో రెండుశాఖల మెంబర్లమెజారిటీ వారిసలహాతో, నెట్టికారణమునకైనను, రాజుగారు తొలగించవచ్చును. ఇంగ్లాండులో వలెగాక, సంయుక్తరాష్ట్రములో నీపైనజెప్పిన తక్కిన రెండుతరగతుల వారికి కూడ, నీపద్ధతి వర్తించును. సంయుక్తరాష్ట్రనిబంధన స్థాపకులు, కాంగ్రెస్‌వారుగాని ప్రెసిడెంటుగాని ప్రజలమీదను, రాష్ట్రములమీదను తమ నిరంకుశాధికారమును కెడమియ్యకుండ నీకోర్టుల నేర్పఱచిరి. ఇంతగొప్ప యధికారము యీజడ్జీలయందుంచి నప్పటికి తమస్వాతంత్ర్యమును తమన్యాయైక శీలతను వీరెల్లపుడు కాపాడుకొనుచునే యున్నారు.

ఈసుప్రీమ్‌కోర్టులో నార్గురుజడ్జీలకు తక్కువకాకుండ నుండి కేసులు వినుచుందురు. విచారణ పూర్తియైన తరువాత వీరందఱు కలసి యాలోచించి వీరిలో నెక్కువమంది యభిప్రాయమును బట్టి, యొకరు తీర్పు వ్రాయుదురు. తిరిగి యందఱు కలసి ఆయన వ్రాసినతీర్పును పరిశీలించి దానిమీద తక్కినవారు దస్కతులుచేసెదరు.

సర్క్యూటుకోర్టులను సంయుక్తరాష్ట్రనిబంధన ననుసరించియే, కాంగ్రెసువారేర్పఱచెదరు. ఇవి ప్రస్తుతము తొమ్మిది. ఒక్కొకకోర్టుకు నెల 1టికి రు 1500లు జీతముగల యిద్దరు జడ్జీలుందురు. వీరితో సుప్రీముకోర్టు జడ్జీలలో నొకరు కలసిపనిచేయుదురు. ఈకోర్టులో వీరిలో నొకరుగాని, యిద్దరుగాని యుండి, కేసులు విని తీర్పు చెప్పవచ్చును. ఒకానొకప్పుడు, వీరిలో నెవరైనను, ఆయాడిస్ట్రిక్టు జడ్జీలతో కలసి పనిచేయవచ్చును. ఒకప్పుడు డిస్ట్రిక్టుజడ్జీగారొక్కరేయుండి పనిచేయవచ్చును. ఈకోర్టుల తీర్పులమీద నప్పీలు కోర్టులేర్పడియున్నవి. వీనికి (Circuit Court of Appeal) అనిపేరు. వీనితీర్పులమీద, కొన్నితరగతి కేసులలో సుప్రీమ్‌కోర్టు వారికి రెండవ అప్పీలు చేసికొనవచ్చును. మరికొన్నితరగతుల కేసులలో సరిగా, సుప్రీముకోర్టువారికే, మొదటిఅప్పీలు చేసికొనవచ్చును.

డిస్ట్రిక్టుకోర్టులు, ప్రస్తుతము యేబదియైదుకలవు. వీని జడ్జీలకు నెలకు రు. 1200 ల జీతము నిచ్చెదరు. సుప్రీముకోర్టు

జడ్జీలవలనే, యీడిస్ట్రిక్టు జడ్జీలనుకూడ ప్రెసిడెంటుగారు శిష్టసభవారి సలహాను తీసికొని యేర్పాటుచేయుదురు. ఏపౌరుడుగాని సంయుక్తరాష్ట్రాధికారులమీద సొమ్ముకు దావాచేయదలచుకొనిన యెడల నిట్టిదావాలను విచారించుటకు నెలకు వేయి రూపాయల జీతముతో అయిదుగురు జడ్జీలుగల (Court of claims) అనున్యాయస్థానమొకటి కలదు. దీనితీర్పులమీద సుప్రీముకోర్టువారికి అప్పీలు చేసికొనవచ్చును.

సంయుక్తరాష్ట్రపుకోర్టుల యధికారము.

సంయుక్తరాష్ట్రపరిపాలకులతో సంబంధించిన సంధివిషయములను గుఱించియు వారిచట్టముల న్యాయాన్యాయ విషయములను గుఱించియు వీనియర్థములను గుఱించియు, రాష్ట్రములోనుండు హైకోర్టుయొక్క తీర్పులలో సంయుక్తరాష్ట్రమున వ్యతిరేకముగ వ్రాసియుండిన యెడల నాతీర్పులమీద సుప్రీముకోర్టు వారికి అప్పీలు చేసికొనవచ్చును. ఇదిగాక సంయుక్తరాష్ట్రనిబంధనకు రాష్ట్రపుచట్టము వ్యతిరేకముగనున్నదని వాది ప్రతివాదులలో నెవరైనను వాదించినపుడు, అట్లుకాదని రాష్ట్రీయ హైకోర్టువారు తీర్పుచేసిన యెడల నాతీర్పుమీద సుప్రీముకోర్టువారికి అప్పీలుగలదు.

సంయుక్తరాష్ట్రశాసన నిర్వాహకశాఖవారు (Federal Executive) నిరంకుశాధికారముతో జరిగించిన ప్రతివిషయమును గుఱించి యీసంయుక్తరాష్ట్రపుకోర్టులలోనే దావాలు చేయ

వలెను. రాష్ట్రీయన్యాయ స్థానముల కెంతమాత్రము అధికారము లేదు. రాయబారులు, మంత్రులు మొదలగు కొందఱు సంయుక్తరాష్ట్రీయోన్నతోద్యోగస్థును సంయుక్తరాష్ట్రపుకోర్టులకే లోబరచ బడవలయును. ఇటీవల, సంయుక్తరాష్ట్ర నిబంధనలో నొకమార్పు జరిగినది. ప్రతిరాష్ట్రము సంపూర్ణస్వాతంత్ర్యము కలిగి యున్నది గనక దానిపౌరుడుగాని, యితరరాష్ట్రపౌరుడుగాని, వ్యాజ్యము తీసికొనివచ్చినయెడల అట్టివ్యాజ్యమును సంయుక్తరాష్ట్రపుకోర్టులు పట్టగూడదని యేర్పాటు చేయబడినది.

రాయబారుల విషయమునను, ఒకరాష్ట్రముపార్టీగానున్నపుడును తప్ప, తక్కిన అన్నికేసులలో సుప్రీము కోర్టువారికి, అప్పీలు అధికారము మాత్రమే కలదు. సంయుక్తరాష్ట్రపుకోర్టులతీర్పుల మీధను, రాష్ట్రపుకోర్టుల తీర్పులలో కొన్నిటిమీదను, సుప్రీము కోర్టువారికి అప్పీలు చేసికొనవచ్చును. రాష్ట్రీయ న్యాయస్థానములు, సంయుక్తరాష్ట్రనిబంధనను బట్టియేర్పడలేదు గనుక వీనిమీద కాంగ్రెసువారికట్టియధికారమును లేదు సంయుక్తరాష్ట్రపుకోర్టులలో కాంగ్రెసు వారేర్పఱచినచట్టములే అమలులో పెట్టబడును. ఆప్పీళ్లలో, రాష్ట్రీయశాసనములకంటె సంయుక్తరాష్ట్రశాసనములెక్కువ బలీయముగ నెంచబడును. వేరువేరురాష్ట్రముల పౌరులు పార్టీలుగానున్నపుడు వారికేసు, యేరాష్ట్రశాస

నము ననుసరించి పరిష్కరింపబడవలెనో సంయుక్తరాష్ట్రపుకోర్టులలో నిర్ధారణచేయబడును. అట్టి నిర్ధారణలో ఆరాష్ట్రముల హైకోర్టువారి తీర్పుల ననుసరించి తీరవలయును. ఈలాగుననే రాష్ట్రీయ న్యాయస్థానములు సంయుక్తరాష్ట్రశాసనముల నమలులో పెట్టవలసివచ్చినపుడు సుప్రీము కోర్టుమొదలగు సంయుక్త రాష్ట్రన్యాయస్థానముల తీర్పులను శిరసావహించవలెను.

సంయుక్తరాష్ట్రపుకోర్టు తీర్పులను, అమలులో పెట్టుటకు (United States Marshall) అను నొక గొప్పయుద్యోగి యుండును. ఆయనకుగాని, ఆయనక్రింది యుద్యోగీయులకుగాని ఆటంకముగలుగజేసిన యెడల ప్రతిపౌరుడును ఆకోర్టుల డిక్రీలనమలు జరిగించుటలో, వారికి సహాయము చేయవచ్చును. తగినంతసహాయము రానపుడు సంయుక్తరాష్ట్ర సేనలను రప్పించి అమలుజరిగించవచ్చును. ప్రతిమండలమున నొక పబ్లికు ప్రాసికూటరుండును. సంయుక్తరాష్ట్రశాసనముల నతిక్రమించినవారి మీదను సంయుక్తరాష్ట్ర కోశములలో సొమ్ముహరించినవారి మీద నీయన శివిల్ క్రిమినల్ చర్యలు జరుపును. ఈయుద్యోగీయులందఱు, న్యాయాధికారశాఖాధ్యక్షుడైన(attorney general) గారి యాజ్ఞకులోబడియుందురు. ప్రతిరాష్ట్రములో కోర్టులు పబ్లికుప్రాసిక్యూటర్లు ఉన్నను వీరికివేరుగా సంయుక్తరాష్ట్రములో నంతయు ప్రతిచోటనుసంయుక్తరాష్ట్రీయోద్యోగీయులు

తమకుగల యధికారమును చెలాయించుచునే యుందురు. ఈ వేరు వేరు యధికారములు ఒకదానిప్రక్కనొకటి సంయుక్తరాష్ట్రములో ప్రతిగజము భూమియందును ప్రబలియుండుట జూచి విదేశీయులాశ్చర్యమగ్నులగుదురు. కాని ఆక్కడిప్రజలు చట్టమునకు బద్ధులగు స్వభావముగలవారగుటచే నీకోర్టులన్నియు వాని వాని యధికారములను క్రమముగను నెమ్మదిగను పరస్పర సంఘట్టన లేక నెరవేర్చుచున్నవి.

ఇంగ్లాండులో రాజకీయనిబంధనలు పెక్కుచట్టములలోను, కేసులలోను, నిమిడియుండును. ఈనిబంధన లన్నియు శాసననిర్మాణశాఖవలన తక్కినవిషయముల వలెనే,సులభముగ మార్చబడును. దీనికి దృష్టాంతము ప్రస్తుతమందే కనబడుచున్నది. ప్రభు సంఘములో కొన్ని మార్పులను పార్లమెంటువారు చేయజూచుచున్నారు. ప్రజాప్రతినిధి సంఘములో ప్యాసయిన బిల్లు ప్రభుసంఘమువారు ఒకటిరెండుసారులు నిరాకరించినను మూడవసారి వారియనుమతిలేకయే, రెండు సంవత్సరముల తరువాత నాబిల్లు చట్టమై తీరవలయునని కొద్దిరోజుల క్రిందట పార్లమెంటు బిల్లు ప్యాసుఅయినది. క్రొత్తప్రభువులను రాజుగారిచే సృష్టింపవలసివచ్చునని ప్రధానమంత్రిగారు భయపెట్టుటచేత, ప్రభుసంఘమువారు తమకు మామూలుగనున్న శాసననిర్మాణాధికారమును తగ్గించుకొనవలసివచ్చెను. కాబట్టి తక్కిన చట్టములవలెనే, రాజ్యనిబంధనలు (Law and Rules of

Constitutions) కూడ నొకవిధముగనే మార్చబడుచుండును. ఈవిధముగనే రాజునుగాని పార్లమెంటునుగాని దానిలో ఏశాఖనైననుగాని తీసివేయుటకు నిర్మాణ సంఘమున కధికారము కలదు. సంయుక్తరాష్ట్ర నిబంధన (Articles of Constitution) శాసననిర్మాణ సంఘమైన కాంగ్రెసువారు మార్చలేదు. దానిలో మార్పులుచేయవలెనన్న బహుప్రయాసమీదగాని జరుగనేరదు. ఇంగ్లాండులో పార్లమెంటుకు నిరంకుశాధికారము కలదు. అమెరికాలో కాంగ్రెసువారు రెండువిధములుగ నిర్బంధింపబడుచున్నారు. సంయుక్తరాష్ట్ర నిబంధనలో నుదాహరించిన యంశములను మాత్రమే వారు చట్టములుగ నేర్పఱచ గలుగుదురు. అట్లు, యేర్పరుచుటలో గూడనిబంధనలో చెప్పబడిన రూలునకు భిన్నముగ జరుపగూడదు. ఒకవేళ కాంగ్రెసువారు బుద్ధిపూర్వకముగ గాని పొరబాటునగాని అట్లు జరిగించినయెడల దానిని దిద్దువారెవరు? ఈ విషయమేదైన కోర్టుల యెదుటకు వ్యాజ్యెమూలముగవచ్చినపుడు, సంయుక్త రాష్ట్రీయ న్యాయస్థానములు, కాంగ్రెసు వారుచేసిన చట్టము నిబంధనకనుగుణముగా నున్నదా లేదా యనియు, లేనియెడల దానినతిక్రమించిన తప్పులేదనియు, తీర్పుచేయు చుండును. ఈయధికారము మిక్కిలి గొప్పది. సంయుక్త రాష్ట్రనిబంధనానిర్మాణకులు, తా మేర్పరచిన నిబంధనలో నిట్టియుత్కృష్టాధికారమును, ప్రజల శ్రేయస్సునకై, కోర్టులకు కలుగ చేసిరి. అనుదిన

ము యీకోర్టులు, నిబంధనకు వ్యాఖ్యానము చేయుచు, నేవిషయము లోనైనను కాంగ్రెసువారికి చట్టముగాని, దానిలో రూల్సుగాని చేయుటకు యధికార మున్నదాయను సారాంశము తమవద్దకు తీసికొని రాబడిన కేసులలో తీర్మానము చేయుచుందురు. ఇట్టి తీర్మానములను సంపూర్ణ స్వాతంత్ర్యము గల చిన్న రాష్ట్రములలో నున్న కోర్టులు కూడ గమనింపవలెను. ఒక రాష్ట్రములో నేర్పడిన చట్టముగాని దానినిబట్టి చేసిన రూలుగాని సంయుక్త రాష్ట్రీయనిబంధనకు వ్యతిరేకముగ నున్నదని యీ సంయుక్త రాష్ట్రీయ న్యాయస్థానములు తీర్మానించినయెడల ఆతీర్పులు ప్రతిమనుజుడు అంగీకరించక తప్పదు. ఈవిధముగనే రాష్ట్రపుకోర్టులుకూడ తమ శాసననిర్మాణశాఖ వారి చట్టములను గురించి తీర్పులు చేయుచుండును.

CHAPTER VIII.

సంయుక్తరాష్ట్ర యింగ్లాండు రాజ్యతంత్రముల తారతమ్యము.

ఇంగ్లాండు రాజ్యతంత్రమును మార్గదర్శకముగా నిడికొని ఫ్రాన్సు, బెల్జియము, హాలెందు, ఇటలీ, జర్మనీ, హంగెరీ, స్వీడను, నార్వే డెన్మార్కు, స్పెయిను, పోర్చుగల్. యిగ్లాండు వలనరాజ్యములైన కనడా, దక్షిణఆఫ్రికా ఆస్ట్రేలియా, న్యూజీలందులో మొదలగు దేశములు తమ కార్యనిర్వాహక సంఘమునకు నొకపెద్దను యేర్పాటు చేసికొనుచున్నవి. ఫ్రాన్సు దేశమునందుతప్ప, పైనచెప్పిన తక్కినరాజ్యములలో, యీపెద్ద యితరుల కెవ్వరికిని జవాబుదారుడు కాడు. ఈయనను తీసివేయుటకు యెవ్వరికిని వలనుపడదు. ఈయన జరిగించు రాచకార్యములు, తా నేర్పరచుకొన్న ఒకమంత్రివర్గముయొక్క సలహామీదను నిర్వహించును, ఈమంత్రివర్గము, ప్రజలచేత నెన్నుకొనబడిన శాసననిర్మాణసంఘమునుండి యేర్పరుప బడుచుండును. ఈ కారణమునుబట్టి రాజ్యమును నిజముగ పాలించువారు ప్రజాప్రతినిధులనియే చెప్పవచ్చును. ఈమంత్రివర్గముమీద, ప్రతినిధి సంఘమునకు నమ్మకము లేనియడల వారు తమపదవులకు రాజీనామాలివ్వవలెను. అప్పుడు క్రొత్తమంత్రు లేర్పడెదరు. కాబట్టి శాసననిర్మాణ శాఖయు, కార్యనిర్వాహక సంఘము

కూడ ప్రజాప్రతినిధి సంఘమునకుచేరి, యుందురు. కాని ఒకానొకపుడు కార్యనిర్వాహక సంఘమునకు పూర్ణమైన స్వాతంత్ర్యమునిచ్చి, దానిచేత ప్రజాప్రతినిధి సంఘము తన కయిష్టమయిన పనులనుకూడ చేయునటుల చేయవచ్చును. శాసననిర్మాణసంఘము ఒకవిధముగ కార్యనిర్వాహక సంఘమని యనిపించుకొనునట్లే కార్యనిర్వాహక సంఘము అనగా మంత్రివర్గముకూడ తమకిష్టమైన బిల్లులను ప్రజాప్రతినిధి సంఘముచేత నామోదింప జేయుచు, తాము శాసననిర్మాణ సంఘమనికూడ యనిపించుకొందురు. కాబట్టి యీమంత్రివర్గము (Cabinet) కార్య నిర్వాహకులేగాక, శాసనకర్తలు కూడ యగుచున్నారు. నిరంకుశాధికారముగల రషియా చక్రవర్తివలెనే కార్యనిర్వాహక శాసననిర్మాణాధికారములు రెండును యీమంత్రివర్గమం దున్నట్లుగానే యెంచబడవలయును. పన్నులనువిధించు కార్యనిర్వాహకత్వము, శాసననిర్మాణము వలనగాని జరుగనేరదు గనుక యీరెంటికి యెంత అన్యోన్య సంబంధముకలిగి యుండవలెనో చదువరులే సులభముగ గ్రహించవచ్చును.

ఈపద్ధతిలో శాసననిర్మాణసంఘముయొక్క స్వాతంత్ర్యము కొన్నిదేశములందు పూర్ణముగను కొన్నిదేశములందు కొంత తక్కువగను యేర్పడియున్నది. ఫ్రాన్సుదేశమున పూర్తిగనున్నది. జర్మనీదేశమున యిదిమిక్కిలి తక్కువగనున్నది. కాని

యీపద్ధతిగల దేశములలో నెల్ల కార్యనిర్వాహక శాసననిర్మాణ సంఘమునకు తగవులు తటస్థించినపుడు వానినేదియో నొకవిధముగ తమలో తాము పరిష్కరించుకొనెదరు. ఈదేశములందు కోర్టులు రాజ్యతంత్రముతో జోక్యమును కలుగజేసికొనవు.

అమెరికాఖండములో స్థాపింపబడిన 13 వలసరాజ్యములు తమ మాతయైన ఇంగ్లాండుదేశముతో పోరాడి స్వతంత్రములై, సంయుక్తరాష్ట్రముగా నేర్పడినపుడు దాని రాజ్యతంత్రము సాధ్యమైనంతవరకు యింగ్లీషువారి దానివలెయుండుటకు అచ్చటిరాష్ట్రనిబంధన కర్తలు ప్రయత్నించిరి. అప్పటికాలములో అనగా సుమారు 145 సంవత్సరముల క్రిందట యింగ్లాండుదేశము తమతో పోరాడునపుడు ఆదేశపురాజు కార్యనిర్వాహశాఖకు ఆద్యక్షుడుగానుండి పార్లమెంటువారి సలహాను పుచ్చుకొనకయే యుద్ధము జరిగించెను. ఇదిగాక అక్కడి మంత్రిసంఘము రాజు చెప్పినటుల కీలుబొమ్మలవలె నాడుట, లంచములు బిరుదులు, భూములు, ఉద్యోగములు మొదలగునవి యొసంగి ప్రజాప్రతినిధులను స్వాధీన పరుచుకొనుట, తనస్నేహితులగు ప్రభుసంఘములోనివారు తమ పలుకుబడిచేత తమకిష్టులైన ప్రతినిధులను ప్రజలచేత నెన్నుకొనబడజేయుట, యీమొదలగు హేతువులనుబట్టి ఆకాలములో రాజుయొక్క అధికారము ప్రబలియుండెను. ఇంతియగాక సంయుక్తరాష్ట్రనిబంధన నిర్మాణకులు ఇంగ్లాండు దేశపు రాజ్యతంత్రమును

గురించి బ్లాక్స్టనను మొదలగువారు రచించిన గ్రంథములను చదివి యా దేశమున కార్యనిర్వాహకాధికారము రాజునందే యున్నదనియు, దానిని తమ రాజ్యమున, తగ్గించి తమ ప్రెసిడెంటుగారి నిరంకుశాధికారమునకు తగిన మేరలేర్పరచి అయనకు శాసననిర్మాణాధికార మెంతమాత్రము నీయకుండినగాని తమ స్వాతంత్ర్యములకు భంగము కలుగుననియు భయపడిరి. అదివరకు తమ్మును పరిపాలించుటకు ఇంగ్లాండు దేశీయులు పంపిన గవర్నరులు ప్రజాప్రతినిధిసంఘములు ప్యాసుచేసిన చట్టములను నిరాకరించుటకు కూడ చూచియున్నారు. ఈకారణములనుబట్టి వారుమూడు నిశ్చితాభిప్రాయములకు వచ్చిరి. (1) నిజమైన స్వాతంత్ర్యముగల ప్రతి రాజ్యమున కార్యనిర్వాహక శాసననిర్మాణాధికారములు వేరు వేరుగ నుండవలెను. (2) కార్యనిర్వాహకాధికారము ప్రజల స్వాతంత్ర్యమునకు సహజముగ అపాయకరము గనుక దానికి నిర్దిష్టమైన మేరలుంచవలెను. (3) రాజ్యాంగమునకు ప్రధానియయిన ప్రెసిడెంటుగారు నియమితాధికారమునే కలిగి కొంతకాలమునకు మాత్రమే యేర్పరచబడి ఆయనకు శాసననిర్మాణ సంఘములో యేమాత్రమయినను పలుకుబడి లేకుండచేయవలెను. ఆయన యేర్పఱచుకొన్న మంత్రిసంఘము ఆయన చెప్పినటులనే చేయుదురుగాన తాను ప్రజల తరఫున పాటుపడుట తటస్థపడదు. కాబట్టి వారు కాంగ్రెసులో నేశాఖకును చేరియుండకూడదు. ఈవిధముగ తమ శాసన

నిర్మాణసంఘము శుద్ధమైనదిగను జాగరూకత గలదిగను, జనులకు త్తరవాదిగను నిరంకుశాధికారమునకు విరోధిగను జేసితిమని వారనుకొనిరి. అయినను కార్యనిర్వాహకాధికారమును బలహీనపరచుటవలన కొన్నియిబ్బందులు తటస్థపడుననికూడ వారు గ్రహించి శాసననిర్మాణసంఘమునకు పూర్ణాధికారమియ్యవలెనని వారి కెంతమాత్రము నిష్టములేదు.

ఈభిన్నాభిప్రాయములను సమన్వయము చేయుటకు ప్రెసిడెంటుగారిని ప్రజలే డైరెక్టుగా ఎన్నుకొనునట్లు యేర్పాటు చేయబడెను. కార్యనిర్వాహకులు, శాసననిర్మాణకులు వేఱువేఱుగ జనులచే నెన్నుకొనబడుటచేత వీరిలో వీరికే తగవులు తటస్థించినపుడు ఉభయులు ప్రజలలో బహుజనాభిప్రాయమును బట్టి నడచుకొనెదరని సంయుక్తరాష్ట్ర నిబంధన కర్తలయుద్దేశము. ప్రెసిడెంటుగారును, కాంగ్రెసుసభికులును, నియమితకాలములకే యేర్పడుదురు గనుక సంయుక్తరాష్ట్రనిబంధనకు వ్యాఖ్యానము చేయుచు ప్రజల స్వాతంత్ర్యములను కాపాడుటకు సుప్రీముకోర్టును దానిక్రింద కొన్ని సంయుక్తరాష్ట్రీయ కోర్టులను ఏర్పఱచిరి.

సంయుక్తరాష్ట్ర నిబంధనకర్తలు, కార్యనిర్వాహక శాసననిర్మాణాధికారములు పూర్తిగ విడదీయుటచేత, రెండింటిని బలహీనముచేసిరి. ఇంగ్లాండులో జనప్రియుడైనమంత్రి, దేశములో తానొక గొప్పమార్పును చేయవలెనన్న పార్లమెంటును

తనకు శోధుచేసికొనగలుగును. సంయుక్తరాష్ట్రములో ప్రెసిడెంటుగారు, కాంగ్రెసు సంఘమును తాను స్వాధీనపఱచుకొనజాలడు. దానిలో తాను మెంబరుకాడు. పరరాష్ట్రవ్యాపారములలో తనకిష్టము వచ్చినటుల సంధిచేయ వలనుపడదు. శిష్టసభవారి యనుమతిలేనిదే తనకు, తనయుద్యోగస్థుల నియమించు నధికారములేదు. చిక్కుసమయములలో, కాంగ్రెసు సభవారి మాటసాటిసేయక ఆసంఘమును ఛిద్రముచేసి, దేశప్రజలకు అప్పీలు చేసికొనుట కవకాశములేదు. అయినను, తాను ప్రజలచేత నెన్నుకొనబడినవాడగుటచే తాను కొంత స్వాతంత్ర్యము గలిగి, కాంగ్రెసును లక్ష్యపెట్టక, తననియమితకాలమగు నాల్గు సంవత్సరములలో నిరంకుశాధికారియైన చక్రవర్తికూడ చేయుటకు సందేహించునట్టి పనులనుకూడ చేయగలడు.

ఇంగ్లాండుదేశపురాజు అధికారములు క్రమక్రమముగ తగ్గుచుండగా ప్రెసిడెంటుగారి యధికారము, సులభముగ మారని ఒకశాశ్వతపు నిబంధననుబట్టి యేర్పడియున్నది. ఇక కాంగ్రెసు విషయమై ఆలోచించిన యెడల, నింగ్లాండులో ప్రజాప్రతినిధిసంఘము, యేటేట యెక్కువ బలము సంపాదించుకొనుచుండగా, కాంగ్రెసు, తాను రెండు శాఖలుగాచీలి, బలహీనముగానే యున్నది. ఇంగ్లాండులో పార్లమెంటు తనమంత్రిసంఘమును తనయెదుటకు దినదినము రప్పించుచు, తనలో నెక్కువపార్టీవారి తరపున వారిచేత పనిచేయించుచుండుటచేత, మిక్కిలి బలముగలది యగుచున్నది. సంయుక్తరాష్ట్రనిబంధనలో శాసననిర్మాణ సంఘమునకు కార్యనిర్వాహకులమీద నిట్టి యధికారములుండుటకు తగినయేర్పాటులు కలుగ జేయలేదు.

ఇంగ్లాండులో పార్లమెంటులో నొకశాఖయైన ప్రజాప్రతినిధిసంఘము, సంపూర్ణకార్యనిర్వాహక శాసననిర్మాణాధికారములు కలిగియుండి తనకిష్టము వచ్చిన మంత్రులనే రాజుచేత నియమింపఁ జేయుటకు శక్తికలిగియున్నది. సంయుక్తరాష్ట్రములో కాంగ్రెసు కేవలము శాసననిర్మాణ సంఘముగనే యున్నది. తనయిష్టము వచ్చినటుల, ఉన్నమంత్రులను వెడలగొట్టి క్రొత్తమంత్రులను ఏర్పఱచ లేదు. తన చట్టముల నమలులో పెట్టుటకు, తానెట్టి యధికారులను నియమించలేదు. ఒక నిష్కర్షమైన రాజ్యాంగతంత్రమును నడుపలేదు. అయినను నీసంయుక్తరాష్ట్రములో శాసననిర్మాణాధికారము తన మేరల నతిక్రమించి కార్యనిర్వాహకాధికారమునకు తన కమిటీలగుండ, అశక్తవ్యాకులత్వముతో ననవసరమగు నడ్డంకులను పెట్టుచుండును.

ఇంగ్లాండులో ప్రజాప్రతినిధిసంఘము తనమంత్రులచేత రాజీనామాల నిప్పించి క్రొత్తమంత్రుల నేర్పఱచుకొనగలదు. కనుక అక్కడి శాసననిర్మాణాధికారము బలముగలదని చెప్పవచ్చును. అయినను, అక్కడి మంత్రివర్గము, తమ్మునేర్పఱచుకొన్న ప్రజాప్రతినిధిసంఘమునుకూడ ఛిద్రముచేసి ప్రజలకు అప్పీలు చేసి కొనగలరు గనుక, అక్కడి కార్యనిర్వాహకాధి

కారముకూడ బలముగలదనియే చెప్పవచ్చును. ఈ రెండుశాఖలును, ఎప్పుడైనను, ఎన్నిసార్లయినను తమకు తగవులు కలిగినపుడు ప్రజలకు అప్పీలు చేసికొన వచ్చును. కాని ఒకదానినొకటి త్రోసివేయుటకు ప్రయత్నించదు. రెండును, బాహాటముగ ప్రజలయెదుట పోరాటము సలుపుచు, వారినే తమకు మధ్యవర్తులుగ నేర్పాటు చేసికొనుచున్నవి. ప్రజాప్రతినిధిసంఘములో నుండు ప్రతిమెంబరు, తన్నక్కడికి పంపిన ప్రజల యభిప్రాయ మెట్లున్నదో మిక్కిలి జాగరూకతతో తెలిసికొనుచుండును. అక్కడి మంత్రిసంఘముకూడ పార్లమెంటులోని యభిప్రాయము బయటనుండు ప్రజాభిప్రాయముతో ననుగుణ్యముగా నున్నదా లేదా, తాముచేయదలుచుకొన్న కార్యము, అప్పటి పార్లమెంటులో బహుమందికి బాగుగ లేకపోయినను, ఇతర ప్రజలకు యిష్టముగనున్నదా లేదా యను నీవిషయము సదా కనిపెట్టుచుండును. ప్రజాప్రతినిధి సంఘము, మంత్రిసంఘమును నేకీభవించి, పార్లమెంటు నియమితకాలమైన అయిదు సంవత్సరముల లోపుగనే, ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగ నడచునప్పుడు మాత్రము కొంత అపాయము కలుగవచ్చును. ఇట్టి స్థితి సాధారణముగ తటస్థించదు. తటస్థించినను, చాల కాలము నిలువ నేరదు. ఇప్పటి దినములలో దినదిన ప్రవర్ధమానమగు బహుజనాభిప్రాయము వర్తాపత్రికల మూలమున ప్రకటించబడు చున్నపుడు, పార్లమెంటువారును, వారిమంత్రులను దేశ ప్రజలయొక్క కోపాగ్నికి వెఱచి గజగజలాడుచు, తమరు చేయబూను పనిని మానివేయుదురు.

ఇట్టిరాజ్యాంగతంత్రము మిక్కిలి సున్నితమైనది. చిక్కుసమయములలో శాసననిర్మాణకార్యనిర్వాహక సంఘములకు తరుచుగా జగడములు తటస్థపడిన యెడల, పరిపాలనాధికారులు మారుచు, ప్రతిడిపార్టుమెంటుకు నిబ్బందులు కలుగుచు, ఎన్నికలలో మిక్కిలి వ్యయప్రయాసలకు కారణమగుచుండును. ఇట్టి రాజ్యతంత్రము జయప్రదముగను, నెమ్మదిగను జరుగుచుండవలెనన్న, పార్లమెంటులో రెండు కక్షులకంటె నెక్కువగ నుండకూడదు. ఈ రెండు కక్షులలో నొకటిమాత్రము ప్రధానమైనదిగ నుండవలెను. బలమైన మూడవకక్షి యేర్పడినపుడు; ఆకక్షి మొదటి రెండుకక్షులలో దేనితోచేరిన నది బలమగుచుండును. కనుక, యీచిన్నకక్షివశములో దేశముయొక్క అదృష్టముండుట సంభవించును. అట్టిసమయములలో రాజ్యపరిపాలనము సరిగా జరుగక ప్రజాప్రతినిధి సంఘము తరుచుగ ఛిద్రమగుచుండును. ఇట్టి చిక్కు యింగ్లాండులో నిప్పుడు తటస్థించినది. ఐయిర్లాండు మెంబర్లు పనివాండ్ర మెంబర్లు కలసి సుమారు నూటయిరువది మంది యగుటచేత వీరుసహాయముచేయు కక్షియే పార్లమెంటులో ప్రబలముగా నుండును.

రాజ్యాంగ విషయములలో తగవులు తటస్థించినపుడు, యింగ్లాండులోను, సంయుక్తరాష్ట్రములలోను, అవి యెట్లు పరి

ష్కారమగునో మనము చూతము. ఇంగ్లాండులో కార్యనిర్వాహకులైన మంత్రిసంఘము ప్రజాప్రతినిధి సంఘమువారికి, అయిష్టులైన యెడల వారికి వ్యతిరేకముగ వోటుచేయుదురు. అప్పుడు మంత్రివర్గము రాజీనామాల నియ్యవలెను. లేదా ప్రజాప్రతినిధి సంఘమును ఛిద్రము చేయవలెను. వారు రాజీనామాల నిచ్చిన యెడల ప్రజాప్రతినిధి సంఘములో నెక్కువమంది సభ్యులుగల పార్టీ వారు, తమకిష్టము వచ్చిన నూతనమంత్రుల నేరికొనెదరు. వారికే రాజుగారు తమశీళ్ల నియ్యవలెను. అప్పుడు కార్యనిర్వాహకసంఘము, శాసననిర్మాణసంఘము కలసి పనిచేయవచ్చును. ఒకవేళ ప్రజాప్రతినిధిసంఘమే ఛిద్రము చేయబడి నూతనయెన్నికలలో క్రొత్తప్రజాప్రతినిధి సంఘమేర్పడినపుడు యీ సంఘములో నుండు సభ్యులు, పూర్వపు మంత్రి వర్గముతో నేకాభిప్రాయము గలవారైన యెడల, ఉభయులు కలసి పనిచేయుదురు; అటులగాకున్న క్రొత్త మంత్రివర్గము నేర్పఱచుకొని రాచకార్యముల నిర్వహించెదరు. ఇట్లున్నను ప్రభుసంఘమువారు ఉభయులు చేయు చట్టములకు తమయంగీకారము నొసంగినపుడు ప్రజాప్రతినిధి సంఘము ఛిద్రమై తిరిగి నూతనసంఘ మేర్పడవలెను. అప్పుడుకూడ వారుచేయు చట్టములను ప్రభుసంఘమువారు ప్యాసు చేయని యెడల, రాజుగారిచేత క్రొత్త ప్రభువులను సృష్టించి ప్రభు సంఘము నెక్కువ చేసి ప్రజాప్రతినిధి సంఘము వారి చట్టములను ప్యాసు చేయించవలెను. ఇట్టి యవస్థ ప్రభు సంఘము వారికి 1832వ సంవత్సరమున పట్టినప్పుడు మంత్రిగారైన వెల్లింగ్టను ప్రభువుగారు ప్రజాప్రతినిధి సంఘమువారు పంపిన చట్టమునకు, వ్యతిరేకులుగనుండు ప్రభువులను, ఆనాడు ప్రభుసంఘమునకు రాకుండజేసి ఆచట్టమున కనుకూలురగు ప్రభువులచేత దానిని ప్యాసు చేయించెను. ఈసంవత్సరము యిట్టి యవస్థ తిరిగి ప్రభు సంఘమునకు తటస్థించి, ఆస్క్వత్తుగారును, మార్లే ప్రభువుగారును రాజుగారిచేత నెంతమందిప్రభువుల నైనను సృష్టించి ప్రభుసంఘమును ముంచివేసెదమని భయపెట్టగా ప్రజాప్రతినిధి సంఘమువారు రెండుసార్లు ప్యాసుచేసిన బిల్లును, రెండుసంవత్సరముల వఱకు ప్రభుసంఘమువా రంగీకరింపక నిలుపుచేయ గలుగుదురనియు, అనంతరము, వారికిష్టమున్నను, లేకపోయినను సదరు బిల్లుచట్టముగ మారుననియు నేర్పఱచిన నిబంధనను, ప్రభుసంఘము వా రంగీకరించవలసి వచ్చినది. కాబట్టి యింగ్లాండులో, ప్రజాప్రతినిధి సంఘములో పూర్ణమైనశాసననిర్మాణాధికారము కార్యనిర్వాహకాధికారముకూడ నిమిడియున్నవి.

అమెరికా దేశములో, ప్రెసిడెంటుగారికిని కాంగ్రెసునకును, ఒక కార్యనిర్వాహకముతో సంబంధించిన పనినిగుఱించిగాని, లేక ఒకబిల్లును గుఱించిగాని వివాదము జరుగవచ్చును. కార్యనిర్వాహకముతో సంబంధించిన పనులలోను, లేక ఉద్యోగస్థుల నేర్పాటు చేయుటలోను, లేక పరరాజులతో సంధి జరి

గించుటలోను, శిష్టసభవారు ప్రెసిడెంటుగారికి అడ్డు కలిగించ వచ్చును. అనఁగా, ఆయన యిష్టము వచ్చినట్లు చేయనియ్యదు కాని, తానుకోరునది ఆయనచేత చేయించలేదు. ప్రెసిడెంటుగారు తానుదస్కతు చేయక కాంగ్రెసువారు పంపినబిల్లును నిరాకరించిన యెడల, శాసననిర్మాణ సంఘముయొక్క శిష్టసభ ప్రజాప్రతినిధి సంఘములను రెండుశాఖలలో రెండువంతుల మెంబర్లు ఒప్పుకొన్నగాని ప్రెసిడెంటుగారి నిరాకరణను తృణీకరించి, బిల్లును చట్టముగా మార్చలేదు. అప్పుడు గాని వీరిజగడము తుదముట్టదు. కాని యీచట్టమును అమలులో పెట్టునది ప్రెసిడెంటుగారును, వారితాబేదారులును గనుక, తమకిష్టములేని యీచట్టమునకు అనేక స్వల్పవిషయములలో విఘాతములను కల్పించుచుందురు. రెండుశాఖలలో రెండువంతుల మెంబర్లు ఆబిల్లు నంగీకరించని యెడల, దానిని జారవిడువవలసినదే. దానిని ప్యాసుచేయుట దేశమునకెంత ముఖ్యమైనను, అదియెంత అవసరమైనను, కాంగ్రెసు మెంబర్ల నియమితకాలము గడచినగాని, అట్టిబిల్లు తిరిగి ఆలోచనలోనికి రాదు. ప్రెసిడెంటుగారికింకను రెండుసంవత్సరముల గడవున్నది గనుక, జనులు ఆబిల్లు నంగీకరించినయెడల దానినామోదించు ప్రతినిధులనే యెక్కువగ నూతన కాంగ్రెసునకు పంపెదరు. అప్పుడు రెండువంతుల మెజారిటీవలన ఆబిల్లు ప్యాసు అగును. జనులు దాని నంగీకరించని యెడల ప్రెసి

డెంటుగారి పక్షముగనే ప్రతినిధు లెన్నుకొనబడెదరు. కాఁబట్టి ఆబిల్లు యెటులైనను ప్యాసుకానేరదు. క్రొత్త కాంగ్రెసుతో పాటు క్రొత్త ప్రెసిడెంటుగారి నెన్నుకొనునపుడు, ఉభయులను బిల్లుకు ఇష్టులనో అయిష్టులనో ప్రజలే యెన్నుకొనెదరు. అట్టిసమయములలోనే శాసననిర్మాణశాఖయు, కార్యనిర్వాహక శాఖయుకలసి, ఐకమత్యముతో పనిచేయగలుగును. అప్పటికిని శిష్టసభవారు వ్యతిరేకముగ నుండవచ్చునుగాని చిన్నరాష్ట్రములు రెండుసంవత్సరముల కొకసారి తమ ప్రతినిధులను మార్చు సమయము వచ్చినపుడు శిష్టసభకూడ, తక్కినరాజ్యాంగములతోకలసి పనిచేయవచ్చును. ఈపద్ధతి యింగ్లాండులో కంటె మిక్కిలి మెల్లగనడచును. అతిశీఘ్రముగ పనులు జరుగవలెనన్న యీపద్ధతి సహకారికానేరదు. కాని తొందరలేకుండ నిశ్చితాభిప్రాయమునకు వచ్చుటకుమాత్రము యిది మంచి మార్గము.

CHAPTER. IX.

రాష్ట్ర ప్రభుత్వములు.

సంయుక్తరాష్ట్ర సంఘములో నలువదినాలుగు చిన్నరాష్ట్రములు గలవు. వీనిలో పెద్దవి చెన్నపురి రాజధానికంటె రెండు మడుంగుల వైశాల్యముగలవియు, చిన్నవి కృష్ణాజిల్లా యంత వైశాల్యము గలవియునై యున్నవి. జనసంఖ్య న్యూయార్కువంటి పెద్ద రాష్ట్రములో అరువదిలక్షలు. నివాడా వంటి చిన్న రాష్ట్రములో యేబదివేలు. కొన్ని రాష్ట్రములలో చదరపు మైలునకు 270 మంది ప్రజలుండగా, మరికొన్ని రాష్ట్రములలో, రెండు మూడు చదరపు మైళ్లకు ఒక మనిషి చొప్పున యుండును. కొన్ని రాష్ట్రములలో మూడవవంతు జనము విదేశస్థులుగా నుండగా, మఱికొన్ని రాష్ట్రములలో, వారు మూడు వందల యేబదవ వంతుగా నున్నారు. ఈనలువదినాలుగు రాష్ట్రములు, నాలుగు తరగతులుగా భాగించవచ్చును.

(1) న్యూ యింగ్లాండు రాష్ట్రములు:—6. మస్సాచేసట్స్, కనెక్టికట్టు, రోడ్డుదీవి, న్యూహాంప్షైర్, వెర్మాంట్, మెయిన్ ;

(2) మధ్యరాష్ట్రములు:—7. న్యూయార్కు, న్యూజర్సీ, పెన్సిల్వేనియా, డిలవేడ్, మేరీలాండు, ఓహియో, ఇండియానా ;

(3) దక్షిణరాష్ట్రములు:—14. వర్జీనియా పశ్చిమ వర్జీనియా, ఉత్తర కెరొలినా, దక్షిణకెరొలినా, జార్జియా, అలబామా, ఫ్లారిడా, కెంటకీ, టెన్నెస్సీ, మిస్సిసిపీ, లూజియానా, ఆర్కన్సాస్, మిస్సోరి, టెక్సాస్, వీనిలో వర్జీనియాలోతప్ప, తక్కిన పదమూఁడు రాష్ట్రములలో అనేకలక్షల నీగ్రోజాతివారు బానిసవాండ్రుగానుండిరి. ఈ బానిసత్వమునుండి వీరి నందరిని విముక్తులను చేయవలెనని, తక్కినరాష్ట్రములవారెంత ప్రయత్నించినను, యీబానిసల యజమానుల మూర్ఖత్వము వలన దేశములో నంతఃకలహము సంభవించి, యీ పదమూఁడు రాష్ట్రములు తాము విడిపోయి వేఱుగ నొక రాజ్యస్థాపన చేయజూచినవిగాని, తుదకీరాష్ట్రములకు తక్కిన రాష్ట్రములకు ఘోరయుద్ధము జరిగి, అబ్రహాము లింకనుగారు ప్రెసిడెంటుగానున్న కాలములో బానిసత్వము నిర్మూలమగుటయేగాక, యే రాష్ట్రముగాని, సంయుక్తరాష్ట్రసంఘమునుండి, యెట్టిప్రబల కారణమునకైనను విడిపోవఁగూడదని సంయుక్తరాష్ట్రనిబంధనలో యేర్పాటు చేయఁబడినది.

(4) వాయవ్యరాష్ట్రములు:—13. మిచ్చిగన్, ఇల్లినోయి, విస్కాన్సిన్, మిన్నిసోట, అయోవా, నిబ్రాస్కా, కాన్సాస్,

కొలొరేడో, ఉత్తరడకోటా, దక్షిణడకోటా, వయొమింగు, మొంటానా, ఇడాహో.

(5) పసిఫిక్కు రాష్ట్రములు:—4. కెలిఫోర్నియ, నివాడా, ఓరుగాన్, వాషింగ్టన్.

ఈరాష్ట్రములలో శీతోష్ణములు, భూములస్థితిగతులు, జనుల వృత్తులు, వ్యాపారములు ప్రజలగుణములు, భాషలు, జాతులు, అనేకభేదములుగ నున్నవి. సంయుక్తరాష్ట్రపటము చూచినయెడల, యీరాష్ట్రముల యెల్లలు, సరళరేఖలుగా నుండునుగాని, వంకర టింకరగానుండవు. దీనికి కారణమేమన, యీరాష్ట్రములు వానియంతట యవియేర్పడి క్రమక్రమముగా పెరిగినవికావు. ఒక విశాలమైనస్థలముకొని, దానిలో వీథుల నేర్పఱచి, కొద్దికొద్ది స్థలములనిచ్చి, యిండ్లు కట్టించినయెడల, ఒక పేట యెట్లుయేర్పడునో, ఆవిధముగనే, యీరాష్ట్రములకు కల్పితమైన తిన్నని యెల్లలేర్పఱచిరి. ఈరాష్ట్రములన్నియు, గాలివలన విత్తులు కొట్టుకొనిపోయి, అక్కడక్కడ మొలచిన మొలకలుగాక, మనుష్యులవలన పాతబడి పెరిగిన వృక్షముల వంటివి. పసిఫిక్కు మహాసముద్రమునకును, సిరా నివాడాయను పర్వతపంక్తికిని మధ్యనున్న కెలిఫోర్నియారాష్ట్రము తప్ప తక్కినరాష్ట్రములకన్నిటికి తిన్ననైన వీథులేర్పఱచుకొన్నటుల, సంయుక్తరాష్ట్ర ప్రభుత్వమువారు యెల్లల నేర్పాటుచేసిరి.

ప్రతిరాష్ట్రము తనకొకరాష్ట్ర నిబంధనవ్రాతమూలకముగ నేర్పఱచుకొన్నది. దీనికి తక్కిన రాష్ట్రములకు గాని, సంయుక్తరాష్ట్రప్రభుత్వమునకుగాని సంబంధములేదు. కాని, ప్రతిరాష్ట్ర రాజ్యతంత్రము ప్రజాప్రభుత్వము గలదై యుండవలెను. సాధారణముగ తూర్పురాష్ట్రములలో నుండుప్రజలు పశ్చిమరాష్ట్రములకు వలసపోయి, అక్కడ కాపుర మేర్పఱచుకొనుటచేత పూర్వరాష్ట్రముల వంటి నిబంధనలనే, పశ్చిమరాష్ట్రవాసులుకూడ నేర్పాటుచేసికొనుచు వచ్చిరి. కొద్ది విషయములలో తప్ప, యీరాష్ట్ర నిబంధనలన్నియు ఒకరీతిగనే యుండును. టెలిగ్రాఫు పోస్టుఆఫీసులు, రైల్వేలు, కాలువలు, వార్తాపత్రికలు మొదలగునవి యీరాష్ట్రముల నొండొంటితో బంధించుటవలన, అన్ని రాష్ట్రములవారును, తమరందఱు ఒకటే జాతివారుగ నెంచుకొనెదరు. ఇంతియగాక, ప్రతిరాష్ట్ర రాజ్యతంత్రములో రాష్ట్రవాదులు, ప్రజావాదులు అని రెండు కక్షులుమాత్రమే యుండును. ఈ యిరుకక్షులవారి యభిప్రాయములు వీటిననుసరించి నడువవలసిన పద్ధతులు, వీరిలోనుండు ప్రముఖులు యాజమాన్యము, ఆయా నియమితకాలములలో సంయుక్తరాష్ట్ర రాజ్యాంగములకు దేశమంతటను ఒకేసారిగ జరుగు యెన్నికలు, యీరాష్ట్రములన్నిటితో ఒకేవిధముగ నుండును.

ఒకప్రాంతమూలకమైన నిబంధన ఒక కార్యనిర్వాహకశాఖ (అనఁగా గవర్నరు, వీరిక్రింది యుద్యోగస్థులు) ఒక చట్టనిర్మాణశాఖ జిల్లాలనగరుల పట్టణముల స్థానికప్రభుత్వము, పన్నులను విధించు ఖర్చుచేయు పద్ధతులు, అప్పులు తీసికొనుట, చట్టములు, శివిలు క్రిమినల్ ప్రొసీడరుకోడ్డులు మొదలగునవి, యేర్పాటుచేసి కోర్టులను స్థాపించుట, విదేశీయులను తమపౌరులుగ చేసికొనుటకు నిబంధనలేర్పఱచుట—యీ మొదలగు విషయములలో వివిధరాష్ట్రములు, భిన్నభిన్నపద్ధతుల నేర్పఱచుకొనుచుండును. దీనికి రెండుమూఁడు దృష్టాంతములను చూపెదము. (1) ఎవరైనను సంయుక్తరాష్ట్ర రాజ్యతంత్రములో సహకారిగనుండవలెనన్న యీనలువదిరాష్ట్రములలో నేదియో నొకదానిలో పౌరుడుగా నుండవలెను. ఆరాష్ట్రములో తనకు వోటున్న యెడల, సంయుక్తరాష్ట్రరాజ్యతంత్రములో జరుగు యెన్నికలలోకూడ తనకు వోటుండును. కొన్నిరాష్ట్రములలో యీపౌరత్వము సులభముగ సంపాదించుకొనవచ్చును. మరికొన్ని రాష్ట్రములలో కొంతయెక్కువ కఠినముతోగాని దొరకదు. (2) ప్రతిరాష్ట్రమునకును తనసరిహద్దులలోనున్న ప్రతివ్యక్తిమీఁదను సంపూర్ణమైన యధికారముకలదు. స్థానికప్రభుత్వమును, తనకిష్టమున్న యెడల తనప్రజల కొసంగవచ్చును; లేక నిరాకరించ వచ్చును. ఈరాష్ట్రప్రభుత్వము తనరాష్ట్రములోనున్న పెద్దపట్టణములలోకూడ మ్యునిసిపాలిటీలను తీసివేయవచ్చును.

ఒక్క కమీషనరుచేతనే. యీమునసిపాలిటీలను పరిపాలింపవచ్చును. రోడ్డు దీవి యనురాష్ట్రముయొక్క వైశాల్యములో దానిముఖ్యపట్టణమైన ప్రావిడెన్సు అనునది మూఁడవవంతున్నది. న్యూయార్కు రాష్ట్రములోనున్న జనసంఖ్యలో మూఁడవవంతుజనము న్యూయార్కు పట్టణములోనున్నది. ఇట్లున్నను, ఆయారాష్ట్రాధికారులు తమ ముఖ్యపట్టణములలో మ్యునిసిపాలిటీలను తీసివేయవచ్చును. సంయుక్తరాష్ట్రప్రెసిడెంటుగారుగాని, కాంగ్రెసువారుగాని యిట్టిరాష్ట్రీయ విషయములలో నెంతమాత్రము జోక్యము కలుగఁజేసికొనఁగూడదు. (3) ప్రతిరాష్ట్రము తనపౌరులను, రాజద్రోహమునకు శిక్షించ వచ్చును. 1861సంవత్సరములో జరిగినయంతఃకలహములో, దక్షిణరాష్ట్రముల ప్రజలు, వారిరాష్ట్రీయశాసనములకు లోబడుచు, సంయుక్తరాష్ట్రాధికారమునకు వ్యతిరేకముగ నడువ వలసివచ్చెను.

ఏరాష్ట్రమైనను సంయుక్తరాష్ట్రసంఘమునుండి విడఁగూడదు. విదేశీయులతో సంబంధించిన విషయములలో జోక్యము కలుగఁజేసికొనకూడదు. సంయుక్తరాష్ట్రమునకు నిబంధనవలనగలిగిన యధికారములు రాష్ట్రప్రభుత్వమువారుకూడ చెలాయించవచ్చును. ఇట్టివానివిషయమై భేదాభిప్రాయములున్నప్పుడు సంయుక్తరాష్ట్ర నిబంధనయొక్క వ్యాఖ్యానమును గుఱించి సంయుక్తరాష్ట్ర సుప్రీముకోర్టువారి తీర్పు ఆఖరు తీర్పు గనుక, దానికందఱు బద్ధులై నడచుకొనవలయును.

సంయుక్తరాష్ట్ర నిబంధన కాంగ్రెసువారెటుల మార్చలేరో ఆలాగుననే, రాష్ట్రనిబంధనలను రాష్ట్రచట్టనిర్మాణశాఖలు మార్చలేవు. జనులే తమవోట్లనుబట్టి మార్చవలయును.

ఆస్ట్రేలియా, కనడా, దక్షిణయాఫ్రికా మొదలగు నింగ్లాండు వలన రాజ్యములలో రాజ్యనిబంధనలు బ్రిటిషుపార్లమెంటు వలన యేర్పడినవి గనుక ఆపార్లమెంటువారివలన నవి రద్దుచేయబడవచ్చును. కాని యీరాష్ట్రనిబంధనలను, కాంగ్రెసువారు రద్దుచేయుటకుగాని మార్చుటకుగాని వలనుపడదు. బ్రిటిషు వలన రాజ్యములలో, చట్టనిర్మాణశాఖలు బ్రిటిషు పార్లమెంటువారికి నామమాత్రమున కైనను లోబడియున్నవి. అమెరికా రాష్ట్రములవలె తమప్రజలకు లోబడి యుండవు. ఈరాష్ట్రములలో నిబంధనలను మార్చవలెనన్న ఆయా నిబంధనలలో చెప్పినప్రకారముగాని, అట్లుచెప్పనియెడల అప్పటిచట్టనిర్మాణశాఖవారు చేయునేర్పాటులను బట్టిగాని ప్రజలవోట్లమీఁదనెన్ని మార్పులనైనను చేయవచ్చును.

ఈరాష్ట్ర నిబంధనలన్నియు క్రమక్రమముగ మారుచు మొత్తముమీఁద ఒకేవిధముగ నున్నవి. మగవాండ్రందఱకును వోటువేయునధికారముకలదు. న్యాయాధిపతులు అనేకరాష్ట్రములలో నియమితకాలమునకు యెన్నికొనబడుచుందురు. సంయుక్తరాష్ట్రోద్యోగియుడు రాష్ట్రచట్టనిర్మాణశాఖలో మెంబరుగా నుండకూడదు. ఏరాష్ట్రములోనైనను ఉద్యోగిగాకూడ నుండఁగూడదు.

రాష్ట్రములలో కార్యనిర్వాహక సంఘమువారు చేయవలసిన పనులు బహుకొద్దిగనుండును. గవర్నరుగారి నిరాకరణాధికారము చట్టనిర్మాణ విషయములో తప్ప మరియెక్కడను కానరాదు. రాష్ట్రములలో ప్రతిజిల్లా, పట్టణము, గ్రామము, వీని పరిపాలన గురించి వానిసంఘములకే వదలివేయుట వలనను, గొప్పవిషయములన్నియు సంయుక్తరాష్ట్ర ప్రభుత్వమున కిచ్చుటవలనను, రాష్ట్రీయకారనిర్వాహక సంఘములకు చిక్కుగల విషయములనుగురించి విచారించవలసినపనిలేదు. వీరు చేయవలసిన ప్రతిస్వల్పకార్యము చట్టముల మూలముననే యేర్పడియుండును. ఈసంఘములమెంబర్లకు సొమ్ము సరిగా వ్యయముచేయుటయే ముఖ్యమైనపని. ఇది గుమాస్తాలు చేయుపనివంటిదే. ఈమెంబర్లు రెండుసంవత్సరములకొకసారి మారుచుండుటచేత వీరికి తమనిరంకుశాధికారమున కవకాశములేదు. ఎప్పుడైనను, వీరు సొమ్ముహరించినట్లు తెలియవచ్చినయెడల చట్టనిర్మాణ సంఘమువారు వీరిమీఁద దోషారోపణచేసి శిక్షించెదరు. వీరుచేయు పనులను అప్పుడప్పుడు పరీక్షించుటకై కమిటీలేర్పాటు కాబడు చుండును.

న్యాయాధిపతులు 31 రాష్ట్రములలో జనులచే నెన్నుకొనబడెదరు. అయిదురాష్ట్రములలో చట్టనిర్మాణ శాఖలవలన నెన్నుకొనబడెదరు. ఎనిమిదిరాష్ట్రములలో గవర్నరులచే నియమింపబడి, కౌన్సిలువలనగాని, చట్టనిర్మాణసంఘమువలనగాని,

లేక దానిలో నొకశాఖవలనగాని యామోదింపబడవలయును. నాల్గు రాష్ట్రములలోతప్ప, యిల్లెన్నుకొనబడిన న్యాయాధిపతులు రెండుసంవత్సరములవరకు తమపదవులలో నుండునటుల ఆయారాష్ట్రనిబంధనలలో యేర్పాటులు చేయబడియున్నవి. కొద్దికాలమువరకే యెన్నుకొనబడి కొద్దివేతనములు మాత్రమే తీసికొనుచుండు న్యాయాధిపతులు, రాష్ట్రనిబంధనలకుకూడ తమకిష్టమువచ్చిన వాక్యార్థములు చేయగలశక్తికలిగియున్నపుడు వీరెల్లపుడు నిర్భయముగ నిష్పక్షపాతబుద్ధితో న్యాయమార్గానువర్తులగుదురా యని మనకు సంకోచము కలుగవచ్చును. కాని వీరిప్రక్కనే మంచిశక్తిసామర్థ్యములు గలిగి న్యాయముగ పనిచేయుచున్న సంయుక్తరాష్ట్ర న్యాయాధిపతు లుండుటచేత లంచములు పుచ్చుకొనువారిని అసమర్థులను యెన్నుకొనుటకు జనులు సిగ్గుపడియెదరు. బహుజనాభిప్రాయము సమర్థులగులాయర్ల పక్షముననేయుండును. ఈయభిప్రాయమునే రాష్ట్రములోనుండు న్యాయవాదులందరు బలపరచి తగినవారి నేర్పరుచుటకు కృషి చేయుదురు.

PART. III.

తృతీయ భాగము.

రాజ్యపాలనము.

CHAPTER I.

పరిపాలకుల విధులు.

మనదేశములోనుండు వివిధ రాజ్యములను పూర్వము నుండియు చక్రవర్తులు, సామంతరాజులు, జమీందారులు, నవాబులు స్వయముగగాని లేక తమతాబేదారుల వలనగాని పాలించుచుండిరి. వీరిలోకొందరు న్యాయముగను, సమర్థముగను, మరికొందర న్యాయముగను అసమర్థముగను, తమ యధికారములను వినియోగించుచుండిరి. పల్లెటూళ్లలో పైయధికారులు విధించుపన్నులను గ్రామ మొత్తముమీద జనులిచ్చుకొనుచు తమగ్రామ సంబంధమైన వ్యవహారములను పంచాయితీ సభలగుండా పరిష్కరించుకొనుచుండిరి. తమదేశపు రాజ్యము లనెడివృక్షములు గొప్పవిప్లవము లనెడితుపానులచే వ్రేళ్లతోఁగూడ పెకలింపబడి మహాప్రవాహమున కొట్టుకొనిపోవుచుండినను, గ్రామసంఘములు రెల్లుపాచలవలె అట్టిసమయము లందు మాత్రము వంగి మునిగిపోవుచు విప్లవానంతరమున తలలెత్తుచు యధాప్రకారము తమమామూలు కార్యమును జరి

గించుచుండెను. బ్రిటిషురాజ్యము మనదేశములో స్థిరముగ స్థాపింపబడిన తరువాత మనయాంగ్లేయులు యేకచ్ఛత్రాధిపత్యము వహించి యిప్పటికి సుమారు నూఱు సంవత్సరములు కావచ్చినది. అదివఱకెన్నడును మనపూర్వులెఱుగని నూతన కట్టుబాటులతో చక్కగను నెమ్మదిగను రాజ్యపరిపాలన చేయుచున్నారు. కాని వీరిపాలనలో పూర్వపు పంచాయతీసభలు నశించుటయు ప్రజలకు రాజ్యాంగ విషయములలో బొత్తిగ స్వాతంత్రతము లేకపోవుటయు తటస్థించినది. గత యేబది సంవత్సరములనుండియు ఆంగ్లేయ విద్యనభ్యసించి పాశ్చాత్యరాజనీతిని గ్రహించిన మనదేశస్థుల సంఖ్య క్రమక్రమముగ వృద్ధియైన కొలది మనవారు ప్రభుత్వముతో సంబంధించిన వివిధశాఖలలో గొప్ప ఉద్యోగములు సంపాదించుకొనుటకును రిపనుప్రభువుగారు స్థాపించిన స్థానిక ప్రభుత్వములోచేరి పనిచేయుటకును తగినసమయము వచ్చినది. ఇటీవల చట్టనిర్మాణకార్య నిర్వాహక శాఖలలో మనవారు మెంబర్లుగ నుండుటయు వారిలో కొందరిని ప్రజలెన్నుకొనుటయు తటస్థపడుచున్నది. ఇకముందు, సామ్రాజ్యశాసన నిర్మాణసభలోను రాజధాని చట్టనిర్మాణసభలోను స్థానిక ప్రభుత్వశాఖలలోను, (లోకలుబోర్డులు మ్యునిసిపాలిటీలు యూనియనులు గ్రామపంచాయితీలు విలేజికోర్టులు మొదలగునవి) యెక్కువమందిప్రజాప్రతినిధులు చేర్చబడుదురు గాన సామాన్య ప్రజలు తమవిధ్యుక్త రాజకీ

యధర్మములను సరిగానెరవేర్చవలెనన్న కొద్దిగనైనను రాజ్యపరిపాలన శాస్త్రమును తెలిసికొనియుండవలెను. ఈవిషయమై సవిస్తరముగ వ్రాయక కొన్ని ముఖ్యాంశములను మాత్రము జనసామాన్యమునకు బోధపడునటుల వ్రాయుటకు ప్రయత్నించెదను.

దేశములో నతఃకలహముల నణచుటకును, ప్రజలలో ఉద్దేశ్య పూర్వకముగగాని, అజాగ్రతవలనగాని ఒకరు మరియొకరి దేహమునకు, మానమునకు, యాస్తికి, స్వాతంత్ర్యమునకు లేక కంట్రాక్టులకు భంగము కలుగఁజేయకుండుటకును, పిల్లల యొక్క సంరక్షణ విద్యమొదలగు భాగములను వారితలిదండ్రులమీద వేయుటకును, పరరాజులబారినుండి ప్రజలను రక్షించుటకును, పరదేశములలో నున్న తమప్రజలను కాపాడుటకును, వారితరదేశస్థులను హానిచేయకుండుటకును, తనయంతశ్శత్రుబహిశ్శత్రులనుండి తాను కాపాడుకొనుటకువలయు సాధనసామగ్రిని చేర్చియుంచుకొనుటకును, ప్రతియాధునిక నాగరిక పరిపాలకులకు విధియైయున్నది. తక్కిన విషయములలో పాలితులకు సంపూర్ణ స్వాతంత్ర్యము కలిగియుండవలెను. పాలితులలో యెవరైనను తమ విధ్యుక్తధర్మములను మీరి ప్రవర్తించిన యెడల నష్టము పొందినవారికి ధనరూపముగ పరిహారమిచ్చుటయేగాక ఒకానొకప్పుడు నేరస్థులకు శిక్షకూడ విధింపబడును.

నేరము జరిగినదని తెలియవచ్చినపుడు పక్షపాతరహితమైన విచారణచేసి మొదట అట్టినేరము జరిగినదా లేదా, జరిగినయెడల యెవరునేరముచేసిరని తెలిసికొనుటయు, జరిగినదని ధృవపడిన తరువాత నేరస్థుని శిక్షించుటకు తగినప్రయత్నములు చేయుటయు, పాలకుల ముఖ్యవిధులై యున్నవి. ఈ రెండు విధ్యుక్త కార్యములను బాగుగ నెరవేర్చుటకు వేరువేరుమనశ్శక్తులు అభ్యాసములు కలిగి యుండవలెను. న్యాయాధికార కార్యనిర్వాహకశాఖలు యీరెండు కార్యములను నిర్వహించవలెను. ఈ రెండు శాఖలు, యెంతవరకు ఒకదానితోనొకటి సంబంధము కలవిగా నుండవలెనో, యెంతవరకు విడిగానుండవలెనో ముందువిచారింతము.

ప్రస్తుతము నేరస్థులను పట్టుకొని, వారితరులను హానిచేయకుండ పోలీసు భటులు జైలర్లు మొదలగు నుద్యోగస్థులను నియమించుట; విదేశీయులు దాడివెడలిన యెడల వారిని తరిమివేయుటకు సేనలను నావికాబలమును సిద్ధముచేసికొనుట; పరదేశరాయబారుల కాతిథ్యమిచ్చుట; విదేశములలోనున్న తమప్రదేశములకును తమ ప్రజలకును సంబంధించిన విషయములను జాగరూకతతో కనిపెట్టియుండుటకు తమ రాయబారులను పంపుట; అనుమానముగలమనుష్యులను పట్టుకొని, వారు కోర్టులలో విచారింపబడువరకు, వారిని బంధించుట; యీమొదలగువిధులను కార్యనిర్వాహక శాఖవారు నెరవేర్చవలయును.

పైనచెప్పిన బనులన్నియు పాలితులలోనుచితముగ చేయువారుండరు గనుక అనేకమంది జీతగాండ్ర నేర్పాటు చేయవలయును. వీరికి కావలసిన వేతనములకు పరిపాలితుల యాస్తి మీద కొద్దిగనోగొప్పగనోపన్ను విధించవలయును. ఈపన్నులను వసూలుచేయువారు, ఉద్యోగస్థులకు జీతముల నిచ్చివేయువారు, లేఖలు వ్రాయువారు తనిఖీచేయువారు, వీరందరు కార్యనిర్వాహకశాఖలో నొకడిపార్టుమెంటుగానుందురు. ఇదిగాక, గొప్ప యుద్ధములు తటస్థించినపుడుతప్ప, మామూలుగ సావత్సరమునకు, పరిపాలన ఖర్చుల కెంతద్రవ్యము కావలెనో ముందుగా నేర్పడినగాని జనులమీద యెంత పన్నుబడునో తెలియక పరితపించుచుందురు. కాబట్టి పన్నులను ఖర్చుపెట్టు వారియందు పన్నులను విధించు నధికారముండకూడదు. వేరుగ మరియొక శాఖచేత ముందు సంవత్సరపు ఆదాయవ్యయముల పట్టీ (అనగా బడ్జెటు) తయారు చేయబడవలయును. ఈశాఖలోనందరు పన్నులనిచ్చువారి ప్రతినిధులుండుట మంచిదని నేను వేరుగ చెప్పనక్కరలేదు. ఈ విషయమై ముందు చర్చించబడును.

CHAPTER. II.

రాజ్యాంగములు, వానిపద్ధతులు.

న్యాయాధిపతులు తమ యెదుటకు తీసికొనిరాబడు కేసులను సరిగా తీర్పుచేయుటకు న్యాయశాస్త్ర నిబంధనలుండవలెను. ఈనిబంధనల నేర్పరుచుటకు వేరుగ నొకసంఘ ముండవలెను. ఇవి జనసామాన్యమునకు తెలియగలందులకు బహిరంగముగ ప్రచురింపఁబడును. పీనల్‌కోడ్డులో నిషేధించిన విషయములు చదువుకొనకుండగనే అందరికి దెలియదగినవి. శివిలువ్యవహారములలో చిక్కులు, లాయర్ల నడిగి తెలిసికొన వలసినదే గాని చట్టము లెంతవిరివిగా ప్రచురింపబడుచున్నను, వానిని సులువుగ గ్రహించుటకు వీలులేదు. చట్టములను వ్యాఖ్యానము చేయుటలో న్యాయాధికారులు, క్రొత్త నిబంధనలను తమతీర్పులలో నిమిడ్చుచుందురు. నాగరికత హెచ్చినకొలది యీచట్టములు నిబంధనలు కేసులు అనేకవిషయములతో సంబంధించి అపారపారావారముగ పెరిగి తుదకు కొద్దిమంది న్యాయాధికారులకును, న్యాయవాదులకును గ్రహింపదగిన విషయములగుచున్నవి. కాని యేవ్యక్తియు తనకు న్యాయశాస్త్రము తెలియలేదని తప్పించుకొన వీలులేదు. ఇది బహువిరుద్ధమైనప్పటికిని యిట్టిరూలు లేనియెడల ప్రతివాడును యీసమాధానమునే చెప్పి న్యాయము నతిక్రమించుచుండును.

కాబట్టి కొన్ని చిక్కువిషయములలో కొందరు తాము తప్పు చేసితిమని తెలియకనే శిక్షార్హు లగుచున్నను మొత్తముమీద యిట్టి నిబంధనయుండి తీరవలయును.

సంఘముయొక్క సంరక్షణకు వ్యక్తిస్వాతంత్ర్యముతో పరిపాలకులు అనేకవిషయములలో జోక్యము కలుగజేసికొనక తప్పదు. గ్రామ పారిశుధ్యము, చెడుగైన భోజన పదార్థములను, మత్తుపదార్థములను అమ్మకుండచేయుట, తుపాకిమందు మొదలగు పేలగొట్టు పదార్థములను లైసెన్సులేనిదే చేయకుండుట, అడవులు సముద్రపురేవులు మొదలగు వానిని గురించి నిబంధనలుచేయుట బలాత్కారముగ విద్యనభ్యసింపజేయుట, ముదుసలులు దుర్బలులగు పనివాండ్ర జీవనోపాధికి భీమాచేయించుట, యిట్టి యనేక విషయములలో పాలకులు నిబంధనలను జేయుచుండక తప్పదు. కాబట్టి వ్యక్తి స్వాతంత్ర్యమున కెంతవరకు నష్టముకలుగకుండ చేయవలయునో యెంతవరకు దానికి మేరలుంచవలయునో విచారించుటకు జనులప్రతినిధులు గల యొక చట్టనిర్మాణసంఘ ముండవలయును.

జనోపయోగకరమైన పనులను చేయుటకు, దొరతనమువారు ప్రజలలో సంఘముల నేర్పరిచి వానికి కొన్ని యధికారముల నిచ్చెదరు. దీని కుదాహరణములు రైల్వేకంపెనీలు, మ్యునిసిపాలిటీలు, లోకలుబోర్డులు, పంచాయతీసభలు, విద్యాపరిషత్తులు, భీమాకంపెనీలు, బ్యాంకులు, పరపతిసంఘములు

మొదలగునవి. ఒక్కొక్క వ్యక్తిచేసికొన లేనట్టియు, దొరతనమువారు, తమకు సావకాశములేక చేయలేనట్టియు అనేక జనోపయోగములగు పనులను, యిట్టిసంఘములు నిర్వహించవలసియుండును.

చట్టములను చేయువారును, వీనిని యమలులో పెట్టువారును విడిగానుండుటమంచిది. జనుల స్వాతంత్ర్యములకు మేరలను కల్పించు చట్టములను చట్టనిర్మాణశాఖవారు చేయుదురు. వీని నమలులో పెట్టు విషయములోకూడ శివిలు క్రిమినల్ప్రొసీజరుకోర్టు మొదలగు కొన్ని నిబంధనలను చేయుదురు. వీని నన్నిటి ననుసరించియే కార్యనిర్వాహక శాఖవారు నడచుకొనవలయును. పన్నులను విధించునధికారముకూడ చట్టనిర్మాణశాఖ వారియందే యుంచుటవలన కార్యనిర్వాహక శాఖవారికి తమ స్వాధీనమం దుంచుకొన్నటుల భావించవలసియున్నది ఆధునిక రాజ్యములలో నెల్ల, చట్టనిర్మాణమును, పరిపాలనకు కావలసినఖర్చులకై పన్నులను విధించుటయును, వానిని ఖర్చు చేయు విధమును, ఒకశాఖయందే యున్నవి. దొరతనమువారు ప్రజల స్వాతంత్ర్యములతో జోక్యము కలుగజేసికొను విషయములలో నెల్ల చట్టనిర్మాణము పన్నులను విధించుట ఖర్చుచేయుట అగత్యమై యున్నవి. ఈయధికారములు వేరువేరుశాఖలలో నున్నయెడల జవాబుదారీ విడిపోవుటచేత ఫలోత్పాదకశక్తియు మితవ్యయమును కలసియుండుట తటస్థపడదు. అప్పుడు

వ్యయముచేయు శాఖ చట్టనిర్మాణశాఖచేత క్రొత్తపన్నులను విధింపజేయనట్టి శక్తికలిగియుండును. కాబట్టి చట్టనిర్మాణశాఖకు పన్నులను విధించునధికారమును వానిని ఖర్చుచేయు విషయములో పైతనిఖీచేయు నధికారమును కలిగియుండవలెను. రాజద్రవ్య సంబంధవిషయములలోనేగాక, చట్టనిర్మాణశాఖకు కార్యనిర్వాహకశాఖ లోబడి యుండవలసినందుకు మరికొన్ని కారణములుకలవు. రాజకీయోద్యోగీయులు సామాన్య జనులవలెగాక దొరతనమువారితో తాముచేసికొన్న కంట్రాక్టులకు వ్యతిరేకముగ నడచుకొన్న యెడల యెక్కువ కఠిన శిక్షలకు పాత్రులగుచుందురు. వీరికి విధించు శిక్షలు శిక్షార్హమగు పనులను కనబరచు నిబంధనలు వీరిని శిక్షించుటకు పూర్వము జరుగవలసినచర్య యీ మొదలైన విషయములను గురించి చట్టనిర్మాణశాఖవారి యంగీకారము పొందవలయును. న్యాయశాస్త్రిములలోనుండు లోపములవలన ఒకప్పుడు చట్టములకు విరుద్ధముగా కనుపడకుండగనే కార్యనిర్వాహకశాఖ తన యధికారమును చెలాయించవచ్చును. కాబట్టి జనులు స్వాతంత్ర్యములకు భంగము కలుగకుండగ చట్టములలో నేర్పరిచిన మేరలను మించకుండుటయేగాక అట్టిమేరలలో చెలాయించబడు కార్యనిర్వాహక శాఖాధికారము చట్టనిర్మాణశాఖయొక్క విమర్శనమునకు సదా లోబడియుండవలయును. దీనివలన చట్టములలో నుండులోపములను నూతన నిబంధనలవలన సవరింపబడుచు

డును. చట్టనిర్మాణశాఖయొక్క అడ్డంకులను తప్పించుకొనవలె ననుకోరికయే, కార్యనిర్వాహకశాఖను క్రమమైన మేరలలో నుంచును.

రాజులు, మంత్రులు, పెద్దయుద్యోగస్థులు, పరిపాలకులని పిలువబడుచున్నవారందరు కార్యనిర్వాహకశాఖలో చేరినవారే యని యెంచవలయును. పరదేశీయులతో జరుగు వ్యవహారములలో యీశాఖకు యెక్కువయధికారముండవలసివచ్చినను, పై విచారణ చేయునధికారము చట్ట నిర్మాణ శాఖయందుండి తీరవలయును. ఇట్లున్నయెడల చట్టనిర్మాణశాఖ నిరంకుశాధికారమును కనపరచి, ప్రజలను పీడించకపోవునాయని కొందరడుగవచ్చును. అవును. అదినిశ్చయమే. ఈయపాయముకలుగకుండ యీశాఖయొక్క నిర్మాణమెట్లుండవలెనో దీనిలోని మెంబర్లు యెట్టిస్థితిగతులు గలవారుగ నుండవలెనో, యేవిధముగ వీరు ప్రజలచేత నెన్నుకొనబడవలెనో యీవిషయములను గురించి వివిధదేశములవారు వేరువేరు విధముగ తమకు చితమని తోచినరీతిని నిబంధనలను చేసికొనుచున్నారు. ఈ విషయమై ముందు వ్రాయబడును.

కార్యనిర్వాహకశాఖ చట్టనిర్మాణశాఖకు వేరుగనుండుటయేగాక మొదటిదానికి కొంతవరకు స్వతంత్రాధికారముకూడ నుండవలయును. ఇట్టి యధికార మెంతయుండవలెనో, యెట్టి మేరలకులోబడి దేనియందీ యధికారము నిలుపవచ్చునో ముందు వివరింపబడును.

పైన వ్రాసిన కారణములనుబట్టియే, న్యాయాధికారశాఖ కార్యనిర్వాహక శాఖకు సంబంధములేకుండగనుండి యీ రెండవదిచేయు కార్యములు న్యాయనిబంధనానుసారముగ నున్నవా లేవా యని విచారించవలసియుండును. కార్యనిర్వాహకోద్యోగీయులను విచారణచేయు నధికారము మామూలుకోర్టుల కీయబడవలయునా, లేక వేరుగ నొక స్పెషల్‌కోర్టు కీయవలయునా యను విషయము ముందు విచారింతము.

న్యాయాధికార చట్ట నిర్మాణశాఖలుకూడ వేరుగనుండవలసినదే. చట్టములను వ్యాఖ్యానముచేయుట కోర్టులపనియైయున్నది. న్యాయశాస్త్రము లెట్లుండవలెనో తెలియజెప్పుట కోర్టులపనికాదు. న్యాయశాస్త్రము ప్రస్తుతమెట్లున్నది? తమ యెదుటకు తీసికొనిరాబడిన కేసులలో కనపరచుట మాత్రమే కోర్టులవిధి. ఇదిగాక, కోర్టులలో తేబడుకేసులను విచారించి లాప్రకారము తీర్పులుచేయుటకు కొంతయనుభవముండవలెను. చట్టనిర్మాణశాఖలోని మెంబర్ల కట్టి యనుభవ ముండజాలదు. కాబట్టి యీ రెండు శాఖలు వేరుగ నుండవలయును.

చట్టనిర్మాణశాఖ.

రాజ్యాంగనిర్మాణములో, చట్టనిర్మాణశాఖ కార్యనిర్వాహకశాఖ న్యాయాధికారశాఖయని మూడంగములుండునని తెలియపరిచితిమి. చట్టనిర్మాణశాఖవారికే పన్నులను విధించు నధికారము, ఆదాయవ్యయములను గురించి పైవిచారణచేయు

నధికారముకూడ యుండవలయునని చెప్పియున్నాము. చట్టనిర్మాణశాఖ తక్కిన రెండుశాఖల కంటెను హెచ్చు అధికారము కలిగియుండును. ఇది చట్టముల నేర్పరచగా వానిని న్యాయాధికారశాఖ తనయెదుటకు దీసికొనురాబడు కేసులలో వర్తింపజేయవలయును. కార్యనిర్వాహక శాఖ వానిని నడపుచుండును. ఈ రెండు శాఖలకుకూడ తమ విధ్యుక్తకార్యములలో కొంత స్వాతంత్ర్యముండక తప్పదు. ఎంతవరకు, యేవిధముగ యీ స్వాతంత్ర్యము వీనికి కలిగింపబడునో ముందు విచారింతము.

చట్టనిర్మాణశాఖ యేవిధముగ నేర్పాటుచేయబడవలెనను ప్రశ్నకు, ఆపనికి సమర్థులైన వారే దీనిలో నుండవలెనని సరియైనయుత్తరువుగా కనబడుచున్నది. కాబట్టి లాయర్ల సంఖ్య దానిలో నెక్కువగ నుండకతప్పదు. చట్టములను తయారుచేయుట, ఇవి పూర్వచట్టములకు విరుద్ధముగాకుండ నన్నిటిని సమ్మేళనము చేయుట, మిగుల ననుభవశాలురైన గొప్పలాయర్ల పనియైయున్నది. కాని యీ చట్ట నిర్మాణశాఖలో అందరుగాని, మిగుల నెక్కువమందిగాని లాయర్లుండకూడదు. మిక్కిలి చిక్కులతో నిండిన నిబంధనలను, అప్పటప్పటికి కోర్టుల యెదుటకు వచ్చు కేసులలో ప్రయోగించగల శక్తికిని అమలులోనున్న చట్టములను పోల్చిజూచుచు నూతనచట్టములు జనోపయోగముగ నున్నవా లేవాయను విషయము నాలోచించగల శక్తి

కిని మిక్కిలి వ్యత్యాసము కలదు. ఈరెండుశక్తులకును, న్యాయశాస్త్రజ్ఞానముండవలసినదే, అయినను యీ రెంటికిని తారతమ్యముకలదు. కాబట్టి కేవలము న్యాయశాస్త్రజ్ఞులే గాక, వివిధ విషయములలో లోకానుభవము కలవారుకూడ యీ సభలోనుండవలెను. ఇదిగాక దేశములోనుండు వివిధసంఘములవారి కష్టసుఖములను తెలియగల వారు ప్రతినిధులుండవలెను. తమ ప్రతినిధులచే నిర్మింపబడిన చట్టములు ఒకప్పుడు కఠినముగా కనుపడినను, ప్రజలు వాని కట్టు దిట్టములకు లోబడియుందురు. వారు వాని నామోదించుట సహజము.

ఈప్రతినిధులు జనులలో నెట్టివారిచేనియమింపబడవలెను? పదునెనిమిది సంవత్సరముల యీడుగలిగి, పిచ్చవాడు కాని ప్రతిమనుజుడు, వోటీయు నధికారము కలిగియుండ వచ్చునా? జనులలో నేతరగతి వారికైనను వోటువేయు నధికారము యీయనియెడల వారిలో అసంతృప్తి కలుగవచ్చును. కాని కొన్ని దేశములలో మేజరులైనను కొంతవయస్సు రానివారికిని స్త్రీలకును కడుబీదలకును, వోటు వేయునధికారములేదు. భయమువలనగాని, లంచమువలనగాని డంబముకొట్టుటవలనగాని మోసపోయి కొందరు వోటర్లు బాగుగ విచారించుకొనకుండగనే తమ వోట్లనిచ్చుట తటస్థపడుచుండును. అంతమాత్రముచేత వోటువేయు నధికారము సామాన్యప్రజలకీయక పోవుట న్యాయము కాదు. రహస్య స్థలములో యెవరికిని తెలియకుండ జనులను వోటువేయునట్లు చేసినయెడల యిట్టి దౌర్జన్యములు కొంతవరకు

తగ్గవచ్చును. అటులభయపెట్టినవారు దండనార్హులు. లంచముల
మూలమున జరిగిన యెన్నికలను రద్దుపరచవచ్చును. పనులలో
రాజ్యపరిపాలన విషయమై విద్యాభ్యాసము ప్రబలినకొలది
యిట్టి దుర్నడతలు తగ్గుచుండును. వోటు యీయవలెననేకుతూ
హలము సామాన్యజనులలో కనుబడనపుడు విద్యాధికులకును
ధనవంతులకును మాత్రమే యీవోటు వేయునధికారము నీయ
వచ్చును. కాలక్రమముగ నీయధికారమును యెక్కువమంది
యుపయోగించునటుల చేయవచ్చును. వోట్లు కావలెనను
వారు గొప్ప యాందోళనమును కలిగించుచు తమకోర్కెలను
వెలిబుచ్చినగాని దొరతనమువారు వారిని ఉపేక్ష చేయుచునే
యుందురు. ఇదియే యాధునిక రాజనీతి. ప్రజాందోళనమును
మీటింగుల మూలమునను వార్తాపత్రికల మూలమునను మహా
జరు పిటీషనుల మూలమునను బహిరంగపరచక పోయినయెడల
దొరతనమువారికి మన యిబ్బందులు కోరికలు యెట్లు తెలి
యును? కడుబీదలు మూఢులు యిన్సాల్వెంటులు నేరస్థులు
వీరికి సామాన్యముగ వోటు వేయునధికార మీయకూడదు.
ప్రాతినిధ్యముకోరు వారికి కూడ కొన్ని యోగ్యతలు చట్టముల
వలన స్థిరపరచవలెను. ప్రతినిధులుగ నుండగోరువారు తమకు
వోట్లు సంపాదించి పెట్టుటకు యేజెంట్ల నుపయోగపరుచుకొ
నుట తప్పుకాదుగాని పోలీసు బంట్రోతులు మొదలగు గవర్న
మెంటు ఉద్యోగస్థులు యీయెన్నికలలో నెట్టిజోక్యమును
కలుగఁ జేసికొనఁగూడదు.

స్త్రీలకుఁగూడ వోట్లు వేయునధికార మెందు కీయఁగూడ
దని యిప్పు డింగ్లాండులో గొప్పయాందోళనము పుట్టినది. ఈ
విషయమై లిబరల్ పార్టీలోచేరి ప్రస్తుతము రాజ్యము చేయు
చున్న ఆంగ్లేయ మంత్రివర్గములోనే రెండు పార్టీలేర్పడినవి.
ఫిన్లెండు, నార్వే, న్యూజీలండు మొదలగు దేశములలో ఆడ
వాండ్రకుగూడ వోట్లు నిచ్చునధికారముగలదు. దీనివలన నెట్టి
యిబ్బందియు నచ్చట తటస్థించలేదు. దేశమును కాపాడఁగల
వారు మగవాండ్రేయనియు స్త్రీలు కేవలము అబల లనియు,
గనుక వీరి కీహక్కుల నీయఁగూడదని కొందఱందురు. ఇది న్యా
యమైనయెడల సోల్జరులు, నావికులు వోటువేయునధికారము
గలిగియుందురు. సమయము వచ్చినప్పుడు స్త్రీలుకూడ తమశక్తి
కొలఁది శౌర్యమును జూపి తమదేశమును గృహమును కాపాడు
కొనినటుల పూర్వచరిత్రలలోనే గాక యీకాలములోఁగూడ
చూచుచున్నాము. ఫిన్లాండు దేశస్థులకును రష్యావారికిని జరిగిన
యుద్ధములకు మగవాండ్రందఱు వెళ్లగా ఫిన్నిషు స్త్రీరత్నము
లు, ఎప్పటివలెనే తమ రాజ్యమునంతయు నెమ్మదిగాఁ బాలించి
రఁట! అవివాహితలకు, వితంతువులకు వోటుల నిచ్చినయెడల
వా రాయధికారమును ఎక్కువ సావకాశముతోను, జాగ్రత
తోను నెఱవేర్చెదరు. భర్తలతో సమానముగ భార్యలకుఁగూడ
వోటు వేయునధికార మిచ్చినయెడలఁ గొన్నిచిక్కులు సంభ
వించు నని కొందఱి యభిప్రాయము. భర్తలకుండగా, భార్యల

కేల యనియు ఇద్దఱకును అధికారమిచ్చిన యెడల వీరిలోవీరికి భేదాభిప్రాయములు కలిగి యిండ్లలో పోరులకు కారణ మగు చుండుననియు వీరు తలంచెదరు. స్త్రీవిద్య ప్రబలని దేశములలో నిట్టి యధికారము స్త్రీల కీయకుండుటయే మంచిది. స్త్రీ పురుషులు సమానముగ విద్యనేర్చిన దేశములలో నిట్టి మీమాంసకు కొంత యవకాశమున్నది. ఈచర్చ మనదేశమునకు* ప్రస్తుత మవసరములేదు.

దేశములో కొందఱకు వోటు వేయునధికార మిచ్చి తక్కిన వారి కీయనందున ప్రతినిధులు బహుజనాభిప్రాయమును గమనింపక నడచిన యెడల ఏమిగతి ? సాధారణముగ అందఱు జనుల యక్కరలు ఒకటిగానే యుండును. ఒకప్పుడు ప్రతినిధులులేని చిన్నచిన్న సంఘములకు పరిపాలకులే మెంబర్ల నేర్పఱచెదరు.

ఒకానొకప్పుడు వోటువేయు నధికారముగలవారు వోటులు లేనివారి యభిప్రాయములకు వ్యతిరేకాభిప్రాయములుగల ప్రతినిధుల నేర్పర్చుకొనవచ్చును. అప్పుడు జనసామాన్యమున కసమ్మతమైన పనులు జరుగవచ్చును. ఇట్టి సమయములలోఁ దగిన విద్యాధికులును ధనవంతులును ప్రతినిధులుగా నుండక పోవుట తటస్థపడును. కనుక చట్టనిర్మాణశాఖను రెండుభాగములుగా విభజించి ఒకభాగములో నెక్కువమంది విద్యాధికులు ధనవంతులు ఉండులాగునను రెండవభాగములో జనసామాన్య

ముచేత నెన్నుకొనఁ బడుప్రతినిధు లుండులాగునను జేయ వచ్చును.

బీదలును గొప్పవిద్యల నభ్యసించనివారును చట్టనిర్మాణ శాఖకు ప్రతినిధులుగ నియమింపఁబడగూడ దని యేర్పాటు చేయుట న్యాయముకాదు. అటులయినచో బీదలకు రాజ్యాంగ విషయములం దాసక్తి యెట్లు పొడమును? వారికి చట్టనిర్మాణ ములయం దేమినమ్మక ముండును? కాఁబట్టి అన్నితరగతుల వారికి ప్రతినిధు లుండునటుల చేయవలయును. ధనవంతులకు సావకాశ ముండుననియు విద్యాధికులు కార్యముల నెక్కువ తెలివితో నడపఁగలుగుదు రనియు మన మొప్పుకోవచ్చును. కాని ప్రపంచజ్ఞానము పైతరగతులవారికంటె ఒకప్పు డితరులకే బాగుగ ననుభవములోనికి రావచ్చును. ఈభేదాభిప్రాయములను సఖ్య పఱుచుటకు ఒకమార్గముకలదు. ఈప్రతినిధులకు జీతము లేర్పాటు చేయకపోవుట. ఏసంఘముగాని తమలోనుండి ఒక ప్రతినిధిని కోరుకొన్నపుడు అతఁడు బీదవాఁడైన యెడల తమలోఁ దాము చందాలు వేసికొని అతనికి జీవనాధారము కల్పించవచ్చును. అతను తగినప్రతినిధి యని అతని నియామకు లెంచిన యెడల అట్టి చందాలను వేసి కొనుటయే తటస్థించదు. ఒకప్పుడు కడుబీదసంఘముల ప్రతినిధులకు జీతము లేర్పాటు చేయవలసి యుండును. ఇంగ్లాండులో మెంబర్లకు నెలజీతముల నేర్పఱిచిరి. ఈకాలములో కూలివాండ్ర సంఘములలోఁ గూడ

గౌరవనీయ మగుప్రజాప్రాతినిధ్యము ప్రతిఫలము లేకుండఁగ పూనుకొనుటకు సావకాశము గలవారు కొందఱైనను నుండకపోరు.

కొన్ని దేశములలో ప్రతినిధుల నెన్నుకొను నధికారము జనసామాన్యమునకు లేక వారిచేత డైరెక్టుగా కొందఱు ప్రతినిధు లేర్పఱుపఁబడి యీప్రతినిధు లందఱుకలసి చట్టనిర్మాణసభకు కొందఱు ప్రతినిధుల నేర్పఱుచుకొనెదరు. మనరాజధానిలో చట్టనిర్మాణశాఖలో నుండు మనప్రతినిధులను మనము డైరెక్టుగా నెన్నుకొనక మన ప్రతినిధులుగా నున్న లోకల్‌బోర్డు మెంబర్లు మునిసిపాలిటీ మెంబర్లు యేర్పఱుచుచున్నారు. వీరందఱుకూడ జనులచే నెన్నుకొనఁబడిన ప్రతినిధులు కారు. ఈబోర్డులు మ్యునిసిపాలిటీలలో లేని యితరవిద్యాధికులకును ధనవంతులకును ప్రతినిధుల నెన్నుకొను నధికార మెంతమాత్రము లేదు. ఒకవేళ లోకల్‌బోర్డు మ్యునిసిపాలిటీల మెంబర్లందఱు జనులచే నెన్నుకొనఁబడువా రైనను వీరిచే మాత్రమే చట్టనిర్మాణసభకు మెంబ ర్లెన్నుకొనఁబడుచుండుటచే జనసామాన్యమునకును చట్టనిర్మాణశాఖలో నుండుప్రతినిధులకును విశ్వాసబంధ ముండనేరదు. ఇదిగాక యీలోకల్ బోర్డు మ్యునిసిపాలిటీలలో నుండుటకిష్టములేనివారును వీనిలో నుండుటకు తగని వారును చట్టనిర్మాణశాఖలోనుండుటకు సమర్థులుగా నుండవచ్చును. కాని యీ జమిలియెన్నికలవలన నేర్పాటు కాబడుప్రతినిధులు న్యాయము

గను స్వతంత్రముగను ఎన్నుకొనబడినపుడు చట్టనిర్మాణశాఖకు వన్నెతెచ్చెద రనుటకు సందేహము లేదు. చట్టనిర్మాణశాఖ రెండుభాగములుగ నేర్పడినయెడల అందులో నొకభాగములో నిట్టిజమిలి యెన్నికలచే నేర్పాటు చేయఁబడుప్రతినిధులు మెంబర్లుగానుండిన మిగులయుక్తముగ నుండును.

CHAPTER III.

కార్యనిర్వాహకశాఖ.

పరదేశీయులతో సంబంధించిన వ్యవహారములను చూచుట, పరదేశములోనుండు తమ దేశీయుల యోగక్షేమముల నరయుట, అంతఃకలహములను, విదేశస్థుల దండయాత్రలను నివారించుటకు సైన్యమును నావికాబలమును సేకరించుట, ప్రజల ఆస్తిని, స్వాతంత్ర్యమును శరీరములను పరువును కాపాడుట, రాజ్యపాలనకు కావలసినఖర్చులు పోఁగా మిగిలినసొమ్ము ప్రజోపయోగము లగుకార్యములకు వెచ్చించుట, ఈ మొదలగునవి కార్యనిర్వాహకశాఖయొక్క ముఖ్యధర్మములు. దేశములో నేర్పడిన యన్నిడిపార్టుమెంటు యుద్యోగులందఱిని కలపి కార్యనిర్వాహకశాఖ యని చెప్పవచ్చును. కాని రాజ్యాంగతంత్రమును చర్చించునపుడు ప్రతి చిన్నయుద్యోగస్థుఁడు కార్యనిర్వాహకుఁడైనను కార్యనిర్వాహకశాఖలోఁ జేరినట్లు యెంచఁబడఁడు. అటులైనచో ప్రతిపోలీసుకానిస్టేబిల్ కార్యనిర్వాహకశాఖతో సంబంధము కలిగియుండును. ప్రతిడిపార్టుమెంటును నడపు పెద్ద యుద్యోగస్థుఁడు ఈశాఖలో చేరినవాఁడని చెప్పవచ్చును. ఈడిపార్టుమెంటుల ముఖ్యాధికారులు ఒకరితో నొకయ సంప్రదించుకొని పనిచేయుచుందురు. అంతఃకలహములు సంభవించి

నపుడును పరదేశీయులతో యుద్ధము పొసంగినప్పుడును, ఈ మంత్రివర్గము కూడి ఒండొరుల డిపార్టుమెంటులలో అనుకూలమైన యేయే మార్పులు చేయవలసియుండునో యాలోచించుకొనెదరు. వీరందఱికిని, ఒకప్రధానమంత్రిగాని, రాజుగాని, ప్రెసిడెంటుగాని యేర్పాటుచేసికొనెదరు. వీరందఱును కలసి కార్యనిర్వాహకశాఖ యని పిలువబడుదురు.

ప్రతిడిపార్టుమెంటులో ననేకతరగతులయుద్యోగీయు లుందురు. వీరు చట్టనిర్మాణశాఖలో నుండుప్రతినిధులవలె నియమితకాలమునకు మార్చుచుండఁబడరు. ఏలయన, చట్టములను, వీనిఁబట్టి యేర్పడు నిబంధనలను ననుసరించి కార్యనిర్వాహణము మాత్రమే చేయు వారగుటచేత వీరందఱు ఆయాడిపార్టుమెంటులలో మిక్కిలి యనుభవశాలులుగనుండి క్రమక్రమముగ చిన్నయుద్యోగమునుండి గొప్పయుద్యోగములకు రాఁగలవారగుచుందురు. కాఁబట్టి తమకుశరీరదార్ఢ్యమున్నంతవఱకును నేరముచేసి శిక్షించబడనంతవఱకును వీరు తమయుద్యోగములయందుండవచ్చును. వీరిని పైయధికారులు తమకిచ్ఛవచ్చినట్లు ఉద్యోగములనుండి తొలఁగించఁగూడదు. సస్పెండు చేయఁగూడదు. వీరు తమకు కేవలము అశాస్త్రీయమైనవనితోఁచినవితప్ప తక్కిన విషయములలో తమపై యధికారులు చెప్పినటుల చేయవలెను. ప్రతిపనియందు చూపఁగల నేర్పు అనుభవముతోఁ గూడికొని యుండును గనుక వీరు ప్రజలచేత నియమితకాలమునకు నియ

మింపబడవలసినవారుకారు. వీరికి ప్రథమమున నుద్యోగము లిచ్చునపుడు ఆయాడిపార్టుమెంటుకు కావలసిన పరీక్షలలో బాగుగా కృతార్థులైననేగాని యీ యుద్యోగముల నీయఁగూడదు. వీరందఱకును జీతము లేర్పాటు చేయవలెను. జీతభత్యములు లేనిపనులు ఎన్నఁటికిని సరిగా జరగవు. ప్రమోషనులు కేవలము సర్వీసునుబట్టియేగాక వీరి శక్తిసామర్థ్యములనుబట్టి జరుగవలయును. అనుసరపక్షము పక్షపాతములచేత ఉద్యోగము లీయుటకంటె ఆయా యుద్యోగములకు తగిన తెలివితేటలను కొంతవఱకైనను తెలుపుడుచేయు పరీక్షలలో కృతార్థులైనవారికిచ్చుటయే మిగుల శ్రేయము. చిరకాలము క్రమముగ పనిచేసిన వయోవృద్ధులకు పెన్షను లీయవచ్చును.

ప్రతిడిపార్టుమెంటుకును పైయధికారి ఒకమంత్రిగాని లేక ఒకచిన్న సభగాని యుండవచ్చును. ఒకడిపార్టుమెంటంతకును, ఒక్కఁడేపైయధికారిగ నున్నయడల అతను తనవిధ్యుక్తకార్య నిర్వహణమునకు ఉత్తరవాదిగ నుండును. ఒకసభయున్నచో యెక్కువసావధానము మెలకువ తెలివియు కనపఱచవచ్చును. ఈరెండుపద్ధతులను సమ్మేళనముచేసి డిపార్టుమెంటుకేర్పడిన పైయధికారి ప్రజలకు జవాబుదారునిగ నుంచి సభవారు ముఖ్యవిషయములనుగురించి తమ యంగీకారానంగీకారములను వ్రాతమూలముగ తెల్పుడు చేయుచున్న యెడల, యుక్తాయుక్తవిచక్షణ యెవరెవరికున్నది, బాగుగ స్పష్టపడఁగలదు. క్రింది

తాబేదారులను తీసివేయుట శిక్షించుట మొదలగు విషయములో ఒక్కపైయధికారికన్న నతనికి సహాయము చేయుసభవారికి వదలివేయుట మంచిది.

ఈడిపార్టుమెంటుల పైయధికారులను ఏర్పఱుచుటకును తీసివేయుటకును వీరిపనులను తణిఖీచేయుటకును మఱియొక చిన్నకార్యనిర్వాహక సభయుండును. దీనిలో పైయధికారులందఱుకానీ కొందఱుగానీ యుండవచ్చును లేకపోవచ్చును. ఈచిన్నసభవారు తమకొక ప్రెసిడెంటు నేర్పఱుచుకొనెదరు, మనరాజధానిలో కార్యనిర్వాహకశాఖ నంతను పైవిచారణచేయు యీచిన్నసభకు అధ్యక్షుఁడు ఇంగ్లాండునుండి అయిదుసంవత్సరముల కొకసారి నూతనముగా మనచక్రవర్తిగారిచే నిండియాకుపంపబడును. ఈయనే మనకు గవర్నరుగారు. ఈయనకు సహాయులుగ ముగ్గురు కౌన్సిలర్లుందురు. వీరిలో నొకరు ఈదేశపువారినే యింగ్లాండునుండి నియమింతురు. ప్రస్తుతము పి. యస్. శివస్వామిఅయ్యరుగా రున్నారు. ఈచిన్నసభ క్రింద రివిన్యూబోర్డు, సెటిల్మెంటు, సర్వే, వ్యవసాయశాఖ, న్యాయాధికారశాఖ, ఫారెస్టు, పోస్టు, టెలిగ్రాఫు, అక్కౌంటు, రిజిస్ట్రేషన్, పోలీసు, జయిలు, విద్య, వైద్య, ఆరోగ్యసంరక్షణ, పబ్లికువర్క్స్ మొదలగు డిపార్టుమెంటులెన్నియో యుండును. ఈడిపార్టుమెంటులలో నుండు ఉద్యోగీయులందఱు కార్యనిర్వాహకశాఖలో చేరినవారైనను, ఈపదమును గవర్నరుగారికిని

ఆయనకు సహాయకారులగు ముగ్గురు కౌన్సిలర్లకును మనప్రస్తుత చర్యలో వర్తింపఁజేసి కొనవలయును. మనదేశములో యీకార్యనిర్వాహకశాఖలుగాని, చట్టనిర్మాణశాఖలుగాని, పూర్ణస్వాతంత్ర్యము కలవికావు గనుక,యీదేశపురాజ్యాంగ తంత్రమును మున్ముందు వేఱొకచో వివరించెదను.

స్వతంత్రరాజ్యములలో నెల్ల నీకార్యనిర్వాహకశాఖవారి యధికారములు వేఱువేఱుగ భేదించియున్నవి. ప్రెసిడెంటుగారు తనకౌన్సిలర్లలో మెజారిటీవారితీర్పుప్రకారము నడువవలెనా? లేక వారిసలహానుమాత్రము తీసికొని తనయిష్టమువచ్చినట్లు చేయవచ్చునా? వీరందఱు చట్టనిర్మాణశాఖ కెంతవఱకు కుత్తరవాదులగుచున్నారు? ప్రెసిడెంటుగారును, కౌన్సిలను, తమక్రిందనున్న డిపార్టుమెంటుల పైయధికారుల కార్యనిర్వాహణములో నెంతవఱకు జోక్యము కలిగించుకొను చుండవలయును? వీరి నెప్పుడు యెట్లు తీసివేయవలెను? ఈప్రశ్నలకు ఒకేజాబు ఉండనేరదు. సంగతిసందర్భములనుబట్టి ప్రతిదేశములో వీనినిగుఱించి నిబంధనలు అప్పటప్పటికి మారుచుండును. ఇంగ్లాండు దేశములో కార్యనిర్వాహకశాఖాధ్యక్షుఁడు, పేరునకుమాత్రము రాజుగారిచేత నియమింపఁబడినను నిజముగ చట్టనిర్మాణశాఖవలన నేర్పడి తోసివేయఁబడుచుండును. ఈయనయే తనకు సహాయులనుగ తక్కినమంత్రివర్గము నేర్పఱుచుకొనును. అమెరికా సంయుక్తరాష్ట్రములో ప్రెసిడెంటుగారే జనులచేతను డైరెక్టుగా నెన్ను

కొనఁబడి తానే తనమంత్రివర్గము నేర్పఱుచుకొనును. జర్మనీ దేశములో పార్లమెంటు ఉన్నను మంత్రివర్గము రాజున కిష్టములేని పని చేయఁజాలరు.

CHAPTER IV.

చట్టనిర్మాణకార్యనిర్వాహకశాఖల యన్యోన్య సంబంధము.

పాశ్చాత్య నాగరిక దేశములలో చట్టనిర్మాణశాఖ ప్రజాప్రతినిధులచేత నేర్పఱపఁబడవలయు నని యొప్పుకొనుచు, దీనికిని కార్యనిర్వాహకశాఖకును ఉండవలసిన సంబంధమును గుఱించి ఆదేశములలో నుండు రాజనీతినిపుణులు వేఱువేఱు నిబంధనలను వాడుకలో పెట్టుచున్నారు. ఆయాదేశములలో నుండు జనులలో పారంపర్యముగ వచ్చుసాంప్రదాయములఁ బట్టియు, రాజకీయవిషయములలో వారిప్రస్తుతాభిప్రాయములను బట్టియు, ఈవిషయమైన నిబంధనలు వేఱువేఱుగ నుండును. వీనిలో కొన్ని ముఖ్యమైన మాదిరులను వీనిలోపములను యీలోపములను తొలఁగించు నుపాయములను కొంతవఱకు తెలియఁజేసెదను.

చట్టనిర్మాణశాఖ మిగలన రెండుశాఖలమీఁదను, అనఁగాఁ గార్యనిర్వాహక న్యాయాధికారశాఖలమీఁదను, అధికారము కలదిగ నుండవలెనని యిదివఱకే తెలియఁజేసితిని. ఈరెండుశాఖల యధికారములకు కొన్ని మేరలను నిబంధనలమూలమున కల్పించుటయే గాక, వీనికి కావలసిన ధనమునుకూడ చట్టనిర్మాణ

శాఖయే సప్లయి చేయవలెను గనుక యీసొమ్మును వ్యయపఱచు విషయములోఁగూడ దీనికి పూర్ణమైన యధికారముకలదు. కాఁబట్టి కార్యనిర్వాహకశాఖను, ఏర్పఱుచు కొనుటయు, తీసివేయుటయు చట్టనిర్మాణశాఖకుండుట న్యాయమే. ఈపద్ధతివలన ఈరెండుశాఖలకు పరస్పరవైరములేక పరిపాలననెమ్మదిగ జరుగవచ్చును. ఈఫలోత్పత్తికి చట్టనిర్మాణశాఖ ఒక్కసభగానే యేర్పడి దానిలో మెజారిటీవారు చెప్పినట్లు కార్యములు నిర్వహించఁబడును. ఈరాజ్యాచారమును అమిశ్రప్రజాప్రతినిధిదొరతనము అనిచెప్పవచ్చును. ఏరాజ్యములోను, ఇట్టిపద్ధతి కొన్నియిబ్బందులమూలమున వాడుకలో లేదు. సర్వాధికారముగలఒకవ్యక్తిగాని ఒకసభగాని తాను నియమితకాలమునకే ప్రజలచేత నెన్నుకొనబడినను త్వరలో నిరంకుశాధికారము [illegible]పుటకు ప్రయత్నించుట సహజము. మఱియొకరి సమ్మతిలేనిదే ఒకసభవారైనను కార్యనిర్వాహణము స్వతంత్రించి చేయుట అనుచితము. ఆలాగుననే కార్యనిర్వాహకశాఖను తనయదుపాజ్ఞలలో నెల్లప్పుడునుంచుకొనినసభ, ఒకప్పుడైనను దానియధికారమును తానులాగుకొనవచ్చును. కాఁబట్టి కొంతవఱకైనను, కార్యనిర్వాహకశాఖకు స్వేచ్ఛాధికారముండవలయును. ఇదిగాక చిక్కుసమయములలో అనేకమంది ప్రతినిధులు కూడి మంత్రాలోచనచేయుటకు వీలుండదు. పరరాజులతో కయ్యము తటస్థించినపుడు కార్యనిర్వాహకులు, తమమీఁద కొంతజవాబుదారీని వేసికొని స్వతంత్రముగను, శీఘ్రముగను

రహస్యముగను పనులు జరిగించవలసియుండును. వీనినిగుఱించి ప్రజాప్రతినిధి సంఘములో బహిరంగ చర్చ యనర్థదాయక మగును. స్వదేశములో జరిగించు కార్యములలో కార్యనిర్వాహకశాఖ నెంత బలహీనపఱచినను నష్టము లేకపోవచ్చును. దేశములో వివిధసంఘముల యక్కఱలు, కోరికలు, ప్రతినిధుల కెప్పటికప్పుడు తెలియుచునేయుండును. కాని విదేశసంబంధమైన విషయములలో మంత్రాలోచనశక్తి సామాన్య ప్రజాప్రతినిధుల కుండుట మిక్కిలి దుస్తరము. యుద్ధసమయములలో కార్యము జయప్రదముగ నెఱవేర్చుటకుబహుమంది యాలోచన యెన్నటికి పనికిరాదు. కాఁబట్టి దేశములో కలవరములు సంభవించి నపుడుగాని పరదేశీయులతో మంత్రాలోచన లేక యుద్ధము జరగవలసినపుడుగాని కార్యనిర్వాహకశాఖకు కొంత స్వతంత్రాధికార మీయవలయును. ఈశాఖను చట్టనిర్మాణశాఖకు కేవలము యేజెంటుగా నుంచఁగూడదు.

కార్యనిర్వాహకశాఖలో నన్నిడిపార్టుమెంటుల ముఖ్యాధికారుల పదవులకును చట్టనిర్మాణశాఖలోనుండు ప్రముఖులను ఏర్పఱచి వీరికి ఎక్కువ యధికారమిచ్చితి మనుకొందము. వీరిని తీసివేయు నధికారముకూడ చట్టనిర్మాణశాఖకున్న యెడల మఱికొన్ని క్రొత్త యుపాయములుకూడ తటస్థించ నచ్చును. చట్టనిర్మాణశాఖలో, మెజారిటీ పార్టీ వారిలో నుండివచ్చిన యీక్రొత్త యధికారుల క్రింద ఖాయపుటుద్యోగస్థులు బహు

మంది యుండుటచేత కార్యములు చక్కఁగను అవిచ్ఛిన్నముగను జరగవచ్చును. న్యాయాధికారుల నేర్పఱచినటులనే యీ యధికారులుగూడ యేర్పడవచ్చును. కాని, వీ రుపయోగపఱచు గొప్పయధికారముల నాశించుచు ప్రజాప్రతినిధులందఱు వేచియుందురు. చట్టనిర్మాణశాఖలో మెజారిటీ వారికి నమ్మకము గల ప్రతినిధులనే నియమించుటకు ప్రయత్నములు జరుగును. కార్యనిర్వాహకమందు సమర్థత లేకపోయినను, వాక్చాతుర్యముగల వారి కీపదవులు లభించుచుండును. తమస్వలాభము కొఱకు చట్టనిర్మాణసంఘములో చిన్నచిన్న ముఠాలేర్పడి కుట్రలు పన్నుచుందురు. మంత్రులు పదభ్రష్టుల మగుదుమేమోయని యెల్లపుడు భయపడుచుందురు. చట్టనిర్మాణశాఖలో ప్రతినిధులు, చిన్నచిన్న పార్టీలుగా నేర్పడినపుడు వీరినందఱను సమ్మేళనము చేయుటకే తమయావచ్ఛక్తి నుపయోగించుచున్న యెడల కార్యనిర్వాహకసభవారు తమవిధ్యుక్తకార్యముల నెట్లు నెఱవేర్చఁగలుగుదురు?

ఈహేతువులను బట్టియే ఇంగ్లాండులో చట్టనిర్మాణశాఖను కార్యనిర్వాహకశాఖవారు మంత్రివర్గము ఛిద్రము చేయుటకు అధికారము కలిగియున్నారు. సాధారణముగ చట్టనిర్మాణశాఖ రెండుసభలుగా నుండును. ప్రస్తుతము మనము అదియొక సభగానే యున్నదని యెంచి దానినే పార్లమెంటు అనియు వాడుదుము. ఈపార్లమెంటులో మెజారిటీపార్టీ వారివలన కా

ర్యనిర్వాహకశాఖముఖ్యాధికారి అనఁగా ప్రధానమంత్రి యేర్పడెననుకొందము. ఈయనకు సహాయకు లగుమంత్రులుకూడ ఆపార్టీలోనుండియే తప్పక తీసికొనఁబడుదురు, ఈ మంత్రివర్గమేర్పడఁగనే పార్లమెంటువారు వీరిని తీసివేయఁ జాలరు. వీరు మాత్రము పార్లమెంటును నిలిపివేసి నూతన యెన్నికలకు ప్రజలకు అప్పీలుచేసికొనవచ్చును. పార్లమెంటులో మెజారిటీవారు యీమంత్రివర్గమందు నమ్మకములేదని తీర్మానముచేసిన యెడల యీమంత్రివర్గమంతయు ఒక్కసారిగ తమపదవులకు రాజీనామా లిచ్చుట శిష్టాచారమై యున్నది. ఒకవేళ అట్లు రాజీనామా లీయనియెడల పార్లమెంటు ప్రజాపరిపాలన ఖర్చులకు కావలసిన ద్రవ్యము వీరికొసంగరు. వీరు చట్టముల నుల్లంఘనము చేయకుండ సొమ్మును వసూలుచేయలేరు. వీరికిని పార్లమెంటులో మెజారిటీ వారికిని ముఖ్యాంశములలో భేదాభిప్రాయములు కలిగినపుడు పార్లమెంటునే ఛిద్రముచేసి ప్రతినిధి నియామకుల సముదాయమునకు వీరు అప్పీలు చేసికొనవచ్చును.

ఈవిధమున రెండులాభములు కలుగును. (1) మంత్రివర్గమువారును పార్లమెంటువారును సాధారణముగ సఖ్యముగానే యుందురు. వీరిలో వీరికి తగవులు తటస్థించినపుడు సద్దుకొనుట గాని లేక యెవరో ఒకరు మానుటగాని జరుగును. (2) తమకు మాత్రమే స్వతంత్రాధికార మున్నదని గర్వపడి నిరంకుశముగ నడువకుండ ఒకరి నొకరు ఆఁపుచుందురు. ఇటులగాక పార్ల

మెంటువారు మంత్రివర్గమును తమ యిష్టానుసారముగ తీసివేయ మొదలు పెట్టినయెడల నిరంకుశాధికారులైన ప్రాగ్దేశ రాజుల కనుసన్నలమెలఁగి వారికి వంగివంగి సలాములుచేయు వజీర్లకును, ఈమంత్రివర్గమునకును భేదమేమి? కాఁబట్టి పార్లమెంటును ఛిద్రము చేయఁగల మంత్రివర్గమున్నపుడు, అట్లు లోబడుట తటస్థపడదు. పార్లమెంటులో మెజారిటీ వారు తమకు మంత్రివర్గములోఁ దగవులు తటస్థించినపుడు ప్రజలు తమపక్షము నవలంబించెదరో మంత్రివర్గమువారి తరఫున నుందురో, నిశ్చయింపఁ జాలరు. పార్లమెంటులో నుండు ప్రతిప్రజాప్రతినిధియు నూతనపుటెన్నికలకు జంకుచునే యుండును. తాను తిరిగి యెన్నుకొనఁ బడుదునో లేదో యని యెన్నికలు త్వరలో రాకుండులాగునఁ ప్రయత్నించును. కాఁబట్టి కార్యనిర్వాహకశాఖ తననిరంకుశాధికారము నుపయోగించి చట్టనిర్మాణశాఖకు వ్యతిరేకించి యే పనియు చేయఁజాలదు. ఈరెండవదాని చలచిత్తమూలమున బయటి ప్రజల కిష్టములేని పనులు జరుగకుండఁగ కార్యనిర్వాహకశాఖ జాగ్రతగ చూచుచుండును. ఈరెండుశాఖలకును దీర్ఘకలహాము లెన్నఁటికిని రావు.

ఇట్టి రాజ్యతంత్రము. ఒకరాజున్నను లేకున్నను క్రమముగ జరుగవచ్చును. కాని బహురాజ్యములలో నీమంత్రివర్గములో ప్రధానమంత్రినైనను రాజే యేర్పఱుచుచున్నాఁడు. ఇంగ్లాండు మొదలగుదేశములలో నీరాజుయొక్క అవసర

మేమని కొందఱడుగవచ్చును. ప్రస్తుత మా దేశములో కార్యనిర్వాహకశాఖ కధ్యక్షుఁడుగా నుండి మర్యాద నిచ్చిపుచ్చుకొను సమయములలో గౌరవస్థానము నధిష్ఠించి, ఆశాఖవారు చేయుకార్యములకు తన యంగీకారము నొసంగుటయే రాజుగారి ప్రథమకర్తవ్యము. వారుచేయు కార్యములకు కారణముల నడిగి వారితో చర్చచేసిన తరువాతగాని తాను వానికి సమ్మతించఁడు. కాని పార్లమెంటు వారియిష్టములేకుండ తానుస్వతంత్రించి తనమంత్రుల నేర్పఱచుకొనఁడు. పార్లమెంటులో మెజారిటీ వారికిని బయటికి నియామకులకును ఇష్టముగల మంత్రివర్గమునే తా నేర్పాటు చేసికొనవలయును.

ఇట్టి రాజునుగాని లేక ప్రెసిడెంటునుగాని పూర్ణస్వాతంత్ర్యమును సంపాదించఁ దలచుకొన్న యింగ్లాండు వలసరాజ్యములలో దేనిలోనైనను ఏర్పాటుచేసికొనుట యుక్తమా యనువిషయమును మన మాలోచించఁదలఁచుకొంటిమేని యీ యనయధికార మెట్లుండవలెను? వంశపారంపర్యమైన హక్కులుగల రాజులను క్రొత్తగ నేర్పఱచుకొనుట దుర్లభము. అట్టి రాజులకు తెలివితేటలు పారంపర్యమున రానేరవు. అట్టిరాజున్నచో, మంత్రివర్గము మాఱినను, ఆయన మాఱకుండునుగాన, రాజ్యపరిపాలన యవిచ్ఛిన్నముగను, స్థిరముగను జరుగుచుండును. అయినను జనులలో రాజకీయజ్ఞానము ప్రబలినకొలఁది వంశపారంపర్యైక రాజాధిపత్యమునందు గౌరవమును భక్తి

యును తగ్గుచుండును. తెలివియు, అనుభవమును గలరాజులు తమ మంత్రివర్గమునకు చిక్కు సమయములలో మంచిసలహా నిచ్చెదరు. పార్లమెంటుకును మంత్రివర్గమునకును జగడము సంభవించినపుడు, రాజు సాధారణముగ నిరుకక్షులవారికిని సహాయము చేయక దూరముగ నుండుటయే మంచిది. ఒకానొకప్పుడు పార్లమెంటును మంత్రివర్గమును ఏకీభవించి రాచకార్యములు జరిగించుచున్నను, బయట ప్రజాభిప్రాయము ననుసరించి పార్లమెంటును ఛిద్రముచేయుటకు రాజున కధికారముండవచ్చును. ఉన్న మంత్రివర్గమును తీసివేసి క్రొత్తమంత్రుల నేర్పఱచి, వీరిచేత పార్లమెంటును ఛిద్రముచేయించి నూతనపుటెన్నికలకై ప్రజల కప్పీలు చేయించవచ్చును. ఇంగ్లాండు దేశపు రాజు 1834 సంవత్సరమునుండి యిట్టిపని కెప్పుడు సాహసించలేదు. క్రొత్తగ వచ్చుప్రతినిధులు పూర్వమంత్రివర్గముయొక్క అభిప్రాయములతో నేకీభవించిన యెడల రాజుగా రేమిచేయుటకును వీలులేదు. అనవసరముగ నూతనపుటెన్నికలకై వృథాప్రయప్రయాసలు కలిగించినందుకు నిందార్హుఁడగును. ప్రస్తుతపు పార్లమెంటులో మెజారిటీవారి యభిప్రాయము బయటి ప్రజాభిప్రాయముతో నేకీభవించలేదని స్పష్టముగఁ దెలిసిననే తప్ప రాజుగారిట్టి ప్రయత్నమును జేయరాదు. మంత్రివర్గముయొక్క సలహాతో పార్లమెంటును రాజు ఛిద్రముచేయవచ్చునుగాని రాజు దానిలో నుండు నొకపార్టీతో నేకీభవింపక తనమంత్రివర్గమునకు పార్లమెంటులో మెజారిటీవారు సహాయము చేయనియె

డల, వారిచేత, తమపదవులకు రాజీనామా లిప్పించి, పార్లమెంటులో పలుకుబడి గలయితరమంత్రుల కట్టిపదవుల నొసంగుటయే మంచిది. కొంతవఱకైనను నిజమైన యధికారములేనిరా జుండుటకంటె, లేకుండుటయే దేశమునకు క్షేమకరము.

ఫ్రాన్సుదేశములోఁ దప్ప పార్లమెంట్లుగల రాజ్యములలోనెల్ల వంశపారంపర్యహక్కులుగల రాజు లున్నారు. అప్పుడప్పుడు తటస్థించు ప్రజాందోళనములలో తగుల్కొనక, నిష్పక్షపాతబుద్ధి గలిగి, పార్లమెంటులో నేపార్టీతోనుగలియక, దూరముగ నుండురాజు పరిపాలనస్థిరత్వమున కుపయోగపడును. కాని, మంత్రివర్గమునకు, చిక్కుసమయములలో సలహానిచ్చుట, తనయందు భక్తిగౌరవములను ప్రజలకు గలిగించుట పార్లమెంటునుగాని మంత్రివర్గమునుగాని యుక్తసమయములలో వెడలఁగొట్టుట ఈమొదలగు పనులకు కావలసిన యోగ్యతలు వంశపారంపర్యముగ రాజకుటుంబములలో వచ్చునవి కావు. కాఁబట్టి క్రొత్తగ స్థాపించు పార్లమెంటు ప్రభుత్వమునకు ఒకప్రభువు నేర్పఱచుకొనుట సంభవించదు.

పైన వ్రాయఁబడిన రాజాధికారములు, ప్రజలచేతనైనను లేక చట్టనిర్మాణశాఖవారిచేతనైనను ఎన్నుకొనబడు, ఒకమేధావంతుఁడైన ప్రెసిడెంటుగారి కిచ్చినయెడల ఆయనకు కొన్ని సంవత్సరములైనను గడువు నీయవలయును. మిగుల ననుభవశా

లిని ప్రెసిడెంటుగ నేర్పఱచుకొనునపుడు ముదిమిచేఁ గలుగు లోపములు కనఁబడునంతవఱకు నాగడువు నీయఁగూడదు.

పార్లమెంటునుండి యుద్భవించిన కార్యనిర్వాహకశాఖ బిల్లులను తయారుచేసి పార్లమెంటు యెదుట దానియంగీకారము నిమిత్తము పెట్టుచుండును. ఏలయన ప్రధానకార్యనిర్వాహకులగు మంత్రివర్గము పార్లమెంటులో మిక్కిలి మేధావంతులును అనుభవశాలురు నగుటచేత, వారే పార్లమెంటులో చట్టనిర్మాణమునకై పెద్దకమిటీగ నేర్పడుదురు. కాఁబట్టి చట్టనిర్మాణకార్యనిర్వాహకశాఖలు విడిగా నుండవలె నని పూర్వరాజకీయశాస్త్రజ్ఞులు ప్రతిపాదించినప్పటికిని కార్యనిర్వాహకశాఖవారే తమకు కావలసిన లేక యుక్త మని తోఁచిన బిల్లులను తయారుచేసి పార్లమెంటు అనఁగా చట్టనిర్మాణశాఖయెదుట దానియంగీకారము నిమిత్తము పెట్టుచున్నారు.

ఈరాజ్యతంత్రము ఇంగ్లాండులో ‘ కాబినెటు గవర్నమెంటు ’ అని వాడెదరు. నేను వెనుకవ్రాసిన అమిశ్రమైన పార్లమెంటు కున్న యిబ్బందులలోఁ గొన్ని దీనియందును నున్నవి. రాజకీయవ్యవహారములను భాగించి కార్యనిర్వాహక చట్టనిర్మాణశాఖలకు పంచఁగా వీనిని మిశ్రమము చేయుచు కార్యనిర్వాహకశాఖవారు తమరు చేయవలసిన విధ్యుక్తకార్యములకు మాత్రమే తమశక్తి నుపయోగించక చట్టనిర్మాణమునం

దే యెక్కువ కాలము గడపుచుందురు. చట్టనిర్మాణశాఖవారు, తమచట్టనిర్మాణ విషయములను సావకాశముతో నాలోచించుటకు బదులుగ విదేశీయవ్యవహారములలో జోక్యము కలుగఁ జేసికొనుచు, కార్యనిర్వాహకశాఖవారిని పరరాజ్యవిషయిక మంత్రాలోచనలను బహిరంగపఱచమని, ప్రశ్నలతో బాధించుచుందురు. మంత్రివర్గమువారు తమ స్థానములను నిలుపుకొనుటకు పార్లమెంటులో మెజారిటీ వారియభిప్రాయములను గమనించినడచుకొనుచు, తమపదవు లస్థిరము లనిభావించుకొనుచు, దూరదృష్టితో నేకరీతిగ నుండురాజ్యతంత్రము నవలంబించఁజాలరు. ఇదిగాక వేలువేలు డిపార్టుమెంటులకు ముఖ్యాధికారు లైనయీమంత్రివర్గము, సాధారణముగాఁ దమకీయఁబడిన పదవులకుఁ దగినవారుగ నుండరు. పార్లమెంటులో వాగ్ధాటియు పలుకుబడియు గలవారినే, ప్రధానమంత్రి తనకు సహాయులుగ నుంచుకొనకతప్పదు. తమ రనుదినము చేయురాజ్యవ్యవహారములను నేర్పరితనముతో పార్లమెంటులో ప్రతివాదించుకొనుటకు శక్తిగలవారై యుండవలెను. ఆయాడిపార్టుమెంటులకు కావలసిన సమర్థతలు వీరికి ఉండకపోవుట తఱుచుగ తటస్థించుచుండును. కాఁబట్టి నిబంధనానుకూలైకరాజ్యాధిపత్యములో రాజు రాజ్యము చేయుచున్నటులును, మంత్రులు కార్యనిర్వాహకము నడపించుచున్నటులును, నటింతు రని జనులు హేళనము చేయుచుందురు.

పైలోపములను దెలిసికొని కొందఱు రాజనీతిశాస్త్రజ్ఞులు విదేశములతో నెక్కువసంబధమును గలుగజేసికొను జర్మనీ మొదలగు యూరపుఖండరాజ్యములలో, వంశపారంపర్యహక్కులు గలరాజులకు ఎక్కువ యధికార ముండవలెననియు పార్లమెంటొకటి యుండుట ముఖ్యమైనను దానితీర్మానములను కొన్నిసమయములలో లక్ష్యముచేయక, రాజాజ్ఞ ననుసరించి పోవలెననియు చెప్పుచున్నారు. పార్లమెంటువారికి చట్టములను నిర్మించుటయును, కార్యనిర్వాహక శాఖవారి పనులను విమర్శించి తప్పొప్పులు కనిపెట్టుటయును మాత్రమే విధాయకకృత్యము లని వీరు చెప్పెదరు. తమరు రాజుగారికి పరిపాలనఖర్చులకు కావలసిన సొమ్ము సప్లయిచేయక ఆయనను బలవంతపెట్టి తమరు కోరుకొన్న మంత్రివర్గమునే, ఆయన యేర్పాటు చేయుట పార్లమెంటువారి విధియని యీశాస్త్రజ్ఞులొప్పుకొనరు. పార్లమెంటులో మెజారిటీవారికి తమయందయిష్టము స్పష్టముగ కనుపఱచుచున్నప్పుడు, మంత్రివర్గమువారు తామే తమయుద్యోగములనుచాలించుకొందురని వీరియభిప్రాయము. రాజునకును పార్లమెంటునకును తగవులు కలిగినపుడు, మంత్రివర్గమువీరికి రాజీచేయుటకు ప్రయత్నించవలెనేగాని పార్లమెంటువారి కిష్టులైన మంత్రులనేర్పాటు చేసికొనుటకు రాజును బలవంతపెట్టునంత యధికారము మంత్రివర్గమునకుఁగాని పార్లమెంటునకుఁగాని యుండఁగూడ దని యీశాస్త్రజ్ఞులుచెప్పుదురు. ఈరాజ్యతంత్రమునే అమిశ్రనిబంధనైక రాజ్యాధిపత్యమని వాడెదరు. ఈరాజ్యతంత్రము

స్థిరముగ నుండుటకును రాజ్యాంగములకు కొన్ని మేర లుంచుటకును ఒక యుపాయము కలదు. మామూలు ఖర్చులకుగాను, ఒక్కసారిగనే కొంతధనమును శాశ్వతముగా కార్యనిర్వాహక శాఖవారి కిచ్చునటుల పార్లమెంటువారు చట్టముల నేర్పఱచి అసాధారణవ్యయములకు సొమ్మునప్లయి చేయు నధికారము పార్లమెంటు వారిచేతిలో నుంచినయెడల రాజుగారు అవసరమైనయుద్ధములు మొదలగువానికి సొమ్మును ఖర్చుచేయఁజాలఁడు. బడ్జెట్టులో నేర్పఱచిన సొమ్ముకంటె మామూలు ఖర్చులకుఁ గొంచమెక్కువగాఁ గావలసివచ్చేయెడల కార్యనిర్వాహక శాఖవారు క్రొత్తపన్నులను విధించునధికారము కలిగియుండవలెను. మామూలుఖర్చులు పోగాఁ గొంత సొమ్ము మిగిలిన యెడల, ఆజాస్తిసొమ్మును వినియోగించు విషయమై రాజును పార్లమెంటును కలసియేర్పాట్లు చేసికొనవచ్చును. ఈపద్ధతినిబట్టి రాజునకుఁ గావలసినసొమ్ము సప్లయిచేయక ఆయనను తమకులోఁబఱుచుకొనుటకు పార్లమెంటునకు వీలుండదు. జనులమీఁద క్రొత్తపన్నులను విధించుటకుగాని, అమితవ్యయములు చేయుటకుగాని పార్లమెంటు అనుమతిలేనిదే రాజున కధికార ముండదు. జనులకు బాధకలుగు చట్టములను రాజుచేయకుండ పార్లమెంటు యెటుల నేర్పడినదో ఆలాగుననే కార్యనిర్వాహకశాఖను లోఁబఱుచుకొనవలె నని పార్లమెంటువారు ప్రవేశపెట్టుచట్టములను నిరాకరించునధికారము రాజున కుండవలయును. రాజ్యమేలు నేర్పు వంశపారంపర్యముగ రాదుగనుక నిట్టిరాజ్య పద్ధతిలో

జనులలో రాజకీయ విద్య ప్రబలినకొలది రాజునకును పార్లమెంటునకును దీర్ఘకాలము తగవులు తటస్థించుచునే యుండును. తుదకు ఇంగ్లాండులోవలె రాజునకు నామమాత్రముగ నధికారము మిగులును. లేక గొప్పవిప్లవము సంభవించి, రాజు నిరంకుశాధికారి కావచ్చును. లేదా ప్రజాప్రభుత్వమే స్థాపింపఁబడవచ్చును.

CHAPTER. IV.

రాజ్యపాలనము.

ఆధునిక రాజ్యములలో వంశపారంపర్యపుహక్కులు గల రాజులకు బదులు జనులచేత నియమితకాలమున కెన్నుకొనఁబడు ఒక ప్రెసిడెంటు ఉండుట మంచిది. కార్యనిర్వాహకత్వమంతయు నీయనయం దుండును. ఈయనే, తనకు కావలసిన మంత్రుల నేర్పఱుచుకొనును. వీరు చట్టనిర్మాణశాఖలో మెంబర్లుగ నుండఁగూడదు. ఈశాఖలో రెండువంతులమెంబర్లు ఆమోదించని చట్టములను ఈయన నిరాకరించవచ్చును. కాని ఈయన తన కేర్పడిన గడువుకాల మంతమగువఱకును చట్టనిర్మాణశాఖతో తగవులాడుచునే యుండవచ్చును. ఈ రాజ్యతంత్రములో ఈబాధతప్పదు. కాని, ఈయన ప్రజలచేత నెన్నుకొనఁ బడినవా డగుటచే, చట్టనిర్మాణశాఖవారు ఈయనకుఁ గావలసినసొమ్ము సప్లయి చేయక రాజ్యాధిపత్యము గలరాజ్యములలోవలె నిబ్బంది కలుగఁ జేయుటకు సాహసించరు.

సంయుక్తరాష్ట్రములో ఈ చట్టనిర్మాణకార్యనిర్వాహక శాఖలు, అనవసరముగ మఱింత యెక్కువగ విడదీయఁ

బడినవి. మంత్రివర్గమునకు చట్టనిర్మాణ శాఖలో వోటువేయు నధికారము లేకపోయినను, దానిలో ప్రసంగించు నధికారమైనను యుండినయెడల, తమయుద్దేశములు, తమరుచేసిన లేక చేయదలచుకొన్న కార్యములు, ప్రతివాదించు కొనుటకును, చట్టనిర్మాణమందు సహాయము చేయుటకును వీరికి నవకాశముండును. ఇట్టి యధికారమే ప్రెసిడెంటుగారికి కూడ నుండవలయును. కొంత నియమిత కాలమున కేర్పడిన కార్యనిర్వాహక శాఖకు, అధ్యక్షుఁడుగా నొకరాజుగా రుండ నక్కఱలేదని సంయుక్తరాష్ట్రరాజ్యతంత్రమే మనకు నిదర్శనము. చట్టనిర్మాణసభచేత నెన్నుకొనఁబడు కార్యనిర్వాహకశాఖకు ఒక అధ్యక్షుఁడు లేకనే యింగ్లాండులో కాబినెటువంటి మంత్రివర్గముచేత రాజ్యము పరిపాలింప బడవచ్చును. కాని యీ మంత్రివర్గమంతయు, చట్టనిర్మాణసభచేతనే ఎన్నుకొనఁబడుటకంటె, దీనివలనఁగాని ప్రజలవలన డైరెక్టుగాఁగాని ఎన్నుకొనఁబడు ప్రధాన మంత్రియే యాసహాయ మంత్రివర్గము నేర్పఱచుకొన్నయెడల, ప్రతిడిపార్టుమెంటువారు చేయవలసిన కార్యములు, ఎక్కువ సామర్థ్యముతో నెఱవేర్పఁబడును. ఈ ప్రధాన మంత్రికి తగుమాత్రమైన గడువుకాల ముండవలెను.

మామూలు ఖర్చులక్కు, శాశ్వతపు బడ్జటుమూలమున సొమ్మును కార్యనిర్వాహకశాఖకు చట్టనిర్మాణ శాఖచేత నిప్పించిన యెడల, నీరాజ్యతంత్రములో నిబ్బందులేమియు గనుపించవు. అప్పుడు కార్యనిర్వాహకశాఖ చట్టనిర్మాణశా

లోనుండి యేర్పడినను ఈరెండవ దానిలో కుట్రలు మొదలగునవి జరగుటకవకాశముండదు. దీనికి కారణము మంత్రివర్గమును వారి గడువుకాలములో వెడలఁగొట్టఁబడకపోవుటయే. ఆ నియమితకాలము గడచిననేగాని యీలోపుగ చట్టనిర్మాణసభలోగాని బయటి ప్రజలలోగాని కలుగు చంచలాభిప్రాయములవలన కార్యనిర్వాహకశాఖకు ఎట్టి యపాయమును తటస్థించదు. ఈ రాజ్యతంత్రము నియమితకాలనిర్వాహక (Periodieal Executive) మని వాడవచ్చును. పార్లమెంటు దొరతనములో లేని లోపము దీనియందొకటియున్నది. కార్యనిర్వాహక చట్టనిర్మాణశాఖలమధ్య, విడఁదీయరాని తాత్కాలిక జగడములు సంభవింప వచ్చును. ఈ జగడములు సాధ్యమైనంతవరకు జఱగకుండ నీ కార్యనిర్వాహకశాఖ జనులచే డైరెక్టుగానెన్నుకొనఁబడుటకంటె చట్టనిర్మాణశాఖచేత నెన్నుకొనఁబడినయెడల, కొంతకాలమువఱకైనను వీనికి పోరాటము కలుగకపోవచ్చును. ఇందుమూలమున మొదటిదాని స్వాతంత్ర్యముపోదు. దీనిని చట్టనిర్మాణశాఖ తీసివేయలేదు. గడువుకాలమైన తరువాత నీ కార్యనిర్వాహకులయం దసూయ కలిగిన యెడల చట్టనిర్మాణ శాఖవారు కొత్తవారి నేర్పరుచుకొనవచ్చును.

ఇదివఱకు నీరెండు శాఖలకును ఒండొంటితో గల సంబంధమును గుఱించి వ్రాసినపుడు కార్యనిర్వాహకశాఖ,

చట్టనిర్మాణశాఖను ఛిద్రముజేయు పద్ధతియొక్క ప్రాముఖ్యతను తెలిపియుంటిని. ఈ రెండును సఖ్యముగనుండవలెనన్న బయటి ప్రజాభిప్రాయమునుఁబట్టి వీనిలో నొకటి వెనుకకు తగ్గవలెను. అప్పుడు కార్వనిరాహకశాఖయందు తమకు నమ్మకములేదని చట్టనిర్మాణశాఖవారు తీర్మానము చేయఁగానే కార్యనిర్వాహక శాఖవారు రెండవవారిని ఛిద్రముచేయుటే దానికి జవాబు. రాజ్యాంగతంత్రములో నీ కార్యనిర్వాహకశాఖవారిని తీసివేయు నధికారముకూడ నుండకూడదు. ఏలయన, క్రొత్త చట్టనిర్మాణశాఖ కార్యనిర్వాహకశాఖతో నేకీభవించునది కాకపోయినయెడల నూరక జనులకు అప్పీలు చేయుటయే తటస్థించును. తుదకు ప్రజల యభిప్రాయమును గమనింపక కార్యనిర్వాహకశాఖవారు, తమగడువు కాలములో మామూలుప్రకారము తమకార్యములు జరిగించుచునే యుందురు. అప్పటప్పటికి నేర్పడు ప్రెసిడెంటుగాని, ఖాయముగానుండు రాజుగాని కార్యనిర్వాహకశాఖ కధిపతిగానున్నప్పుడు బహుజనాభిప్రాయము ననుసరించి తమ రాజనీతిని మార్చుచుండలేదా! ఆలాగుననే, యీ కార్యనిర్వాహకశాఖవారు కూడ మార్చుకొనఁగూడదా యని కొందఱు శంకఁజేయవచ్చును. ఇది యొప్పుకొన్నను రాజ్యపరిపాలనము స్థిరముగనుండవలెనన్న చట్టనిర్మాణశాఖను ఛిద్రముచేయకుండఁగనే జనుల యభిప్రాయములను కనుగొనుచుండుట యుత్తమము. రాజనీతిని యడుగడుగున మార్చినయెడల మంత్రివర్గము

కూడ మాఱుచుండ వలయును. ఇట్లు అనేకసారులు జరుగఁగనే కార్యనిర్వాహకాధికారమంతయు రాజు చేతిలో నుండి చట్టనిర్మాణశాఖలో మెజారిటీ ప్రతినిధులచే నేర్పఱుపఁబడు మంత్రివర్గము స్వాధీనములోనికి రానచ్చును. రాజ్యమేలు నేర్పు, జనుల యభిప్రాయములను ముందుగానే తెలిసికొని జనసమ్మతముకాని మంత్రిని సులభముగ విడనాడుటయందే కానవచ్చును.

కార్యనిర్వాహకశాఖ తన విధ్యుక్త కార్యములను సరిగా నెఱవేర్చవలెనన్న, వీరికిసంగతిసందర్భములనుఁబట్టి కొన్ని నిబంధనలను చేసికొను నధికారముండవలెను. జనుల స్వాతంత్ర్యములకు భంగము కలుగకుండ వీరియధికారమునకు చట్టనిర్మాణశాఖ కొన్నిమేరలుంచవలెను. దేశాందోళన సమయములలో నీయధికారమును మించి, కార్యనిర్వాహకశాఖవారు నడువవలసి వచ్చును. మొదట వీరి యాజ్ఞానుసారముగ ప్రజలు నడుచుకొనుటకును, తరువాతక్రమమైన చట్టములద్వారా వీరియాజ్ఞలు న్యాయమైనవని నిర్ధారణ కాఁబడిననేతప్ప వీరు శిక్షార్హులగుటకును, తగు యేర్పాటులుచేయబడవలయును. కాని యీ పద్ధతి జనులమనస్సులలో, న్యాయశాస్త్ర గౌరవము అన్యాయకార్యధిక్కరణము అనునలవాటులను తాఱుమాఱుచేసి చెడఁగొట్టును. ఈ పద్ధతికన్న కార్యనిర్వాహకశాఖవారు తమకుఁ గావలసిన నిబంధనలను ప్రచురము చేయునట్లును వీనినిసాధ్యమైనంత శీఘ్రముగ చట్టనిర్మాణసభవారియెదుటఁబెట్టి చట్టములుగ మార్పించులాగునను జేయుటమంచిది. ఈ యాందోళన సమయములలో చట్టనిర్మాణశాఖవాయ త్వరితముగ అనేకసారులు కూడుచుండవలయును. నెమ్మదికాలములలో నీసభవారు ఆలస్యముగ కూడుటయే యుత్తమము. ప్రతినిధులు తమ నియామకులుండు జిల్లాలకువెళ్లి వారికిచట్టనిర్మాణసభలో జరిగిన సంగతుల బోధించుచు వారికిగల యిబ్బందులను దెలిసికొనుచుండవలయును. తమ శరీరారోగ్యమునకు పరదేశాటనము చేయవలసియుండును. తమసంసారమును భుక్తిని చూచుకొనవలయును. కాఁబట్టి వీరందఱు కూడని సమయములలో పరదేశీయులతో యుద్ధములు తటస్థపడినపుడును, అంతఃకలహములు సంప్రాప్తించునపుడును దేశములో గొప్ప అల్లకల్లోలములు కలిగినపుడును సంఘమునకు హాని కలుగఁజేయుదురని యనుమానముగల మనుష్యులను అరెస్టుచేసి ఖయిదుఁజేయు నధికారములు తమ తాబేదారుల కిచ్చినటుల ప్రకటనల మూలమున కార్యనిర్వాహక శాఖవారు తెలుపవచ్చును. కానిశీఘ్రముగ అట్టి ప్రకటనలకు చట్టనిర్మాణశాఖయొక్క అధికారమును పొందవలయును.

చట్టనిర్మాణశాఖలో కార్యనిర్వాహకశాఖలోనుండు క్రింది యుద్యోగస్థులు మెంబర్లుగ నుండఁగూడదు. వీరు తక్కిన ప్రజాప్రతినిధుల భయపెట్టిగాని, లంచమిచ్చి గాని, తమపక్షమునకుఁ ద్రిప్పుకొందురు. వీరు తమప్రధానకార్యనిర్వాహకశాఖాధ్యక్షులకు వ్యతిరేకముగ వోటువేయరు. తమ ప్రమో

షనులకడ్డుకలుగునని భయపడెదరు. ఒకవేళ వ్యతిరేకముగ వోట్లువేసినయెడల, పైవారికి క్రిందివారు అవిధేయులగుట తటస్థించి కార్యనిర్వాహకశాఖ బొత్తిగ బలహీనమగుచుండును. ఇంతియగాక, కార్యనిర్వహణము సరిగా జరుగవలెనన్న దానికి జీతములు పుచ్చుకొనుచున్నయీ యుద్యోగస్థులకు చట్టనిర్మాణమునకుఁ దగిన సావకాశము, సమర్థతయు నుండక వీరు మంచి మెంబర్లు కానేరరు. కాఁబట్టి చట్టనిర్మాణకార్యనిర్వాహకశాఖలను సమ్మేళనమునకు ఆవశ్యకమైనంతమట్టుకు పెద్దయుద్యోగస్థులనుమాత్రమే యీచట్టనిర్మాణశాఖలో నుంచవలయును. గొప్ప యుద్యోగములనే లంచముల నిచ్చి యీశాఖలో వారిని కార్యనిర్వాహకశాఖవారు లాగుకొనవచ్చును. కనుక చట్టనిర్మాణశాఖలో ప్రతినిధులుగానున్నంతకాలములోను, ప్రాతినిధ్యము పోయిన కొంతకాలమువఱకును, ఈప్రతినిధులు గవర్నమెంటు ఉద్యోగమున కనర్హులని చట్ట మేర్పడవలయును. పైనఁ జెప్పిన దోషములు మన దేశమందుండుచట్టనిర్మాణశాఖలలో నున్నవి. కాని యీశాఖలేవియు, స్వతంత్రము కలవి కావుగనుక వీనిని గుఱించి, మన మిచ్చట నాలోచించ నక్కఱలేదు.

CHAPTER. V.

ద్విశాఖయుత చట్టనిర్మాణసంఘము.

ప్రతిరాజ్యతంత్రములో చట్టనిర్మాణసంఘము, కార్యనిర్వాహకసంఘము, న్యాయాధికారసంఘము, అని మూఁడుభాగములు స్వాభావికముగ నుండక తప్పదు. వీని కొండొంటి కుండవలసిన సంబంధమును గుఱించి యిదివఱకే వ్రాసియుంటిని. చట్టనిర్మాణ సంఘము తిరిగి రెండుశాఖలుగ నుండవలయునని బహుమంది రాజనీతి శాస్త్రజ్ఞుల యభిప్రాయము. ఇంగ్లాండు దీని వలసరాష్ట్రములలోనే గాక, ప్రాన్సు, బెల్జియము హాలెండు, స్వీడను, నార్వే, ఇటలీ మొదలగు యూరపుఖండదేశములలోఁగూడ రెండుశాఖలుగల చట్టనిర్మాణసంఘము లున్నవి. ఇంగ్లాండులోవలెనే, చట్టనిర్మాణశాఖ అప్పటప్పటికి చేయు నిబంధనలను నిరాకరించు నధికారము, కార్యనిర్వాహకశాఖకు లేనియెడల, ఇది బలహీనమై, తనకు స్వతంత్రాధికార మెంతమాత్రము లేకపోవుటచే, దేశమున కుపద్రవము సంభవించవచ్చును. ఇట్టి నిరాకరణాధికారము ఉన్నట్టియు, లేనట్టియు దేశములలోఁగూడ, ప్రజాప్రతినిధి శాఖకు తోడుగ, ఒకశిష్టసభ కూడనున్నది. పూర్వమునుండి యనుశ్రుతముగ వచ్చుచున్న యింగ్లాండుదేశపు ప్రభుసంఘములోఁ దప్ప, నీ రెండవశా

ఖిలో; వంశపారంపర్యపు హక్కులుగల మెంబర్లేర్పడుట తటస్థించదు. రాజ్యపాలన శక్తిగాని, మఱి యేయితర శక్తులుగాని, వంశపారంపర్యముగ నుండుట యసంభవము గనుక, నీయిరువదవ శతాబ్దములో, నిట్టి మెంబర్లు గలసంఘము నేర్పాటు చేయుట హాస్యాస్పదముగఁగూడ నుండును.

ఈరెండవశాఖ, ప్రధానమైన ప్రజాప్రతినిధి సంఘములో వలెనే జనులచేత నెన్నుకొనఁబడు మెంబర్లను కలిగియుండవలెనా? అట్టి మెంబర్లు ఎవరివలన నెన్నుకొనఁ బడవలెను? ఈ మెంబర్లస్థితిగతు లెట్లుండవలెను? ఈరెండుశాఖలకు అన్యోన్య సంబంధ మేవిధముగ నుండవలెను? ఈప్రశ్నలకు నవనాగరక రాజ్యతంత్రములు అనేక విధములుగ నుత్తరువు లిచ్చుచున్నవి.

ఈరెండుశాఖల మెంబర్లను ఒకేవిధముగ నెన్నుకొనఁబడినప్పటికిని, రెండుశాఖ లుండుటయే మంచిదనియు, మిక్కిలి తొందరగ అనాలోచనతో నొక శాఖచేసిన కార్యమును దిద్దుటకు మఱియొకశాఖ యుండవలెననియు, రెండుశాఖలు, ఏకార్యమునైనను, ఏచట్టమైనను, ఆలోచించి చేసినయెడల, అది న్యాయమైనదనిన్ని యెక్కువలాభకారియనిన్ని మనము నమ్మవచ్చుననియు, బహుమంది రాజనీతి శాస్త్రవేత్తల యభిప్రాయము. ప్రజాప్రతినిధి సంఘములో కక్షలుండకతీఱదు. వీరిలో వీరికిఁగల వైషమ్యములవలన, పట్టుదలతో, నేబిల్లునైనను ఒక

ప్పుడు ప్యాసుచేయవచ్చును. దేశాందోళన సమయములలోఁగూడ, కార్యనిర్వాహకశాఖ బలహీన మగునటుల చట్టముల నేర్పాటుచేయవచ్చును. బయటి ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగ ప్రజాప్రతినిధి సంఘము, తన నియమితకాలములో నిరంకుశాధికారిగ నడువవచ్చును. కాఁబట్టి యీశాఖవారు చేయు కార్యమును సావకాశముగ జాగ్రతతో కనిపెట్టుటకు రెండవశాఖ యున్నయెడల, నీరెండుశాఖలు నామోదించిన బిల్లుమాత్రమే చట్టముగ మాఱునని యేర్పాటుండవలయును. రాచకార్యములను సరిగా నెఱవేర్చుటకు, ఈ రెండవ శాఖలోనుండు మెంబర్లు ఎక్కువ తెలివితేటలను, సావకాశమును గలిగియుండవలెను. అప్పటప్పటికి అనాలోచనీయమును, అనిశ్చలత్వమును గల బయటి ప్రజాభిప్రాయమునుఁ బట్టి తాత్కాలిక జయమును పొందుటకు ప్రజాప్రతినిధి సంఘములో నిరుకక్షులవారును ప్రయత్నించెదరు. కాఁబట్టి ప్రజాప్రతినిధి సంఘములో నుండు మెంబర్లకులేని యోగ్యతలను కలిగియుండు మెంబర్లను నీ శిష్టసభలో చేరునటుల చేయవలయును. బుద్ధిబలము రాజనీతి, ధనము, మంచిస్థిరాస్తియుఁ గలవారు మెంబర్లుగా నుండుట మిక్కిలి యుత్తమము. ఇవియన్నియు నొక్కరియం దుండుట సాధారణముగా తటస్థించదు. వీనిలో ధనము కంటె తక్కిన యోగ్యతలే మిగుల నుపయోగకరములు.

ఈరెండు శాఖలకు సరిసమానమైన యధికారములుండును. వీనిలో నేశాఖవారైనను తమ మెజారిటీవలన బిల్లును త్రోసివేసినయెడల, అదిచట్టముగ మారనేరదు. ఈరెండు శాఖల భేదాభిప్రాయములవలన, మంచితరుణములలోఁగూడ చట్టనిర్మాణము ఆఁగిపోవచ్చును. ఒకప్పుడు యీరెండు శాఖలు కలసి రాజీగా తమ తగవులను పరిష్కరించుకొనవచ్చును. బడ్జెటువిషయమై యిట్టి తగవులు వచ్చినయెడల రాజ్యపరిపాలన జరుగుటయే యసాధ్యము గనుక స్థిరముగా కావలసిన ఖర్చులకైనను ప్రజాప్రతినిధి సంఘమువారి బడ్జెట్టు, శిష్టసభవారు ప్యాసు చేయవలయును. కార్యనిర్వాహకసంఘము సాధారణముగ ప్రజాప్రతినిధిసంఘమునకు లోఁబడియుండవలెను గనుక సొమ్ముతో సంబంధించిన బిల్లులు ప్రజాప్రతినిధి సంఘమువారే యేర్పాటు చేయవలసి యుండును. ఈవిషయమై చట్టనిర్మాణ సంఘములోనుండు రెండుశాఖలకు తగవులుకలిగి, రాజ్యపరిపాలన జరుగనంత యపాయము ఒకప్పుడు సంభవించవచ్చును, ఈ యపాయమును తప్పించుటకు కొన్ని యుపాయములు కలవు. (1) ఈ రెండుశాఖలుకలసి, మొత్తపు మెంబర్ల మెజారిటీవలన బడ్జెటు మొదలగు విషయములనుగుఱించి చట్టములను ప్యాసుచేయుట, అప్పుడు రెండు శాఖలుండుట యనవసరము. (2) వీనిలో నొకదాని యధికారమును తగ్గించి రెండవదానికి లోఁబడునట్లుచేయుట, (3) కోశాధికారములోమాత్రము ఒకదానికి నెక్కువ యధికార మొసంగుట.

కార్యనిర్వాహక సంఘముయొక్క నియామక కాలము, చట్టనిర్మాణ సంఘముయొక్క నియామక కాలమునకు సంబంధము లేకుండనుండినయెడల, ద్విశాఖయుతచట్టనిర్మాణసంఘము సరిగా తన పనులను నెఱవేర్చగలదు. కార్యనిర్వాహకసంఘముయొక్క స్వాతంత్ర్యమునకు ఏవిధమైన హానియుఁ గలుగదు. కాని చట్టనిర్మాణసంఘము సమానమైన యధికారములుగల రెండు శాఖలను కలిగియున్నపుడు కొన్ని యిబ్బందులు తటస్థించవచ్చును. కార్యనిర్వాహకశాఖను తీసివేయవలెనన్నయెడల, చట్టనిర్మాణసంఘముయొక్క రెండుశాఖలు ఒకేవిధముగ, వేఱువేఱుగ, కలసికొని తీర్మానములు చేయవలయును. లేదా, యీరెండుశాఖలు ఒకచోఁ గలసి, ఒకేతీర్మానముచేయవలయును. మొదటిమార్గ మవలంబించిన యెడల నీరెండు శాఖలు భిన్నాభిప్రాయములు గలవైనపుడు కార్యనిర్వాహకసంఘమును తీసివేయుటే తటస్థపడదు. అప్పుడీకార్యనిర్వాహకసంఘమునకుఁ గావలసిన చట్టములను చట్టనిర్మాణశాఖవారేర్పఱుచుట కొప్పుకొనరు. రెండవమార్గ మవలంబించిన యెడల, కార్యనిర్వాహకసంఘము తీసివేయఁగలిగినను, చట్టనిర్మాణసంఘములో నీరెండుశాఖ లున్నంతకాలము వీరికి తగవు లెల్లపు డుండక తప్పదు.

ఈరెండుశాఖలుకూడ జనులచే నెన్నుకొనఁబడిన మెంబర్లు గలవై, యేకకాలమందు ఛిద్రము చేయఁబడునవైనప్పటికిని అట్టి

తగవులు రాకమానవు. ఇంగ్లాండు దేశములోవలె, కార్యనిర్వాహకసంఘము చట్టనిర్మాణసంఘములో ఒకశాఖవలననే వెడలగొట్టఁబడుట, ఈరెండవది మొదటిదానివలన ఛిద్రముచేయఁబడుట, ఇట్టి యుపాయములున్నను తగవులు తటస్థించుచునే యుండును. ఈ చట్టనిర్మాణసంఘములో ఒకశాఖకే మిగుల నధికారమిచ్చినయెడల రెండవది బలహీనమై మొదటిదానికి లోఁబడవలసివచ్చుచుండును. అప్పుడు తనయభిప్రాయ స్వాతంత్ర్యము నుపయోగించుట మానివేయును. అట్లు లోఁబడక, పోరాటము సలిపినయెడల దేశములో నాందోళనము గలుగక మానదు. ఇట్టి యాందోళనము క్రిందటిసంవత్సరము, ఇంగ్లాండు దేశములో సంభవించి, ప్రభుసంఘమును రాజుగారిచేత నూతన ప్రభువులతో ముంచివేసెదమని కార్యనిర్వాహకసంఘమువారు (మంత్రివర్గము) భయపెట్టుటచేత పార్లమెంటులో రెండుశాఖల వారును, పార్లమెంటు బిల్లును చట్టముగ మార్చఁగలిగిరి. ఈచట్టమునుఁబట్టి పార్లమెంటులో ప్రజాప్రతినిధిసంఘమును మొదటిశాఖలో ప్యాసు అయినబిల్లు, రెండు సంవత్సరములకు మాత్రమే ప్రభుసంఘమువారు చట్టముగ మారకుండ నివారించవచ్చును. తరువాత వీరియనుమతి లేకుండగనే అది చట్టముగ మాఱును.

చట్టనిర్మాణ సంఘములో రెండుశాఖ లుండవలసివచ్చునెడల రెండును ప్రజాప్రతినిధి సంఘములుగా నుండవలయు

ను. ఎక్కువ ధనవంతులు విద్యాధికులు నీరెండవ శాఖకు నెన్నుకొనఁబడుదురు. అప్పుడైనను, ఈ రెండుశాఖలు భేదాభిప్రాయములు గలవైనప్పుడు, ఈరెండవశాఖ పక్షపాతబుద్ధిగలదనియు, ధనవంతులు, విద్యాధికుల పార్టీకిచేరినదనియు, జనులు నిందింతురు. ఈనిందను పోగొట్టుటకు, నీరెండవశాఖలో ప్రతినిధులు జనులచేత నెన్నుకొనఁబడు ప్రతినిధులచేత తిరిగి యెన్నుకొనఁబడిన యెడల, యీ రెండవశాఖ మొదటిశాఖను పోలియుండక కొంతవఱకైనను అన్యాలోచనతో చట్టములను ప్యాసుచేయకుండ నాఁపివేయఁగలదు. ఈపద్ధతి అమెరికా సంయుక్తరాష్ట్రములో నవలంబింపబడి యున్నది. ఈ రెండుశాఖలు ఒకేవిధముగ నుండకుండుటకు వీనిలో చిన్నశాఖకు పెద్ద పెద్ద జిల్లాలనుండి యెక్కువ నియామకకాలము నేర్పఱచి వయోవృద్ధులగు కొద్దిమందిని మాత్రమే యెన్నుకొనబడునటులఁ జేయవచ్చును. వీరిని ఎన్నుకొనుటకు ప్రజలచేత నేర్పాటు చేయఁబడు ప్రతినిధులుండుట యవసరము. ఈ ప్రతినిధులకు, తమకిష్టమైనవారి నేర్పాటు చేసికొనుటకు స్వాతంత్ర్యముండవలెను. వీరందఱిచేత నెన్నుకొనఁబడు ప్రతినిధులుగల యీచిన్నశాఖలోనుండి ప్రతిసంవత్సరాంతమునను కొంతమంది బాలెటుమీద వెడలిపోవుటయు, వీరికి బదులు మఱికొందఱు నూతనముగ ప్రతినిధు లగుటయు జరుగుచుండవలయును. ఈచిన్నశాఖలో కార్యనిర్వాహకసంఘమువారి వలన

నియమింపఁబడు కొందఱు మేధావంతులుకూడ నుండుట మిక్కిలి యుపయోగకరము. పరదేశీయులతో సంబంధించిన విషయములు ఈచిన్నశాఖ కీయవచ్చును. ఆదాయవ్యయముల పట్టీని యేర్పాటుచేయు విషయములను పెద్ద శాఖకే వదలవచ్చును.

CHAPTER. VI.

న్యాయాధికారశాఖ.

న్యాయాధికారశాఖయొక్క ప్రాముఖ్యత రాజ్యాంగ విచారణలో సామాన్యజనులకంతగా గోచరింపదు. కాని ఆధునిక రాజకీయ నాగరికతలో ఒకజాతియొక్క స్థానమును దెలిసికొనవలెనన్న, వారి దేశపరిపాలనలో, న్యాయమున కెంత గౌరవ మీయఁబడుచున్నదో చూడవలయును. పౌరుల మధ్యను కలుగు కలహాములేగాక, పాలకులకును, పౌరులకును అప్పటప్పటికి తటస్థించుచుండు తగవు లీన్యాయాధికారశాఖ సరిగా పరిష్కరించవలెను. ఈపనులు న్యాయముగ జరుగవలెనన్న, న్యాయశాస్త్రజ్ఞానము, నేర్పు, ప్రపంచజ్ఞానము, నిష్పక్షపాతబుద్ధి, లంచములకు లోబడక యుండుట, స్వాతంత్ర్యము, మొదలగు సుగుణపుంజములుగల న్యాయాధికారులుండవలెను. ప్రజలకుఁ గావలసినన్ని న్యాయస్థానముల నేర్పాటుచేయవలెను. ప్రజలు అచ్చటికి నే యభ్యంతరములు లేకుండ పోఁగలిగియుండవలెను. తమకష్టసుఖములను చెప్పుకొనుటకు కోర్టులకు పోకుండ పాలకులుగాని, యితరులుగాని యెట్టి యాటంకములును గలుగచేయఁగూడదు.

ఈ శాఖలోనుండు కొందఱు ప్రముఖులు శిష్టసభలో నున్నయెడల, చట్టనిర్మాణము, ఎక్కువ తృప్తికరముగ నుండును. చట్టములెంత జాగ్రత్తగఁ జేయఁబడుచున్నను దినదినము బయలు దేఱుచుండు క్రొత్త క్రొత్త మాదిరుల కేసులకు ఆచట్టములలోనుండు మాటలు సరిగా వర్తించక పోవచ్చును. అప్పుడు న్యాయాధికారులు, దమతీర్పులలో ఆచట్టములకు, కొంత నూతన వ్యాఖ్యానములను జేయుచుందురు. ఈవిధమున, క్రమక్రమముగ అసలు చట్టములలోనున్న వానికంటె, నూతనమైన యెక్కువ న్యాయశాస్త్రము బయలు దేఱుచుండును. కొంతకాలమైన తరువాత, నీతీర్పులలో నిబిడీకృతమైన న్యాయశాస్త్రము చట్టముగ మాఱుచుండును. ఈలోపుగఁ బ్రతిన్యాయాధికారియు తన కిష్టమువచ్చినటుల చట్టములకు వ్యాఖ్యానముచేయ ప్రయత్నించఁగూడదు. దానిలోనుండుమాటలనుఁ బట్టియే పోవలెను. అనేకతరగతుల కోర్టులుండును గనుక, అన్నిటికిని పైన ఒక హైకోర్టున్నపుడు, దాని తీర్పులను బట్టి క్రింది కోర్టులన్నియు నడచుకొనవలయును.

కార్యనిర్వాహక శాఖకును, ప్రజలకును తగవులు తటస్థించినపు డీన్యాయాధికారశాఖయొక్క ప్రాముఖ్యత బయల్పడును. న్యాయసంరక్షణకును, రాజ్యపరిపాలన నెమ్మదిగ జరుగుటకును, జనుల యాస్తిస్వాతంత్ర్యములలోఁ గొంత జోక్యమును కలుగఁ జేసికొనునధికారము కార్యనిర్వాహకశాఖ కీయ

వలసి యుండు నని యిదివఱకే తెలిపియుంటిని. కాని యిట్టి యధికారము, జనులను బాధింపకుండ కొన్ని కట్టుదిట్టములకు లోఁబడియుండవలెను. ఈకట్టుబాట్ల నతిక్రమించినపుడు జనులు, తత్క్షణమే నిష్పక్షపాతముతో తీర్పుచెప్పఁగల న్యాయస్థానములకు పోవుటకు తగిన యవకాశము లుండవలెను. ఈ సదుపాయములే జనుల స్వాతంత్ర్యములకు గొప్ప యాధారములని తెలిసికొనవలెను.

విచారణకు పూర్వమందు ముద్దాయీలను కారాబద్ధులను చేయఁగల కార్యనిర్వాహకాధికారమునకు మేరలనుచూడుఁడు. (a) ఒకనేరమును జరిగించెనని నిర్దిష్టమైన చార్జి లేనిదే, యెవరును అరెస్టుచేయఁబడకూడదు. (b) అరెస్టుచేయఁబడువానిని ఈ చార్జికి న్యాయమైనహేతువులున్నవా విచారణకాలమువఱకు అరెస్టులో నుండవలసినంత గొప్పనేరముచేసి యుండునా యను విషయములను విచారించుటకు సాధ్యమైనంత త్వరలో న్యాయాధికారియొద్దకు నేరస్థుని తీసికొనిరావలెను. (c) గొప్పనేరముచేసి యుండవచ్చునని కోర్టువారికి సందేహము కలిగినపుడు సాధ్యమైనంత శీఘ్రముగ కేసును విచారణకు తీసికొని రావలయును. కొద్దినేరము జరిగినట్లు తోఁచినయెడల జామీనుమీఁద, నేరస్థుని వదలివేయవలయును. ఈనిబంధనలన్నియు మన క్రిమినలు ప్రొసీజరుకోర్టులోనున్నవి. ఈచర్య సరిగా జరుగుచున్నదా లేదా యని విచారించు న్యాయాధికారశాఖయు యీచర్చ

నుజరుపు కార్యనిర్వాహకశాఖయు వేఱుగ నుండవలయునను విషయము అందఱకుఁ దెలిసినదే. ముఖ్యముగఁ గార్యనిర్వాహకశాఖాధికారుల కయిష్టముగఁ బ్రవర్తించు పౌరులవిషయమై నిష్పక్షపాతబుద్ధితోను స్వతంత్రముతోను విచారించు న్యాయాధికారశాఖయుండి తీఱవలయును. ఇదిగాక, గవర్నమెంటు ఉద్యోగస్థులు తమ యధికారములను చెలాయించుటలో జరిగించు నక్రమములకు, వారిని ప్రాసిక్యూటు చేయునప్పుడుగాని, వారిమీద నభియోగములు దెచ్చునపుడుగాని, పక్షపాతరాహిత్యమును స్వాతంత్ర్యమును గల న్యాయాధికారశాఖ లేనిచో, ప్రజలకు స్వాతంత్ర్యమే లేదని చెప్పవలసినదే.

కాఁబట్టి యీన్యాయాధికారులకు శాస్త్రజ్ఞానము, అనుభవము, స్వాతంత్ర్యము ఉండవలెను. వీరిలో కొన్ని తరగతులుండవలెను. వీరు కార్యనిర్వాహక శాఖవలన వెడలఁగొట్టబడఁగూడదు. కొద్దికాలమునకే వీరు నియమింపఁబడఁగూడదు. కాని, మిగుల పెద్దసంఘమైన చట్టనిర్మాణశాఖవలన గాని లేక జనసామాన్యముయొక్క వోట్లవలనగాని వీరు నియమింపఁబడఁగూడదు. అన్నితరగతుల న్యాయాధికారులును న్యాయముగ నడచుకొన్నంతకాలము, తీసివేయఁబడఁగూడదు. వీరిలో నెవ్వరైనను తీసివేయఁబడవలెనన్న, అత్యున్నత తరగతిలో నున్న కొందఱు న్యాయాధికారులును కలిపి ఒకస్పెషలు కోర్టునేర్పఱిచి వారిచేత విచారణ జరిగించుట యుత్తమము.

మిక్కిలి క్రింది తరగతి న్యాయాధికారులను కార్యనిర్వాహక శాఖవారే యేర్పఱచవచ్చును. కాని వీరి ప్రమోషనులు ఆ శాఖవారిచేతి కిచ్చినయెడల వీరిస్వాతంత్ర్యమునకు భంగము గలుగును. తమకులోఁబడి తమరు చెప్పునట్లుచేయు న్యాయాధికారులకు పారితోషికములుగ హెచ్చుజీతముల నిప్పించుట యీ శాఖవారికి స్వాభావికము. కాఁబట్టి వీరిలో ప్రమోషనుల నిచ్చు నధికారముపై న్యాయాధికారుల కిచ్చినయెడల బాగుగ నుండును.

మన ఇండియాదేశములో మేజస్ట్రేటులందఱు కార్యనిర్వాహకశాఖలో చేరినవారై పైయధికారులకనుసన్నలకులోనై మెలఁగుచు తమ ప్రమోషనులకు వారిననుసరించు చుండుటచేత మనస్వాతంత్ర్యములకు భంగము గలుగుచున్నది. చిన్న మేజస్ట్రేటు ప్రమోషనులు పెద్ద మేజస్ట్రేటుగారయిన జిల్లాకలెక్టరు చేతిలో నుండుటనుఁ బట్టియు పోలీసు డిపార్టుమెంటుకు జిల్లాలో నధిపతియైన పోలీసు సూపరింటెండెంటు జిల్లాకలెక్టరుగారికి స్నేహితుఁడుగా నుండుటనుఁబట్టియు మనకెన్ని యనర్థకములు వాటిల్లుచున్నవో అప్పుడప్పుడు మేజస్ట్రేటు కోర్టులలో జరుగు చర్యలవలననే స్పష్టపడుచున్నవి. మనకాంగ్రెసువారును, ఇంగ్లాండులోనుండు అనేకప్రముఖులును ఇట్టి యేర్పాటు అక్రమమనియు న్యాయాధికారశాఖ కార్యనిర్వాహకశాఖకు లోఁబడక వేఱుగ స్వతంత్రముగ నుండవలెననియు అనేక సం

వత్సరములనుండి మొరబెట్టుచున్నను నేటివఱకు మనప్రభువులు ఈ యన్యాయమును దొలఁగించుటకు ప్రయత్నముచేయలేదు. బంగాళా దేశములో కొన్నిజిల్లాలలో నీక్రొత్తయేర్పాటు నమలులోనుంచెద రని వాడుక. ఈరెండుశాఖలు వేఱుపఱచినను ప్రస్తుతము ఖర్చగుచున్న సొమ్ముకంటె అధికమైన మొత్తము వెచ్చించనక్కఱలేదని కీర్తిశేషులయిన మన మోహన్ ఘోషుగారును రమేశచంద్రదత్తుగారును విపులముగ వ్రాసియున్నారు. క్రిమినల్ కేసులలో ముఖ్యముగాఁ బరిశుద్ధమయిన న్యాయము మనకు కలుగవలెనన్న న్యాయాధికారశాఖయు కార్యనిర్వాహకశాఖయు పూర్తిగ విడదీయఁబడి మునసబులువలెనే మేజస్ట్రీటులును హైకోర్టువారి క్రిందనే యుండవలయును. ఈ న్యాయాధిపతులందఱు గుమాస్తాలలో నుండి గాక లాయర్లలో నుండియే యేర్పాటు కాఁబడవలెను.

కేసుల విచారణలో న్యాయశాస్త్ర విషయములేకాక లోకానుభవముతోఁగూడిన విషయములుఁగూడ నచ్చుచుండును గాన న్యాయాధికారులకు సహాయముగ సామాన్య ప్రజలలోఁ గొంద ఱుండుట మంచిదని అనేక శాస్త్రజ్ఞుల యభిప్రాయము. ఇంగ్లాండు దేశములోఁ గొన్ని సివిలు క్రిమినల్ కేసులలో పార్టీ లేర్పఱుచు కొన్న మధ్యవర్తులు న్యాయాధికారులతోఁ గలసి తీర్పు చెప్పుట జరుగుచున్నది. మన దేశములో శెషనుకోర్టులో కొన్ని నేరములకు జూరీలును మఱికొన్ని

నేరములకు అస్సెసర్లును ఏర్పఱచఁబడుచున్నారు. అన్ని గొప్ప నేరముల విచారణలలోను జ్యూరీలను ఏర్పఱచిన యెడల న్యాయము బయల్పడుటకును ప్రజల యభిప్రాయమును దెలిసికొనుటకును వీఁలు కలుగును. ఇదిగాక జనులకు న్యాయవిచారణయందు ఆసక్తి యుదయించును. రాజ్యాంగములలో తాము కొంతజోక్యము కలుగఁజేసి కొనుచుండుటవలన వానిలో సాధక బాధకములు జనులు తెలిసికొనఁగలుగుదురు. ఈ జ్యూరీ పద్ధతివలన మఱియొక లాభము కలదు. ప్రభుత్వమే వారికిని వారి ప్రజలకును ఏవిషయములోనయినను తగవులు తటస్థించినపుడు అట్టిసంబంధమయిన కేసులలో బహుజనాభిప్రాయము వెల్లడి యగుచుండును. రాజద్రోహపు కేసులలో జ్యూరీపద్ధతి యేర్పఱచిన యెడల తమ్ముగుఱించి ప్రజ లెట్లభిప్రాయపడుచున్నారో ప్రభుత్వమువారు గ్రహించఁగలరు. పెద్దయధికారులమీఁద గొప్ప నేరములు మోపఁబడినపుడు వారిని విచారించుటకు కొందఱు పెద్దజడ్జీలను శిష్టసభలో కొందఱు ప్రముఖులును కలసి ఒక స్పెషల్ కోర్టుగ నేర్పడవచ్చును.

CHAPTER. VII

స్థానికస్వపరిపాలనము.

ఆధునికరాజ్యములో ప్రధానశాసననిర్మాణశాఖకు లోఁబడి ప్రధాన కార్యనిర్వాహకశాఖకు సంబంధించక వేఱుగ ననేక శాఖలు జనోపయోగము నిమిత్తము ఏర్పాటు చేయఁబడు చుండును. ప్రజల కుత్తరవాదియయిన రాజ్యస్థాపనలో వారి స్వాతంత్ర్యమువలన కలుగు లాభములను పూర్ణముగ ననుభవించుటకు స్థానికప్రభుత్వ మేర్పడినది. దీని మూలమున ధనవ్యయము అధికము గాకుండ కొన్ని రాచకార్యములు చక్కఁగ జరుగును. దేశమంతయును ప్రజల ప్రతినిధు లెట్లు పరిపాలించెదరో ఆలాగుననే ఆదేశములోనున్న చిన్నచిన్న భాగములు ఆయాభాగములలో నున్న ప్రజల ప్రతినిధులచేఁ బరిపాలింపఁ బడుట న్యాయము. కావునఁ గొన్ని విషయములలోనయినను ఆయాభాగములలో నుండుప్రజలకు ఉపయోగకరమయిన కార్యములను నిర్వహించుటకు వారి ప్రతినిధులే అక్కడి పన్నులను వసూలుచేసి వెచ్చించు నధికారములు కలిగియుండుట మంచిది. విద్య, బీదలకు ధర్మము, ఆరోగ్యరక్షణము మొదలగు ముఖ్యకార్యము లన్నియు స్థానికసంఘములయం దుంచుట యుత్తమము. ఇంతియగాక ప్రజాస్వామిక

ప్రభుత్వము జయప్రదముగ జరుగవలెనన్న సాధ్యమయినంతవఱకు జనులందఱు కొంతవఱకయినను రాజ్యపరిపాలనలో జోక్యము కలుగఁజేసికొనుచుండవలయును. సంవత్సరమున కొకసారిగాని, రెండుసార్లుగాని శాసననిర్మాణ కార్యనిర్వాహకశాఖలకు తమప్రతినిధులను నియమించుకొనుటకు వోట్లు వేయుచున్నంతమాత్రమున సామాన్య పరిపాలన విషయములను బాగుగ గ్రహింపఁజాలరు. ప్రభుత్వమువారి పనులను గుఱించి శ్రద్ధగా పై తనిఖీ ప్రజలందఱు చేయలేరు. ఈస్థానిక సమాజములెంత బాగుగ వర్ధిల్లఁజేసిన నంత తెలివితో ప్రజాస్వామిక ప్రభుత్వము జయప్రదముగ జరుగుచుండును.

ఇంతియగాక, ప్రధాన రాజ్యాంగముల మీఁద మిక్కుటమగు బరువు పెట్టకూడదు. ఆధునికరాజ్యములలో ప్రభుత్వమువారు ప్రజల సంరక్షణార్థము నెఱవేర్పవలసిన విధులు మిక్కిలి విస్తారమయినవియేకాక చిక్కులతోఁ గూడుకొనునవికూడ నగుచున్నవి. వీని నన్నిటిని అతిజాగరూకతతో వివిధరాజ్యాంగములకు పంచవలసి యుండును. ఈ స్థానిక సమాజములకు పూర్ణాధికారము లిచ్చినయెడల ప్రజలలో నెప్పుడైనను అతృప్తికలిగినపుడు ఇవి ప్రధాన రాజ్యాంగములకు అడ్డంకులు కలిగించుటకుఁ దోడ్పడును. కావున సామాన్యప్రజలు తమకిచ్చు స్వాతంత్ర్యములను క్రమముగ వినియోగించిన కొలఁది, వీరికి స్థానిక సంఘములకు ఎక్కువ హక్కుల నొసంగుచుండవలయును.

దేశములో నాయాభాగముల పూర్వచరిత్రలను బట్టియు వానిలో నివసించు ప్రజల యేకజాతీయతను బట్టియు, అక్కడి దేశీయభావనలను బట్టియు స్థానికసంఘముల నేర్పాటుచేయవలెను. అప్పుడుగాని ప్రజలు ఐకమత్యముతో పనిచేయఁజాలరు. కనుకనే మనరాజధాని జిల్లాలుగా విభజింపఁబడి పెద్దపట్టణములలో మ్యునిసిపాలిటీలును, పెద్దపల్లెటూళ్లలో యూనియనులును, జిల్లాలకు డిస్ట్రిక్టుబోర్డులును, జిల్లాలలో నంతర్భాగములయిన తాలూకాలకు తాలూకాబోర్డులును, ఏర్పాటుచేయఁబడినవి. వీనిలో కొందఱు మెంబర్లను, ప్రెసిడెంట్లను ప్రజలే యెన్నుకొనుటకు చట్టములను ప్రభుత్వమువారు చేసియున్నారు. మ్యునిసిపాలిటీలలోను, యూనియనులలోను జనసంకీర్ణముచేత కలుగు నిబ్బందులను తొలగించుటకు అనఁగా వీథులను బాగుచేయుట, రాత్రులయందు దీపములను వెలిగించుట, పాయిఖానాల నేర్పఱచి వానిని ప్రతిదినము బాగుచేయించుట, ప్రజలయారోగ్యమునకు ఆసుపత్రులను స్థాపించుట, పిల్లల విద్యకొఱకుఁ బాఠశాలల నేర్పఱచుట ఈ మొదలగు పనులను ప్రజలు నెఱవేర్చగలుగుటకై యీస్థానికసంఘములు స్థాపింపఁబడుచున్నవి. ఇవి శాసన నిర్మాణశాఖవారి చట్టములకును, ఆచట్టములవలన యీయఁబడిన యధికారమునుఁబట్టి నీకార్యనిర్వాహశాఖవారు చేయు నిబంధనలకును లోఁబడి ప్రతిస్థానికసంఘము తన విధ్యుక్తకార్యములను క్రమముగ జరపుచుండవలయును.

భిన్నజాతులతో నిండియున్న యీ దేశములో వాడుచున్న భాషలనుబట్టి పరగణాల నేర్పఱచవలయును. ఇండియా

దేశ మంతకును సంబంధించు విషయములు, అనఁగా పరదేశీయులతో జరుగు యుద్ధములు, సంధులు, పోస్టు టెలిగ్రాఫ్సు, సైన్యములు, నాణెములు, తూనికెలు, వాణిజ్యము, ఢిల్లీలోఁగాని, మఱియొక పెద్దపట్టణములోఁగాని యేర్పడు ప్రధాన ప్రభుత్వమువారి చేతిలో నుండవలయును. ఇవిగాక తక్కిన యన్నివిషయములలో ఆయాపరగణాలకు సంపూర్ణస్వాతంత్ర్యము లుండవలయును. ప్రతిపరగణాయును నిప్పటివలెనే జిల్లాలుగా విభజింపఁబడి జిల్లా బోర్డులు, తాలూకా బోర్డులు, మ్యునిసిపాలిటీలు, యూనియనులు మొదలగు స్థానికసంఘము లేర్పడవలెను. ప్రజాప్రతినిధ్య మీయన్నిటిలో నుండితీఱవలయును. ఈస్థానికప్రభుత్వమువారికి పరగణాప్రభుత్వమువారు చేయునట్టి చట్టములనుఁ బట్టి నిబంధనలను చేసికొను నధికార ముండవలయును. మనలో విద్యాధికు లందఱు నిట్టిరాజ్యాంగతంత్రమును పరమావధిగా నుంచుకొని దీనిని జనులకు బోధచేయుచు దీనిని స్థాపించుటకు కావలసిన పరికరములను సంపాదించుకొని ప్రస్తుత రాజ్యతంత్రములో దీనికి అనుగుణమగు మార్పులను కలుగజేయుటకు నిబంధనానుకూల రాజకీయాందోళనమును పట్టుదలతో జరిపించినయెడల కొంతకాలమున కయినను మన యిండియాదేశములో అమెరికా సంయుక్తరాష్ట్రములో వలెనే ప్రజాస్వామిక రాజ్యతంత్రము స్థాపింపఁబడునను నాశ కలుగును.

(అనుబంధము—1.)

అమెరికాఖండములో మొదట 13 రాష్ట్రములు, అనగా 1 కనెక్టికట్టు 2 డెలవేరు 3 జార్జియా 4 మేరీలాండు 5 మస్సాచెస్సట్సు 5 న్యూహాంప్షైరు 7 న్యూజర్జీ 8 న్యూయార్కు 9 ఉత్తరకెరోలినా 10 దక్షిణకెరొలినా 11 పెన్సిల్వేనియా 12 రోడ్డుదీవి 13 వర్జీనియా, చేరి ఒక సంయుక్తరాష్ట్ర నిబంధన నేర్పఱచుకొని, తమమాతయైన యింగ్లాండు దేశమునుండి విడిపోయి, తమ సంయుక్తరాష్ట్రమునకు 1739 సంవత్సరములో జార్జివాషింగ్టన్ అనునొక మహానుభావుని మొదటిప్రెసిడెంటునుగా నేర్పఱచుకొనెను. క్రమక్రమముగ 1896 వ సంవత్సరము వఱకు నేబది రాష్ట్రము లీసంయుక్తరాష్ట్రములోచేరి ఈ నిబంధనకు ప్రస్తుతములోఁబడియున్నవి. మన దేశముకూడ నిట్టిరాష్ట్రములుగ విభజింపఁబడి, అన్నియు నిట్టినిబంధనకు ముందెప్పుడైనను చేరి తీఱునని నమ్మి యీఅమెరికా సంయుక్తరాష్ట్రనిబంధనయొక్క సారమును నీగ్రంథము చదువుకొను వారికి ఉపకరించు నని యిందు బొందుపఱచుచున్నాను.

అమెరికా సంయుక్తరాష్ట్ర ప్రజలమైన మేము, మునుపటికంటె సంపూర్ణమైన ఐకమత్యము కలిగించుటకును, న్యా

యమును స్థాపించుటకును, దేశములో నంతశ్శత్రు బహిశ్శత్రువులనుండి కాపాడుటకును జనులందఱకు సౌఖ్యమును వృద్ధిపఱచుచు మాకును మాపుత్రపౌత్రాదులకును సమస్తస్వాతంత్ర్యములు సురక్షితము చేయుటకును ఈనిబంధన నేర్పాటు చేసికొనుచున్నాము.

ఆర్టికిల్ I. చట్టనిర్మాణశాఖ.

సెక్షను I. కాంగ్రెసు.

ఈక్రింద నుదహరింపఁబడు చట్టనిర్మాణాధికారములు కాంగ్రెసుసభవారి కీయఁబడినవి. ఈకాంగ్రెసుసభ రెండు శాఖలుగ నుండవలెను. 1 శిష్టసభ (Senate). 2 ప్రజాప్రతినిధి సంఘము (House of representatives).

సెక్షను II. ప్రజాప్రతినిధిసంఘము.

1. రెండు సంవత్సరముల కొకసారి ఈసంఘములో నుండఁదగిన ప్రతినిధులను జనులెన్నుకొన వలయును. రాష్ట్రచట్టనిర్మాణసంఘములో (State Legislature) పెద్దశాఖకు ప్రతినిధుల నియమించు నియామకులకు కావలసిన యోగ్యతలే యీసంయుక్తరాష్ట్ర ప్రజాప్రతినిధిసంఘమునకు ప్రతినిధులను నియమించువారికి గూడ నుండవలయును.

2. ఇరువదియైదు సంవత్సరములలోపు వయస్సువాఁడుగాని, సంయుక్తరాష్ట్రములో నేడు సంవత్సరములైనను పౌరుఁడుకానివాఁడుగాని, నియమింపఁబడుకాలములో నేరాష్ట్రము

నకు తాను నియమింపఁబడునో, ఆరాష్ట్రములో కాఁపురము చేయనివాఁడుగాని యీసంఘములో మెంబరుగనుండఁగూడదు.

3. రాష్ట్రములోనుండు ప్రజల సంఖ్యను బట్టి సంయుక్త రాష్ట్రమునకు ప్రతినిధుల సంఖ్యను, ఆరాష్ట్రము చెల్లించవలసిన పన్నుల మొత్తమును ఏర్పాటు చేయఁబడును. పదిసంవత్సరముల కొకసారి జనాభా తీసికొనవలయును. ముప్పదివేలమంది జనులకు ఒకప్రతినిధికంటె నెక్కువ యుండఁగూడదు. ప్రతి రాష్ట్రమునకును కనీసము ఒకప్రతినిధి యుండవలెను.

4. ప్రతినిధులలో ఖాళీవచ్చినపుడు ఆప్రతినిధియొక్క రాష్ట్రకార్య నిర్వాహక సభవారు (State Executive) ఆఖాళీని పూర్తిచేయుటకు తగిన యేర్పాటులు చేయవలెను.

5. ఈసంఘమువారు తమ సభాధ్యక్షుని (Speakers) తక్కిన తమ యుద్యోగస్థులను నియమించుకొనుటకు అధికారము కలదు.

సెక్షను III. శిష్టసభ.

1. ప్రతిరాష్ట్రము ఈసభకు నిద్దఱు సభ్యులను పంపవలెను. ఈయిద్దఱు ప్రతినిధులును వారి రాష్ట్రముయొక్క చట్టనిర్మాణసంఘమువలన ఆఱు సంవత్సరముల కొకసారి యెన్నుకొనఁబడవలెను. శిష్టసభలోనుండు ప్రతిసభ్యునకును ఒకవోటు మాత్రమే యుండవలయును.

2. మొట్టమొదటి యెన్నికలను బట్టి యీసభ కూడఁగానే, మెంబర్లందఱు మూఁడు భాగములుగా విభజింపఁబడి, రెండవసంవత్సరాంతమున మొదటిభాగములోనివారును నాల్గవసంవత్సరాంతమున రెండవభాగములోనివారును ఆరవ సంవత్సరాంతమున మూఁడవభాగములోనివారును తమ పదవులనుండి తొలఁగవలసియుండును. కనుక, రెండుసంవత్సరముల కొకసారి యీశిష్టసభలో మూఁడవవంతు మెంబర్లు తిరిగి యెన్నుకొనఁబడుదురు. రాష్ట్రచట్టనిర్మాణసంఘము కూడని సమయములో ఆరాష్ట్రపుమెంబరు, తనస్థానమును ఖాళీచేసినయెడల, ఆరాష్ట్రకార్యనిర్వాహకసంఘము టెంపొరెరీగా ఆఖాళీని పూర్తిచేయవలెను. తరువాత ఖాయపు మెంబరును చట్టనిర్మాణ సంఘము వారేర్పర్చుకొనవలెను.

3. ముప్పది సంవత్సరములకు తక్కువ వయస్సుగలవాఁడును, సంయుక్తరాష్ట్రములో 9 సంవత్సరములు పౌరుఁడుగానుండనివాడును యేరాష్ట్రమువలన నెన్నుకొనఁబడునో ఆరాష్ట్రనివాసి కానివాఁడును, నీశిష్టసభలోఁ బ్రతినిధిగ నియమింపఁబడఁగూడదు.

4. సంయుక్తరాష్ట్రపు వైసు ప్రెసిడెంటు ఈ శిష్టసభకు ప్రెసిడెంటుగ నుండవలయును కాని, యేవిషయములోనైనను సభ్యులలో సమానసంఖ్యలకు భేదాభిప్రాయము కలిగిననే గాని, యీయనకు వోటు వేయ నధికారము లేదు.

5. వైస ప్రెసిడెంటు లేనపుడుగాని, ఈయన ప్రెసిడెంటు అయినపుడుగాని, యీసభవారు తమ యధ్యక్షుని టెంపొరెరీగా నేర్పాటు చేసికొనవలయును.

6. ఈసభవారు మంత్రివర్గములోనివారినిగాని గొప్ప యుద్యోగస్థులనుగాని ప్రాసిక్యూటుచేసి విచారించవచ్చును. అట్టి సమయములో నీసభవారందఱు ప్రమాణము తీసికొని న్యాయాధిపతులుగా నుండవలయును. సంయుక్త రాష్ట్రముయొక్క ప్రెసిడెంటుగారిమీఁది నేరము మోపఁబడి, ఆయన విచారించఁబడునపుడు సుప్రీముకోర్టు ఛీఫుజడ్జీగారు ఈ సభకు అధ్యక్షుఁడుగా నుండవలయును. అప్పుడు హాజరుగానున్న యీసభవారిలో రెండువంతుల మెంబర్లు నేకీభవించినఁ గాని ముద్దాయి నేరస్థుఁడుగా నెంచఁబడఁడు.

7. ఈసభవారు నేరస్థుఁడని తీర్పుచెప్పిన తరువాత అతనిని యుద్యోగములోనుండి తగ్గించుటమాత్రమే తటస్థించును. సంయుక్తరాష్ట్రములో నతనికి ఎట్టియుద్యోగము నీయఁగూడదు. లాప్రకారము, మామూలుకోర్టులలో అతను విచారింపఁబడి వేఱుగ శిక్షపొంద వచ్చును.

సెక్షను VI. పైరెండుసంఘములుకలసికూడుట.

1. శిష్టసభకును, ప్రజాప్రతినిధి సంఘమునకును నియమింపఁబడు మెంబర్లను ఎన్నుకొనుకాలము స్థలము విధము మొదలగు విషయములు, ఆయారాష్ట్రచట్టనిర్మాణశాఖవారే

యేర్పాటు చేసికొనవలెను. స్థలము విషయమై తప్ప తక్కిన సంగతులలో కాంగ్రెసు సభవారే చట్టముల నేర్పాటు చేయవచ్చును.

2. కాంగ్రెసుసభవారు సంవత్సరమున కొకసారియైనను కూడవలెను. చట్టముల మూలమున మార్పు లేనపు డీయీ కాంగ్రెసు సభవారు డిసెంబరునెలలో మొదటి సోమవారము నాఁడు కూడవలెను.

సెక్షను V. ఈరెండుసభలు ప్రత్యేకముగకూడుట.

1. తనలో మెంబరుగా నుండుటకు కావలసిన యోగ్యతలను గుఱించియు తనమెంబర్ల యెన్నికలను గూర్చియు వారినడతను గుఱించియు నేసభకు ఆసభయే పూర్ణాధికారము కలిగియుండవలెను. సభవారికి అవిధేయతను కనఁబఱచు మెంబరు రెండువంతుల మెంబర్ల యనుమతిమీఁద వెడలఁగొట్టఁబడవచ్చును.

2. చర్చింపఁబడు ప్రతివిషయములోను భేదాభిప్రాయము లున్నప్పుడు అయిదవ వంతు మెంబర్లు కోరినయెడల సభవారి పుస్తకములో అట్టి భేదాభిప్రాయులసంఖ్యను వ్రాయవలయును.

3. రెండుసభలునుకూడి వేఱువేఱుగ పని చేయుచున్నపుడు, ఒకదాని యిష్టములేక రెండవది మూఁడు దినములకంటె నెక్కువ కాలమువఱకు సభను నిలుపు చేయకూడదు. మఱియొక చోటునుకూడఁ గూడదు.

సెక్షను VI. అనర్హతలు.

1. మెంబర్లకు సంయుక్తరాష్ట్రకోశము నుండియే, వేతనములీయవలయును. రాజద్రోహమునకును, మఱికొన్ని గొప్పనేరములకును తప్ప, మెంబర్లు తమసభలకు పోవునపుడును సభలనుండి వచ్చునపుడును, అరెస్టు చేయఁబడఁగూడదు. సభలోజరుగు ప్రసంగములకు, బయటనున్న కోర్టులు వారిని శిక్షించుటకు వలనుపడదు.

2. ప్రతిమెంబరు, తన సభ్యతకాలములో క్రొత్తగ నేర్పరుపఁబడు నుద్యోగమునకుఁగాని హెచ్చుజీతము గల యుద్యోగమునకుఁగాని, అర్హుఁడు కాఁడు. సంయుక్త రాష్ట్రోద్యోగియుఁడు. ఈ రెండు సభలలోను మెంబరుగా నుండఁగూడదు.

సెక్షను VII. చట్టములను ప్యాసుచేయు విధము.

1. ఆదాయమును వృద్ధిచేయు బిల్లులను ప్రజాప్రతినిధి సంఘమే ముందుగ చట్టనిర్మాణ సభయొక్క యంగీకారము నిమిత్తము ప్రవేశపెట్టవలెను. కాని, వానిలోనుండు తగిన మార్పులను శిష్టసభగాని, ప్రజాప్రతినిధిసంఘముగాని యుపపాదించవచ్చును.

2. శిష్టసభ ప్రజాప్రతినిధి సంఘముల వలన ప్యాసు కాఁబడిన బిల్లులను ప్రెసిడెంటుగారి యంగీకారమునకు పంపవలెను. ఆయనకూడ సంతకము చేసినయెడల ఆబిల్లులు చట్టముగ మాఱును. ఒకప్పుడు, తనకుఁదోఁచిన సవరణలతో, ఆయన యీ బిల్లును ప్రవేశపెట్టిన సభకు తిరిగిపంపవచ్చును. ఆసభవారు పునర్విచారణ చేసినమీఁదట, రెండువంతుల మెంబర్లు నేకాభిప్రాయమునకు వచ్చినయెడల, రెండవ సభవారికి తమ యాక్షేపణలను తెలియఁజేయుచు ఆబిల్లును పంపవలెను. ఈరెండవసభవారిలోఁగూడ రెండువంతుల మెంబర్లు అదేవిధముగ నభిప్రాయమునకు వచ్చినయెడల, ఆబిల్లు చట్టముగ మాఱితీఱవలయును. ప్రెసిడెంటుగారు, బిల్లును తనయొద్దకు పంపినతరువాత 15 రోజులవఱకు దానిమీఁద తనయభిప్రాయమును తెలియఁజేయని యెడల నీలోపుగ కాంగ్రెసు సభవారు తమసభలను నిలుపుచేసినను తప్ప, ఆయన దస్కతుచేసినట్లుగానే యెంచఁబడి ఆబిల్లు చట్టముగ మాఱును.

3. పైనఁజెప్పిన చర్యయంతయు రెండుసంఘములు ఒప్పుకొనవలసిన ఆర్డర్లకును, తీర్మానములకును, వోటుచేయవలసిన రీతులకును వర్తించును. ఈసంఘములను మఱియొక దినమునకు నిలిపిపెట్టు తీర్మానములకు మాత్రము పై చర్య వర్తించదు.

సెక్షను VIII. కాంగ్రెసువారి యధికారము.

1. పన్నులనువిధించుట, వసూలుచేయుట, అప్పులుతీర్చుట, దేశమునుకాపాడుట, పన్నులు దేశమునకంతకును, హెచ్చుతగ్గులులేకుండ యేకరీతిగ నుండవలయును.

2. దేశములోవచ్చు ఆదాయమునుబట్టి అప్పులు తెచ్చుట.

3. పరదేశములలో జరుగు వాణిజ్యవిషయములను గుఱించి తగునిబంధనల నేర్పఱచుట.

4. సంయుక్తరాష్ట్రమునకంతకును వర్తించు యిన్సాల్వెంటు చట్టములను పౌరులనుగాఁ జేర్చుకొను చట్టములను నేర్పాటుచేయుట.

5. నాణెములను తూనికలను కొలఁతలను నేకరీతిగ దేశమందంతట నుండునటుల నిబంధనలను జేయుట.

6. తప్పు నాణెములు, తప్పు బ్యాంక్‌నోట్లు మొదలగువానిని చేసినందుకు శిక్షించుట.

7. తపాలాఫీసులను, రోడ్లను ఏర్పాటుచేయుట.

8. కాపీరైట్లు, పేటెంట్లు విషయమై నిబంధనలనుచేసి లేఖకులకును, నూతన కల్పకులకును ప్రోత్సాహము కలిగించుట.

9. సుప్రీముకోర్టు అనగా హైకోర్టువారి క్రింద నుండుటకు చిన్నకోర్టుల నేర్పఱుచుట.

10. నడిసముద్రముమీఁద జరుగు నేరములను,వానినిచేసినవారికి శిక్షలను యేర్పాటుచేయుట.

11. యుద్ధమును చాటించుట, యుద్ధమున నడుచుకొనవలసిన విధములను గుఱించి నిబంధనలను చేయుట.

12. సేనలను సేకరించుట, వానికిఁ గావలసిన ఖర్చుల నొసంగుట. రెండుసంవత్సరములకంటె నెక్కువకాలమునకు వీని విషయమై సొమ్మును వినియోగించఁగూడదు.

13. నావికబలమును సేకరించుట. దీనికి కావలసి ఖర్చుల నొసంగుట.

14. భూమిమీఁదను,నీటిమీఁదను ఉండు సేనలనుగుఱించి తగునిబంధనలను చేయుట.

15. దేశములో నంతఃకలహముల నణఁచుటకును, పరదేశ దండయాత్రల నరికట్టుటకును, తమ చట్టముల నమలులోఁ బెట్టుటకును, ప్రతిరాష్ట్రములో జనులలోనుండి కొందఱు ప్రముఖులను చిన్నచిన్న సేనలుగఁ జేర్చి, వీని నుపయోగపఱచుట.

16. సంయుక్తరాష్ట్ర ముఖ్యపట్టణమునకు చుట్టు పదిమైళ్ళకు మించని విస్తీర్ణము గల ప్రదేశములో, అన్ని విషయములలోను సంపూర్ణమయిన చట్టనిర్మాణాధికారము చెలాయించుట. ఒక రాష్ట్రముయొక్క అనుమతిమీఁద, దానిలో తమ కోటలకును ఓడరేవులకును, మందుగుండు సామానుల కొట్లకును, తమరు విక్రయించుకొన్న స్థలములలో తమరే యావత్తు అధికారమును కలిగియుండుట.

17. పైయధికారము లన్నియు సరిగా నెఱవేర్చుటకుగాను కావలసిన చట్టముల నేర్పాటు చేయుట.

సెక్షను IX. సంయుక్తరాష్ట్రాధికారులకు నీయఁబడని హక్కులు.

1. దేశములో అల్లకల్లోలము, విదేశీయులతో యుద్ధము సంభవించినపుడు తప్ప యేనేరస్థునిఁగాని విచారణకు కోర్టులయెదుటఁ బెట్టకుండుట.

2. క్రొత్తనేరముల నేర్పఱచి, అవి యేర్పడకముందు జేసినపనులకు శిక్షించుట.

3. జనాభా లెక్కలనుఁ బట్టికాకుండ, యథేచ్ఛగ పన్నులను విధించుట.

4. ఏరాష్ట్రము నుండిగాని యెగుమతి యగుచున్న సఱుకులమీఁద సుంకము వేయుట.ఏరాష్ట్రములోఁగాని తన రేవులలోనికి వచ్చు నితరరాష్ట్రముల యోడలమీఁద పన్నులను విధించుట.

5. చట్టముల ననుసరించక, సంయుక్తరాష్ట్రకోశములో నుండి సొమ్ము తీసికొనుట, ఖర్చు చేయుట.

6. ఎవరికిఁ గాని బిరుదుల నొసంగుట. కాంగ్రెసువారి యనుమతి లేకుండ, యేరాష్ట్రోద్యోగియుఁడుగాని విదేశీయ ప్రభువులవలనఁ బహుమతిఁగాని, బిరుదుఁగాని పుచ్చుకొనఁగూడదు.

సెక్షను X. రాష్ట్రములకు నీయఁబడని యధికారములు.

1. పరరాష్ట్రములతో చేరుట, వానితో సంధి చేసికొనుట, నాణెములు వేయుట, బంగారు వెండి నాణెములుగాక

తక్కినవి చెలామని చేయుట, క్రొత్తనేరముల నేర్పఱచి వాని క్రింద వెనుకటి నేరస్థులను శిక్షించుట, కంట్రాక్టులను రద్దుపఱచు చట్టముల నేర్పాటు చేయుట, బిఱుదుల నొసంగుట.

2. కాంగ్రెసువారి యనుమతి లేకుండ యెగుమతి దిగుమతులమీఁద పన్నులను విధించుట, ఓడలమీఁద సుంకము వేయుట, దేశము నెమ్మదిగ నున్నసమయములో సైన్యములను సేకరించుట, తమ సోదర రాష్ట్రములతోఁగాని, పరరాష్ట్రములతోఁగాని చేరుట, తన్ను సంరక్షించుకొనుటతప్ప, వానితో యుద్ధము చేయుట.

ఆర్టికిల్ III. కార్యనిర్వాహకశాఖ.

సెక్షను I. ప్రెసిడెంటు వైసుప్రెసిడెంటు.

1. అమెరికా సంయుక్తరాష్ట్ర కార్యనిర్వాహమంతయు ఒక ప్రెసిడెంటుగారియందుండవలెను. ఈయనయు యీయన క్రింది యుద్యోగస్థుఁడైన వైసు ప్రెసిడెంటుగారును నాలుగు సంవత్సరముల కొకసారి యీక్రిందివిధముగ నెన్నుకొనఁబడవలయును.

2. ప్రతిరాష్ట్రము దాని చట్టనిర్మాణశాఖచేయు నిబంధనల ననుసరించి కొందఱు నియామకుల నేర్పఱచుకొనవలయును. వీరిసంఖ్య ఆరాష్ట్రము శిష్టసభవారికిని ప్రజాప్రతినిధిసంఘమునకును పంపు ప్రతినిధుల సంఖ్యతో సమానముగ నుండవలయును. ఈ నియామకులు శిష్టసభలోఁగాని ప్రజాప్రతిని

ధిసంఘములోఁగాని మెంబర్లుగ నుండఁగూడదు. సంయుక్తరాష్ట్రోద్యోగియుఁడుగఁ గూడ నుండఁగూడదు.

పైనఁ జెప్పఁబడిన నియామకులు వారివారి రాష్ట్రములలో కలుసుకొని ప్రెసిడెంటు వైసుప్రెసిడెంటుగా నుండఁదగినవారికి రహస్యముగ వోట్లువేసికొనవలయును. ఈ ప్రెసిడెంటు వైసు ప్రెసిడెంట్లలో కనీసము ఒకరయినను తమతమ రాష్ట్రములో నివసించువారుగా నుండఁగూడదు. ఈ రెండుపదవులకు విడివిడి వోట్లుసేయవలెను. ఎవరెవరికి వోట్లు వేసినది యెవ రెవరికి యెన్నివోట్లు వచ్చినదియు జాబితాలు వ్రాసి వానిమీఁద నందఱు దస్కతులుచేసి సీళ్లువేసి అప్పు డధికారములోనున్న శిష్టసభవారి ప్రెసిడెంటుగారికి పంపవలెను. ఈయన శిష్టసభ ప్రజాప్రతినిధిసంఘముల యెదుట వివిధరాష్ట్రములనుండి వచ్చిన యీప్యాకెట్టుల సీళ్లను బ్రద్దలుకొట్టి వోట్లను లెఖ్కపెట్టవలెను. అందఱికంటె నెక్కువవోట్లును మొత్తములో హెచ్చువోట్లును వచ్చినవారిని ప్రెసిడెంటుగా నెన్నుకొనఁబడవలయును. ఎవ్వరికిని అట్టి మెజారిటీ లేనిపక్షమున ప్రజాప్రతినిధిసంఘమువారు తత్‌క్షణమే వోట్లువేసికొని మొదటియిద్దఱుముగ్గురలో నొకరిని ఏర్పఱచవలయును. ప్రెసిడెంటుగారిని ఏఱుకొనుటలో రాష్ట్రములప్రకారము వోట్లు తీసికొనవలయును. అనఁగా ఒకరాష్ట్రమునుండి వచ్చుప్రతినిధులందఱికిని ఒకటే వోటుండవలయును. రెండువంతుల రాష్ట్ర

ముల మెంబర్లయినను హాజరుండవలయును. అన్నిరాష్ట్రములలో మెజారిటీవా రెన్నుకొనఁబడువాని తరఫున నుండవలెను. ప్రెసిడెంటుస్థానము ఖాళీకాకమునుపే యీయెన్నికలు నవంబరు నెలలో మొదలుపెట్టవలెను. ముందు సంవత్సరము మార్చి నాల్గవతారీఖులోగా ప్రజాప్రతినిధిసంఘమువారు ఇట్లు ప్రెసిడెంటుగారిని ఎన్నుకొననియెడల వైసుప్రెసిడెంటుగారు ప్రెసిడెంటుగారిస్థానము నధిష్ఠించెదరు. ప్రెసిడెంటుగ్గారు చనిపోయినను లేక ఆయనకు ఏ యితరయిబ్బంది తటస్థించినను ఆయనకు మిగిలిన గడువు కాలమునకు వైసుప్రెసిడెంటుగారే ప్రెసిడెం టగుచున్నాఁడు.

4. వైసుప్రెసిడెంటుగారుకూడ పైన చెప్పినప్రకారము హెచ్చుసంఖ్యగల వోట్లవలననే యెన్నుకొనఁబడును. ఎవరికిని మెజారిటీలేనిపక్షమున హెచ్చువోట్లువచ్చిన మొదటియిద్దఱిలో నొకరిని శిష్టసభవారు వైసుప్రెసిడెంటుగ నెన్నుకొనవలయును. అట్లెన్నుకొనుటలో యావత్తుశిష్టసభ మెంబరులలో మెజారిటీ కూడ నాయెన్నుకొనఁబడువారికి నుండవలెను.

5. ఈనిబంధన ననుసరించి ప్రెసిడెంటుగా నుండఁదగనివారు వైసుప్రెసిడెంటుగకూడ నుండఁగూడదు.

6. ఏదినమున వివిధరాష్ట్రముల నియామకులు తమ ప్రెసిడెంటు, వైసుప్రెసిడెంట్లను ఎన్నుకొనవలెనో, కాంగ్రెసు

వారేర్పఱచెదరు. సంయుక్తరాష్ట్రము లన్నిటిలో, ఆదినముననే యెన్నికలు జఱుగవలయును.

7. సంయుక్తరాష్ట్రములో జన్మించనివారుగాని, పౌరత్వమును సంపాదించుకొననివారుగాని ప్రెసిడెంటుగా నుండకూడదు. ఈస్థానమును కోరువారు 35 సంవత్సరములకు తక్కువకాని వయస్సుకలవారును, కనీసము 14 సంవత్సరములనుండి సంయుక్త రాష్ట్రములో కాఁపురము గలవారుగను నుండవలెను.

8. ప్రెసిడెంటుగారు తీసివేయఁబడినపుడుఁగాని, చనిపోయినపుడుఁగాని, తనపనికి రాజీనామా యిచ్చినపుడుఁగాని, యేకారణముచేతనైనను తన విధ్యుక్తకార్యములను నెఱవేర్పఁజాలనపుడుఁగాని, ఆయనపదవి వైస్ప్రెసిడెంటుగారికి లభించును. వీరిద్దఱకును ఏకకాలమందిట్టిస్థితి సంభవించినయెడల తిరిగి ప్రెసిడెంటు నెన్నుకొనఁబడువఱకును కాంగ్రెసువారెవరినైనను ప్రెసిడెంటుగా నియమించవచ్చును.

9. ప్రెసిడెంటుగారు తమకిచ్చు నెలజీతము తప్ప యేవిధమైన పారితోషికమును పుచ్చుకొనఁగూడదు. ఈసంయుక్తరాష్ట్రనిబంధన ప్రకారము నడచుకొనెదననియు తనశక్తివంచన లేకుండ దానిని కాపాడెదననియు ప్రమాణము చేయవలెను.

సెక్షను II. ప్రెసిడెంటుగారి యధికారములు.

1. సంయుక్తరాష్ట్రముయొక్క సేనలకును నావికబలమునకును, ప్రెసిడెంటుగారు ముఖ్యసేనాధిపతిగా నుండవలయును. తాను శిష్టసభవారి సలహాతో నేర్పఱుచుకొను మంత్రివర్గమును వారివారి డిపార్టుమెంటులతో సంబంధించిన విషయములలో వ్రాతమూలకమైన సలహాల నీయుఁడని యడుగవచ్చును. సంయుక్తరాష్ట్రమునకు సంబంధించిన కొన్ని నేరములను చేసిన వారిని క్షమించుటకు ఈయన కధికారము కలదు.

2. శిష్టసభలో హాజరుగ నున్న రెండువంతుల మెంబర్ల సలహా యంగీకారములతో పరరాష్ట్రములతో సంధిచేసుకొనవచ్చును. శిష్టసభవారి సలహాతో తన రాయబారులును మంత్రివర్గమును, న్యాయాధిపతులును మున్నగు కొందఱుద్యోగస్థులను, ఆయన నియమించవచ్చును. కాంగ్రెసు సభవారు, తాము చిన్నయుద్యోగీయుల నియమించునధికారము ప్రెసిడెంటుగారికి లేక కోర్టులకును లేక ఆయాడిపార్టుమెంటుల యధ్యక్షులకు నొసంగవచ్చును.

సెక్షను III. ప్రెసిడెంటుగారి విధులు.

కాంగ్రెసువారికి సంయుక్తరాష్ట్రస్థితిని తెలియఁజేయుచు, తనకు యుక్తమని తోఁచిన విషయములనుగుఱించి బిల్లు

లను తయారుచేయవలె నని వారికి వ్రాయుచుండవలయును. అసామాన్య సమయములలో శిష్టసభవారిని ప్రజాప్రతినిధిసంఘము వారిని కూడునట్టు చేయవలయును. ఈసంఘములు తిరిగి కూడవలసిన సమయమును గుఱించి, వీనిలో వీనికి తగవులు తటస్థించునపుడు, తానే ఆతేదీని యేర్పఱచవచ్చును. విదేశ రాయబారులకును మంత్రులకును తా నాతిథ్య మొసఁగవలెను. చట్టముల నన్నిటిని సరిగా నమలులోఁ బెట్టుచున్నది లేనిది కనుఁగొనుచుండవలయును.

సెక్షను IV. గొప్పయుద్యోగీయులమీఁద దోషారోపణ.

ప్రెసిడెంటుగారును వైసుప్రెసిడెంటుగారును సంయుక్తరాష్ట్రోద్యోగీయులు దోషారోపణ చేయఁబడి ప్రజాద్రోహమునకును లంచములు పుచ్చుకొన్నందునకును మఱికొన్ని గొప్ప నేరములకును శిక్షింపఁబడినయెడల, వారి నుద్యోగమునుండి తొలఁగింపవలయును.

ఆర్టికిల్ III. న్యాయాధికారశాఖ.

సెక్షను I. సంయుక్తరాష్ట్రీయ న్యాయస్థానములు.

సంయుక్తరాష్ట్రముయొక్క న్యాయాధికారము ఒక సుప్రీము కోర్టువారి యందును, కాంగ్రెసువా రప్పుడప్పు డేర్పఱ

చు క్రిందికోర్టులయందును ఎంచఁబడవలయును. అన్నికోర్టుల న్యాయాధిపతులు సరిగా పని చేయఁగలిగినంతకాలము తీసివేయఁబడఁగూడదు. వారివేతనములను వారు ఉద్యోగములో నున్నంతకాలము తగ్గించఁబడఁగూడదు.

సెక్షను II. సంయుక్తరాష్ట్ర న్యాయస్థానముల యధికారము.

1. ఈనిబంధనను వ్యాఖ్యానముచేయుచు దీనినిఁబట్టి విచారించఁదగిన యన్నికేసులును, విదేశీయులతో జరుగుసంధులను, సంయుక్తరాష్ట్ర చట్టములను గుఱించిన వ్యాఖ్యానమును రాయబారులకు, మంత్రులకు సంబంధించిన కేసులు నావికసంబంధమైన కేసులు సంయుక్తరాష్ట్రము పార్టీగానున్న కేసులు రెండురాష్ట్రములుపార్టీలుగా నున్న కేసులు ఒకరాష్ట్రమునకునుమఱియొకరాష్ట్రపుపౌరునకును గల కేసులు వేఱువేఱు రాష్ట్రముల పౌరులమధ్యగల కేసులు, వేఱువేఱురాష్ట్రములవలన నీయఁబడిన స్థిరాస్తిని గుఱించి ఒకేరాష్ట్రముయొక్క పౌరులమధ్య గలుగు కేసులును ఒకరాష్ట్రమునకును లేక దానిపౌరునికిని పరదేశమునకును - లేక దానిపౌరునికిని తగవులున్న కేసులును - యిట్టి కేసులను విచారించుటకు సంయుక్తరాష్ట్రపుకోర్టులకే యధికార మీయఁబడినది. కాని స్వతంత్రరాష్ట్రాధికారమునకు భంగము కలుగునని అనేక రాష్ట్రములు

యభిప్రాయపడినందున నీసెక్షనులోఁ జెప్పిన విషయములలో నిటీవల కొద్దిగ మార్పుచేసినారు. ఒకరాష్ట్రముమీఁద మఱియొకరాష్ట్రపు పౌరుఁడు గాని విదేశీయుఁడు గాని వ్యాజ్యము తెచ్చినపుడు సంయుక్తరాష్ట్రపు కోర్టులుగాక, ఆరాష్ట్రపుకోర్టులే విచారించవలెను.

2. రాయబారులు, మంత్రులు మొదలగు వారుగాని ఒకరాష్ట్రముగాని పార్టీగానున్న కేసులను సుప్రీముకోర్టువారు స్వయముగ విచారణ చేయుదురు. తక్కిన కేసులలో కాంగ్రెసువారు చేయునిబంధనలకు లోఁబడి సుప్రీముకోర్టువారికి అప్పీలు అధికారముమాత్రమే యున్నది.

3. గొప్ప యుద్యోగీయులమీఁద గొప్పనేరములలోఁదప్ప, తక్కిన యన్ని నేరములను వారు నియమించు స్థలములలో విచారించవలయును.

సెక్షను. III. ప్రజాద్రోహము.

1. సంయుక్తరాష్ట్ర ప్రజలను ద్రోహము చేసిన యెడల అనఁగా వారిమీఁద దండెత్తినఁగాని, వారిశత్రువులకు సహాయము చేసినఁగాని, నేరస్థుఁడు పబ్లీకుకోర్టులో తననేరమును ఒప్పుకొనిననేతప్ప, ఇద్దఱుసాక్షులైనను అతను బహిరంగముగాఁ జేసినకార్యమును రుజువుపఱచవలెను. అట్లుకానియెడల, అతను శిక్షించఁబడఁడు.

2. ఈనేరమునకు కాంగ్రెసువారే శిక్ష నేర్పఱచవలయును. ఆనేరస్థుని జీవితకాలములో తప్ప, తరువాత అతనివంశీయులకు నీకళంకము అంటనేరదు.

ఆర్టికిల్ IV. రాష్ట్రములు, సంయుక్తరాష్ట్రప్రభుత్వము.

సెక్షను I. రాష్ట్రముల రికార్డులు.

ఒకరాష్ట్రముయొక్క పబ్లీకు రికార్డులను తక్కిన రాష్ట్రములు పూర్ణముగ విశ్వసించవలెను. కాంగ్రెసువారుఆరికార్డుల నెట్లు రుజువు చేయవలెనో ఆవిషయమై చట్టముల నేర్పఱచెదరు.

సెక్షను II. పౌరులస్వాతంత్ర్యములు.

1. ప్రతిరాష్ట్రములోనుండు పౌరులును, అన్నిరాష్ట్రముల పౌరులకుగలస్వాతంత్ర్యములనన్నిటిని అనుభవించవచ్చును.

2. ఒకపౌరుఁడు ఏనేరమునకైనను ఒకరాష్ట్రములో చార్జిచేయఁబడి మఱియొకరాష్ట్రములో పట్టుబడినయెడల మొదటి రాష్ట్రముయొక్క కార్యనిర్వాహకసంఘమువారు రెండవరాష్ట్రమువారి నడిగి అతనిని తమ స్వాధీనము చేసికొనవచ్చును:

సెక్షను III. నూతనరాష్ట్రములు.

1. కాంగ్రెసువారు నూతనముగ కొన్నిరాష్ట్రములను, తమ సంయుక్త రాష్ట్రములోనికి చేర్చుకొనవచ్చును. కాని

యిదివఱకున్న రాష్ట్రములను చీలఁదీసి క్రొత్తగా రాష్ట్రముల నేర్పాటుచేయఁగూడదు. రెండు లేక రెంటికంటె నెక్కువ రాష్ట్రములను, వానిచట్ట నిర్మాణసంఘముల యొక్కయు, కాంగ్రెసుయొక్కయు అంగీకారములేకుండ కలుపుటకు వలనుపడదు.

2. సంయుక్తరాష్ట్రమువారి యాస్తిని గుఱించి వారుతగు నిబంధనలను జేసికొనవచ్చును. అన్యాక్రాంతము చేయవచ్చును. సంయుక్తరాష్ట్రమువారి హక్కులనుగాని, రాష్ట్రముల హక్కులనుగాని, యీనిబంధన బాధించదు.

సెక్షను IV. రాష్ట్రములకు జవాబుదారీ.

సంయుక్తరాష్ట్రము ప్రతిరాష్ట్రమునకును ప్రజాస్వామికమను రాజ్యతంత్రమునే యుంచుటకు పూఁచీపడవలయును. ఇతరులు దండెత్తకుండ ప్రతిరాష్ట్రమును కాపాడవలయును. అంతశ్శత్రుల బారినుండి, రాష్ట్రచట్టనిర్మాణశాఖగాని, యిదికూడనపుడు ఆరాష్ట్రకార్య నిర్వాహకశాఖగాని, కోరినయెడల, సంయుక్తరాష్ట్రమువారు దానిని తప్పించవలయును.

ఆర్టికిల్ V. ఈ నిబంధనలోని సవరణలు.

శిష్టసభ ప్రజా ప్రతినిధిసంఘముల రెంటిలోను రెండువంతుల మెంబర్ల వోట్లమూలమున యీనిబంధనలో మార్పుల

నుపపాదించవచ్చును. రాష్ట్రచట్టనిర్మాణ సంఘములలో రెండువంతులు సంఘముల కోరికమీఁద కాంగ్రెసువారు, ఈనిబంధనలో మార్పులను చేయుటకు ఒక నూతనసభను ఏర్పఱచవచ్చును. వీనిలో నేవిధముగ మార్పుల నుపపాదించినను రాష్ట్రములలో మూఁడువంతులవారి చట్టనిర్మాణశాఖలు గాని ఈమార్పుల నుపపాదించుటకు ప్రత్యేకముగ నేర్పడుసభలు గాని కాంగ్రెసువారు నియమించు పద్ధతినిఁబట్టి ఒప్పుకొనవలసియుండును. ఇవి. యా మార్పుల నామోదించని యెడల నీ నిబంధనలో నా మార్పులు చేర్చఁబడవు. శిష్టసభలో ప్రతిరాష్ట్రమునకుఁగల ప్రాతినిధ్యము, దాని యిష్టములేకుండఁ దీసివేయుట కెవరికిని ఎప్పటికిని వలనుపడదు.

ఆర్టికిల్ VI. నిబంధనాధిపత్యము.

1. ఈసంయుక్తరాష్ట్ర నిబంధనకును, దీనినిఁబట్టి యేర్పడు చట్టములకును, విదేశీయులతో జరుగుసంధులకును సంయుక్తరాష్ట్ర ప్రజలందఱు లోఁబడి నడుచుకొనవలయును. రాష్ట్రచట్టములెట్లున్నను, దేశములోనుండు న్యాయాధిపతులందఱు సంయుక్తరాష్ట్రపు చట్టములకు వ్యతిరేకములుగ తీర్పులు చేయఁ గూడదు.

2. కాంగ్రెసుసభవారును, రాష్ట్రచట్ట నిర్మాణసంఘమువారును, కార్యనిర్వాహకశాఖవారును, రాష్ట్రసంయుక్తరా

ష్ట్ర న్యాయాధిపతులును, ఈనిబంధన ననుసరించియే, రాచకార్యములను జరిగించెదమని ప్రమాణము చేయవలెను. ఏయుద్యోగమునకుఁగాని ఫలానిమతస్థుఁడే యుండవలె నను నియామక మెన్నటికిని ఏర్పడఁగూడదు.

ఆర్టికల్ VII. నిబంధనాంగీకారము.

సంయుక్తరాష్ట్రము సంపూర్ణస్వాతంత్ర్యము సంపాదించుకొన్న 12 సంవత్సరములకు, అనఁగా 1787 సంవత్సరము సెప్టెంబరు 17 వ తారీఖున హాజరైన పదుమూఁడు రాష్ట్రములు నేకగ్రీవముగ నీనిబంధన నేర్పాటుచేసికొన్నవి.

పిమ్మటి యేర్పడిన ముఖ్యమైన మార్పులు.

1. ఒక మత మవలంబించఁ గూడదనిగాని, మఱియొకమతము స్థాపించవలెననిగాని కాంగ్రెసువా రేవిధమైన చట్టమును ప్యాసుచేయఁగూడదు. వాక్స్వాతంత్ర్యమునకుఁ గాని, లిఖితస్వాతంత్ర్యమునకుఁగాని జనులు నెమ్మదిగ గూడుస్వాతంత్ర్యమునకుఁగాని, ప్రజలబాధలను దొలఁగించుటకై ప్రభుప్రార్థనాస్వాతంత్ర్యమునకుఁగాని భంగము కలిగించఁగూడదు.

2. మంచిరాజ్యపద్ధతిగల ప్రతి స్వతంత్రరాజ్యములోను, తన్ను కాపాడుటకు పటాలము లవసర మగుచుండును గనుక,

జనులందఱు, ఆయుధములనుంచుకొనుటకును ధరించుటకును పూర్ణమైన హక్కు కలిగియుండవలెను.

3. నెమ్మదిగల కాలములో ఇంటియజమాని యిష్టము లేకుండ, వానియింటిలో దండుసిపాయీల నుంచఁగూడదు. యుద్ధసమయములలోఁగూడ చట్టముల ననుసరించియే,యట్లుంచవలెను.

4. జనులు తమ శరీరములను ఆస్తిని కాపాడుకొనుటకు హక్కుగలవారు గనుక లాప్రకారము సరియైన్న వారందు లేకుండ ఎవరినిగాని, వారి యాస్తిని గాని సోదా చేయఁగూడదు.

5. ఏనేరస్థుని గాని, అతనుచేసిన నేరమునకు రెండుసార్లు విచారింపబడకూడదు. తనమీఁదనే తాను సాక్ష్యము చెప్పుకొనునట్లు చేయఁగూడదు. లాప్రకారముతప్ప, మఱియొక విధముగ నెవరియాస్తినిగాని, శరీరముగాని తీసికొనఁబడఁగూడదు. తగిన పరిహారము నీయకుండి బహిరంగమగు పనులనిమిత్తము యెవరి యాస్తిగాని తీసికొనఁబడఁగూడదు.

6. క్రిమినల్ కేసులల్లో ముద్దాయిని శీఘ్రముగ విచారణకు పెట్టవలెను. నేరముజరిగిన జిల్లాలో విచారింపఁబడవలెను. అతనికి ప్లీడరునుంచి, అతనుకోరెడు సాక్షులకు సమ్మనులు చేయించి తెప్పించవలెను.

7. ఇరువదిడోలర్లు అనఁగా సుమారు నూఱు రూపాయల కంటె నెక్కువ మొత్తముగల కేసులు జూరర్ల చేత విచారింపఁ బడవలయును.

8. మిక్కిలి యెక్కువ మొత్తము గల జామీనుగాని, జరిమానాగాని మిక్కిలి క్రూరమయిన శిక్షనుగాని వేయఁ గూడదు.

9. ఈనిబంధనలతో ప్రజలయొక్క కొన్ని హక్కులను మాత్ర ముదహరించుట వలన, వారి కున్న యితరహక్కులను న్యూనతగ జూచినటుల యెంచఁబడఁదగదు.

10. ఈనిబంధనవలన సంయుక్తరాష్ట్రమున కీయఁబడని యధికారములును, రాష్ట్రములకు నిషేధించని యధికారములును, రాష్ట్రములకును ప్రజలకును ఉన్నట్లే యెంచఁబడవలయును.

11. బానిసత్వము, సంయుక్తరాష్ట్రాధికారమునకు లోఁబడిన యన్నిస్థలములలో నిషేధించఁబడినది.

12. సంయుక్త రాష్ట్రములోఁ బుట్టినవారును దానిపౌరత్వమును సంపాదించుకొన్న వారున్ను, సంయుక్తరాష్ట్రముఁనకును వారువసించుచున్న రాష్ట్రమునకును పౌరులనే యెంచబడవలయును. ఏరాష్ట్రముగాని, సంయుక్తరాష్ట్రపౌరుల హక్కులకు భంగము కలుగునట్లు ఏవిధమైన చట్టమును ఏర్పాటుచేయఁగూడదు. ఏరాష్ట్రముగాని లా ప్రకారముతప్ప, యేమనిషియొక్క శరీరమునకు, స్వాతంత్ర్యమునకు, ఆస్తికిని భంగము కలుగచేయఁగూడదు. లాప్రకారము ప్రతివానికిని ఉన్న హక్కులను దీసివేయుటకు వలనుపడదు.

(అనుబంధము. 2.)

1910 వ సంవత్సరమువఱకు, అమెరికాసంయుక్తరాష్ట్రిములోఁ జేరిన రాష్ట్రిముల విస్తీర్ణమును, జనసంఖ్యయుఁ దెలుపు పట్టీయును, సామాన్యముగ వాడుకలోనున్న భాషలను బట్టి చిన్నరాష్ట్రిములుగ మన యిండియాదేశమును విభజించిన యెడల, హానికుండు సుమారు విస్తీర్ణమును, ప్రస్తుతపు జనసంఖ్యయుఁ దెలుపు పట్టీయును ఈక్రిందఁ బొందుపఱచుచున్నాను.

1. అమెరికాసంయుక్తరాష్ట్రిము.

నంబరు.	రాష్ట్రిముల పేరు.	విస్తీర్ణము చదరపుమైళ్లు.	జన సంఖ్య.	చేరిన సంవత్సరము.	ప్రతినిధులు.
1	న్యూహాంపుషైర్	9341	430572	1789	4
2	మస్సాచెసట్స్	8166	3366416	డిటో	18
3	రోడ్డుదీవి	1148	542610	డిటో	5
4	కనెక్టికట్	4965	1114756	డిటో	7
5	న్యూయార్కు	49104	9113614	డిటో	45
6	పెన్సిల్వేనియా	45116	7675111	డిటో	38
7	డెలవేరు	1370	220322	డిటో	3
8	మేరీలాండు	11377	1295346	డిటో	8
9	వర్జినియా	42627	2061612	1789	12
10	ఉత్తరకెరోలినా	52426	2206287	డిటో	12
11	దక్షిణకెరోలినా	30989	1515400	డిటో	9
12	జార్జియా	59265	2609121	డిటో	14
13	న్యూజర్సీ	8224	2537167	డిటో	14
14	కెంటకీ	40598	2289905	1792	13
15	వెర్మాంట్	9564	355956	1791	4
16	టెన్నస్సీ	42022	2184789	1796	12
17	మెయిన్	33040	74271	1820	6
18	టెక్సాస్	265896	3896542	1845	20
19	పడమటివర్జినీయ	24170	1221119	1863	8
20	ఓహియో	41040	4767121	1802	24
21	లూజియానా	48506	1656388	1812	10
22	ఇండియానా	36354	2700876	1816	15
23	మిస్సిసిపీ	46865	1797114	1817	10
24	ఇల్లినోయ్	56665	5638591	1818	29
25	అలబామా	51998	2138093	1819	14
26	మిస్సోరి	69420	3293335	1821	18
27	అర్కన్సాస్	53335	157449	1836	9
28	మిచ్చిగన్	57980	2810173	1837	15
29	ఫ్లారిడా	58666	752619	1845	6
30	అయోవా	56147	2224771	1846	13

నంబరు.	రాష్ట్రముల పేరు.	చదరపు మైళ్ల వైశాల్యము.	జన సంఖ్య.	చేరిన సంవత్సరము.	ప్రతినిధులు.
31	విసాన్సిన్	56066	2333860	1848	13
32	కెలిఫోర్నియా	158297	2377549	1850	13
33	మిన్నిసోటా	84682	2075708	1858	12
34	ఓరిగన్	96699	672765	1859	5
35	కాన్సాస్	82158	1690949	1861	10
36	నివాడా	110690	81875	1864	3
37	నీబ్రాస్కా	77520	1192214	1867	8
38	కొలరాడో	103948	799024	1876	6
39	ఉత్తరడెకోటా	70837	577056	1889	5
40	దక్షిణడెకోటా	77615	583883	1889	5
41	మొంటానా	146997	376358	1889	4
42	వాషింగ్టన్	69127	1141900	1889	7
43	ఇడాహో	83888	325594	1890	4
44	వయోమింగ్	97114	145965	1890	3
45	ఊటా	84900	373351	1896	4
46	ఓక్లహామా	70057	1657155	1907	10
47	న్యూమెక్సికో	122634	327301	1850	3
48	అరిజోనా	113956	204354	1863	3
49	హావేయ్	6449	191909	1900	
50	ఆలస్కా	590884	64356	1868	
51	కొలంబియా	70	331069	1791	
		3,026,789	92,027,874		531

(*d*) బ్రిటిషు ఇండియా, బర్మా.

నంబరు.	రాష్ట్రముల పేరు.	చదరపు మైళ్ల వైశాల్యము.	జన సంఖ్య.	వాడుక భాష.
1	బంగాళారాజధాని	80,000	45217527	బంగాళీ
2	బేహారురాజధాని	71,185	34755634	
	(*a*) బేహార్		24018519	బేహారీ హిందీ
	(*b*) ఒరిస్సా		5131753	ఓఢ్రము
	(*c*) చోటానాగపూరు		5605362	బేహారీ
3	అస్సాము, సుర్మా	56,243	6713635	అస్సామిస్
4	ఆగ్రా, అయోధ్య సంయుక్త రాష్ట్రములు	107164	47182044	హిందీఉర్దు
5	పంజాబు	97,209	19974956	పంజాబీ
6	బొంబాయిరాజధాని	123064	19626477	ఉర్దు
	(*a*) బొంబాయి నగరము		979445	మరాటీ గుజరాతి
	(*b*) ఉత్తరజిల్లాలు		3685383	గుజరాతి
	(*c*) మధ్యజిల్లాలు		6387064	మహారాష్ట్రము
	(*d*) దక్షిణజిల్లాలు		5061150	కన్నడము
	(*e*) సింధు		3513435	సింధు
7	ఏడెన్		46165	ఉర్దు

నంబరు.	రాష్ట్రముల పేరు.	విస్తీర్ణము చదరపు మైళ్లు	జన సంఖ్య.	వాడుక భాష.
8	చెన్నరాజధాని	141726	41405404	
	(*a*) చెన్నపట్టణము		518660	తెలుగు అఱవము.
	(*b*) తెలుగుజిల్లాలు		17087808	తెలుగు
	(*c*) అరవజిల్లాలు		19464400	అఱవము
	(*d*) మళయాళము, నీలగిరి, అంజంగో		3139309	మలయాళము
	(*e*) దక్షిణకన్నడము		1195227	కన్నడము.
9	అండమాను నికోబారు దీవులు	3,143	26459	
10	కొడగు	1,582	174976	కన్నడము.
11	బీరారు, మధ్యపరగణాలు	104169	13916308	మహారాష్ట్రము
12	అజమీర్ మైర్వారా	2,711	501395	హిందీ
13	పశ్చిమోత్తర పరగణాలు	16,466	2196933	ఉర్దు
14	బెలూచిస్థానము	45,804	414412	బెలూచీ
15	బర్మాదేశము	236738	12115217	బర్మీస్
		1087204	244267542	

స్వదేశ సంస్థానములు.

నంబరు.	రాష్ట్రముల పేరు.	విస్తీర్ణము చదరపు మైళ్లు	జనసంఖ్య.	వాడుక భాష.
1	హైదరాబాదు	82698	13374676	ఉర్దు, తెలుగు మహారాష్ట్రము
2	మైసూరు	29444	5806193	కన్నడము
3	కాశ్మీరము	80900	3158126	కాశ్మీరము
4	బరోడా	8099	2032798	గుజరాతీ
5	మధ్యయిండియా యేజన్సీ ఇందూరు గ్వాలియరు రీవా, భోపాలము మొదలగునవి - 7 రాజ్యములు	78772	9356980	మహారాష్ట్రము
6	రాజపుత్రరాష్ట్ర మండలము-జయపూరు, మీవారు భరతపూరు, మర్వారు, బికనియరు మొదలగునవి 21 రాజ్యములు	127541	10530432	మహారాష్ట్రము హిందీ గుజరాతీ
7	బంగాళ, బేహారు రాజధానులలోని సంస్థానములు	38652	5113996	బంగాళీ బేహారీ

నంబరు.	రాష్ట్రముల పేరు.	విస్తీర్ణము చదరపుమైళ్లు	జనసంఖ్య.	వాడుక భాష.
8	బొంబాయి రాజధానిలోని సంస్థానములు - కచ్చి, కత్తివాడ్, కొల్హాపూరు మొదలగు 20 రాజ్యములు	65761	7411675	మహారాష్ట్రము గుజరాతీ
9	చెన్నపట్టణము రాజధానిలోని సంస్థానములు- కొచ్చి, తిరువాన్కూరు, పుదుకోట, బంగనపల్లి, సడూరు	9969	4811841	తెలుగు అఱవము మలయాళము
10	మధ్యపరగణాలలోని బస్తరు, మొదలగు రాజ్యములు 15	29435	2117002	మహారాష్ట్రము
11	పంజాబులోనిరాజ్యములు కపర్థం, పట్టియాలా ఫరీదు కోటానభి, జిందు మొదలగునవి-16 సంస్థానములు	36532	4212794	పంజాబీఉర్దు

నంబరు.	రాష్ట్రముల పేరు.	విస్తీర్ణము చదరపుమైళ్లు	జనసంఖ్య.	వాడుక భాష.
12	సంయుక్తరాష్ట్రములలోని రాజ్యములు రాంపూరు, గద్వాల్	5079	832036	హిందీ
13	బెలూచీస్థాన్ యేజన్సి	86511	396432	బెలూచీ
14	పశ్చిమోత్తరపరగణా యేజన్సి		1622094	ఉర్దు
15	సిక్కిము	2818	87920	నేపాళము
	స్వదేశసంస్థానములు	682211	70864995	
	బ్రిటిషు ఇండియా,	1087204	244267542	
	బర్మా.	1769415З	315132537	

ఆంధ్రభాషాభివర్ధనీప్రచురములు.

దేశాభివృద్ధి కావశ్యమగు నన్ని విషయములయందు పరిశ్రమ జరుగుచున్న యిక్కాలంబున భాషాభివృద్ధి కగ్రస్థానమిచ్చుట ప్రథమకార్యంబని వేఱ నుడువ నక్కఱలేదుగదా. ఏలయన విజ్ఞానమును బ్రచురింపఁజేయుటకు దేశభాషాసేవయే ముఖ్యసాధనంబుగ నున్నది. ప్రకృతంబున సనాతనాధునికేతిహాసములు, ప్రకృతిశాస్త్రములు, అన్యదేశాదర్శనిక గ్రంథములు, మహాపురుషుల జీవితములు, గణితశాస్త్రములు, రాజనీతిశాస్త్రములు, ఆర్థికశాస్త్రములు, వృత్తులును, పరిశ్రమలును, వాణిజ్యమును నడపువిధమును తెల్పు గ్రంథములు, నవలలు, ఈ ఆంధ్రదేశమందు క్వాచిత్కంబుగ గానంబడుచున్నవి. అట్టి లోపమును నివారించి భాషాభివృద్ధియు, విజ్ఞానమును, ప్రజలకేకకాలమందె లభించుటకయి యీసంఘమువారు బ్రయత్నించుచున్నారు.

భారత ధర్మ దర్శనము (తృతీయ ముద్రణము).

(గ్రంథకర్త) గవర్నమెంటు అసిస్టెంటు ట్రాన్సులేటరును, ఆధునిక కవివరుడున్ను అగు మ-రా-రా-శ్రీ, చన్నాప్రగడ-భానుమూర్తిపంతులుగారు. బి. ఏ, ఎల్. టి., ఇది నిర్మల దేశానురాగమును ప్రబోధించు పద్యకావ్యము. మృదుమధుర శైలిని రచింపఁబడినది. 109 పద్యములు గలవు. వెల 0-2-0 చందాదారులకు 0-1-6.

3. పీష్వా నారాయణరావు వధ.

(గ్రంథకర్త) మ-రా-రా-శ్రీ, వేమవరపు-రామదా గారు, బి. ఏ., బి. ఎల్. హైకోర్టు వకీలు. ఇందు 3 చిత్రపటములు గలిగి చదువరుల వీనుల కింపుగా నుండును. వెల 0-2-0, చందాదారులకు 0-1-6.

8. స్వాతంత్ర్య దర్శనము.

(గ్రంథకర్త) కీర్తిశేషులయిన దుగ్గిరాల-రామమూర్తిపంతులుగారు, బి. ఏ, ఎల్. టి. జాన్‌స్టూఆర్టుమిల్లు అను ఆంగ్లేయ పండితోత్తముని లిబర్టీ అను సుప్రసిద్ధ గ్రంథముయొక్క భాషాంతరీకరణము. ఈ గ్రంథము సుబోధకముగ తెనిగింపఁబడినది. వెల 0-12-0 చందాదారులకు 0-7-0

9. మహారాష్ట్ర చరిత్ర.

(గ్రంథకర్త) నేషనల్ కాలేజి ఉపాధ్యాయులగు మ-రా-రా-శ్రీ, చిల్లరిగ-శ్రీనివాసరావు పంతులు, బి. ఏ. గారు.

ఒకప్పుడు భరతఖండమున కాభరణమో యన్నట్లుండిన మహారాష్ట్ర సామ్రాజ్యమును సంపాదించిన శివాజీ మహారాజు మున్నగు వీరుల సచ్చరిత్రములు. ఈరాష్ట్రనిర్మాణాభివృద్ధి క్షయములకుంగల కారణములు సహేతుకముగా నిందు జర్చింపఁబడియున్నవి. శైలి సుబోధకమయి గ్రంథము ప్రామాణికముగనున్నది. మఱియు నిందు 22 మహారాష్ట్ర ప్రముఖుల చిత్రపటములున్ను, భరతఖండపు పెద్ద పటమున్నుగలవు. సామాన్యులగు చదువరులను రంజింపఁజేసి విమర్శకులకు వలయునంత చరిత్రసామగ్రి నొసంగుచు నీగ్రంథము విరాజిల్లుచున్నది. 500 పుటలు, ప్రశస్తముగు కాలికోబైండు వెల 1-14-0 చందాదారులకు 1-4-0.

10. ఆంగ్లేయ రాజ్యాంగ నిర్మాణ చరిత్ర.

(గ్రంథకర్త) గవర్నమెంటు తెలుఁగు ట్రాన్సులేటరుగారు, మ-రా-రా-శ్రీ, గోటేటి-కనకరాజుపంతులుగారు, బి. ఏ, బి. ఎల్.

ఇంగ్లండు దేశీయుల రాజ్యపరిపాలనము, నాగరికతయు, విపులముగ నిందు వర్ణింపఁబడియున్నవి. ప్రాచీన వృత్తాంతము, విదేశరాజుల పరిపాలనము, స్వాతంత్ర్య నిర్ణయ మహాశాసనము, నిరంకుశ ప్రభుత్వమునకు పార్లమెంటు పోరాటము, ప్రజాప్రభుత్వము, అమెరికాయుద్ధము, శిల్పకళల ప్రాభవము పార్లమెంటు సంస్కారము, విక్టోరియామహారాజ్ఞి కాలనీలు హిందూదేశము స్వరాజ్యము మొదలగు విషయములుగలిగి సుబోధకమయియున్నవి. అనేకములగు చిత్రపటములు దేశపటములుగలవు. ప్రశస్తమగు కాలికోబైండు వెల 1-4-0. చందాదారులకు 0-12-0.

11. ఆరోగ్యశాస్త్రము.

(గ్రంథకర్త) మ-రా-రా-శ్రీ, భోగరాజు, పట్టాభి-సీతారామయ్య పంతులుగారు, బి. ఏ. ఎం. బి. సి. ఎం. ఆరోగ్యమున కావశ్యకమైన

సమస్తధర్మములును సులభశైలిని సవిస్తరముగ నిందు బోధింపఁబడినవి. ఈగ్రంథము ప్రతియింట నుండఁదగినది. ప్రశస్తమయిన కాలికోబైండు వెల 1-4-0 చందాదారులకు రు. 0-8-0.

12. అశోకమహారాజు చరిత్ర.

(గ్రంథకర్త) స్కూళ్ల సూపరువైజరుగానుండి ఉపకారవేతనము పొందిన మ-రా-రా-శ్రీ, బేతపూడి-లక్ష్మీకాంతరావు పంతులుగారు.

ఇందు బౌద్ధధర్మ విజృంభణకాలమున హిందూదేశౌన్నత్యమును, అశోకుని రాజ్యవైభవమును, బౌద్ధధర్మ వ్యాపకమును మిగుల రమణీయముగ నీగ్రంథమునందు వర్ణింపఁబడినవి. అనేకశాసనములును అక్కడక్కడ చక్కని పద్యములును, అశోకుని రాజ్యమునుదెలుపు హిందూదేశపు పెద్ద పటమును గలవు. ప్రశస్తముయిన కాలికోబైండు చేయఁబడినది. వెల 1 4-0, చందాదారులకు 0-13-0.

13. ప్రభావతి (నవల).

(గ్రంథకర్త.) మ-రా-రా-శ్రీ, గాదె-జగన్నాథ స్వామిగారు.

ఈ నవల జగద్విఖ్యాతయశుఁడగు శివాజీ మహారాజును గుఱించి వ్రాయఁబడినది. కథాచమత్కార మద్భుతము. భాష మృదుమధురము. ఈనవలను నాంధ్రమహాజను లనేకవిధములఁ గొనియాడియున్నారు. ప్రశస్తమయిన కాలికోబైండు వెల 1-4-0, చందాదారులకు 0-12-0.

14. పశుశాస్త్రము.

(గ్రంథకర్త) ఏకుమళ్ల-రాజగోపాలరావుగారు, బి. ఏ.,

హిందూదేశములో నీపశువృద్ధికి గావలసిన ప్రధానవిషయములును, వాటి యావశ్యకతనుగూర్చియు, ఏయేపదార్థము లెంతవఱకు పశువులు భక్షించవలెనో ఆ వివరమును, ఇందు విపులముగా వర్ణింపఁబడియున్నవి. పశువులరోగములు వాటికి తగిన చికిత్సలు, ఇందు వర్ణింపఁబడినవి. పశువులకు సంబంధించిన యనేక గ్రంథములనుండియు, ఏలూరులో జరుపఁబడిన పశువ్యవసాయప్రదర్శనములకు వచ్చిన యనేక జాతుల పశువులవిషయమయి స్వయముగా పరిశోధించి గుర్తించినవిషయవిమర్శనముల నుండియు, నితర విధములయిన యనుభవముల నుండియు, నీగ్రంథము వ్రాయఁబడుటచే నిది యాంధ్రదేశములోని ప్రతిరైతును తప్పక చదువవలయును ప్రశస్తమయిన బైండు వెల 0-10-0, చందాదారులకు 5-0-0.

15. చీనాదేశ చరిత్ర.

(గ్రంథకర్త) మా 12 వ ప్రచురమగు అశోకచరిత్ర గ్రంథకర్తయగు మ-రా-రా-శ్రీ, చేతపూడి లక్ష్మీకాంతరావు పంతులుగారు, ఈభరతఖండముతో బాటుగ బహుపురాతన రాజ్యమయి, పూర్వాచారపరాయణత్వము గలిగి, విద్యా వైభవ నాగరికామలయం దప్రతిమానంబై వెలుగొందుచుండిన చీనాదేశవృత్తాంతము సంగ్రహంబుగను, మిగుల రమణీయంబుగను నింను వర్ణింపఁబడియె. దీనిని చదివినకొలఁది, ఇంక చదువవలయుననియె బుద్ధి పొడముచుండును. 1922-వ సంవత్సరమందు సంభవించిన-చీనావిప్లవము కూడ ఇందు సమగ్రంబుగ వర్ణింపఁబడినది. శైలి సుగమము. అందందు వర్ణనలు బహు మనోహరంబులుగ నుండును. ప్రజాస్వామికమును నెలకొల్పిన రాజ్యతంత్రప్రవీణులయొక్క చిత్రపటములు ఇందు పొందుపఱుపబడినవి. చక్కని కాలికో బైండు వెల 1-4-0, చందాదారులకు 0-13-0.

పునర్ముద్రణమందున్న గ్రంథములు.

2 అక్బరుచరిత్ర. 4 వివేకానందస్వామి జీవితము. 5 సిక్కులచరిత్ర. 6 విద్యాసాగరునిచరిత్ర. 7 రామమోహనరాయలచరిత్ర.

ముద్రణమందున్న గ్రంథములు.

కమలకుమారి (నవల) మహారాష్ట్రచరిత్ర 2 వభాగము. ఔరంగజేబుచరిత్ర మొదలగునవి.

మాశాశ్వత చందాదారులకు 100 పుటలు పోస్టేజిగాక నాలుగణాల చొప్పున నిచ్చుచుందుము. 0-4-0 లు ప్రవేశకట్నము చెల్లించవలయును. ధరఖాస్తులు చేయువారు వివరముగ విలాసము ఈ క్రింది చిరునామాకు వ్రాయవలయును. మాకు ఏజంట్లుగా పనిచేయువారలకు వారి సామర్థ్యమునుబట్టి జీతములు ఇవ్వబడును గనుక వారి వారి యోగ్యతను ఈక్రింది చిరునామాకు ధరఖాస్తులు పంపుకొనవలయును.

ఆంధ్ర భాషాభివర్ధనీ సంఘము,
(లిమిటెడ్) మచిలీపట్నం.

విజ్ఞానచంద్రికాగ్రంథమాల.

చింతాద్రిపేట, మద్రాసు.

ఇందు
సంవత్సరమునకు నాలుగుచొప్పున

దేశచరిత్రములు. ప్రకృతిశాస్త్రము.
చిత్రవిషయిక నవలలు. మహాపురుషుల జీవితములు.

ఇంగ్లీషు ఉద్గ్రంథముల భాషాంతరీకరణములు
ప్రచురింపఁబడును.

శాశ్వతపు చందాదారులకు 100 పేజీలకు పోస్టేజితో 0-4-0 చొప్పున పుస్తకముల ఖరీదు ఏర్పఱుపబడును. ఇతరులకు పోస్టేజిగాక-అ.0-6-0లు.

శాశ్వతపు చందాదారులు వెనుకటిగ్రంథములు కావలసినయెడల అ. 0-4-0 లు. అక్కఱలేనియెడల 1-0-0 ప్రవేశరుసుము క్రింద చెల్లించవలెను.

చిరునామా:—ఆ. లక్ష్మీపతి, బి. ఏ, ఎం. బి. సి.ఎం.
మేనేజరు.

ప్రచురింపఁబడిన గ్రంథములు.

హిందూమహాయుగము.

ఇది హిందూదేశకథాసంగ్రహముయొక్క మొదటిభాగము మన పూర్వుల రాజ్య విస్తారంబును, అప్రతిమశౌర్యంబును, అకలంక స్వదేశభక్తియు తెలిసికొనగోరువారీగ్రంథము తప్పక చదువవలయును. అత్యంత పురాతనకాలమునుండి మహమ్మదీయుల దండయాత్రవరకుగల చరిత్రమంతయు సవిస్తరముగా వర్ణింపఁబడినది. గ్రంథకర్త, కే. వి. లక్ష్మణరావు, ఎం. ఏ. మాచందాదారులకు పోస్టేజితో రు. 0-11-0. ఇతరులకు పోస్టేజిగాక రు. 1-0-0.

రాణీసంయుక్త.

జగద్విఖ్యాతమై, నాలుగు నాటకరచనలకు మార్గదర్శకమై శైలి యందును, వర్ణనలయందును, కథాచమత్కారమునందును నిరుపమానమై పండితులచేతను పామరులచేతను పొగడ్తగన్న ఈ అద్భుత నవలనుగురించి ఎంతవ్రాసినను తనివిదీరదు. దీనింజదివి యిందలి సారస్యమును పాఠకులే గ్రహింతురు గాక. చందాదారులకు పోస్టేజితో రు. 0-9-0 ఇతరులకు పోస్టేజిగాక రు. 1-12-0 గ్రంథకర్త—వేలాల, సుబ్బారావుగారు.

విమలాదేవి.

ఇది విచిత్రమైన క్రొత్తనవల, రంగుపటములు కలిగియున్నది. రాజసింహునియొక్కయు, అతని భార్యయగు విమలాదేవియొక్కయు, శౌర్యము, ధైర్యము, మతాభిమానము మొదలయిన విందు జక్కగ ప్రదర్శింపఁబడినవి. ఇంద్రరామర్గాదాసులరాజభక్తి, దేశరక్తి, ధర్మాసక్తి, గోలకొండలోనియక్కన్న మాదన్న గారి వైభవమును, వైకుంఠయోగిచేసిన యద్భుతకృత్యములును మిగుల రమణీయముగ వర్ణింపఁబడినవి. కథాసందర్భము (Plot) అత్యద్భుతము. వర్ణనలు అశ్రుతపూర్వములు. మా చందాదారులకు రు.0-13-0 ఇతరులకు రు. 1-2-0. గ్రంథకర్త—బాలకవి, భోగరాజు-నారాయణమూర్తిగారు.

కలరా.

వాంతిభేది, విషూచి, గత్తర యని మనవారలు బిలుచు జాడ్యమునుగూర్చి ఇందు సమగ్రముగ వ్రాయఁబడినది. చందాదారులకు రు. 0-4-0 ఇతరులకు రు. 0-6-0 గ్రంథకర్త—వైద్యవిశారదులగు ఆ. లక్ష్మీపతి, బి. ఎ., ఎం. బి. సి. ఎం. గారు.

ప్రకృతిశాస్త్రముల ప్రథమపాఠములు.

ఇందు జంతుశాస్త్రము, వృక్షశాస్త్రము, శారీరశాస్త్రములను గురించిన కొద్ది యంశములు బాలురకు స్త్రీలకు తెలయునటుల వ్రాయఁబడినవి. చందాదారులకు రు. 1-2-0 లు. ఇతరులకు రు. 1-10- లు. గ్రంథకర్త—కే. సీతారామయ్య, బి. ఏ., ఎల్. టీ. గారు.

భౌతికశాస్త్రము

400 పుటలు. **200 పటములు.**

దీని నింగ్లీషులో ఫిజియాగ్రఫీ (Physiography) అందురు. ఇందు పదార్థవిజ్ఞాన, రసాయన, భూగర్భ, భౌతిక, భూగోళ, ఖగోళశాస్త్రములకుగల పరస్పరసంబంధమును, ముఖ్యముగా భూమికిని సృష్టియందలియితర పదార్థములకును గలసంబంధములును, విపులముగను, విచిత్రముగను వర్ణింపఁబడినవి. ఇది శ్రీయుత, మైసంపాటి-నరసింహం, బి. ఏ., ఎల్. టీ. గారిచే నెంతయు పరిశ్రమ పూర్వకముగా వ్రాయఁబడినది. మాచందాదారులకు పోస్టేజితో రు. 1-0-0. ఇతరులకు పోస్టేజిగాక రు. 1-8-0.

మహమ్మదీయ మహాయుగము.

రెండవకూర్పు. (Mahammadan period) క్యాలికోబైండు.

ఇందు ఆఱుప్రకరణములుగలవు:—1 ముసల్మానులయుత్పత్తి; వారీదేశమునకు వచ్చుట. 2 ఆఫ్గాన్ రాజులు. 3 మొగల్ ప్రభుత్వము. 4 దక్షిణములోని మహమ్మదీయరాజ్యములు. 5 రాజపుత్రులశౌర్యాగ్ని. 6 విజయనగర సామ్రాజ్యము.

కొందరు తలఁచినట్లు హిందూదేశము మహమ్మదీయులకు సులభముగా వశము కాలేదనియు హిందువులు అభిమన్యునివలెనే అపరిమితపరాక్రమమును జూపి మోసమునకును స్వామిద్రోహమునకు లోనై యోడిపోయిరనియు నీగ్రంథమునందు సప్రమాణముగాఁ జూపఁబడినది.

ఇందు శ్రీకృష్ణదేవరాయలు, పృథ్వీరాజు, రాణాప్రతాప్, అక్బరు మానసింగ్, నానక్ మొదలయిన మహాత్ముల దివ్యమైన పటములు కలవు.

శ్రీయుత, కే. వి. లక్ష్మణరావు, ఎం. ఏ. గారిచే రచింపఁబడినది. చందాదారులకు పోస్టేజితో రు. 1-3-0. ఇతరులకు పోస్టేజిగాక రు.1-12-0.

ఆంధ్రులచరిత్రము.

ఇది ప్రథమభాగము. పౌరుషమునందును పాండిత్యాతిశయంబునందును, రాజ్యవిస్తారంబునందును పూర్వపు ఆంధ్రులు హిందూదేశములోని యితర దేశములవారికి దీసిపోవువారు కారని యీగ్రంథము సప్రమాణముగా సిద్ధాంతీకరించుచున్నది. ఇప్పటియాంధ్రులవలెనే మన పూర్వపుటాంధ్రులు గూడ కూపమండూకములె యనుకొంటిరా? ఆంధ్రులొకప్పుడు మగధ సామ్రాజ్యమును, ఇంకొకప్పుడు మహారాష్ట్రమును, మఱియొకప్పుడు యవద్వీపమును, వేఱొకప్పుడు పాండ్యచోళదేశంబులను జయించిరని మీరు కలనైన నెఱుంగుదురా? ఎఱుంగనియెడల ఈగ్రంథము జదువుడు.

శ్రీయుత చిలుకూరి-వీరభద్రరావుగారిచే రచియింపఁబడినది. చందాదారులకు పోస్టేజితో రు. 1-0-0. ఇతరులకు పోస్టేజిగాక రు. 1-4-0.

ర సా య న శా స్త్ర ము.

రెండవకూర్పు. 320-పుటలు-75-పటములు. క్యాలికోబైండు.

మనపూర్వులు బంగారము చేయఁగలయునన్న కోరికచే ఈశాస్త్రమును అభ్యసించిరి. ఇప్పుడు ఇంగ్లీషువారు ఈశాస్త్రమును అభ్యసించి కోట్లకొలఁది ధనము సంపాదించుచున్నారు. ఇట్టిఘనమైనవిద్య మనవాండ్రకు తెలియుటకై ఈగ్రంథము చక్కనివచనశైలిని వ్రాయఁబడినది. జనులు లక్షాధీశులై దేశముధనసంపన్నతతో తులతూగుటకు ఇట్టి పుస్తకములే యాధారములు. ఈగ్రంథమునందు హిందూరసాయన శాస్త్రముయొక్క చరిత్రకూడ రసవంతముగ వ్రాయఁబడినది. శ్రీయుత, వేమూరి - విశ్వనాథశర్మ, ఎం. ఏ. గారిచే రచియింపఁబడినది. చందాదారులకు పోస్టేజితో రు. 0-13-0. ఇతరులకు పోస్టేజిగాక రు. 1-4-0.

రావుబహదూరు. కం. వీరేశలింగముపంతులుగారి
స్వీ య చ రి త్ర ము.

ఇంగ్లీషుభాషలో మహనీయుల స్వీయచరిత్రలు (Auto Biographies) పెక్కులున్నను తెలుఁగులో నేటివఱకునొక్కటియు లేకపోవుట

గొప్పలోపమనియుఁ దానినెట్లు తొలగింపనగుననియు మేము చింతించుచుండఁగా రావుబహద్దరు కందుకూరి, వీరేశలింగము పంతులుగారు తమస్వీయచరిత్రమును ప్రకటించు గౌరవము మాకుఁ గలుగజేసిరి. గద్యతిక్కనయైన ఈమహనీయునిగుఱించిగాని, వారిగ్రంథములను గుఱించిగాని మేమధికముగా వ్రాయుట కాగడాతో సూర్యునిఁ జూపించుటయే!

గర్వముగాని స్వాతిశయభావముగాని ఎంతమాత్రమును లేక యున్నదియున్నట్లు యథార్థచరిత్రము ఇంపుఁజక్కనిభాషలో వ్రాయబడినది. ఈచరిత్రముజూచి పంతులవారి విరోధులుగూడ తలయూపెదరనిమానమ్మిక. మహనీయులపటము లనేకములుగలవు. నిజమైనచరిత్రయని అందరు మెచ్చుకొనియున్నారు. చందాదారులకు రు. 1-0-0. ఇతరులకు రు. 1-8-0.

ఆ ం ధ్రు ల చ రి త్ర ము
(రెండవభాగము).

ఇది విజ్ఞానచంద్రికా గ్రంథమాలలోని 18 వ కుసుమము.—ఇందు క్రీ. శ. 1100 నుండి 1550 వరకుగల ఆంధ్రదేశచరిత్ర వర్ణింపఁబడినది. పురాణములు, కావ్యములు, శాసనములు, విదేశీయులవ్రాతలు మొదలగువానినన్నిటిని శోధించి, తెలుఁగుచోడులు, నాగవంశోద్భవులైన మహారాజులు, కాకతీయచక్రవర్తులు, పల్నాటివీరులు, కమ్మవారు, రెడ్లు, వెలమలు, మొదలగువారి చరిత్రలు ఈయుద్గ్రంథమునందు క్రోడీకరింపఁబడినవి. రామానుజుఁడు, బసవేశ్వరుఁడు, నన్నెచోడ కవిశిఖామణి, ఖడ్గతిక్కన, కవితిక్కన, గణపతిదేవచక్రవర్తి, ప్రతాపరుద్రమహారాజు, మహారాణి రుద్రమదేవి మొదలగువారల పవిత్రజీవితములు శ్రద్ధతో వ్రాయబడినవి.

ఆయాకాలములందలి సాంఘిక, రాజకీయస్థితులు చక్కఁగ వివరింపఁబడినవి. పరదేశములయొక్కయు, కట్టడములయొక్కయు పటములుకలవు.

ఇయ్యది మొదటిభాగమును రచించిన సుప్రసిద్ధులగు శ్రీయుత, చిలుకూరి-వీరభద్రరావు పంతులుగారిచేతనే మనోహరమగుశైలిని వ్రాయఁబడినది.

మాచందాదారులకు పోస్టేజితో	1-0-0.
ఇతరులకు పోస్టేజిగాక	1-8-0.

డిల్లీ దర్బారు.

ఇది గడచిన పట్టాభిషేక మహోత్సవసందర్భమున ప్రచురింపబడినది, ఇందు ఢిల్లీనగరవర్ణనము, శ్రీరాజదంపతుల జీవితములును, హైద్రాబాదు. బరోడా, మైసూరు రాష్ట్రముల చరిత్రయు, దర్బారుల కథనములును బహు రమ్యముగ వర్ణింపబడినవి. చక్కని పటములచే శోభాయమానముగనుండిన ఈగ్రంథము నందరును చదివి తీరవలెను.

మాచందాదారులకు పోస్టేజితో 1-0-0. ఇతరులకు పోస్టేజిగాక 1-0-0.

గ్రంథము.		కర్త.
౧. చంద్రగుప్తచక్రవర్తి, ...	0—12—0	శ్రీపరమహంస విద్యానందస్వామిగారు, బి ఏ.
౨. చలిజ్వరము.	0—7—0	డాక్టరు లక్ష్మీపతి, బి. ఏ. ఎం బి. సి. ఎం. గారు.
౩. మహాపురుషులజీవిత చరిత్రములు,	1—4—0	ప. శ్రీనివాసరావు. బి. ఏ.
౪. అర్థశాస్త్రము (Political Econymy),	1—8—0	సి. రామలింగారెడ్డి, ఎం. ఏ. గారు.

తయారగుచున్న గ్రంథములు.

౧. వ్యవసాయ శాస్త్రము,
గోటేటి-జోగిరాజుపంతులుగారు.

౨. మహారాష్ట్రవిజృంభణము,
కే. వి. లక్ష్మణరావుగారు, ఎం. ఏ.

౩. సద్వర్తనము (Character),
కే. వి. లక్ష్మణరావుగారు, ఎం. ఏ.

౪. కళింగదేశచరిత్రము,
గరుజాడ. అప్పారావుగారు, బి.ఏ., బి.ఎల్.

౫. గ్లాడుస్టను జీవితము,
అ. కాళేశ్వరరావుగారు, బి. ఏ., బి. ఎల్.

౬. జంతుశాస్త్రము (Zoology),
ఆ. లక్ష్మీపతి, బి. ఎ., ఎం. బి. సి. ఎమ్.

ఆయుర్వేదమార్తాండ, భిషజ్మణి

వైద్యరత్న, పండిత-డి. గోపాలాచార్యులవారిచేఆంధ్రీకరింపబడిన

ఆయుర్వేదాశ్రమ గ్రంథమాలలోని ప్రథమ గుచ్ఛమగు

మాధవనిదానము. ప్రతిమనుజునివద్దనుండదగిన వైద్యగ్రంథము.

ఈగ్రంథము మధుకోశ, పంజికా, ఆతంకదర్పణాద్యనేక వ్యాఖ్యాతల యభిప్రాయములతోడను చరకసుశ్రుతవాగ్భటాదుల మతానుసారముగాను మాచేతభాషాంతరీకరింపబడిన, నిదానదీపిక యను నాంధ్రవ్యాఖ్యతోగూడినది. ఈమాధవనిదానమునుమించిన గ్రంథమింకొకటిలేదు. జ్వరము, అతిసారము, పాండు, నంజు, మొదలగు 100 ప్రధానవ్యాధులయొక్కయు, వాని అంతర్భూతములగు 1000 రోగములయొక్కయు పుట్టుకకు కారణములను, అవి బోవులక్షణములను, వాని నిజస్వరూపములను, ఇట్టి యనేక విషయములన్నింటిచే రోగముల నిశ్చయించుటను ఈగ్రంథము విపులముగ సూచించుచున్నది. వెల పోష్టుఖర్చులుగాక రు. 3-0-0.

ద్వితీయగుచ్ఛమగు పథ్యాపథ్యము.

ఈ గ్రంథమునందు ప్రతిరోగియు నాచరింపదగిన పథ్యములగు నన్నము, కూరలు, పప్పులు, మాంసరసములు, శరీరవ్యాయామములును, ఆయాచికిత్సావసరముల పథ్యాపథ్యములగు వస్తి,వమన,విరేచన,స్వేద, ప్రతిసారణాదిక్రియలయొక్క వివరణమును, రోగములురాకుండ ఆరోగ్యముగనుండుటకై వసంతాది ఋతువులయందు నాయాఋతుధర్మముల ననుసరించి యాచరింపదగిన యాహార విహారాది హితాహితములను బోధించెడు "వివరణ" మను నాంధ్రటీకతోడ ముద్రింపబడియున్నది.

చందాదారులకు రు. 0-12-0. ఇతరులకు రు. 1-0-0.

నాలవగుచ్ఛమగు ఆయుర్వేదపరిభాష.

ఇయ్యది హిందూవైద్యులకు జ్ఞాననేత్రమువంటిది.

ఈపుస్తకము చేతనున్నయెడల వైద్యశాస్త్రమున ఏసందేహము గలుగదు.

కషాయ, కల్క, తైల, ఘృత, ఆసవ, అరిష్ట, మోదక, రస, రసాయనాదులు జేయువిధములను, మానపరిభాషలను, ద్రవాహారములను బోధించు పరిభాషలను, పంచభద్రము మొదలగు సాంకేతికములును, వ్యవాయూపథ, వికాస్యాపథాదిభేదములను, స్వేదన, ఆశ్చోతనము మొదలగు కర్మలయొక్క భేదముల వివరమును అభావ ప్రతినిధివస్తువులను సూచించు

పరిభాషలను వివరముగ జెప్పంబడియున్న యవి. చందాదారులకు రు. 1-2-0. ఇతరులకు రు. 1-8-0.

నాలవగుచ్ఛమగు వస్తిచికిత్స.

వస్తి యనగా నెద్దియో దాని యుపయోగము. దానినుండి నశించు వ్యాధులు మొదలగునవి చక్కగా చర్చించబడెను.

చందాదారులకు అ. 0—3—0. ఇతరులకు అ. 0—4—0.

ఆయుర్వేదము.

ఆయుర్వేదవైద్యము, ఏకాలమునుండి ఆరంభమైనదియు, అందు ఏయేవిషయములుగలదియు, వానివిభాగములును, ఆక్కాలమునగల శస్త్రవైద్యముయొక్క అభివృద్ధియు, ప్రకృతకాలమున భరతఖండమునందు ఆయుర్వేద మెట్లభివృద్ధికి దెచ్చుకొనవలసినదనియు ఇందు చక్కగ చర్చింపబడియున్నవి. దీని వెల రు. 0-4-0. ఇతరులకు రు. 0-3-0.

వైద్యరత్న, పండిత డి. గోపాలాచార్లు ఏ. వి. యస్.
ప్రిన్సిపాల్ ఆయుర్వేద కాలేజ్, మదరాస్.

నిస్సత్తువల నడంచి, రక్తమును వృద్ధిపరచుటకు, జీవామృతము, దేవామృతమునంటిది. వెల. బుడ్డి ౧ కి 0 3 0

ఋతుశూలల నడంచి సౌఖ్యము నొసంగుటకు అశోకఘృతి స్త్రీలపాలిటివరప్రసాదిని. వెల. బుడ్డి ౧ కి 12 0

సర్వరోగములయందును, సర్వకాలములందును, సర్వజనులు నుపయోగించుటకు మకరధ్వజ మసమానమయినది. 7 రోజులమందు రు. 1 0 0

కన్నుల చల్లపరచుటకును, మెదడును బలపరచుటకును, మనమున కానందము గలిగించుటకును, అమృతామలకతైలము, చక్కని తలంటునూనె. ౩ ౧ కి 0 12 0

పండ్లయందలి పురుగులను జంపి, చిగుళ్లయందలి రక్తమును శుభ్రపరచుటకు "వజ్రదన్తచూర్ణము" ప్రశస్తమయినది. డబ్బి ౧ కి 0 4 0

ప్యాకింగు పోస్టేజి వేరుగా నివ్వవలెను.

వైద్యరత్న, పండిత డి. గోపాలాచార్లు ఏ. వి. యస్.
ఆయుర్వేదాశ్రమం మదరాస్.

వివేకవర్ధని గ్రంథమాల.

(24-8-12 తేది. నెలకొల్పబడినది.)

నియమములు.

1. ఆంధ్రభాషామతల్లికి సేవఁజేయుటయే యీగ్రంథమాలముఖ్యోద్దేశము.
2. ఇందు ఆంధ్రభాషాభివృద్ధికిఁ దోడ్పడఁదగు నాలుగు గ్రంథములు వత్సరమునకుఁ బ్రకటింపఁబడును.
3. ఇందు ప్రబంధములు, నవలలు, నాటకములు, దేశచరిత్రలు, దేశోపకారులగు కొందరు మహనీయులచరిత్రలు, మున్నగునవి ప్రకటింపబడును.
4. ఈగ్రంథమాలయందుఁ బ్రకటింపఁబడు గ్రంథములనన్నింటిని కొనుటకు నొప్పుకొనువారు శాశ్వతపుఁజందాదారు లగుచున్నారు.
5. శాశ్వతపుఁజందాదారులకు ఈ గ్రంథమాలలోని గ్రంథములన్నియు అంచకూలి మేమేభరించి నూరుపుటలకు రు 0-4-0 వంతున నిచ్చెదము. ఇతరులకు ఈపుస్తకములు యంచెకూలిగాక రు 0-6-0 వంతున నీయఁబడును.
6. ఇందువత్సరమునకు 800 పుటలకంటె నెక్కువపుటలు గల గ్రంథములు ప్రకటింపఁబడవు గాన చందాదారులకు వత్సరమునకు రు 2-0-0 కంటె నెక్కుడుకానేరదు.
7. శాశ్వతపుఁ జందాదారులు ప్రవేశరుసుము రు 0-3-0 యివ్వవలెను. ఈ ప్రవేశరుసుము ముందుచెల్లించిన చెల్లించవచ్చును లేదా వి.పీ. ద్వారా బట్టుకొనుదుము.
8. ఇందు ప్రకటింపఁబడు గ్రంథములన్నియు దళసరికాగితములు, చక్కని యచ్చు, మంచిబైండు గలిగియుండును.

ఇందు ప్రకటింపఁబడిన గ్రంథములు.

	చందాదారులకు.	ఇతరులకు.
1. బుధకుమారచరిత్ర:—(చక్కనినాటకము.)	0-7-0	0-11-0
2. సత్యాబాయి:—(చరిత్రవిషయికనవల.)	0-6-0	0-9-0

అనుబంధ గ్రంథము.

1. తిమ్మాపురపుశతావధానము:—(చక్కని పద్యములు.) వెల ౦-1-౦.

అచ్చులోనున్న గ్రంథము.

సర్వంజగన్నాథం:—ఇదియొక మిశ్రమప్రబంధము. కొలదిరోజులలో చందాదారులకందజేయుచున్నాము.

తయారగుచున్న గ్రంథములు.

1 హరిశాస్త్రీయము. 2 వీరాబాయి. 3 రాజవదన. 4 విద్యుల్లత. 5 భువనమోహినీ. 6 రాజకుమారి. 7 కరుణదేవి. 8 మంజువాణి.

N. B. ఈగ్రంథమాలకయిదుగురు శాశ్వతపు చందాదార్లను జేర్చువారికి. ఇంతవరకు ప్రకటించిన గ్రంథములలో వారుకోరినదుచితముగా నివ్వబడును. ధర్మపుస్తకభాండాగారములు, స్త్రీసమాజములు, రీడింగురూములు, తపాలాచార్జిభరించినయెడల మాగ్రంథములన్నియు నుచితముగానివ్వబడును. ఈగ్రంథమాల శైశవదశయందుండుటచేత చందాదార్లను జేర్చుటకు ఏజంట్లుకావలసియున్నారుగాన వివరములు తెలియగోరువారు మాకు వ్రాసిన తెలియనగు.

ఇట్లు, ఆంధ్రభాషాసేవకుడు,
టి. కేశవరావు, మేనేజర్.
-వివేకవర్ధనీగ్రంథమాల.
ఇనగల్లు
పెదనందిపాడు పోష్టు, గుంటూరుజిల్లా.

180 పుటల పుస్తకము

ఉచితము.

ఆరోగ్యము మఱియు ఆయుర్దాయము కొద్ది స్వాభావిక ధర్మము లనుసరించుటవల్లనే నిస్సందేహముగా సంబంధించియుండును.

ఐశ్వర్యమునకు మార్గమై జీవితకాలమును అభివృద్ధించుచు ఇట్లు నీశరీరారోగ్యము సమకూర్చుచు ధర్మమార్గమును ఈమేలైన పుస్తకము కనుపరుచును.

ఈపుస్తకము ఉచితము. తపాలు ఖర్చులుకూడను అపేక్షింపకయే పంపబడును.

వైద్యశాస్త్రి మణిశంకర్ గోవిండ్జీ,
ఆతంకనిగ్రహ ఔషధాలయము,
22, బ్రాడ్వే, మదరాసు.

96, మాంటు రోడ్డు,
మదరాసు.

న, చక్కని విషయాంతరగర్భిత (Allegorical) చిత్రకథ. ఇందలి యతి మృదుమధురమగు శైలికిఁ దోడ్పడు నూతనకల్పనలును, ప్రకృతివర్ణనలును, స్వభావ నిర్మాణాది నూతనాలంకారములును భావాతీతములు.

(2) ద్వితీయమరీచి:—"వాఁడే వీఁడు." ఇది యపూర్వమగునిరూపణా (Detective) నవల. ఇందలి కథాచమత్కారమును, స్వభావనిర్మాణమును, విషయానుగత ప్రకృతి వర్ణనలును (Sympathy of Nature) భావాతీతములు.

ఈ రెండుగ్రంథములును మనయాంధ్రవాఙ్మయమునకు నూతనా లంకారములని చదువరులకే వెల్లడికాఁగలదు.

ఇట్లు

దేవరాజు - వెంకటకృష్ణారావు,

కార్యదర్శి.

"వేగుఁజుక్క" గ్రంథమాల.

బరంపురం.
గంజాంజిల్లా.

యాజుషస్మార్తానుక్రమణిక

అను

యజుర్వేదపూర్వప్రయోగ పుస్తకము.

అయ్యా, భగవదనుగ్రహముచే ఈ రెండవకూర్పునందు ప్రాచీనవిషయములకన్న నిందనేకస్మార్తరహస్యములును, ఆశీర్వచన మంత్రములకు స్వరములును, గొన్నిప్రయోగములలో నచ్చటచ్చట తెలుగు తాత్పర్యమును జేర్పంబడి ముద్రింపఁబడినది. ఈభట్టీయమును ద్వరలో బంపుమని బహుజనులు జాబులువ్రాసిరి. అప్పట్లో పుస్తకములు లేనందునఁ బంపుటకు వీలులేకపోయెను. ఈగ్రంథమందు విషయములన్నియును, ఈస్వల్పప్రకటనయందుఁ జేర్ప వలనుపడనందున, ముఖ్యములైన కొన్ని స్మార్త విషయములే యిందు సూచింపఁబడినవి. గర్భాధానము, పుంసవనము, సీమంతము, జాతకర్మ, నామకరణము, అన్నప్రాశనము, చౌలము, ఉపనయనము, వేదవ్రతములు, స్నాతకము, వివాహము, వైశ్వదేవము, ఆబ్దికమంత్రము, ఆయుష్యహోమము, శ్రీరామకళ్యాణము, పుత్రకామేష్టి మొదలగు బహువిషయములుండును. ఈగ్రంథమువలని ప్రయోజనమును చదువరులే యెఱుంగఁగలరు. యాజ్ఞిక జీవనార్థమును సద్విద్యార్థి సౌకర్యార్థమును ఈగ్రంథమునకుతక్కువవెల యేర్పఱపఁబడినది. వలయువారలు తమపోష్టుగ్రామము మొదలగునవి విస్పష్టముగా (తెలుగునగాని, యింగ్లీషులోగాని) వ్రాసి పంపవలెను. గ్రంథముకొఱకు వ్రాయువారికి బహుమానముగా నవీనముగా ముద్రించిన గాయ సప్తాహమును కేట్లాగులును వి. పి. టపాలాద్వారా పంపఁబడును.

గ్లేజుకాగితముల ప్రతి 1-కి 1-8-0. రఫ్ కాగితముల ప్రతి 1-కి 1-4-0 ఇదిగాక పోష్టుఖర్చులు ప్రత్యేకము.

యాజుషస్మార్త మన్త్రపాఠము సర్వసహితము గ్లేజుప్రతులు ఖర్చుబడినవి. రఫ్ ప్రతి 1-కి రు 1-4-0 మాత్రమే.

చల్లా. లక్ష్మీనృసింహశాస్త్రి;

బందరు, బచ్చుపేట, కృష్ణాజిల్లా.

సంస్కృతాంధ్రగ్రంథములు.

V. RAMASWAMY SASTRULU & Sons

192, Esplanade, MADRAS.

ఆంధ్రభాగవతము. పోతనామాత్యప్రణీతము, ఈవరకు ముద్రితమైన ప్రతులకన్న అన్నివిధముల బాగుగనున్నది.	3	0
డిటో మేలుప్రతి, చక్కనిబైండు	4	0
డిటో మేలుప్రతి, రెండువాల్యములు	4	12
డిటో అత్యుత్తమప్రతి రెండువాల్యములు	5	8
మనుచరిత్ర. సటీక, వావిళ్ల. రామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో చిన్నసైజున మేలుకాగితములమీఁద స్ఫుటమైన అక్షరములతో చక్కగ ముద్రించియున్నాము. బైండుఅద్భుతము. శ్రీకృష్ణదేవరాయలయొక్కయు, రామస్వామిశాస్త్రిగారి యొక్కయు ప్రతిమలు ఇందు గలవు.	1	8
ఉత్తరరామాయణము. కంకంటి పాపరాజ ప్రణీతము, చక్కనికూర్పు.	1	0
డిటో మేలుప్రతి, కాలికోబైండు	1	8
డిటో అత్యుత్తమప్రతి	2	8
వసుచరిత్ర. సవ్యాఖ్యానము, దళసరికాగితములు.	2	8
డిటో అత్యుత్తమప్రతి.	4	0
శబ్దార్థచంద్రిక. శ్రీమహాకాళి, సుబ్బారాయకృత అకారాదినిఘంటువు. పూర్వముద్రణములోనిలోపము లెల్ల సవరించి లక్ష్మీనారాయణీయము, శబ్దరత్నాకరము మొదలగువానినుండి యపూర్వము లగుపదములు జేర్చి రమ్యముగా ముద్రింపఁబడియున్నది.	2	8

శ్రీగురుజాడ. శ్రీరామమూర్తిగారి కవిజీవితములు. ఇదివఱలో వెలువడిన యాంధ్రకవిజీవితములలో నెల్ల మొదటిది. ఇందు పూర్వకవులగాథలు సమగ్రముగా వ్రాయఁబడుటయే కాక శిష్టు. కృష్ణమూర్తికవి, పెండ్రిపోలు. లక్ష్మణకవి మొదలగు నాధునిక కవులచరిత్రలుగూడ సమగ్రముగా వర్ణింపఁబడినవి. దీనిలో దొరకనిమహాకవుల చాటుపద్యములు చిత్రకథలు అపూర్వ చరిత్రాంశములు మఱియొకదాన నెందును గాన మని చెప్పుట యతిశయోక్తికాదు. కాలికో బైండు 2 వాల్యములు. రు. 2 8.

యాజుషపూర్వ ప్రయోగచంద్రిక. సస్వరము, అనేకవిషయములఁజేర్చి యాంధ్రమహాజన సంప్రదాయానురూపముగఁ బరిష్కరించి ముద్రించుచున్నాము.		
గురుబాలప్రబోధిక. చిన్నసైజున నామాత్రశమీయాద్యనేక గ్రంథములసహాయముతో చక్కగ పరిష్కరించి అకారాది అనుక్రమణికతో ముద్రించియున్నాము.	2	8


ఇంక ననేకసంస్కృతాంధ్రగ్రంథములు మావద్ద దొరకును.

మాముద్రాక్షరశాలయందితరుల అచ్చుపనులు, సరసముగను, వేగముగను చేసి యివ్వఁబడును.

అనేకులు కోరుటచే మాఆదిసరస్వతీనిలయముద్రాక్షరశాలను త్వరలో ఎస్ప్లనేడుకు చేర్చెదము.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

192 ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.


L. Sambasiva Rao

END OF
TITLE